వేదాంగాలు

# బాష



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్ధికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్ధులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014


# భాష

## ఆధునిక దృక్పథం

వ్యాస సంపుటం

✱

డా॥ పోరంకి దక్షిణామూర్తి



ఆ తరం మేధావివర్గంలో
అంతెత్తు మనిషి
'పద్మభూషణ'
ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారి
జ్ఞాపకార్థం

అంకితం

# ఇదీ సంగతి

నేను రాజమండ్రిలో వీరేశలింగాస్తికోన్నత పాఠశాలలో ఐదో ఫారం చదివే రోజుల్లో (1949–50) మాచేత ఇంగ్లీషులోంచి తెలుగులోకి అనువాదాలు అభ్యాసం చేయించేవారు. 'టేల్స్ ఫ్రమ్ షేక్స్పియర్' అన్న పుస్తకంలోని రెండుమూడు పేరాలు ఏరి వాటిని తెలుగులోకి అనువదించమనేవారు. ఆ తరగతి నడిపేవారు, భమిడిపాటి కామేశ్వరరావుగారు. తెలుగులో రచయితగానూ ఉపన్యాసకులుగానూ ఆయన ప్రసిద్ధులయినందువల్ల ఆయనంటే స్కూల్లో పిల్లలందరికీ భయమూ భక్తీకూడా ఉండేవి. అలాటివారు ఎదురుగా కూర్చుని ఉండగా అనువాదం చెయ్యాలంటే బెదురుబెదురుగా ఉండేది మాకు.

ఒకసారి, తరగతిలో ఉన్నవాళ్ళమందరం అనువాదం పూర్తిచేసేసి మా పుస్తకాలన్నీ ఆయన బల్లమీద బొత్తిగా పెట్టాం. పీరియడ్ పూర్తికావడానికి ఇంకా టైముంది. కామేశ్వరరావుగారు ఆ బొత్తిలో పై పుస్తకం తీసి ఇంగ్లీషు మూలవాక్యాలూ వాటి అనువాదాలూ చదివి వినిపించారు. అందులో ఒక వాక్యం : "Demitrius and Helena went to the forest." దానికి అనువాదం: "డెమిట్రియస్ మరియు హెలీనా అడవికి వెళ్ళిరి". ఆ తరవాత తక్కినవి చదవడం మానేసి సొంతంగా కొన్ని వాక్యాలు చెప్పారు :

"రాముడు మరియు రంగడు సినిమాకు వెళ్ళిరి."
"నేను హొటల్లో ఇడ్లీ మరియు ఉప్మా తింటిని."
"సీత మరియు రాధ పేరంటమునకు వెళ్ళిరి."

ఇలా ఇంకొన్ని వాక్యాలు చెప్పేవారే కాని అప్పటికే మేము విరగబడి నవ్వుతున్నాం.

"నవ్వుతారేం?" అన్నారు కామేశ్వరరావుగారు.

'మరియు' వింటే నవ్వొచ్చిందండి" అన్నాను, మొదటి బెంచిమీద కూర్చున్నవాణ్ణి.

"అదీ సంగతి! వాక్యంలో 'మరియు' అన్నమాట వస్తే మీకు నవ్వు ఎందుకొచ్చిందో తెలుసా? అది ఎబ్బెట్టుగా ఉంది కనక. అంటే, మనం మాట్లాడే టప్పుడు 'మరియు' అన్నమాట ఎప్పుడూ రాదు కనక. అంచేత మనం మాట్లాడే మాటలే రాయాలి. మనం మాట్లాడేదే మనభాష- అదే మాతృభాష!'' అన్నారు. అందరం తలలూపాం. 'వెళ్ళిరి, తింటిని' లాంటి మాటలు కూడా ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లోనే వాడుకలో ఉన్నాయనీ చాలామంది వాటిని వాడరనీ చెప్పారు. గ్రాంథిక భాషకూ వాడుక భాషకూ ఉన్న తేడాలు కొన్ని చెప్పారు.

"ఇంతకీ ఈ 'మరియు' రాసింది ఎవరోయ్?'' అంటూ రోల్ నంబరు పిలిచారు.

వెర్రిమొహం వేసుకొని నిలబడ్డవాడు భవదీయుడని వేరే చెప్పక్కర్లేదు.

అదుగో- అదీ, గ్రాంథికభాషలో రాయగూడదని నేను మొట్టమొదట తెలుసుకున్నది. కథలూ నవలలూ చదవడం అలవాటయాక అది గట్టిపడింది. సొంతంగా గిలకడం మొదలుపెట్టాక, పరీక్షల్లో తప్ప మరెక్కడా, ఎప్పుడూ నేను గ్రాంథికంలో రాయలేదు.

అలాగని గ్రాంథికంమీద నాకు ఏవగింపు ఉందని కాదు. పెద్దల్ని గౌర వించినట్టు దానికి నమస్కరిస్తాను కాని, స్నేహితుల దగ్గిర ఉన్నట్టుగా మనస్సు విప్పలేను. ఛందోబద్ధంగా గ్రాంథికంలో రాసిన కవిత్వం నాకూ ఇష్టమే. హైస్కూల్లో మాకు తెలుగు చెప్పిన మాస్టరుగారు సామాన్యులు కారు- సాక్షాత్తు మహాకవి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు. అత్యంత రసనిర్భరంగా, ప్రసాదగుణోపేతంగా, మదగజధృతిలో హుందాగా పద్యం రాయడంలోనూ చదవడంలోనూ మాత్రమే కాకుండా, పద్యకవిత్వంలోని అందచందాల్ని విడ మరిచి చెప్పడంలో కూడా ఆయనకు దీటయినవారు చాలా అరుదు. ఆయన నడిపిన 'ఆంధ్రి' సాహిత్య పత్రికను ఇప్పటివాళ్ళు ఎరక్కపోవచ్చు. కాని 'ఆంధ్ర రచయితలు' అందరికీ తెలుసు. తెలుగు జాతి చరిత్రకు కావ్యత్వసిద్ధి కలిగించిన 'ఆంధ్రపురాణం' ఎప్పటికీ నిలుస్తుందనేది అందరూ ఎరిగిన సత్యం. అటువంటి మహాకవి దగ్గిర చదువుకొన్నవాడికి పద్యకవిత్వంమీద అభిరుచి ఏర్పడకుండా ఎలా ఉంటుంది? కాని, నా విషయంలో ఆ అభిరుచి, చదివి ఆనందించడానికే పరిమితం.

వచనం వాడుక భాషలోనే ఉండి తీరాలన్న నమ్మకానికి అప్పటికీ ఇప్పటికీ కూడా తిరుగులేదు. గిడుగు రామ్మూర్తిపంతులుగారి చలవవల్ల అది ప్రత్యక్ష సత్యంగా శాశ్వతంగా స్థిరపడింది.

ఈ విధంగా నా చూపును సరయిన దిశకు మళ్ళించిన గురువులు భమిడిపాటి కామేశ్వరరావుగారు.

ఈ చూపును సునిశితమూ విశాలమూ చేసినవారు భద్రిరాజు కృష్ణమూర్తిగారు. ఆయన నా 'వెలుగూ వెన్నెలా గోదారీ' నవల చూసి మాండలిక వృత్తిపదకోశం (చేనేత పదాలు) పనిలో నన్ను నియమించారు. భాషపట్ల నాకు శాస్త్రీయమైన దృష్టి విస్తృతమయిన అవగాహనా కలిగించారు. తెలుగువాళ్ళలో ఈ శతాబ్ది ఉత్తరార్ధంలో జాతీయఅంతర్జాతీయస్థాయిల్లో సుప్రసిద్ధులయిన ఏకైక భాషాశాస్త్ర వేత్త భద్రిరాజు కృష్ణమూర్తిగారు. ఆయన దగ్గర నేర్చుకొన్న భాషాశాస్త్రం కొద్దిపాటే అయినా నా కదే అరోధి!

నాకు జరిగిన మరో మేలు, గురజాడ అప్పారావుగారి 'మినిట్ ఆఫ్ డిసెంట్' చేతికి చిక్కడం. మిత్రుడు అబ్బూరి గోపాలకృష్ణ ప్రేరణతో దాన్ని తెలుగులోకి అనువదించి ఆంధ్రప్రభ దినపత్రికలో నాలుగు నెల్లపాటు ధారావాహికంగా ప్రచురించాను (1964). దాంతో వ్యావహారికభాషోద్యమం లోతుపాతులు సంపూర్తిగా అవగాహన అయాయి; నైతిక బలం పెరిగింది. వివిధ సందర్భాల్లో భాషాసంబంధమయిన వ్యాసాలు కొన్ని రాయడానికి ఉత్సాహం కలిగింది. ఆ వ్యాసాల్లోంచి ఏరి కూర్చినదే ఈ వ్యాస సంపుటం.

దీన్ని స్వర్గీయ మామిడిపూడి వెంకటరంగయ్యగారికి జ్ఞాపకార్థం ఆనందంగా, వినమ్రంగా అంకితమిస్తున్నాను.

శ్రీ కొండపల్లి శేషగిరిరావుగారు సుమారు మూడు దశాబ్దులుగా స్నేహామృతమందిస్తున్న సుహృన్మిత్రులు. ఆయన వేసిన బొమ్మ ఒకటి నా పుస్తకం మీద ముఖచిత్రంగా వెయ్యాలన్నది నా చిరకాలపు ముచ్చట. అది ఈ సందర్భంలో నెరవేరినందుకు సంతోషిస్తూ ఆయనకు అభివాదా లర్పిస్తున్నాను.

ఈ వ్యాససంపుటాన్ని ఆవిష్కరించడానికి అంగీకరించిన, తెలుగు అకాడమి డైరెక్టర్, శ్రీమతి కా. హేమలతగారికి నా కృతజ్ఞతలు.

అడిగిన వెంటనే వెంకటరంగయ్యగారి ఫొటో ఇచ్చిన 'ఆనందవాణి' సంపాదకులు మాన్యులు శ్రీ ఉప్పులూరి కాళిదాసుగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సంపుటంలో చేర్చడానికి వ్యాసాలు ఎంపిక చేయడంలోనూ వాటి కొక క్రమం ఏర్పరచడంలోనూ తోడ్పడిన డా॥ కె. ఎల్. ఎన్. శర్మగారికి, ముద్రణ యోగ్యప్రతి తయారీలో సహకరించిన చి॥ ఎన్. సూర్యప్రకాశ్‌కు, స్వల్ప వ్యవధిలోనే చక్కగా ముద్రించి ఇచ్చిన శ్రీ బి. నాగేందర్ (శివాజీప్రెస్, సికింద్రాబాదు) గారికి ధన్యవాదాలు.

పోరంకి దక్షిణామూర్తి

# వరస


1. భాష : వ్యాకరణం-ఆధునిక దృక్పథం 1

2. కావ్యేతర గ్రంథాల్లో సిసలయిన తెలుగు సంప్రదాయం 8

3. గ్రాంథిక వ్యావహారిక భాషోద్యమాలు 33

4. గిడుగు మెమొరాండం : గురజాడ డిసెంట్ పత్రం 42

5. మాండలికాలు 50

6. పారిభాషిక పదాలు : కల్పనాశిల్పరీతులు 60

7. బోధనభాషగా తెలుగు వాడకంలో సాధకబాధకాలు 91

8. అధికారభాష 97

9. మాండలికంలో ఎందుకు రాశానంటే.... 103

10. తెలుగు నవలలో భాష, శైలి, మాండలికత 106

11. పానుగంటివారి భాషాశైలి 119

12. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రచన : భాషావిశేషాలు 125

13. భారతీయ భాషలన్నిటికీ కలిపి ఏకలిపి అవసరమా? 144

# 1

# భాష : వ్యాకరణం - ఆధునిక దృక్పథం

పరస్పర భావ వ్యక్తీకరణకు సామాజికులు వాగ్రూపంలో వెలువరించే సంకేతాల నియత నిర్మాణమే భాష. సమాజం దీన్ని సమష్టిగా సృష్టించుకొన్నది. సమష్టి సాధనంగా వాడుకొంటున్నది.

కాలగతిలో కొన్ని శతాబ్దాలూ సహస్రాబ్దాలు గడవగా వాగ్రూపానికి లిఖిత రూపం ఏర్పడింది. వాగ్రూపం మౌలికం; శ్రవణమాత్ర బోధకం. రెండోది దానికి విధేయం; పఠనమాత్ర బోధకం.

ఈనాడు ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నవీ ఖచ్చితంగా ఎవరూ చెప్ప లేకపోయారు. రెండువేలకూ మూడువేలకూ మధ్యలో ఉండవచ్చని అన్నారు. ఆటవికుల భాషల ఉనికి ఇంకా సరిగా తెలియనేలేదు. పరిశోధనలు కొనసాగు తున్నాయి.

భాషకు వాగ్రూపమే మౌలికమనటానికి హేతువు ఏమిటంటే, కొన్నివేల సంవత్సరాలుగా భావప్రకటనావ్యాపారం కొనసాగుతున్న మానవ సమాజంలో కొన్ని భాషలకు ఈనాటికి కూడా లిఖితరూపం లేకపోవటమే! ఉదాహరణకు కూర్గుప్రాంతం తీసుకుంటే, దేశంలో అన్ని రంగాల్లోనూ అత్యున్నత స్థాయికి వచ్చిన ఆ ప్రాంతపు విద్యావంతులు మాట్లాడే భాష ఒకటి ఉంది. కన్నడానికి దగ్గరగా ఉండే సోదర ద్రావిడ భాష. కాని, వాళ్లు రాసేది కన్నడలిపిలోనో, తెలుగులిపిలోనో! ఇలాటివి ఈ దేశంలో చాలా ఉన్నాయి. బయటి ప్రపంచంలో మరింకెన్నో ఉన్నాయి. అయితే, ప్రతి భాషకూ ఒక్కొక్క ప్రత్యేక లిపి ఉండ వలసిన అవసరంలేదు కదా!

సామాజికుడు మాట్లాడే వైయక్తికపద్ధతిని, అతని 'ఈడియొలెక్ట్' అంటారు. ఒకే కుటుంబంలో ఉన్న వ్యక్తుల్లో వాళ్ళవాళ్ళ అలవాట్లనుబట్టి, వాళ్ళవాళ్ళ పద్ధ తుల్లో కొద్దిపాటి భేదాలు కనిపిస్తూ ఉంటాయి. మా కుటుంబంలో దూరవ్యక్తి

నిర్దేశకంగాగాని, సమీపవ్యక్తి నిర్దేశకంగాగాని 'తను/తాను' వాడుతుంటాం. అంటే, దూరసామీప్యభేదం పాటించవలసిన అవసరంలేకుండానే అర్థస్ఫూర్తి కలుగుతోందన్నమాట. మా పిల్లల్లో ఒకడు, రెండింటికీ భేదం పాటించాలనుకున్నాడేమో, దూరవ్యక్తి నిర్దేశకంగా 'తను', సమీపవ్యక్తి నిర్దేశకంగా 'తిను'—'అతను', 'ఇతను' అన్నపదాల సామ్యం మీద—అంటూ అనటం ప్రారంభించాడు. ఉదా: "తను పుస్తకం కొనుక్కున్నాట్ట", "తిను పాఠం రాసుకోవాలంటున్నాడు." ఇదే విధంగా ఒక కుటుంబానికీ మరొక కుటుంబానికీ, ఒక వర్గానికీ మరొక వర్గానికీ, ఒక ప్రాంతానికీ మరొక ప్రాంతానికీ కూడా భేదాలు కనిపిస్తూ ఉంటాయి. చేనేత పనివారిలో పద్మశాలివారికి, మగ్గంచివర పగ్గం బిగించే వంకర కర్రకు 'పెడకోల' అనే పదం వాడుకలో ఉంది. వారి ఊళ్ళలోనే ఉన్న దేవాంగులకు, దానికి ఊడు[గు]కోల' అనే పదం వాడుకలో ఉంది. ఒక ప్రాంతంలో 'నుయ్యి' అనే దానికి మరో ప్రాంతంలో 'బావి' అనేది వాడుక. ఇలాంటి భేదాలు వివిధ స్థాయిల్లో జరిగే ఆదాన ప్రదానాల వల్లకూడా ఏర్పడుతూ ఉండవచ్చు.

వైయక్తిక వాగ్వ్యవహార పద్ధతులు కొన్ని కలిసి 'మాండలికం' [డయలెక్ట్] అవుతుంది. ఈ మాండలికాలు ప్రాంతాలను బట్టీ వృత్తులనుబట్టీ, వర్ణాలను బట్టీ. సాంఘికమైన వివిధ వర్గాలనుబట్టీ కొంచెం కొంచెం వేరుగా ఉంటుంటాయి. కోస్తాప్రాంతంవాళ్ళు 'వచ్చాడు' అనే సందర్భంలో, తెలంగాణావాళ్ల 'వచ్చిండు' అనీ, రాయలసీమవాళ్లు "వచ్చినాడు" అనీ అంటూంటారు. ధాతుప్రత్యయాలు వాటిలో విడమరిచి చూస్తే: వచ్చ్ + అ + డు → వచ్చాడు, వచ్చ్ + ఇన్ + డు → వచ్చిండు, వచ్చ్ + ఇనా + డు → వచ్చినాడు అనీ. నేటి తెలుగులో '–అ–/–ఇన్–/–ఇనా–' ఆయా ప్రాంతాల్లో ఉన్న భూతార్థక ప్రత్యయమని తెలియకపోదు. ఇలాంటి భిన్నతలు కొన్ని ఉన్నప్పటికీ వాటిలో ఏకత్వం లేకపోలేదు. అంటే అన్ని ప్రాంతాల్లోనూ వాక్యనిర్మాణ నియతిలో సమానధర్మం ఉంది కాబట్టి అర్థబోధకత లోపించదన్నమాట. కనక, ఇలాంటి మాండలికాలు ఎన్ని ఉన్నా ఒకే 'భాష' (లాంగ్వేజ్)గా లెక్కకు వస్తాయి. ఏ రెండు మాండలికాల మధ్య అయినా అర్థబోధకత పూర్తిగా లోపిస్తే వాటిని భిన్నభాషలుగా లెక్కకట్టక తప్పదు. ఒకప్పుడు తమిళభాషకు ఉపభాషగా ఉన్న మలయాళం, పదో శతాబ్దం ప్రాంతంలో తమిళంనుంచి విడివడి స్వతంత్ర భాషగా స్థిరపడింది. కనక, వాటిని 'సోదరభాషలు' అని చెబుతూ ఉంటారు. తెలుగు, తమిళం, కన్నడం—

వగైరా పాతిక ముప్పయి భాషలూ 'మూల ద్రావిడభాష' (ప్రోటో ద్రవిడియన్) నుంచి విడివడి స్వతంత్ర వ్యవస్థను కల్పించుకొన్న సోదరభాషలే.

సమాజంలో నిత్యజీవితంలో సహజ వాగ్వ్యవహారంగా ఉన్నభాష 'జీవద్భాష' (లివింగ్ లాంగ్వేజ్). ఉదా : తమిళం, తెలుగు మొదలైనవి. ఒకప్పుడు వాడుకలో ఉండి, రానురాను ఆ భాష మాట్లాడే వ్యక్తుల్లో చివరివాడు కూడా మరణిస్తే, అప్పుడు దాన్ని 'మృతభాష' (డెడ్ లాంగ్వేజ్) అంటారు. లాటిన్, సంస్కృతం మొదలైనవి. 'డాల్మేషియన్' అనే భాష మాట్లాడే వాళ్లలో చివరివాడు పందొమ్మిదోశతాబ్ది చివరిరోజుల్లో ఒక గని ప్రమాదంలో మరణించాడు. అప్పటినుంచి డాల్మేషియన్ మృతభాషగా లెక్కకు వచ్చింది.

భాష సమాజాన్ని ఆశ్రయించుకొని ఉన్న వ్యవస్థ అని ముందే చెప్పుకొన్నాం. అన్ని సాంఘిక వ్యవస్థల మాదిరిగానే భాష కూడా మార్పులకూ, చేర్పులకూ లోనవుతూ ఉంటుంది. అందుకే జీవద్భాషను ప్రవాహిని (నది)తో పోల్చటం జరిగింది. ప్రపంచంలో ఏ భాషా, మార్పులకు లోనుకాకుండా ఉండదు. అయితే ఆ మారుపాటు ఎంత నిదానంగా జరుగుతుందంటే ఏవ్యక్తి తన జీవిత కాలంలో స్పష్టంగా గమనించజాలనంత నిదానంగా జరుగుతుంది.

భాషలో అర్థవిపరిణామమూ ధ్వని విపరిణామమూ ఏయే తీరులుగా ఉంటాయో భాషాశాస్త్రవేత్తలు నిరూపించారు. ధ్వని విపరిణామం ఎప్పుడూ ఒక క్రమపద్ధతిలో వస్తుంది. దానికి బాహ్యాభ్యంతర హేతువులు నిరూపించడం జరిగింది.

వ్యక్తి చింతనావ్యాపారానికి భాషానిర్మాణంలో ఉండే నియతి ప్రధానం. నియత నిర్మాణ రహితమైన భాష ఏదీ ఉండదు. ఎంతటి నిరక్షరకుక్షి అయినా తెలుగువాడు, "నేను వచ్చాయి" అని చస్తే అనడు. ఎందువల్ల ? వాక్యంలో కర్తృపదం ఉత్తమ పురుషలో ఉన్నప్పుడు, క్రియాపదంలో చివర నపుంసక బహువచన ప్రత్యయమైన '–యి' రాగూడదని అతనికి తెలుసు. వచ్చ్– ధాతువుకు '–ఆ– అనే కాలార్థక ప్రత్యయం, '–ను' అనే పురుషార్థక ప్రత్యయం చేర్చి క్రియాపదం వ్యక్తంచేస్తాడు. ఇలా అనడానికి అతను వ్యాకరణ గ్రంథం ఏదైనా చదివాడా ? లేదు. ఒక భాషాసమాజంలో పుట్టి పెరిగినవాడు, తల్లిదండ్రులవల్లా,

పెద్దలవల్లా అనుకరణద్వారా భాషావ్యవహారం అలవరచుకొంటాడు. ఇతరమైన అలవాట్లు ఎలా అలవడతాయో భాషకూడా అలాగే అలవడుతుంది. కాబట్టి ఒక భాష మాట్లాడేవ్యక్తికి, ఆ భాషకు సహజమైన నిర్మాణం చిన్నతనంలో అయిదారేళ్ల ఈడుకే అలవడి ఉంటుందన్నమాట. చదవవేసే సమయానికే అతని బుద్ధిలో అది నమోదయి ఉంటుంది. ప్రస్తార సంయోగాలు (పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్) మూలంగా, తెలిసిన రూపాల సామ్యంలో తెలియని రూపాలు కూడా సాధించి వ్యవహారం కొనసాగించుకొంటాడు. అతని వ్యవహారం భాషానిర్మాణ సహజమైన పద్ధతిలోనే సాగుతుందన్నమాట. ఎప్పుడూ దానికి విరుద్ధంగా ఉండదు. శిష్టేతరుల వ్యవహారంకూడా వాళ్ల సహజమైన వాడుకకు భిన్నంగా ఉండదు. మెదడుకు సంబంధించిన 'ఎఫేసియా' అన్న వ్యాధి ఉన్నవాడు తప్ప, మరెవ్వడూ వ్యాకరణ విరుద్ధంగా మాట్లాడడు. వ్యాకరణమనే పదానికి ఏర్పడ్డ విస్తృతార్థం ముందు ముందు ప్రస్తావిస్తాను.

మనదేశానికి రాజ్యాంగచట్టం (కాన్‌స్టిట్యూషన్) ఒకటి ఉంది. అది లిఖితం. ప్రభుత్వ యంత్రాంగం దానికి లోబడి వ్యవహరించవలసి ఉంటుంది. మన రాజ్యాంగానికి చాలా వరకూ మాతృక అనదగింది బ్రిటిష్ రాజ్యాంగం. అది అలిఖితం. సంప్రదాయాల సమాహారంగా అనూచానంగా వస్తున్నదేకాని, మనదాని మాదిరిగా శాసనబద్ధమైలేదు. అంటే, లిఖితంకాకపోయినంత మాత్రాన వ్యవస్థ లేదనటానికి వీల్లేదన్నమాట. అలాగే, ప్రపంచంలో కొన్నివేల భాషలు ఉన్నాయి. వాటికి అన్నిటికీ వ్యవస్థ ఉన్నది. కాని వాటి వాటి నిర్మాణాలను తెలియజెప్పే శాస్త్రగ్రంథాలు ఎన్నో భాషలకు లేవు.

ప్రతి భాషాసమాజానికి ఎంతో కొంత సాహిత్యం ఉంటూంటుంది. పాటలతోనూ, కథలతోనూ వాగ్రూపంలో ఉంటుంది. ఇది ప్రాథమికావస్థ. రానురాను ఆ భాషా సమాజానికి లిపి అలవడ్డ తరవాత అది గ్రంథస్థం అవుతుంది. సంస్కారం పెరిగేకొద్దీ శాస్త్రదృష్టికూడా అలవడి, ఆ భాష పనిచేసే తీరును వివరించే శాస్త్రం మొదలవుతుంది. 'వాక్యం, వాక్యాంశం, పదం, పదాంశం, ప్రత్యయం, వర్ణం, ధ్వని, అన్నవాటి స్పృహ ఏర్పడుతుంది. నామవాచకం, క్రియాపదం, విశేషణం, క్రియావిశేషణం, అవ్యయం మొదలైనవాటి వివేచన కలుగుతుంది. పదపదార్థసంబంధం సామాజిక నిష్ఠమేకాని సహజసిద్ధం కాదని

రూఢి అవుతుంది. అంతవరకూ అలిఖితంగా ఉండి, వ్యవహర్త బుద్ధిలో నెలకొని ఉన్న భాషానిర్మాణం ఎంతోకొంతవరకూ లిఖితమవుతుందన్న మాట.

భాషలో అర్థవంతమైన గరిష్ఠాంశం వాక్యంకాబట్టి, అలాటి వివిధ వాక్యాలను పైనచెప్పిన రీతిలో విడమరిచి చూపించి, ఆయా అంశాల సహజస్థానాలు వాటివాటి సంబంధాలూ నిరూపించటం భాషాశాస్త్రవేత్త చేసే పని. ఆ రీతిగా గ్రంథస్థమైందాన్నే 'వ్యాకరణం' (గ్రామర్) అని చెప్పటం చాలాకాలంగా వాడుక. కాని ఆధునిక భాషాశాస్త్రవేత్తలు 'వ్యాకరణం' అనే పదాన్ని విస్తృతమైన అర్థంలో వాడుతూండడం గమనించవలసిన విషయం. ప్రతి భాషకూ నియతమైన నిర్మాణం ఉంటుందని ముందు చెప్పుకున్నాం. అది వ్యవహర్త బుద్ధిలో నెలకొని ఉంటుంది. కాబట్టి ఆయా సందర్భాల్లో దాన్ని విడమరుచుకొని, అవసరమైన అంశాలను జతపరుచుకొని నూతన వాక్యనిర్మాణం చేసుకొంటూ ఉంటారు. ఈ ప్రక్రియ అంతా రెప్పపాటుకాలంలోనే జరుగుతూ ఉంటుంది. కనక వ్యవహర్త బుద్ధిగతమైంది కూడా వ్యాకరణమే అని ఆధునిక భాషాశాస్త్రవేత్తల నిర్ణయం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే దాన్ని 'అలిఖిత వ్యాకరణం' (అన్‌రిటెన్ గ్రామర్) అనీ 'ఆంతర వ్యాకరణం' (ఇంటర్నల్ గ్రామర్) అనీ అంటూంటారు.

దీన్నిబట్టి తేలేవి ఏమిటంటే: ఒకటి, వ్యాకరణంలేని భాష ఉండదు, రెండు, మాతృభాషావ్యవహర్త మాట్లాడేది అంతా వ్యాకరణానుగుణంగానే ఉంటుంది.

ఒక్కొక్క భాషావ్యాకరణం ఒక్కొక్క తీరుగా ఉంటుంది. ప్రపంచంలో ఏ రెండు భాషల్లోనూ భావాల వర్గీకరణ (క్లాసిఫికేషన్ ఆఫ్ కాన్‌సెప్ట్స్) ఒకే తీరుగా జరగదు. కింది ఉదాహరణలు గమనించండి.

తెలుగు : నేనింటికి వెళ్తున్నాను.

హిందీ : మైఀ ఘర్ జారహా హూఀ.

ఇంగ్లీషు : అయామ్ గోయింగ్ హోమ్.

పై వాక్యాల్లో వివిధ అంశాలకు తగిన స్థానాలూ ప్రయోగార్హతలూ (పొజిషన్స్ అండ్ ప్రివిలేజెస్) ఒకే రీతిలో లేవు. అయితే ఒకే కుటుంబానికి చెందిన భాషల మధ్య మాత్రం కొన్ని సామాన్యధర్మాలు ఉంటూంటాయి. కాబట్టి

ఒక భాష వ్యాకరణాన్ని బట్టి మరో భాష వ్యాకరణాన్ని నిరూపించటం వ్యర్థం అవుతుంది. అంటే, లాటిన్ భాషా వ్యాకరణాన్ని పట్టుకొని ఆంగ్లభాషా వ్యాకరణానికి వర్తింపజేసినప్పుడు ఏమైందో అదే అవుతుందన్నమాట :

లిఖిత వ్యాకరణం లక్ష్యాలు ఏమిటని ప్రశ్నించుకొంటే సమాధానాలు ఇలా చెప్పుకోవచ్చు : (1) మాతృభాషా వ్యవహర్త సహజావబోధాన్ని (ఇన్ట్యూషన్) తృప్తిపరిచేటట్లు, లేదా వివరించేటట్టు ఉండాలి. (2) అతని వ్యవహార సామర్థ్యాన్ని పెంచటానికి తోడ్పడాలి. నోమ్ ఛామ్‌స్కీ (Noam Chomsky) అనే ప్రఖ్యాత భాషాశాస్త్రవేత్త, 'పరివర్తన వ్యాకరణ' శాస్త్రానికి ఆద్యుడు, ఇలా అంటాడు :

"Grammar is a device that generates (enumerates) all of the grammatical sequences (of a language) and none of the ungrammatical one."

అన్ని రూపాలనూ గ్రహించేది మాత్రమే ఆదర్శ వ్యాకరణం అని కూడా ఆయన చెప్పాడు.

వర్ణనాత్మక వ్యాకరణం [డిస్క్రిప్టివ్ గ్రామర్], చారిత్రక వ్యాకరణం [హిస్టారికల్ గ్రామర్], తులనాత్మక వ్యాకరణం [కంపారిటివ్ గ్రామర్], పరివర్తన వ్యాకరణం [ట్రాన్స్‌ఫార్మేషనల్ గ్రామర్], మాండలిక భాషా వ్యాకరణం [డయలెక్ట్ గ్రామర్], కావ్యభాషా వ్యాకరణం [క్లాసికల్ గ్రామర్], మొదలైనవి తరుచుగా వింటూండే పేర్లు. నిర్దిష్టకాలంలో ఉన్న భాషాస్వరూపాన్ని వివరించేది వర్ణనాత్మక వ్యాకరణం. ఒక భాష వివిధ దశల్లో ఎలా ఎలా పరిణామం చెందుతూ వస్తున్నదో తెలిపేది చారిత్రక వ్యాకరణం. నిర్దిష్టకాలంలో, నిర్దిష్టభాషలు రెండిటి మధ్య సాదృశ్య వైదృశ్యాలు వివరించేది తులనాత్మక వ్యాకరణం. ఒక్కొక్క మాండలికాన్నే విడివిడిగా వివరించేవి మాండలిక భాషా వ్యాకరణాలు. (ప్రాచీన) కావ్యభాష వ్యవస్థను నిరూపించేవి కావ్యభాషావ్యాకరణాలు. ఆధునిక భాషలో ఒక తీరు నిర్మాణంగల వాక్యంనుంచి ఇతర వాక్యాలను సాధించే శిల్పాన్ని తెలిపే శాస్త్రం పరివర్తన వ్యాకరణం.

బడుల్లో చదివే పిల్లకాయలపాలిటి 'భాషలో తప్పులుదిద్దే' అనుశాసనాన్ని

'ప్రిస్క్రిప్టివ్ గ్రామర్' అని అంటారు. వేదం ప్రభుసమ్మితం అన్నట్టుగానే ఇలాటి వ్యాకరణంకూడా ప్రభుసమ్మితం అనుకొంటూ ఉంటారు కొందరు. ఇలాటి మూఢభక్తిగల ప్రబుద్ధులవల్లే ప్రతిభావంతుడైన వ్యాకర్తకూడా అప్రతిష్ఠపాలౌతూ ఉండటం మనకు తెలుసు !

భాషకు మార్పు సహజం కాబట్టి ఏ కాలంలో మార్పులూ చేర్పులూ వస్తూంటాయో వాటినల్లా జీవద్భాష స్వీకరిస్తూనే ఉంటుంది కాబట్టి, ఏకాలంలో శిష్టజనుల వాగ్వ్యవహారంలో ఉన్న భాష ఆ కాలపు ప్రామాణిక భాషగా వన్నె కెక్కుతుంది. వాగ్వ్యవహారానికి తోడు సమకాలీన జీవితాన్ని ప్రతిబింబించే రచనలు ఆ భాషలోనే వెలువడడం, ప్రభుత్వ యంత్రాంగం ఈ సత్యాన్ని విస్మరించకుండా ప్రజలకు దగ్గరగా ఉండేటట్లు ఆ భాషలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటం, తాకీదులు ఇవ్వటం, ఇతర వ్యవహారాలు కొనసాగించటం జరిగినప్పుడూ జీవద్భాషలో విద్యాబోధనకు అవకాశం కలిగించినప్పుడూ క్రమేణా భాష పుష్టిమంతం అవుతుంది. లండన్ నగరంలోనూ చుట్టుపక్కలా విద్యావంతులు మాట్లాడే భాష సుమారు నాలుగువందల ఏళ్ళకు పూర్వమే ప్రామాణిక భాషగా గుర్తింపుకు వచ్చి క్రమక్రమంగా పుష్టి చేకూర్చుకుంటున్నందువల్ల, ఈనాడు సర్వసంపన్నమైన అంతర్జాతీయ భాషగా రాణిస్తోంది.

తెలుగులో శిష్టవ్యావహారిక భాషకు ప్రజామోదం ఎప్పుడూ ఉంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న విద్యావంతులూ, రచయితలూ, పత్రికలూ, సినిమాలూ, రేడియో మొదలయిన విద్యావ్యాపక సాధనాలు దీని వ్యవస్థను నిరూపించటం జరిగింది. ఇది క్రమక్రమంగా సుసంపన్నమవుతున్నది.

"Aristocracy and exclusiveness tend to final overthrow, in language as in politics".

—**Prof. Whitney.**

"Language is no better and no worse than the men who speak it."

—**Prof. Lounsbury**

(ఆంధ్రప్రభ దినపత్రిక, 1970 ఆగస్టు 30)

# 2

# కావ్యేతర గ్రంథాల్లో సిసలైన తెలుగు సంప్రదాయం

తెలుగువాళ్ల దురదృష్టం ఏమిటోగాని, ఒక్క చిన్నపని జరగాలంటే కొండతవ్వి ఎలకను పట్టేంత హైరాణ పడితేనేగాని ఏ కొద్దిపాటి ప్రయోజనమూ నెరవేరటంలేదు. ఒకనాడూ, రెన్నాళ్ళూకాదు; దశాబ్దాలూ శతాబ్దాలూ వేసట పడాలి. ఈలోగా కొన్ని తరాలు వెళ్లమారి ముచ్చటంతా ముక్కలైపోతుంది. చేసిన ప్రయత్నం నెరవేరి ఫలం చేతికి అందేదాకా కూడా నమ్మకంలేదు. అందిందే అనుకుందాం, ఆ చేతికీ ఈ పంటికీ మధ్యలో దాన్ని చెదరగొట్టడానికి చూసేవాళ్ళు ఎంతమంది లేరు? ఎన్నిటికో సరిపెట్టుకుంటూ వస్తున్నాం. దీనికి అంతేమరి! ఛస్తామా? పైవాళ్లమాట అలా ఉంచండి, మనవాళ్ళలోనే సైంధవులు ఉన్నారు. ఏవేవో ఘన కార్యాలు సాధించి పోగులుపెట్టడం మాట దేవుడెరుగు. ఒక మంచి ముక్కచెప్పి ''దీంట్లో మంచి ఇదిరా అబ్బాయ్! నామాట చటుక్కున నీ మనస్సు కెక్కకపోయినట్టయితే కాస్సేపు నిదానించి చూడు, బుర్రకి పనిచెప్పు, అంతగా మంచికాదని తోస్తే అప్పుడేదాన్ని మానెయ్యచ్చు! భయాలూ, భేషజాలూ, స్వార్థాలూ అన్నీ పక్కకి పెట్టేసెయ్యి. ఒక్కడి ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా పదిమందిమేలు దృష్టిలో పెట్టుకోవాలి తండ్రీ!'' అంటూ నచ్చచెప్ప డానికే ఉన్న శక్తి కాస్తా ఉడిగిపోతోంది. ఇంకా మనం ఏవేవో సాధించేదేమిటి? వెలగబెట్టేదేమిటి?

గిడుగు రామ్మూర్తి పంతులు అనే పెద్దమనిషి పొరపాటున తెలుగువాడయి పుట్టాడు. పుట్టినవాడల్లా ఊరుకోకుండా తెలుగూ, ఇంగ్లీషూ, సంస్కృతమూ ఆపోశనపట్టాడు. తెలుగు పలుకులకోసం చెవులు దోరబెట్టుకు విన్నాడు. బుద్ధి సానబెట్టి, మనస్సువిప్పి మాట్లాడాడు. ''నీ హృదయస్థితి తెలుగులో మాట్లాడుకో గలవురా అబ్బాయి, ఆశక్తి నీ కిచ్చా" అన్నాడు. "నీ హృదయస్థితి నువ్వు మాట్లాడ గలిగితే భాషగురించి సిగ్గుపడకూ! ఎవడి హృదయస్థితికి తగ్గభాష వాడికి

అమిరే ఉంటుంది ! మాట్లాడేసెయ్ ! దాన్ని ప్రకటించేప్పుడు దానికి డాబుగా వేషంవేస్తే చూపులికి శాశ్వతంగా మాబాగా ఉంటుందని నువ్వు అనుకుంటూన్న కొద్దీ అనృతమై హృదయదూరం కాగల్దూ ! మానవుడవై పొందిన హృదయానందానుభవాన్ని లిఖితంచేసేటప్పుడు మానవాతీతుణ్ణనుకోకూ ! ఆపళంగా అనెయ్ ! దాన్లో విశేషం ఏమిటంటే, దేశంలో హృదయంగల మనుషులు దాన్ని నిలుపుకుంటారూ !'' అన్నాడు (చూడండి : భమిడిపాటి కామేశ్వరరావుగారి 'చంద్రుడికి'........, పుట 28). ఎదుటివాడు, లేనిచెవుడు తెచ్చిపెట్టుకున్నందుకు నిజంగా వాడికి చెవుడు వచ్చేదాకా కర్ణపటలాల్ని అదరగొట్టకుండా విడవలేదు ఆయన. భాషాపరిశోధన తనకు తెచ్చిపెట్టిన చెవుడు తలచుకొని, ''మీ సంభాషణ విన్లేనుకదా, ఆ ఊరెడితే అక్కడివాళ్ళు తమ హృదయంలాంటి తెలుగు అనేటప్పుడు దాన్ని నా చెవితో స్వీకరించలేను గదా!'' (అదే పుస్తకంలో, పుట 27) అని వాపోయాడు. ''మహాకవి రచనల్లో ఉత్కృష్టమైనచోట్ల దాఖలాలు చూపించి, వాటిని తప్పులనకండి. అవి తప్పులుకావు. కవుల నోటంట తప్పురాదు. కవి సార్థకుడైతే అవసరం చొప్పున వ్యాకరణం తరవాత బయల్దేరి అతణ్ని సమర్థించుకుంటుంది. ఏదో చచ్చిచెడుతుందీ ! ప్రత్యక్షంకూడా ప్రమాణమేనూ ! చూడండి అని నొక్కినొక్కి అనేవారు.'' (పుట 30). ''భూమిమీద తెలుగు మాట్లాడే వ్యక్తి ఒక్కడు మాత్రం మిగిలిఉండే కాలం వచ్చినా ఆ ఒక్కడూ తన హృదయ పరిస్థితులు యథారీతిగా వెలిపుచ్చడంలో తన తల్లిదండ్రులవల్లా పెద్దలవల్లా తను నేర్చుకోగలిగిన మాట ధోరణిలో ''(వ్యాప్తి శాశ్వతత్వాలకి లోటు వస్తుందనే భయంచేత మార్చి, దాన్ని కేవలం అనృతంగా చేసేసి, బుర్రతో హృదయాన్ని పొడిచి, తన భయాన్ని ఖాయపరచుకోకుండా) తను మాట్లాడేసెయ్యడం, అవసరం అయితే అదే లిఖితం చెయ్యడం, తనకు నామర్దా కాదు సరికదా, అసలు అదేగదా సూనృతం. అదేగదా యదార్థజీవితానికి సూచకం, అదేగదా తెలుగు జిహ్వాకి జన్మసాఫల్యం'' (పుటలు 33-34) అని చెప్పాడు.

పోనీ కళ్లు విప్పార్చి చూడమన్నాడు. ఆ చూపు కేవలం నీ పొట్టమీదే ఉంటే చాలదూ, వెనకా ముందూ చుట్టుపక్కలా అంతటా పొడిగించమన్నాడు, పుస్తకాలు చంకనపెట్టుకుని, కాళ్ళకు బలపాలు కట్టుకుని దేశమంతా తిరిగాడు. ఒక్కడి కన్నయినా, ఒక్కడి చెవి అయినా ఒక్కడి తెలివి అయినా పనిచెయ్యకపోతాయా అని ఆశపడ్డాడు. కొందరికి బ్రహ్మచెవుడు తెచ్చిపెట్టుకున్న వరం.

కొందరికి గుడ్డితనం వరం. కొందరికి గొడ్డుచర్మం వరం. అయినా తడిగుండె వాళ్ళూ ఉన్నారు. నిక్కచ్చిగా చూసేవాళ్లూ ఉన్నారు. బుర్రకి కేటాయింపుగా పని చెప్పేవాళ్ళూ ఉన్నారు. ప్రలోభాలకు లొంగిపోయి సత్యాన్ని మరుగు పర చనివాళ్ళూ ఉన్నారు. ఆయన హృదయాశయానికి చలించినవాళ్ళు చలించారు, లేనివాళ్ళు లేదు. చివరికి కాలమే సూనృతాన్ని శిరస్సున దాల్చింది.

ఆ శుభఘడియలకోసమే ఆయన సర్వస్వం ధారపోశాడు. ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు! ఆయనచేత వీపు తట్టించుకున్నవాళ్ళూ, మెత్తమెత్తగా వాతలు తిన్నవాళ్ళూకూడా "కారణజన్ముడంటే ఇలాంటివాడే సుమా!" అని అనుకోకుండా ఉండలేకపోయారు.

ఈ శతాబ్దం తొలిరేకలు విచ్చుకుంటున్నవేళ, ముగ్గురే ముగ్గురు మనుషులు గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, పి. టి. శ్రీనివాసయ్యంగారూ- కన్న కలలు పండటానికీ చదువులతల్లి మూగతనం పోవడానికి దాదాపు ఏడు దశాబ్దాలు పట్టవలసి వచ్చిందంటే తెలుగుజాతి నొసట ఏం రాసిఉందని చెప్పాలి? గుడ్డిలో మెల్ల నయం! కాడి ఎన్నివంకరలు తిరిగినా గూటికి చేరుకుంటేసరి! ఇలా సరి పెట్టుకోవచ్చు. అయినా ఈలోగా ఎన్ని గుండెలు అవిసిపోయాయో ఎందరు గ్రహించారు? పోనీండి, వెనకటివి మరిచిపోదాం. ఇప్పటినుంచి అయినా ఇల్లు చక్కదిద్దుకుందాం! తీరువు నేర్చుకుందాం!

అలనాడు రామ్మూర్తి పంతులుగారు నిరూపించిన సిసలైన తెలుగు సంప్ర దాయాన్ని దేశమంతా శిరసావహించినా పాఠ్యపుస్తకాల్లో మాత్రం వెలివేస్తూ వచ్చారు. 'తెలుగు అకాడమి' వాళ్ల మాత్రం ఇటీవల కొన్నిపుస్తకాలు ప్రచురించి సిసలైన తెలుగు సంప్రదాయాన్ని పునరుద్ధరించడంలో చాలావరకూ కృతకృత్యు లయారు.

ఈ సందర్భంలో తెలుగు అకాడమి గురించి రెండుముక్కలు చెప్పాలి. మనదేశంలో ఉన్న ఉన్నత విద్యాబోధన జాతీయ భాషల్లో జరగాలని మన కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి ఆర్థిక సహాయం చేస్తానంది. ఒక్కొక్క భాషను ఆధునిక అవసరాలకు అనుగుణంగా సుసంపన్నంచేయడానికి ఒక్కొక్క పరిషత్తు ఏర్పడేటట్టు చేసింది. దానిమేరకు తెలుగు భాషకోసం ఏర్పడ్డదాన్ని 'తెలుగు అకాడమి' అన్నారు. ఈ అకాడమి, కొత్త ఇంటర్మీడియట్ క్లాసుకూ బియ్యేకూ

పోతారనీ, తెలుగు పండితుల ఉద్యోగాలు ఊడిపోతాయనీ బెదిరించవచ్చు. 'ప్రత్యేక రాష్ట్రవాదం' అనే బూచిని ప్రభుత్వానికి చూపించి పబ్బం గడుపుకుందామని చూడవచ్చు. ప్రాచీన కావ్యభాషలో ఆధునిక వచన రచన దెబ్బతిని పోతుందని వాపోవచ్చు. ఇలా చెప్పడానికి అవకాశం లేకపోలేదు కాని, ఆ మాటల్లో నిజం ఎంతమాత్రంలేదని మనవి చేసుకుంటున్నాను. ఎందుకంటారా ? వందలాది సంవత్సరాలనుంచి వస్తున్న తెలుగు భాషాసంప్రదాయం చిత్తగించండి. చిన్నయ సూరిగారి పేరు చెప్పుకుని చెలామణి అవాలని చూస్తున్నవాళ్ళు సత్యాన్ని ఇంత వరకూ మరుగుపరచాలని చూస్తున్నారు. కాని దేశంలో పేరుమోసిన మహాపండితులు సత్యాన్ని ఒప్పుకున్నారు. కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు గవర్నమెంటు లైబ్రరీలో పండితులుగా ఉండేవారు. గిడుగు రామ్మూర్తిగారికి రాసిన ఉత్తరంలో కింది వాక్యాలు చిత్తగించండి :

'వాడుకభాషలో గ్రంథాలు వందలున్నవి. అచ్చువచ్చిన తరవాతనే ఈ అన్యాయం (గ్రాంథికంలోకి మార్చిపారేయడం) పూజాపురస్కారాలు లేక బూజు పట్టిస్తున్నారు. వ్యాఖ్యానాలకు వాడుక భాషతప్ప వేరేభాష లేనేలేదు.... తెలుగు వ్యాఖ్యానాలన్నీ అదేమిటి, ఇదేమిటి సర్వం వాడుక భాషలో ఉన్నవి. ప్రాచీన వచన గ్రంథాలు వందలు పరిశీలించగా, కావ్యభాషవి వేళ్ళ లెక్కకైనా రాలేదు. అన్నీ వాడుక భాషలోనే ఉన్నవి. రామాయణాలు, భాగవతాలు, కథలు అన్నీని. ఎరిగి అంటారో ఎరగక అంటారో, కొందరు భాషరానివారు రాసినారని. పుష్పగిరి తిమ్మన వ్యాకరణం రానివాడా ! వ్యాఖ్యానాలు, లక్షణగ్రంథాలు రచించిన వారు భాష రానివారా ? "లక్షణ గ్రంథాలలో వచన భాగమంతా వాడుకభాషే ... లక్షణ దీపికలో పాటలు, పదాలు, షట్పదులు, ధవళాలు, అర్ధచంద్రికలు వగైరాలు మధుర కవిత అన్నారు. వఝ్యం వాసుదేవ పరబ్రహ్మ శాస్త్రిలు, జూలూరి అప్పయ్య పండితుడు, రావిపాటి గురుమూర్తి శాస్త్రిలు మొదలగు గొప్ప పండితులు బ్రౌను దొరగారికి విద్యావిషయమై రాసిన ఉత్తరములున్నవి. అన్నీ వాడుకభాషే. "చిన్నయసూరి వరకూ ఉండే వచన గ్రంథాలలో ఏవో కొద్ది సంఖ్యవి తప్ప అన్నీ వాడుకభాషవే !" ఇదీ సిసలైన తెలుగు సంప్రదాయం !

కావ్యభాషాభిమానులు పైన పేర్కొన్న పండితుల్ని గురించి ఏమంటారో? వాళ్ళ పూర్వుల మూలంగా నన్నయ్య దిక్కులేకుండాపోయి ఉన్నట్టయితే- పాపం

శమించుగాక :- చిన్నయసూరిగారు 'చిన్న అసూరి'గానే ఉండిపోయేవాడు. అప్పుడులేని భయం ఇప్పుడు ఎందుకో తెలియదు. చిన్నయసూరిగారు ప్రతిభావంతుడనే విషయం అందరికీ అంగీకార్యమే.

అంతమాత్రాన ఆయనతోటే భాష కరడుగట్టుకుపోవాలని ఎక్కడ రాసి ఉంది ? ఆయన తన అభిరుచికి అనుగుణమైన పద్ధతిలో ఆనందంగా రాసుకున్నాడు. అంతేగాని సిసలైన సంప్రదాయాన్నే దెబ్బతీసేవాళ్లు పుడతారని కలగన్నాడా ? యాతావతా చెప్పొచ్చేదేమిటంటే, నన్నయ తిక్కనాదులు సూరిగారికి పూర్వమూ లేకుండాలేదు, ఇప్పుడూ లేకుండాలేరు. ఇకముందుకూడా లేకపోరు. అభిరుచి కలవాళ్ళు ఎప్పుడూ వాళ్ళని విస్మరించరు. పాఠ్యగ్రంథాల్లోనూ బయటా కూడా ఆనందంగా చదువుతారు. చదివినవాటిని గురించి రాయడానికి కృతక భాషమట్టుకు అక్కర్లేదు. ఈ రోజుల్లో పత్రికల్లో కావ్యాలను గురించి వాడుక భాషలో రచనలు వస్తున్నాయి కదా ! అలాగే విద్యార్థులూ రాస్తారు. తప్పేముంది ?

మాట్లాడింది గొప్పదీ రాసింది భ్రష్టమూ అవుతుందా ? ఇంగ్లీషులో షేక్స్పియరూ, మిల్టనూ, చాసరూ చదివినవాళ్లు ఆధునిక భాషలో రాయటంలేదా? చదివేవాళ్ళు ఎప్పుడూ ఉంటారు. కాబట్టి అధ్యాపకుల ఉద్యోగాలు పోతాయన్న బెదిరింపు కూడా అబద్ధమే !

ఈనాడు వాడుకభాషని వెలివెయ్యకుండా వాడుకోనిస్తే కావ్యభాషాయోష దెబ్బతింటుందట ! కొక్కొండవారి నాటకంలో కొన్ని రూపాలు లక్షణ విరుద్ధాలనీ ఆయనకి భాషే రాదనీ వేదం వెంకటరాయ శాస్త్రిలవారు జబర్దస్తీగా, విమర్శిస్తే వారు లక్షణ విరుద్ధం అన్న రూపాలు వారి గ్రంథాలోనే ఉన్నప్పుడు గిడుగువారు ఊరుకుంటారా ! ఆ ప్రకారమైతే వేదంవారికే భాషరాదని నిరూపించారు. అలాగని తమకి వచ్చునని అహంకారం ప్రకటించుకోలేదు.

ఇలాటి పండితులకే ప్రాచీనభాష సరిగా రాయడం చేతకావడంలేదని వెల్లడి అవుతున్నప్పుడూ ఈనాడు ఎం. ఏ. పరీక్షల్లోనూ థీసిస్సుల్లోనూకూడా శుద్ధమైన గ్రాంథిక భాషంటూ లేదని అనుభవజ్ఞులు నిరూపిస్తున్నప్పుడూ వ్యావహారిక భాషలో రాస్తేనే రచనలో సౌలభ్యమూ స్ఫూర్తీ ఉంటాయని చెవిలో పోరుపెడుతున్నా తలకెక్కించుకోరెందుకో తెలియదు !

తరవాత విషయం, వాడుకభాషలో వాచకపుస్తకాలు చదివినా పరీక్షలో రాసినా ప్రాంతీయ దురభిమానాలూ, ప్రత్యేక రాష్ట్రవాదాలూ బయల్దేరతాయట! ఇంతకంటే విడ్డూరం ఉందా అని? అంటే, ఆ దురభిమానాలూ ప్రత్యేక రాష్ట్ర వాదాలూ కావ్యభాష మోహంచూసి ఇంతవరకూ రావడం మానేశాయి అన్నట్టా? లేకపోతే ప్రత్యేకరాష్ట్రమో, రాష్ట్రాలో వచ్చేస్తే వాడుక భాష నోటికీ చేతులకీ తాళాలు వెయ్యగలమనా? అదృష్టవశాత్తూ రాజకీయపు బెదిరింపులకు హడలిపోయే రోజులు వెళ్ళిపోయాయి కనక సరిపోయింది!

దేశభాష ఒకరి సొత్తు కాదు. సమాజం సమష్టి సృష్టి సమష్టి సంపదాను. రాకపోకలూ రకరకాల సంబంధాలూ పెరుగుతున్న ఈ కాలంలో ఏ ఒక్క ప్రాంతానికీ భాష పరిమితంకాలేదు. ఈనాటి విద్యావ్యాపక సాధనాలూ పత్రికలూ సినిమాలూ రేడియో ఆధునిక సాహిత్య గ్రంథాలూ దానికొక సమగ్ర స్వరూప మిచ్చాయి; ఇస్తున్నాయి; ముందూ ఇస్తూంటాయి.

భాషకు మారుపాటు సహజం. గ్రాంథిక భాషకైనా సరే; అయినా తొంభై ఏళ్ళనాటి వీరేశలింగం పంతులుగారి ప్రహసనాల్లో భాషకీ ఈనాటి వ్యవహారానికీ ఏమంత పెద్ద తేడా ఉందని? ఈనాటి సంగతి చూస్తే ఒక్కొక్క ప్రాంతపు పలుకుబడిలో ఒక్కొక్క వైలక్షణ్యం ఉండవచ్చు. అన్నీ కలిసి వ్యావహారికానికి పుష్టి కలిగించడంలేదా? భిన్నత్వంలో ఏకత్వంలేదా? ప్రపంచంలో ఏ భాషలో అయినా నూటికి నూరుపాళ్ళు ఏకరూపత అన్నది ఎక్కడైనా ఉందా?

ఆ మాటకొస్తే మన గ్రాంథికభాషలో మాత్రం ఎన్నో రూపాంతరాలూ పర్యాయపదాలూలేవా? 'ఒకతె' అన్న సర్వనామానికి సూరిగారు 52 రూపాంత రాలు ఇచ్చిన విషయం చిత్తగించి ఏమంటారు? చిన్నయసూరిగారి కాలంలోనూ వారికి పూర్వమూ తరవాతా ఉన్న తెలుగు సంప్రదాయం కళ్ళకు కట్టేలాగ గిడుగువారు సేకరించిన కింది ఉదాహరణలు గమనిస్తే సత్యం బోధపడుతుంది.

## 1. వచనవాక్యాలు

**రామాయణం :**

నేత్రోత్సవంగా సేవించుకుని ఎత్తుకపోయిన

డెబ్బైరెండు
తక్కువగానే ఉండెను
దక్షిణ దిక్కునుంచ్చి
విమానం
ఏలేటంద్దుకు
చూస్తివా

కూడా
తీసుకు
ఆ వాక్యాన్ని విని
పిలుచుకో వచ్చి
లేకుండా

**భారతం** (కాంచీపురం పచ్చయప్ప మొదలారిగారి విద్యాశాలలో తెలుగు, సంస్కృత భాషలకు ప్రధానోపాధ్యాయులుగా ఉన్న వైయాకరణ రామానుజాచార్యులవారూ, పరవస్తు చిన్నయసూరిగారూ 'ఆదిపర్వం' పరిష్కరించి, వచనంలో రాసి ప్రకటించిన గ్రంథం) :

యవ్వనము
తీసుకొని
వాన్ని
ఇవ్వవలయును
అనుభవించితే
ఆకాశమున్ను
ఒక్కడైనా
వారినిన్నీ
వుద్ధరించి
జేష్ఠ కొమారుడైనా
నెత్తురు ప్రవాహమయ్యేటప్పుడు

కూడా
దేశం
వక
అందులోవుండే
ఆడవాండ్లు
చిరునవ్వుచాతను
తెలుస్తుంనదే
సింహ్మదేశం
వార్లకు వొకరికి వొక కొమ్ము
వుండేటటువంట్టి
వాళ్ళ

**భాగవతం :**

పలుకరిస్తున్నాడు
పుట్టుచుండ్డే
తోవ
చెవుడివాని వద్ద వూదిన శంఖము
చంద్దాన

వొఖవాళ
వొకవాళ
అన్నినీన్ని
పొలు తాగితే
ఏడ్చేవుసుమీ అనీ

పీణ్ణి
మీ నేపుణాకల సంహ్మారించ్చండ్డా
నిర్దాక్ష్యముగా సూస్తున్నుండెను
వో పన్నగశయనా
తంౖడి ఘోరకృత్యము చేస్తున్నాడని
కోపము ళాయడు
వొఖవేళ
వొకవ్యాళ
వచ్చేటప్పుడు రధాలెక్కి
దూడల గాస్తున్నా
రక్షించె
పోతావున్నాడు
చూస్తానె వుండిరి
సహదేవుణ్ణి
రక్తమాంసములుల్యాక
పలుకరిస్తున్నారు.

## 2. ౖపాచీనౖగంథాలు

కావలి వేంక్కట బోరయ్యగారు కంచిలో పురాణ ఇతిహాస దరిశన ౖపమాణములు వల్ల విచారించ్చి ౖవాసినటువంటి 'కాంచి మహత్యం' :

వున్నంతల్లో
చేసేవర్కు
తెరిచేటంత అవకాళం
నరమాణాన్ని
ఆ వృక్షంకింద్ద వుంటుంన్నాను
తీర్ధాలతో కూడి
వృక్షాన్ని
సంకల్పించిన వెనక
అయితె కూడా
ఆగ్గచేస్తే
అక్కడనుంచ్చి
ధ్యానం చేస్తారు.

## 3. తత్త్వశాస్త్ర ౖగంథాలు

ఎందువల్లనంటే
ౖవాసితే
వాటికి
చేస్తూ
అప్పటినుంచి
ఐతే
మనచుట్టూ అయితే
నాలాగే
వైష్ణవచెరువొకటిన్ని
ఎందువల్ల - వస్తుందంటేను
అజ్ఞానం వల్లను
గుడ్డు
గురుముఖంగా
లేకపోయినాగాని

బాగా
చెప్పినట్లుగా
కంటె
ఆక్రమించుక వుండును
ఎటువలెనాసక్తి విడువలెనంటేను చెప్పేము
లోకాలను
వేసుకు పోతాను
లేకుండా
చాలా
సంపాదించినా
ఆచార్యులున్నూ
చెప్పబొయ్యేది
గనుక
లేకపోవటమున్నూ
బోధించేస్తేను
యెంత - బోధించినా
దిద్దుకొనే
సరిపొయ్యీని
అటువంటివారిని
ఆచార్యున్ని
సూత్రం

కోపతపాలు
(పైవాటిలో చాలావరకూ తాళపత్ర గ్రంథాలినుంచి)
అనేటిది
కొట్టిస్తిని
వణుకు
ప్రకాశిస్తున్నదని
పురుషుణ్ని
వుంటూ వుండగా
మనిషి
అనుభవింత్సును
పొందుతాడుగన్క
తీసుకువచ్చేటందుకు
పీటిని
దగ్గిరికే
చెయ్యలేక
వాండ్లతో
వాణ్ని
ఇవ్వగానే
పంప్పించడానకు
పదిహేనో పర్వము
చేసుకునెను
ఇంకా
చేసుకోవడానకు

## 4. కథలు

'చార్‌దర్వేషు' (ఎఱ్ఱమిల్లి మల్లికార్జునుడు) :

అనే
అయితే
2)

కనబడుతున్నందున
దీన్ని చేస్తే
బాగా
నిశ్చయించడమైనది
ఇందుకు
రెండో
కాకుండా

పట్టుకుని వస్తే
విరుచుతుండిరి
ఇప్పట్లో
నావల్ల అయ్యేపని కాదు
అతణ్ణి
బహుమతీ
లేకుంటే
దీవిస్తూ పాయెను

'ద్వాత్రింశత్సాలభంజికల కథలు' (రావిపాటి గురుమూర్తిశాస్త్రి, 1819) :

పోతున్నారు
అయితే
విరగదొక్కుకుంటూ పోగా
విరుస్తూ వుండగా
గూడా
జగడానపడేది
చిన్నవాణ్ణి

నీళ్ళు
అవుతాను
దినం
చెప్పుతాను
వచ్చినట్టయితే
స్నేహితుణ్ణి
వరహాలు

'హంసవింశతి' (వచనం) : బళ్ళకు
'కాంభోజరాజు కథలు' :

అయ్యేకొరకూ
అడిగితే
అగ్రహారం
అంతకంట్టె
వక

ఆశచాత
పోనిస్తుంన్నాను
చక్కాపోగా
మరుకవాంణ్ని
తప్పించుకపొయ్యెను

'తాతాచార్యుల కథలు' (అచ్చు 1855) :

వేసుకొని
చేస్తున్న
ఏలాగంటే

విద్వాంసుణ్ని
చదువుకొంటున్నాము
వచ్చే పొయ్యే దోవ

'తెనాలిరాముని కథలు'

| | |
|---|---|
| నలబై | వచ్చేది |
| | వఖ పుటికలో |

'శుకసప్తతి కథలు'

| | |
|---|---|
| ఏడోవాన్ని | మడుస్తూ |
| | చెప్పినా |

'నిజమైన కాశీమజిలీలు' :

| | |
|---|---|
| నీవుచెప్పాజాలవు నేను వినాజాలను | కనుక్కుంటేనేగాని |
| చేస్తామంటే | తెలిసింది |

## 5 దేశచరిత్ర

'తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర' (సరస్వతీమహల్ లైబ్రరీలో ప్రతి-కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఉద్ధరించినది) :

| | |
|---|---|
| సంపూర్ణంగా | కట్టుతప్పడమే |
| స్వాధీనపర్చుకున్నారు | కుదిరింది |
| గ్రంథాలవల్ల | చోళరాజ్యం |
| తెలుస్తూ వున్నది | ఇప్పటికీ తెలుస్తుంది |
| కలుపుతున్నారు | |
| ఐతే | |

'రాయవాచకం' (శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉండే-విశ్వనాథనాయని స్థానాపతి రాసింది) :

| | |
|---|---|
| విన్నపం | కాస్తా వున్నారు |
| ఎనిమిది తిరుపతుల నుంచిన్ని | రప్పించుక |
| పలకగా | డెబ్బైరెండు |
| | కరణాలు |

'కర్ణాటరాజ్యవృత్తాంతం' (శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సేకరణ) :

| | |
|---|---|
| వస్తేను | వుత్తరంలో |
| కూర్చునేటట్టు | రాసుకుంటున్నారం |
| వివరం | రాజ్యం చేస్తూ వుండిరి |

'కాశీయాత్ర చరిత్ర' - (అచ్చు 1830 - సుమారు 170 ఏళ్ళకిందట చెన్నపట్నంలో సుప్రీంకోర్టులో ఇంటర్‌ప్రిటర్‌గా ఉన్న మహాపురుషుడు ఏనుగుల వీరాస్వామయ్యగారు రాసింది).

| | |
|---|---|
| ఉదయాన | చెప్పుతారు |
| ఎక్కే | అనే |
| అయితే | అందుకు |
| తెస్తాడు | వాటి |
| ఏమంటే | కడుపులో నుంచి |
| ప్రవహించేటట్టు | చస్తాము |
| | చెప్పించుకొంటారు |

'పిఠాపురం కైఫియ్యతు' - 7 (మెకంజీ కైఫియ్యతులు) :

| | |
|---|---|
| వక పట్నము | గ్రామాన్కి |
| నామం | కట్టించుకుని |
| చేస్తూ | గ్రామానికి |
| వెళ్ళేటప్పుడు | కూడా |
| అనే | చేసుకోమని |
| నివాసం చేసుకుని | జరుగుతూ వున్నది |
| వుండేటి | రావడం |
| పట్టుకుని | చెప్పకుంటే |
| సారంగధరుణ్ని | ఏమీ |
| వెలపలకి | అడగగా |
| లేకుండా | చెప్పేటప్పటికి |
| చాయడాన్కి | మహా గొప్ప సర్పం |
| శలవు పుచ్చుకుని | అంతా |

| | |
|---|---|
| దుఖపడినంతట్లో | సర్పాంన్ని |
| దేహత్యాగం | పూరేగడముకు |
| విరోధం తలుస్తూ వుండేవాడు | వేస్తూవున్నట్లున్నూ |

## 7. కోర్టు తీర్పులు

'అర్జీలు'

| | |
|---|---|
| ఏమంటే | నీళ్ళు |
| మూడు నెలల నుంచి | పడదోసి |
| వెచ్చం | దాకా |
| ఇదుగో | వేసుకుంటూ |
| ఇస్తాను | వెళ్ళకొట్టుతానని |

'సమన్లు'

| | |
|---|---|
| ఇందువల్ల | ఏమంటే |
| ఆజ్ఞాపించేది | విచారిస్తున్నాము |
| | గనక |

## 8. వార్తాపత్రికలు

'పురుషార్థప్రదాయిని' (ఏప్రిల్ 1872)

| | |
|---|---|
| ఉంటూఉండగా | కూడా |
| ఉండే | నశించిపోవడమునకున్ను |
| వల్లనే | |

'హిందూజన సంస్కారిణి' (1889)

| | |
|---|---|
| జరిగిస్తూ వుండి | పురుషుని వల్ల |

## 9. వ్యాసం

'హితసూచని' (1862 ప్రచురణ - సామినేని ముద్దు నరసింహంనాయుడు రాసింది)

| | |
|---|---|
| ఐతే | అనే |
| లేకుండా నుండుటము వల్లనున్ను | అన్ని |
| ఉంటున్నది | లేకుండానే |
| | ఎంచుకుంటున్నాను |

## 10. టీక - వ్యాఖ్యానం

'ఆంధ్రశబ్దచింతామణి' (ఎలకూచి బాలసరస్వతి 17వ శతాబ్ది-)

| | |
|---|---|
| అనే | అయిపోతే |
| ఐతే | తెలుసుకునేది |
| అయినాగాని | గనక |
| వస్తే | ఉంటేనే కాని |
| హలంత్యం | నిర్ణయించేము |
| | చేసుకుంటేను |

'అమరం' (తాళ్ళపాక తిరువేంగళనాథుడు)*

| | |
|---|---|
| గ్రంథానకు | సంక్షిప్తాన |
| చేస్తూన్నాడు | అంటేను |
| వరువులవల్లాను | దిగ్గజాలున్ను |

'అమరం' (పార్నంది రామేశం) :

| | |
|---|---|
| ఉండే | నాట్యంచేసే స్థలమందు |
| ఉచ్చరించే కాలము | ఉండేవారి పేరు |
| ఐతే | పెళ్ళాము |
| కికురించడమనగా ధిక్కరించడము | |

---

* అమరుక కావ్య వ్యాఖ్య (శృంగారామరుక కావ్యము) రాసిన తాళ్ళపాక తిరువేంగళాచార్యులు క్రీ. శ. 1550 ప్రాంతంవాడు అని తెలుగు విజ్ఞాన సర్వసం (సం. 4).

'భారతం' (ఉద్యోగపర్వం - భారతం లక్ష్మీపతి పండితుడు):

| | |
|---|---|
| యుద్ధానకు | సూచించపడ్డది |
| లేకుండా | ఒప్పుకుంటే |
| యింట్లో వుంటే | యిచ్చినట్లైతే |
| అనే | |

'ఆముక్త మాల్యద':

| | |
|---|---|
| అనేటి | హరించినదాన్ని గాను |
| కైనేసే | అంటే |
| దర్శనంవల్ల | రాకుండా |
| | గనక |

'మనుచరిత్ర' (1851, జూలూరి అప్పయ్యపంతులు):

| | |
|---|---|
| పుట్టుతున్నటువంటి | చేసుగాక |
| | మ్రోస్తూనుండే |

'వసుచరిత్ర' (జూలూరి అప్పయ్యపంతులు):

| | |
|---|---|
| ఏడవగాను | గనక |
| కన్నీళ్ళు | అయ్యేవరకు |
| అంతా | తెల్లగా |
| పారుతూ | ఉంటే |
| ఉండడమునకు | నిద్రనున్న |

'కళాపూర్ణోదయం' (వంగిపురం నరసింహాచార్యులు)

| | |
|---|---|
| కాకుండాచేసి | చేసును |
| తెలుసుకొని | గోరులవల్లను |
| మిక్కిలిన్ని | కిందుమీదుగా |
| చెప్పేవాడున్ను | ప్రకాశిస్తూనుండే |

## 11. లక్షణ గ్రంథాలు

'అప్పకవీయము' (కాకునూరి అప్పకవి - 1656 ప్రాంతంవాడు) :

| | |
|---|---|
| ఇందుకు | తెలుసుకొనేది |
| ఎటువంటి వంటేను | గనక |
| ఐతేను | తత్సమము చేస్తేను |
| చెప్పుకొన్నారు | ఇటువంటివెల్లా |
| | అనే |

'ఆనందరంగరాట్ఛందము' (కస్తూరి రంగకవి - అచ్చు 1922; ఫ్రెంచి గవర్నరయిన డూప్లే దగ్గర దుబాసిగా ఉన్న ఆనందరంగపిళ్లకు అంకితం) :

| | |
|---|---|
| యతులున్ను | వ్రాయదమయినది |
| చెప్పివున్నవి | అన్ని |
| ఉండే | వాటికి |
| ఉంచితే | చెప్పితే |
| వస్తే | చాలా |
| అయినా | కూడా |

'ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణము' (పుదూరు సీతారామశాస్త్రి - అచ్చు 1834) :

| | |
|---|---|
| వాటి | వాటికి |

'గురుమూర్తి వ్యాకరణము' (1836) :

| | |
|---|---|
| శబ్దములున్ను | మాటలున్ను |
| కోసము | అనిన్ని |
| కోసరము | ఐనా |
| నుంచి | చేరియున్నట్టయితే |
| అనే | చావడము |

'శేషయ్య వ్యాకరణము' (1857, విద్యాశాఖ అచ్చువేయించింది. తరవాత 1875లో దీన్ని గ్రాంథికభాషలోకి మార్చిపారేశారు) :

| | |
|---|---|
| అనిన్ని | మొదటఉండే |

| | |
|---|---|
| అనే | |
| చివరను ఉండే | అచ్చురావడము |

## 12. బడి పుస్తకాలు

'పెద్దబాలశిక్ష' (పుదూరు సీతారామశాస్త్రి) :

| | |
|---|---|
| చేసుకొనరాదు | ఇచ్చేది |
| వచ్చినా | చంపే |
| పలికేవాడు | చేయడము |
| తెగగొట్టడము | వానికిన్ని |
| | నీళ్ళలో |

'పురుష సాముద్రికలక్షణము' :

| | |
|---|---|
| ఉంటే | పంపుతు రావలెను |
| మనిషి | చేసియుండె |
| వ్రాయడము | |

'మహమ్మదు చరిత్ర' (అధ్యాయం 1) :

| | |
|---|---|
| పెండ్లి చేసుకొనువరకు | పెత్తండ్రి |
| ఉండేవాడు | నేర్చుకొనెను |

(అధ్యాయం 6) :

| | |
|---|---|
| చేసేవాడు | అనిన్ని |
| ఉండేది | ఉండేటట్టుగా |

'భూగోళము' (1856, ఉపయుక్త గ్రంథకరణి సభవారిది, మూడోకూర్పు) :

| | |
|---|---|
| స్వాధీనపరుచుకొని | అనే |
| | వాటిచేత |

'భూగోళశాస్త్రము' (1852) :

| | |
|---|---|
| బోధపరచుకొనడము | అయితే |

ఉండే
సృష్టినిన్ని
వేరే వేరే
వాటి

అనిపించుకొంటున్నారు
ఎరుగకుండానున్నారు
విచారిస్తే
పుట్టే

'రైల్వేస్ అండ్ ది స్టీమ్ ఇంజిన్స్' (1856) :

లాగబడుతూ వున్నవి
తోవ
కుడిపక్కన
అక్కరకొద్దీ
వొక
నిలుస్తున్నాడు
రాకుండా
తీసుకపోబడుతున్నది
వుండేవి
మూడో
ఇచ్చేవారు
వుండేవాటిలో
కూర్చుండవచ్చును
తెలిపేకొరకు

సుళువుగా
అగ్నికొలిమి
అనే
వస్తువి
అనేది
నీళ్ళు
దగ్గెరవున్న
ఏలాగంటే
చేరగానే
తోసివేసును
పుట్టితే
చేరనివ్వవచ్చును
తెలుసుకొని
అంటారు
క్రవాసములున్న

'ఎలెక్ట్రికల్ టెలిగ్రాఫు' (అనగా మెరుపు టప్పా) :

పంపించే
అంటాము
జరిగే
అగుపడే
నీళ్ళు
అయితే
తోవకు

ద్వారా
అంటారు
తీగెల వల
కొంచుపోబడుతున్నది
రప్పించబడే
కమ్మికిన్ని
తిరిగి

| | |
|---|---|
| ఉంటే | వదిలితే |
| బద్దలు | తగిలిస్తే |
| పోయే | అలాటి యంత్రమువల్ల |
| | రెండు ముళ్లున్ను |
| | అలాగే |

'చిన్నవాండ్లకు తెలివిపుట్టగలందులకున్ను, నడవడి తెలియగలందులకున్ను యేర్పర్చబడ్డ వేడుక కథలు, (మద్రాస్ స్కూల్ బుక్ సొసైటీకై 1821లో పునర్ముద్రితము) :

విద్యా తరగని ధనము :

| | |
|---|---|
| విను | చెప్పడంవల్ల |
| చెప్పేవాణ్ని న్ని | దినదినానికి తరగిపోతున్నది |
| అయినా | అగుపరుస్తుంది |
| ఇస్తే | దివిటీ ప్రకాశించినట్టు |
| ఏమంటే | ముట్టిస్తే |
| పోగొట్టుకోకుండా | పోగొట్టుకోనూ కూడదు |

'పంచతంత్రము' (1834, 1861, 1870-రావిపాటి గురుమూర్తి శాస్త్రి-నలభై ఏళ్ళ పాటు పాఠ్యగ్రంథంగా ఉంటూవచ్చినది):

| | |
|---|---|
| వైశ్యులచేతనున్న | సమర్పించకపోతే |
| చచ్చినా | ఇదుగో |
| పుట్టినట్టు | పీండ్లు |
| ఎవరైనా | సంపాదించుకోవడము |

'మచిలీ బందరు చరిత్రము' (1879 - సారంగపాణి, మతుకుపల్లి కృష్ణశాస్త్రి) :

| | |
|---|---|
| మహత్వమును బట్టి | తెలిసే |
| ఉంటూ | ధాటీచేస్తూ |
| అయితే | |

'తెలుగుదేశములో వున్న యింగిలీషు బరులకొరకైన "బాలబోధి" (1852, ఆఖరు పాఠము) ధైర్యముగల వొక చిన్నవానినిన్ని పిరికితనముగల ఇంకొక చిన్నవానినిన్ని గురించినది, :

| | |
|---|---|
| వెళ్ళుతూ వుండగా | నేరము మోసుటచేతనే |
| అదుగో | దేనికయినా |
| అందువల్ల | స్నానము చేసుకొంటూ వుండగా |
| జడుస్తున్నావని | చిన్నవాండ్లందరూ |
| రెండో | నీటిలోనుంచి తీసుక |

'బాలమనోరంజని' వాచకపుస్తకం (పాఠం 37) నుంచి-మంచి వాయువును గురించి:

| | |
|---|---|
| అయితే | ఉన్నట్టు |
| చంపే | కప్పుదగ్గిర |
| లేకపోతే | వల్ల |
| కూడా | |

(పాఠం 57):

| | |
|---|---|
| నీళ్ళలో | వాటివల్ల |
| పుచ్చుకుంటే | రాస్తే |
| కూడా | వేస్తూ |
| తరుచుగా | కట్టితే |

'గణితశాస్త్రబోధ (1848- గణితశాస్త్రము అనగా లెక్కించవడమును తెలియజేసే శాస్త్రము), :

| | |
|---|---|
| అవి ఏవంటే | ఉండేవాటి |
| | రావడమునకు |

శబ్దమంజరి (....మునిపల్లె విశ్వంభరశాస్త్రి) :

| | |
|---|---|
| ఏమంటే | చాయతగిన |
| రామశాస్త్రులున్ను | చేరేటప్పుడున్ను |

| | |
|---|---|
| లేకుండా | అనే |
| చదువుకొనే బాలులకు | దీనివల్ల |
| కన్నా | చదివే |
| | వాటిలో |

జాబులు

కందాళ కేశవాచార్యులవారికి పరవస్తు రామానుజాచార్యులు రాసింది:

| | |
|---|---|
| వేంచేసియుండే | ఇప్పిస్తామన్నారు |
| కుశలం | అయితే |
| శ్రీముఖం | లేకుంటే |
| వుత్తరం | మరచిపోకుండా |
| ఘటిస్తుందో | వ్రాయిస్తువుండవలెను |

## 14. శాస్త్రాలు, చట్టాలు

'ధర్మశాస్త్రం - వ్యవహారదర్పణము' :

| | |
|---|---|
| ఉండే | చూస్తేనేకాని |
| లోబడ్డ | రీతిన్నీ |
| ఆచరిస్తున్నారు | తెలుసుకోవటము |
| అయితే | తెలిసేటట్టు |
| యావత్తూ | కూడా |

'క్రీస్తు పుట్టిన 1802 సంవత్సరం రెండో చట్టం' :

| | |
|---|---|
| దొరతనంతో | యేమంటే |
| అనే | వేరేవేరే |
| శోధించేటందుకు | చెప్పబొయ్యే |
| అనేకమాట్లు | |

'1860 సంవత్సరపు 45 ఆక్టు' :

| | |
|---|---|
| అంతటా వ్యాపించే | ఏదిన్నీ |

| | |
|---|---|
| ఏర్పాటు చెయ్యడము ఏమంటే | కంపెనీవారితోటి |
| ఉన్నట్లయితే | వేటినయినా |

'జ్యోతిషం - మాధవరాజీయము' :

| | |
|---|---|
| గురుడు వుంటే | అవుతున్నవి |
| మారకనిర్ణయం | సర్వగ్రహాలకున్ను |

'గోపాలరత్నాకరము' :

| | |
|---|---|
| పాపముక్తుడయితేను | చూస్తే |
| ఉంటే | ఉన్నా |

'భూగోళదీపిక' (అచ్చుప్రతి 1843, పీఠిక) :

| | |
|---|---|
| అచ్చువేయించడము | వాటిని |
| అనే | తెలియతగ్గది |
| ఉండడమే | అంతా |
| అయితే | కంటున్నాము |

'శ్రీ ఆర్యభట సిద్ధాంతవ్యాఖ్యానము' :

| | |
|---|---|
| బుధవారం | ఈ ప్రకారంగానే |
| సూత్రం | ఇంకా |
| అన్ని కక్షల కంటేనున్ను | దూరాన |
| పుచ్చుకుని | నుంచి |
| నడుస్తూ వుంటుంది | సాధించే క్రమం |
| ఆరో | సాధించుకునేది |
| వ్రాశేము | అంటీలాగు |
| | దగ్గిర వుంది |
| | గ్రహించేది |
| | పదిహేడో సూత్రం చాత |

'వైద్యం - శారీరం' :

| | |
|---|---|
| దినమున్నూ | తెలిసే |
| వుదయం | లేదా |

'అభినయ దర్పణము' :

పతాకహస్తానకు చెప్పేయందున్న
వద్దనడమందున్న

'తాళలక్షణ సంగ్రహము' .

ముఖం యెదుటబట్టితేను నిలిపితేను
ఉద్వేష్టంగా అనేటి
వ్యావర్తకమైతేను

'మృదంగ లక్షణం' :

వస్తేను మర్దనం చేశి
వాళ్ళు అనే
తీసుకుని

'వాస్తుశాస్త్రం' ,

ఇల్లు కట్టితేను చూస్తూ
విపరీతం

పై ఉదాహరణలు ఎక్కువగా పందొమ్మిదో శతాబ్దానివి. ఈ శతాబ్దంలోవి ఉదాహరించడం ఏమంత కష్టం కాదు కాని, అనవసరం అని చెప్పవచ్చు. కారణం ఏమిటంటే, ప్రస్తుత సమాజంతో అన్ని విధాలుగానూ సంబంధం పెట్టుకొన్న వ్యక్తులు నేటి విద్యావంతుల భాషలో సార్వజనీనతను గ్రహించకపోరు. రాష్ట్రంలో ఏ జిల్లా పుట్టినవారయినా నూటికి తొంభై మందికి పైగా రచయితలు ఇప్పటి వాడుకభాషలోనే రాస్తున్నారు. అంటే 'ఆధునిక ప్రమాణ భాష' లోనే రాస్తున్నారు. ఇది నిర్వివాదాంశం. శ్రీగంటి జోగిసోమయాజి ఈ ('ఆంధ్రభాషా వికాసము' రచయిత) వంటి పండితులుకూడా ఆధునిక భాష ఘనతను ఒప్పుకోక తప్పలేదు. కావాలంటే ఆంధ్రభాషావికాసం రెండో కూర్పు (పుటలు౬౭౬-8) చూడవచ్చు.

యాతావతా, తెలుగువాళ్ళకి అందరికీ భాషాసాహిత్యాలపట్ల ప్రేమాభిమానాలు లేకపోలేదు. ఇటు పత్రికలూ ఆధునిక సాహిత్యగ్రంథాలూ ఎంత విరివిగా

చదువుతున్నారో అంత విరివిగానూ ప్రాచీన సాహిత్యం చదివితీరాలని శాసనం చెయ్యడంవల్ల ప్రయోజనం ఉంటుందా? ఎవరి అభిరుచికి తగ్గట్టుగా వాళ్ళు ఆయా గ్రంథాలు చదువుకోడానికి స్వేచ్ఛ ఉందికదా! పాఠ్యాంశనిర్ణేతలు వ్యక్తిగతమైన ఇష్టానిష్టాలు పక్కకుపెట్టి జనబాహుళ్యానికి తృప్తికరంగా ఉండేటట్టు, వారి బాధ్యత వారు నిర్వహించుకోడం అవసరం.

చిత్రమయిన విషయం ఏమిటంటే, ఒకప్పటి 'తెలుగు ఎకాడమీ' అనే ఆంధ్రసాహిత్యపరిషత్తు వ్యతిరేకించిన సిసలైన తెలుగు సంప్రదాయాన్ని ఇప్పటి 'తెలుగు అకాడమి' (హైదరాబాదు) చాలావరకూ ఉద్ధరించి గణనీయమైన కృషి చెయ్యడం. ఇది ఎంతో హర్షదాయకం. ఈ సంప్రదాయాన్ని గురించి పండితులకు సైతం ఇంకా సందేహాలేమిటో అర్థం కాదు. అలాటివాళ్ళు, గిడుగు రామ్మూర్తి పంతులుగారు ఏనాడో రాసిన 'వ్యాసావళి, ఆంధ్రపండితభిషక్కుల భాషాభేషజం, బాలకవి శరణ్యం, గద్యచింతామణి'కాని, మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిలవారూ మండపాక పార్వతీశ్వర శాస్త్రిలవారూ చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారూ మొదలయినవారి మాటలు కాని విస్మరించకూడదని మనవి. స్వస్తి.

# 3

# గ్రాంథిక వ్యావహారిక భాషోద్యమాలు

ఈనాటి యువతరానికి ఈ శీర్షిక చూస్తేనే నవ్వొస్తుంది. ఎంచేత ? ఈ నాడటువంటి వివాదానికి స్థానంలేదు కాబట్టి. కాలమిచ్చిన తీర్పు అమలులోకి వచ్చి కొన్ని దశాబ్దాలే గడిచిపోయాయి కనక; ఒక్క పాఠ్యపుస్తకాల్లోతప్ప సర్వే సర్వత్ర ఆధునికభాషే ప్రయుక్తమవుతూ రోజుకు కొన్నివందల పుటలు అచ్చవుతూ వస్తున్నాయి కనక; ఆ పాఠ్యపుస్తకాల్లోనయినా, ప్రాచీన కావ్యభాషా సంప్రదాయాన్ని తెలుగు విద్యార్థులు మరిచిపోకుండా ఉండటంకోసం తెలుగు మాతృభాషగా చదివేవాళ్ళకోసం రాయించిన తెలుగువాచకాలకే గ్రాంథికం పరిమిత మవుతుంది కనక.

నిజమే. కాని ఇటీవలి రెండుమూడు సంవత్సరాల కిందటివరకు ఆ ఉద్యమాల ప్రభావం ప్రసరిస్తూనే వచ్చింది. ఆనాడే కాదు, ఈనాడుకూడా 'వ్యావహారిక సత్యాన్ని' అంగీకరించలేని కావ్యభాషాభిమానులు ఇరకాటాన పడుతూండటం కద్దు. కాబట్టి ఈ వివాదానికిగల చారిత్రక ప్రాముఖ్యం విస్మరించరానిది.

గ్రాంథిక, వ్యావహారిక భాషోద్యమ చరిత్రను సమగ్రంగా అవగాహన చేసుకోవాలంటే భాషతో ముడిపడి ఉన్న మౌలికాంశలను ముందుగా ప్రస్తావించటం అవసరం.

సమాజంలో ఒకరి భావాలు మరొకరికి తెలియటానికి వీలుగా ఏర్పడిన ధ్వని సంకేతాల నియతనిర్మాణం భాష. సమాజం దీన్ని సమష్టిగా సృష్టించుకుంది. సమష్టి సాధనంగా వాడుకుంటోంది. సమాజంలో వివిధస్థాయిలున్నట్లుగానే భాషలోకూడా వివిధస్థాయిలుంటాయి. వివిధరంగాల్లో పరిణామాలు వచ్చినట్లుగానే భాషలోకూడా పరిణామాలు వస్తూఉంటాయి. అంటే పాతవి తొలగిపోతూండటం కొత్తవి చేరుతూండటం జరుగుతూ ఉంటుంది. ఈ పరిణామాల

నన్నిటినీ స్వీకరిస్తూ సమకాలీన వాగ్వ్యవహారానికి అద్దంపట్టేదే జీవద్భాష. అట్లా లేనిది మృతభాష.

ఏ భాషలోనయినా లిపి కొత్తగా వాడుకలోకి వచ్చినప్పుడు అప్పటి వ్యవహారానికి అది అక్షరరూపమిస్తుంది. ఒకరకమైన రచనా సంప్రదాయాన్ని నెలకొల్పుతుంది. కాని ఆ సంప్రదాయానికే అలవాటుపడ్డ మితవాదులు పరిణామకారణంగా వారి వ్యవహారంలోనే వచ్చిన మార్పులను లిఖితంచేస్తామంటే అంక్ష పెడతారు. దేన్ని ప్రాచీన సంప్రదాయమని తాము అనుకుంటున్నారో దాంట్లోకూడా వచ్చిన రచనాపరిణామాలను చూస్తూ ఉండికూడా భాషాతత్త్వాన్ని అర్థం చేసుకోలేకపోతూ ఉంటారు. తెలుగులో వాళ్ళనే కావ్యభాషావాదులని, గ్రాంథికభాషావాదులని అంటూ ఉంటారు.

సమాజంలో వివిధస్థాయిలున్నట్టే భాషలోకూడా వివిధస్థాయి లుంటుంటాయని ముందు చెప్పుకొన్నాం. వాటిలో-చదువూ సంస్కారం ఉన్నవాళ్ళూ సంపన్నులూ పలుకుబడిగలవాళ్ళూ సామాన్యంగా నిత్యవ్యవహారంలో వాడే భాష ఆ కాలపు ప్రమాణభాషగా గుర్తింపు పొందుతుంది. అటువంటి ప్రమాణభాషకే తెలుగులో మరోపేరు శిష్టవ్యావహారికభాష. శిష్టేతరులు దీన్ని అనుకరిస్తూ ఉండటం దానిద్వారాకూడా శిష్టత్వం సంపాదిస్తూ ఉండటం సర్వసామాన్యమైన విషయం. సమాజంలో అన్నిరంగాల్లోనూ ప్రాచుర్యంపొందిన ఈ ప్రమాణభాషే విద్యారంగంలో కూడా స్వీకారయోగ్యమైందని వాదించేవాళ్లని ఆధునిక భాషావాదులని, శిష్టవ్యావహారిక భాషావాదులని అంటూఉంటారు.

## పూర్వదశ

తెలుగులో ఆదికావ్యంగా ప్రసిద్ధమైన నన్నయభారతంలోని భాష ఆనాటి శిష్టవ్యావహారికానికి ప్రతిబింబమని చెప్పడానికి ఆధారాలు లేవు. దానికి భిన్నమైన నిర్మాణంగల రూపాలు అప్పటికి కొన్ని శతాబ్దాలముందునుంచికూడా వాడుకలో ఉంటూ తరవాతకూడా ఎన్నో శతాబ్దాలు అలాగే జీవించిఉన్న దాఖలాలు ఉన్నాయి. కాబట్టి నన్నయగారి భాషకూడా అంతకుపూర్వం చాలాకాలంగా కావ్యరచనకు పరిమితంగా వాడుకలో ఉండి ఉన్నదేనని ఆ రచనలు మాత్రం ఖిలమయిపోయాయని గ్రహించవలసిఉంది. పోతే, నన్నయగారి కాలంనుంచి ఇటీవల

చాలా శతాబ్దాలవరకూ తెలుగు సాహిత్యంగా చెలామణీ అయినవి దాదాపు అన్నీ పద్యకావ్యాలే కాబట్టి వాటిలో ఆ పాత వరవడే కనిపిస్తుంది. అయినా అక్కడక్కడ, కవి స్వేచ్ఛాపరతవల్ల నయితేనేం, సమకాలిక వ్యవహార ప్రభావంవల్ల నయితేనేం, ఛందోనిర్బంధాలవల్ల నయితేనేం పేరుమోసిన కవుల రచనల్లోకూడా కావ్యభాషా సంప్రదాయానికి భిన్నమైన రూపాలు కనిపిస్తూనే ఉన్నాయి. వ్యాకర్తలు వాటిలో కొన్నిటిని మట్టుకు అనింద్యగ్రామ్యాలనో పూర్వకవి ప్రయోగాలనో మన్నిస్తూనే వచ్చారు. ఇది ఇలాఉండగా వివిధశాస్త్రగ్రంథాలకు రాసిన వ్యాఖ్యానాలలోను, శాసనాలలోను, తదితర రచనలలోను కూడా మహాపండితులుసైతం వ్యావహారికాన్ని ఆదరిస్తూ వచ్చారు. దీన్నిబట్టి తేలేదేమిటంటే, గతశతాబ్ది ఉత్తరార్ధంవరకు పండితులకుసైతం వ్యావహారికంపట్ల నిరసనభావం ఎంతమాత్రంలేదు. అందుకు నిదర్శనం, చిన్నయసూరిగారు స్వయంగా ప్రచురించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వానికి రాసిన టీకలోని రూపాలే సాక్ష్యం (చూ. గిడుగువారి 'గద్య చింతామణి').

భారతదేశంలో సార్వజనీనమైన విద్యావిధానం వచ్చింది ఇంగ్లీషువాళ్ళ చలవవల్లనే అని మనకు తెలుసు. 1852లో మద్రాసు, బొంబాయి, కలకత్తా నగరాల్లో మూడు విశ్వవిద్యాలయాలు వెలిశాయి. వాటిలో చదువుకొని పట్టభద్రులైనవాళ్లు దేశంలో విద్యావ్యాప్తికి దోహదం చేస్తారని ప్రభుత్వం ఆశించింది. అయితే ఇంగ్లీషు పరభాషకావడంవల్ల, దేశభాషల్ని అభివృద్ధిచేయడానికి తగిన దోహదం లభించకపోవడంవల్ల వాళ్ల ఆశ ఫలించలేదు. 1901లో గవర్నర్ జనరల్‌గాఉన్న లార్డ్‌కర్జన్, సిమ్లాలో ఒక సమావేశమేర్పరిచి విద్యాసంబంధమైన సమస్యలన్నిటినీ కూలంకషంగా చర్చింపజేశాడు. ప్రాథమిక స్థాయినించి విశ్వవిద్యాలయ స్థాయివరకు పరిష్కరించవలసిన అంశాలగురించి, ఆ సమావేశం 150 తీర్మానాలను ఆమోదించింది. వాటి ఆధారంగానే కర్జన్ విద్యావిధానం రూపొందింది. ఉత్తరోత్తరా, పాఠశాలల్లోనూ కళాశాలల్లోనూ మాతృభాషా బోధనపట్ల విద్యాధికారులుకూడా శ్రద్ధచూపడం ప్రారంభించారు. "మాతృభాషలో వ్యాసరచనలను నిర్బంధ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలనీ, అట్లాగే ఇంగ్లీషులోని పుస్తకాలను ప్రాంతీయభాషల్లోకి అనువదించేప్పుడు వారికి శిక్షణ కలిగేందుకుగాను అనువాద పద్ధతులను నేర్పాలనీ'' నిశ్చయించారు.

1906 ప్రాంతంలో గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాలకు పాఠశాలా పరీక్షాధికారిగా జె. ఏ. యేట్స్ అనే ఆయన ఉండేవాడు. ఆయన కేంద్రకార్యస్థానం విశాఖపట్నం. అందువల్ల ఆయనకి తెలుగు పట్టుబడింది. అయితే పుస్తకాల్లో ఉన్న తెలుగు వేరు, ఆ పుస్తకాలుచెప్పే పండితులే క్లాసులో మాట్లాడే తెలుగు వేరు కావడంచూసి ఆయన విస్తుపోయాడు. నిజమే. ప్రపంచంలో ఏ భాషలోనూ ఇటువంటి విచిత్రం లేదాయె మరి! దీని కథా కమామిషూ ఏమిటో తెలుసుకుందామని స్థానిక కళాశాలాధ్యక్షులైన పి. టి. శ్రీనివాసయ్యంగారి దగ్గిర కదిపి చూశాడు. ఆయన కూడా తెలుగు బాగా వచ్చినవాడే. అయినా విజయనగరంలో ఉన్న గురజాడ అప్పారావుగారు, పర్లాకిమిడిలో ఉన్న గిడుగు రామమూర్తిగారు తనకంటె బాగా చెప్పగలరని సూచించాడు. యేట్స్ వాళ్ళిద్దరినీ కలుసుకొని కీలకం గ్రహించాడు. ఏటేటా ఉపాధ్యాయ వార్షిక సమావేశాలు ఏర్పరిచి భాషా పరిణామ వివేచనాదృష్టితో రామమూర్తి పంతులుగారిచేత ఉపన్యాసాలిప్పించాడు. పండితులకిది కంట్లో కారమైంది.

ఈ తరుణంలో మెట్రిక్ పరీక్షబదులు స్కూల్ఫైనల్ పరీక్ష, ఎఫ్. ఏ. బదులు రెండేళ్ల ఇంటర్మీడియట్ వచ్చాయి. అప్పుడు మాతృభాషలో వ్యాస రచనకు, అనువాదానికి ఎన్నుకోవలసిన పాఠ్యాంశాలగురించి గడబిడ జరిగింది. గిడుగువారు జీవద్భాషాప్రాశస్త్యాన్ని పునరుద్ఘాటించారు. పి. టి. శ్రీనివాసయ్యంగారు Language Life and death ప్రచురించారు. 1911 స్కూల్ఫైనల్ పరీక్షకు గ్రీకుమిత్తులు (Greek Myths పాఠ్యగ్రంథమైంది. పండితులకిది కోపకారణమైంది. వ్యావహారికభాషానిరసనానికి ఒక ఉద్యమమే లేవదీశారు. దాని బహిష్కారానికి ప్రభుత్వంమీద ఒత్తిడి తీసుకువచ్చారు.

ఈ పరిస్థితి గమనించి గ్రాంథిక వ్యావహారిక భాషావివాదాన్ని పరిష్కరించడానికిని మద్రాసు విశ్వవిద్యాలయం 1911 సెప్టెంబరు 8వ తేదీన ఒక సంఘాన్ని నియమించింది. అందులో నలుగురు గ్రాంథికభాషావాదులు, నలుగురు వ్యావహారిక భాషావాదులు సభ్యులు; ఒక తటస్థుడు అధ్యక్షుడు. ఈ సంఘం చాలాసార్లు సమావేశాలు జరిపి శిష్టవ్యావహారికానికి అనుకూలంగా తీర్మానించింది. దాని మేరకు విద్యాశాఖవారు, విద్యార్థులు గ్రాంథిక వ్యావహారికాల్లో దేనినయినా ఎన్నుకోవచ్చునని తాఖీదులిచ్చారు.

ఇది కావ్యభాషాభిమానులకు దుర్భరమైంది. వ్యావహారికాన్ని ఎదుర్కోడం కోసం ఆంధ్రసాహిత్య పరిషత్తు స్థాపించారు. శిష్టవ్యావహారికాన్ని గ్రామ్యమని నిరసించారు. ఎందరో పండితులను కూడగట్టుకున్నారు. ఊరూరా సభలు జరిపి, సంతకాలు తీసుకొని ప్రభుత్వానికి మహజర్లు పంపుకొన్నారు.

ఇది ఇలా ఉండగా, విశ్వవిద్యాలయం నియమించిన ఉపసంఘంవారు తెలుగులో నామ సర్వనామ క్రియాపదాల ప్రాచీన వర్తమాన రూపాలను వింగడించడంకోసం ఒక తీర్మానం ఆమోదించి వేదం వెంకటరాయశాస్త్రిగారిని, కొమర్రాజు వెంకటలక్ష్మణరావుగారిని, గురజాడ వెంకటఅప్పారావుగారిని ఆ పని చూడమని కోరారు. వ్యావహారికభాషావ్యతిరేకులైన వేదంవారు, కొమర్రాజువారు ఈ పట్టిక తయారీలో తమ చాతుర్యం చూపి వ్యావహారిక గ్రాంథికాలలో సమానరూపంలో ఉన్న ఏ రెండు మూడింటినో తప్ప తక్కినవాటినన్నిటినీ గ్రాంథికంలోంచే తీసుకుని అవే వర్తమాన రూపాలన్నారు. ఆవిధంగా, వెనక ఆమోదించిన తీర్మానానికే తమకు కావలసిన అర్థం చెప్పుకుని దాని ప్రయోజనాన్ని భగ్నంచేశారు. గురజాడవారు దీన్ని ప్రతిఘటించారు.

ఇది ఇలా ఉండగా, కొందరు పెద్దలు, విద్యావిషయాల్లో కూడా రాజకీయాలు ప్రవేశపెట్టకపోతే లాభంలేదనుకుని, విశ్వవిద్యాలయం నియమించిన ఉపసంఘంలో రాయలసీమకు ప్రాతినిధ్యం కల్పించే కారణంతో కోలాచలం శ్రీనివాసరావు, టి. శంకర లింగంపిళ్ళై, నాగపూడి కుప్పుసామయ్య, బారిస్టర్ కె. సుబ్బారెడ్డిగార్ల నియామకానికి దోహదంచేశారు. వీరంతా వ్యావహారికభాషా వ్యతిరేకులేనాయె ! ఇంకేముంది ? త్రాసు ఆవేపు మొగ్గింది. మెజారిటీ తీర్మానం గ్రాంథికభాషకే పట్టంకట్టింది. అప్పుడు గురజాడ అప్పారావుగారు డిసెంట్ పత్రం (Minute of Dissent) ఆంగ్లంలోరాసి అందజేశారు. రామమూర్తిపంతులు గారు రాసిన A Memorandam on Modern Telugu, జయంతిరామయ్యపంతులు గారు రాసిన A Defence of Literary Telugu మొదలైనవి కొంచె మించు మించుగా అప్పుడు వచ్చినవే.

అప్పటినించి బోధనరంగంలో గ్రాంథికం ఏలుబడి చెల్లుతూ వచ్చింది. అయితే ఉత్తరోత్తరా వచ్చిన వచనరచనల్లో వ్యావహారికం ప్రాచుర్యం పెరుగుతూ వచ్చింది. సమాజంలో అన్ని రంగాల్లోకి వేళ్ళుతన్నింది. పత్రికలు,

రేడియో, సినిమాలు, సృజనాత్మక సాహిత్యం వ్యావహారికాన్నే చేపట్టి సర్వవ్యాప్తం చేశాయి. పాత అలవాటు పోనివాళ్లు, వేళ్లమీద లెక్కపెట్టవలసిన కొద్దిమంది రచయితలు, తప్ప తక్కినవాళ్ళంతా వ్యావహారికంలోనే రచనలు చేస్తున్నారు. కేవలం వచనంలోనే కాదు, పద్యాల్లోకూడా ఇది చోటుచేసుకుంది. చివరికి గ్రాంథిక వ్యావహారిక వివాదమన్నదే అర్థరహితమనిపించేటంతగా తెలుగువాళ్ళ దృక్పథంలో మార్పుతెచ్చింది. అందుకే అంట, స్వాతంత్ర్యానంతరం కాలంలో పుట్టినవాడికి ఈ శీర్షిక చూస్తేనే నవ్వొస్తుందని : అయితే కథ ఇంతటితో అయిపోలేదు.

## ఇటీవలి చరిత్ర

మొదట్లో వ్యావహారికాన్ని వ్యతిరేకించిన ఉద్దండ పండితులే సత్యం గ్రహించి వ్యావహారికాన్ని సమర్థించడం ప్రారంభించారు. అందులో రచనలు ప్రారంభించారు. అటువంటివారిలో మొట్టమొదట చెప్పుకోదగ్గవారు వీరేశలింగం పంతులుగారు. గిడుగువారితో చర్చించి, వారి వాదాన్ని ఆమోదించి, వర్తమానాంధ్ర భాషా ప్రవర్తకసమాజానికి అధ్యక్షస్థానం స్వీకరించారు. అలాగే చెళ్ళపిళ్ళవారు. మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు, మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయ శాస్త్రిగారు, అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు వంటివారు దీన్ని సమర్థిస్తూ వాదించారు. గిడుగువారి దగ్గర చదువుకొన్న తాపీ ధర్మారావుగారు కొంతకాలం వీర గ్రాంథికంలో విహరించినా గురువుగారి వాదాన్ని గ్రహించిన తరవాత వ్యావహారికంలో విరివిగా రచనలు చెయ్యడమేకాదు పత్రికల్లో (జనవాణి) వ్యావహారికాన్ని మొట్టమొదట ప్రవేశపెట్టిన ప్రతిష్ఠ దక్కించుకొన్నారు. చలం, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, చింతా దీక్షితులు, మల్లాది రామకృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గోపీచంద్ మొదలైనవాళ్ళంతా కథలూ నవలలూ వ్యాసాలూ రాసి వ్యావహారికాన్ని పటిష్ఠంచేశారు. దేశంలో రేడియోశ్రోతలూ సినిమాప్రేక్షకులూ పాఠకులూ ఇబ్బడిముబ్బడిగా పెరిగారు. రచయితలూ కొన్నిరెట్లు పెరిగారు. ఇప్పటి పాఠకుడికి అన్నిప్రాంతాలవాళ్ళ రచనలూ అందుబాటులో ఉన్నాయి. అన్ని ప్రాంతాల మాండలికాలూ అన్నిస్థాయిల మాండలికాలూ భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తూ హృదయరంజకా లవుతున్నాయి.

ఆంధ్రప్రదేశం ఏర్పడ్డ కొంతకాలానికి రాష్ట్రప్రభుత్వంవాళ్ళు పాఠ్య పుస్తకాలను జాతీయంచేశారు. ప్రసిద్ధులైనవారిని ఎన్నుకొని సరళ గ్రాంథికంలో రాయించారు. అయితే ఇవి తెలుగు మాతృభాషగా చదివే విద్యార్థులకోసం. తెలుగు దేశంలో బతికే పరభాషీయులుకూడా రెండోభాషగా తెలుగు నేర్చుకోవలసి ఉంటుంది కాబట్టి వాళ్ళకోసం రెండోభాష తెలుగు పుస్తకాలు రాయించాలని ప్రభుత్వం సంకల్పించింది. దానికోసం దేశంలో ప్రసిద్ధులైన పండితుల్ని రచయితలుగాను సంపాదకులుగాను నియమించింది. ఆరో తరగతి తెలుగు వాచకానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం భాషాశాస్త్రాచార్యులయిన డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తిగారు సంపాదకులు. వారు ఆధునిక భాషాశాస్త్రాన్ని విదేశాల్లో క్షుణ్ణంగా అభ్యసించి ద్రావిడభాషాశాస్త్రవేత్తల్లో అంతర్జాతీయఖ్యాతి గడించినవారు. ఆరోతరగతి పుస్తకం పాఠ్యప్రణాళిక (సిలబస్) పీఠిక (ప్రియాంబుల్)ను అనుసరించి ఆధునికం, నిత్యవ్యవహారోపయుక్తం అయిన భాషలో శ్రీఉత్పల సత్యనారాయణాచార్యులుగారిచేత ఆ పుస్తకం రాయించారు. అయితే అది, ఇతర పాఠ్యపుస్తకాలకు భిన్నంగా ఉండటంవల్ల భాషాశైలినిగురించి ఒక నిర్ణయం తెలియజేయడంకోసం ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. దాన్ని పురస్కరించుకొని 1965లో తిరుపతిలో ఒక పండితగోష్ఠి ఏర్పాటుచెయ్యాలని మూడు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులూ తీర్మానించారు. దానిమేరకు, ప్రభుత్వాంతరపున పాఠ్యపుస్తక జాతీయాకరణ సంఘానికి కార్యదర్శిగా ఉన్న డాక్టర్ పి. ఎస్. ఆర్. అప్పారావుగారి కార్యకర్తృత్వంతో, కీ. శే. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి అధ్యక్షతన పండితగోష్ఠి జరిగింది. దేశంలో ప్రముఖ విద్వాంసులూ రచయితలూ పత్రికా రచయితలూ అందరూ అందులో పాల్గొన్నారు. విషయ (Subject) ప్రధానమైన పాఠ్యపుస్తకాల్లోను, ద్వితీయభాషా (Second language) పుస్తకాల్లోనూ ఆధునికభాషే ఉండాలనీ తక్కినవాటిలో సరళగ్రాంథికం ఉండాలనీ తీర్మానించారు. శైలీ వివరాలు రూపొందించడానికి మరొక చిన్నకమిటీ వేశారు. అందులో ఫుల్‌టైమ్ మెంబరుగా నియుక్తులైన శ్రీ గొడవర్తి సూర్యనారాయణగారు కొన్ని నమూనాపాఠాలు రూపొందించారు.

హిందీ మాతృభాషగాగల ఉత్తరదేశీయులు తెలుగు నేర్చుకొనే నిమిత్తం, దక్షిణ భారతహిందీప్రచారసభవారు 'తెలుగు భాషాబోధిని' అన్న పేరుతో నాలుగు

వాచకాలు, మరికొన్ని ఉపవాచకాలు వ్యావహారికంలో రాయించి ప్రచురించారు.

ఇంతలో, కళాశాలల స్థాయిలో ప్రాంతీయభాషలో విద్యాబోధన జరగాలన్న అంశం ఎదురయి అప్పటి విద్యాశాఖకార్యదర్శి అయిన శ్రీ జె. పి. ఎల్. గ్విన్ గారి అధ్యక్షతన ఒక కమిటీని ప్రభుత్వం నియమించింది. ఆ కమిటీవారుకూడా ప్రాంతీయభాషలో వేసే గ్రంథాలు శిష్టవ్యావహారికంలోనే ఉండాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ కమిటీ తెలుగుభాష అభివృద్ధికీ, ఆధునీకరణకూ 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' నమూనాలో ఒక సంస్థ ఏర్పడాలని సూచించింది. ఆ సూచన ననుసరించి రూపొందినదే ఇప్పటి 'తెలుగు అకాడమి'. ఈ సంస్థ ఆధునిక భాషకు కొంత పరిధి ఏర్పరిచి దాని మేరకు విషయప్రధానమైన పాఠ్య గ్రంథాలు రాయించడం ప్రారంభించింది.

ఆ మరుసటి సంవత్సరం, ఆధునిక సాహిత్యానికి సంబంధించిన పి. హెచ్. డి. సిద్ధాంతవ్యాసాలు వ్యావహారికంలో రాయవచ్చునని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తీర్మానించింది.

ఇది జరిగిన కొన్నాళ్ళకి – మాతృభాషగా తెలుగు చదివే విద్యార్థుల సమస్య అపరిష్కృతంగానే ఉండిపోవడం గమనించి, ఆంధ్రవిశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యులయిన శ్రీ పురిపండా అప్పలస్వామిగారు, సమస్యాపరిష్కార పరిశీలననిమిత్తం విశ్వవిద్యాలయంవాళ్ళు ఒక కమిటీని నియమించాలని తీర్మానం ప్రవేశపెట్టారు. దానిమేరకు, మాజీమంత్రి శ్రీ ఎం. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పడింది. డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి, డాక్టర్ పి. ఎస్. ఆర్. అప్పారావు, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, డాక్టర్ జి. ఎన్. రెడ్డి, డాక్టర్ తూమాటి దొణప్ప, శ్రీ పురిపండా అప్పలస్వామి, డాక్టర్ చేకూరి రామారావు ప్రభృతులు సభ్యులు. వీరంతా చాలా సమావేశాలు జరిపి, ఏకగ్రీవంగా ఒక నిర్ణయానికి వచ్చారు. నాటకాలు, ఉపవాచకాలు, ఆధునిక విషయాలగురించి రాసిన ఇతర రచనలూ వ్యావహారికంలో ఉండవచ్చుననీ విద్యార్థులు ఆధునికభాషలోనే సమాధానపత్రాలు రాయవచ్చుననీ తీర్మానించినట్లు వినికిడి. ఒక నిష్పత్తిననుసరించి ప్రాచీన, ఆధునిక కావ్యభాషాభాగాలను

పాఠ్యాంశాలుగా నిర్ణయించాలనికూడా పేర్కొన్నట్లు తెలుస్తున్నది. ఈ నిర్ణయాలు త్వరలో అమలులోకి వచ్చి సత్ఫలితాల నందించగలవని, ఆ విధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పూనిక ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకం కాగలదని ఆశించవచ్చు.

(యువభారతి వారి 'మహతి' వ్యాస సంకలనం, 1972)

# 4

# గిడుగు మెమోరాండం : గురజాడ డిసెంట్ పత్రం

తెలుగు వాడుక భాష 'ప్రామాణిక భాష'గా గుర్తింపు పొందడానికీ అది అన్ని రంగాల్లోనూ వ్యాపించడానికీ ప్రధానకారకులు గిడుగు, గురజాడ. వీరిద్దరూ ఆధునిక భాషావాదులు కావటంవల్ల ఆ కాలపు చాదస్తపు పండితులంతా ఒక్కటయి వీరి వాదానికి వ్యతిరేకంగా సభలు జరిపి, తీర్మానాలు ప్రకటించి, ప్రభుత్వానికి మహజర్లు పంపుకొని ప్రాచీన కావ్యభాషను బడిపిల్లల పుస్తకాల్లో కొనసాగించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. గిడుగు గురజాడల ఆధునిక భాషోద్యమం అంతకన్న తీవ్రంగా సాగింది. రామ్మూర్తి పంతులుగారు ప్రత్యేకంగా పనిగట్టుకొని మద్రాసు, నెల్లూరు, గుంటూరు, మచిలీపట్నం, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం పట్నాలకు వెళ్ళి అక్కడి విద్యావంతులతో చర్చించి తమ వాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. అప్పటికి ముప్పై ఏళ్ళుగా ప్రాథమిక పాఠశాల స్థాయినించి కళాశాలస్థాయి వరకు బోధనానుభవం ఉన్నవారు ఆయన. అంతే కాకుండా ఇంగ్లండులో, ఫ్రాన్సులో, ఇతర నాగరిక దేశాల్లో విద్యారంగం సాధించిన ప్రగతిని గురించి రాసిన పుస్తకాలు చదివారు. పర్లాకిమిడి మునిసిపల్ కౌన్సిల్ సభ్యులుగా, గ్రామీణ పాఠశాలల మేనేజరుగా, పురపాలక సంఘ పాఠశాలల సూపరింటెండెంటుగా, తదితర విద్యాసంస్థల సంబంధిగా పొందిన అనుభవం ఆయన వాదానికి ఎంతో బలమిచ్చింది. సునిశితమైన భాషాశాస్త్రపరిజ్ఞానం, సహేతుకమైన లోకజ్ఞానం ఆయనలో చక్కగా మేళవించాయి. వీటికి తోడు, తమ వాదం సరైనదన్న ఆత్మవిశ్వాసమూ దాన్ని విద్యావంతులకు వివరించి వాళ్ళందరూ అంగీకరించేటట్టు చెయ్యాలన్న గట్టి పట్టుదలా ఆయనలో ఉన్నాయి.

గురజాడ ప్రధానంగా భావుకుడు, కవి, రచయిత, పరిశోధకుడు. గిడుగు ప్రధానంగా భాషాశాస్త్రవేత్త. వీరిద్దరూ ఒకే లక్ష్యంతో వేరువేరుగా రెండు పుస్తకాలు ప్రచురించారు. 'ఎ మెమోరాండం ఆన్ మోడర్న్ తెలుగు'(1913) గిడుగు

వారిది; 'మినిట్ ఆఫ్ డిసెంట్' (1914) అన్నది గురజాడవారిది. ఆధునిక వ్యావహారిక భాషను ప్రామాణిక భాషగా గుర్తించడం వల్లా ప్రాథమిక పాఠశాలల్లోనూ సెకండరీ పాఠశాలల్లోనూ దీన్ని వాడటానికి అనుమతించడంవల్లా కలిగే లాభాలు వివరించడం వీరిద్దరి ప్రధానోద్దేశమూ. ప్రాచీన కావ్యభాషావాదుల వాదాల్ని సునిశితంగా, సహేతుకంగా, ఇద్దరూ ఖండించారు - శబ్దస్వరూప నిర్ణయంలో పండితులు పడే పొరపాట్లు బట్టబయలు చేశారు. అంతర్జాతీయస్థాయిలో ప్రామాణిక భాషా శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందినవారి అభిప్రాయాలు పరిశీలించి వాటిని తమ వాదానికి ఉపబలకంగా చేర్చుకొన్నారు. ఇద్దరూ శబ్దస్వరూపాల్ని వివరించే పట్టికలతో, విమర్శలతో అనుబంధాలు చేర్చారు. అయితే రెంటికీ ఒక్క తేడా ఉంది. గురజాడ వారిది 'డిసెంట్ పత్రం'. ఇది, మద్రాసు విశ్వవిద్యాలయం వారు భాషావివాద పరిష్కారం కోసం నియమించిన 'తెలుగు కాంపోజిషన్ సబ్ కమిటీ' మెజారిటీ సభ్యులు ఇచ్చిన నివేదికకు అనంగీకారం ప్రకటిస్తూ సమర్పించిన పత్రం. అందువల్ల కమిటీ సమావేశాల్లో ఆయా సందర్భాల్లో చర్చకు వచ్చిన అంశాలు ఆయా వ్యక్తుల ధోరణులూ స్పష్టంగా వెల్లడించడం జరిగింది. మొత్తం మీద ఈ రెండు పుస్తకాలూ తెలుగు వ్యావహారిక భాషోద్యమ చరిత్రలో నిలిచే తోరణ స్తంభాలని చెప్పవచ్చు.

## మెమొరాండం

ఈ పుస్తకం రాయటంలో రామ్మూర్తిగారు తమ ఉద్దేశాన్ని మొదటి పేరాలోనే స్పష్టం చేశారు. మాతృభాషలో బోధించవలసి ఉన్న బడిపిల్లల పుస్తకాల్లోనే కాకుండా ప్రభుత్వం కాని, ప్రభుత్వాధికారులు కాని తెలుగు ప్రజలకు రాసే ఉత్తరాల్లో పంపే వర్తమానాల్లో, ప్రచురించే పుస్తకాల్లో, కరపత్రాల్లో, వ్యవసాయం, వాణిజ్యం, పారిశుద్ధ్యం మొ॥ విషయాలు జనసామాన్యానికి తెలియడానికి ప్రచురించేవాటన్నిటిలోనూ వాడుక భాష వాడడానికి అనుమతించాలని చెప్పారు. 1903 మార్చి 11నాడు గవర్నర్ జనరల్ కౌన్సిల్‌వారి తీర్మానంలో పేర్కొన్నట్టు దేశభాషల్ని ఉపేక్షించడం జరుగుతోందనీ, ఈ దుస్థితికి మూలకారణం ప్రజలు మాట్లాడే అసలు భాషను- మాతృభాషను- ఉపేక్షించడమేనని చెప్పారు. పండితులనిపించుకున్నవాళ్ళంతా సంస్కృతం మీదే మోజు చూపిస్తున్నారనీ తెలుగును పెంపొందింపజెయ్యాలన్న ఆసక్తి వాళ్ళలో లేదనీ అన్నారు.

ప్రాచీన సాహిత్యంలో చెప్పుకోదగ్గ వచన రచన లేవీ లేవు. బ్రిటిష్ ప్రభుత్వం సార్వజనిక విద్యావిధానం ప్రవేశపెట్టిన కొంతకాలానికి తెలుగులో వచనరచనలు చేసే ప్రయత్నం జరిగింది. కాని దురదృష్టవశాత్తు అది భాషా భేషజం ప్రదర్శించే పండితుల చేతుల్లో పడింది. అయితే పాశ్చాత్య సాహిత్య గ్రంథాలవల్ల ప్రభావితులైన రచయితలు కొందరు అప్పుడప్పుడు, ప్రాచీనమూ కృతకమూ అయిన కావ్యభాషను ఆధునిక అవసరాలకు అనుగుణంగా 'సరళీకరించడం'లో కొన్ని ప్రయోగాలు చేసిన మాట వాస్తవం. వీరేశలింగంగారి వంటి వారు కొద్దిమంది తప్ప తక్కినవాళ్ళు దీన్ని సాధించలేకపోయారు. అయితే వీరేశలింగంగారు కూడా, భాషను ఎంత సులభం చేసినప్పటికీ వాక్యనిర్మాణమూ వ్యాకరణమూ పాత పండితుల కృతకపద్ధతిలోనే ఉండిపోయింది- అన్నారు రామ్మూర్తి పంతులుగారు. ఈ సందర్భంలో డా॥ గ్రియర్సన్ భారతీయభాషల్ని గురించి చేసిన వ్యాఖ్యలు ఉదాహరించారు: 'The vernacular has been split into two sections-the tongue which is understanded of the people, and the literary dialect, known only through the press and not intelligible to these who do not know Sanskrit. Literature has thus been divorced from the great masses of the population and to the literary classes'. అలాగే, 'న్యూ ఇంగ్లీష్ గ్రామర్' రచయిత స్వీట్, వ్యాకరణ శాస్త్ర అధ్యయన లక్ష్యాన్ని గురించి చెప్పినవి కూడా ప్రస్తావించారు. సర్ థామస్‌మన్రో 1822లో, మద్రాస్ ప్రెసిడెన్సీలో అమలులో ఉన్న భాషాబోధన సామగ్రిగురించి చెప్పిన మాటలు ఇప్పటికీ వర్తిస్తాయనీ, అప్పటికీ ఇప్పటికీ దేశీయ భాషాబోధన ఏమీ మెరుగు కాలేదనీ అన్నారు. (1) విద్యార్థి తాను సులువుగానూ బలంగానూ సరిగానూ ఏదైనా చెప్పడానికి రాయడానికీ భాషాబోధన తోడ్పడాలి. (2) మనస్సులో అనుకున్నది సొంతంగా చెప్పగలిగేలా చెయ్యాలి, (3) నిర్దిష్టశ్రోతలకు నిర్దిష్టలక్ష్యంతో చెప్పగలిగేటట్టు చెయ్యాలి. (4) క్రమబద్ధమైన ఆలోచనకు విద్యార్థి అలవాటుపడేటట్టు చెయ్యాలి. (5) వాస్తవ విషయాల గురించి ఊహించగల శక్తి, లోకజ్ఞానం విద్యార్థిలో పెరగాలి. (6) ఒక విషయం మీదినుంచి దృష్టి మళ్ళకుండా నిలకడగా కొనసాగే అలవాటు కావాలి. (7) మనస్సుకు విషయగ్రహణశక్తి బాగా అలవడాలి. ఈ విధంగా విద్యార్థిలో సమగ్ర వికాసం కలగడానికి భాషాబోధన తోడ్పడుతుందని ఆంగ్లభాషావేత్త చెప్పిన అంశాలు తెలుగు పండితుల దృష్టికి తీసుకువచ్చారు రామ్మూర్తి పంతులుగారు.

"విద్యార్థులకు నిర్ణయించే పాఠ్య పుస్తకాలు సులువుగా అర్థమయ్యే భాషలో రాసినవే కావాలికాని పరిచయం లేని కావ్యభాషాశైలిలో రాసినవికాదు," అంటూ 'ది ఇండియన్ ఎడ్యుకేషనల్ పాలసీ'లో స్పష్టం చెయ్యడం జరిగింది. సులువుగా అర్థమయ్యే భాష, ప్రజలకు పరిచితమైన భాష వాడుక భాషేనని అంగీకరించి నప్పటికీ దేశంలో వివిధ వర్గాలవారి పిల్లలు, వివిధ మాండలికాలు మాట్లాడుతూం టారు కాబట్టి ఏకరూపత, ప్రామాణికత కొరవడతాయని చెప్పి వాడుక భాషను నిరసించేవాళ్ళకి రామమూర్తి పంతులుగారు సహేతుకమైన సమాధానమిచ్చారు. ఇంగ్లండులోకూడా కింది వర్గాలవాళ్ళ పిల్లలు తమతమ మాండలికాల్లో మాట్లాడు కుంటారు. కాని వాళ్ళందరికీ ప్రామాణిక భాష బోధిస్తున్నారు. అలాగే తెలుగు దేశంలో కూడా ఆ మాదిరి ప్రామాణిక భాష - వాడుక భాష - బోధించవచ్చు. ఉన్నత వర్గాలవారి వాడుకలో ఏకరూపత లేదని కొందరి వాదం. కాని కావ్య భాషలో ఉన్నంత రూపభేదం వాడుక భాషలో లేదని చెప్తూ గిడుగువారు 'ఒకరై' అన్న మాటకు 52 రూపాంతరాలూ 'ఒకడు'కు కనీసం 16 రూపాంతరాలూ ఉన్నాయని ఉదాహరించారు. నిజం చెప్పాలంటే ప్రామాణికమైన తెలుగు (వాడుక) భాషలో ఉన్నపాటి వైవిధ్యం ప్రామాణికమైన ఇంగ్లీషు భాషలో కూడా ఉందన్నారు. "పండితుడి నిరంకుశత్వం వల్లనే తెలుగులోకి విజ్ఞానం రాకుండా పోయింది," అని బాధపడ్డారు.

చివరికి, తెలుగు బోధన సామాన్యమూ ఐచ్ఛికమూ అంటూ రెండు విధా లుగా ఉండాలనీ, 'ఐచ్ఛికం' కేవలం ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చెయ్య దలుచుకున్న వాళ్ళకి బోధిస్తే చాలుననీ 'సామాన్యం' విద్యార్థులందరికీ నిర్బంధంగాబోధించాలనీ సూచించారు. 'సామాన్యం' ఆధునిక భాషలోనే ఉండాలి. చరిత్ర, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. ఈ శాస్త్రాలు నేర్పే ఉపాధ్యాయుడే వివిధ విషయాలమీద తెలుగులో కాంపోజిషన్ రాయిస్తాడు. ఆ విధంగా ఆధునికభాషకు అర్హమైన స్థానం ఇచ్చిన వాళ్ళమవుతామని రామమూర్తి పంతులుగారు తమ వాదం ముగిస్తూ చివర రెండు అనుబంధాలు చేర్చారు.

తెలుగువారి ఉచ్చారణలో వచ్చిన ధ్వని విపరిణామాల తీరుతెన్నులు, పదస్వరూప నిర్ణయంలో కావ్యభాషావాదుల్లో కనిపిస్తున్న గందరగోళం, కాల

గతిలో ప్రాచీన, ఆధునిక రూపాలమధ్యా, అర్థాలమధ్యా ఏర్పడ్డ అంతరం ఉదాహరణలతో వివరించడం జరిగింది.

ఈ అనుబంధంలోనే, 'పడు' అనుయోగక్రియతో ఛాందస పండితులు ఒక్క పేజీలోనే డజనుకు పైగా కృతకమైన 'పాసివ్ ఫామ్స్' ఎలా ప్రయోగిస్తూ ఉంటారో గిడుగువారు చూపించారు. అవి నిజానికి 'పాసివ్ ఫామ్స్' కావు. పూర్వ కవులు అలాటివి చాలా అరుదుగానే ప్రయోగించారు. కేతన 'దశకుమార చరిత్రం' మొత్తంలో ఒకే ఒక్క రూపముంది. తెలుగు భారతంలో పర్వానికొకటితప్ప ఉండదు. It is grammatically wrong to call such forms 'passive'. Genuine Telugu has no passive voice. It does not require it. It employs other devices which serve the same purpose for which the passive is used in other languages, e.g. Sans. శ్రూయతాం; Tel. విను(ము); భగ్నం Tel. విరిగినది, 'It is torn, అది చిరిగినది," అంటూ స్పష్టం చేశారు.

రెండో అనుబంధంలో, మద్రాసులో ఆంధ్ర సాహిత్య పరిషత్తు సమావేశంలో పండితులు చేసిన తీర్మానాలు (1912లో కృష్ణా పత్రికలో అచ్చయినవి) తీసుకొని ఒక్కొక్క తీర్మానాన్నే సహేతుకంగా ఖండిస్తూ వచ్చారు గిడుగువారు. ముఖ్యంగా విద్యార్థుల వాచక పుస్తకాల్లో శృంగారరసప్రధానమైన కావ్యభాగాలు ఎంపికచేసే విషయమై పండితులు వెల్లడించిన అభిప్రాయాన్ని గట్టిగా విమర్శించారు.

## డిసెంట్ పత్రం

విద్యార్థుల వ్యాసరచనకు ఉపయోగకరమైన ప్రామాణిక శైలిని నిర్ధారణ చేసి చెప్పడానికి మద్రాసు విశ్వవిద్యాలయం వారు 1910 జూలై లో దక్షిణాది భాషల్లో ఒక్కొక్క భాషకు ఒక్కొక్క కమిటీ వేశారు. తెలుగు భాషకు సంబంధించిన కమిటీలో, ఎం. రంగాచార్యులుగారు (సమావేశకర్త), కందుకూరి వీరేశలింగం గారు, కొమర్రాజు లక్ష్మణరావుగారు, పి.టి. శ్రీనివాసయ్యంగారు, పి. రామారాయణింగారు, రివరెండ్ జె.ఆర్.స్టిల్‌వెల్ సభ్యులు. ఆ తరవాత గుమ్మడూరి వెంకట రంగారావుగారిని, గురజాడ అప్పారావుగారిని కూడా ఆ కమిటీలో

సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ కమిటీవారు చాలాసార్లు సమావేశాలు జరిపి, ఇంటర్మీడియట్ విద్యార్థులు శిష్టవ్యావహారికంలో రాయడానికి అనుకూలించే విధంగా తీర్మానించారు. ప్రాచీన కావ్యభాషాభిమానులకు ఇది దుర్భరమైంది. వ్యావహారిక భాషావాదాన్ని ఎదుర్కోడానికి ఆంధ్ర సాహిత్య పరిషత్తు (Telugu Academy) స్థాపించారు. శిష్ట వ్యావహారికాన్ని గ్రామ్యమని నిరసించారు. ఊరూరా సభలు జరిపి సంతకాలు సేకరించి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నం చేశారు. అన్ని రంగాల్లో మాదిరిగానే విద్యారంగంలోకూడా రాజకీయ తంత్రం ప్రయోగించి, విశ్వవిద్యాలయం నియమించిన ఉపసంఘంలో రాయలసీమకు ప్రాతినిధ్యం కల్పించాలన్న కారణంతో వ్యావహారిక భాషా వ్యతిరేకులకు స్థానం కల్పించారు. కోలాచలం శ్రీనివాసరావుగారు, టి. శంకర లింగంపిళ్ళెగారు, నాగపూడి కుప్పుసామయ్యగారు, బారిస్టర్ కె. సుబ్బారెడ్డిగారు అలా వచ్చిన సభ్యులే. దాంతో త్రాసు మొగ్గుమారింది. ఆ మెజారిటీ సభ్యుల అభిప్రాయానికి గురజాడ అప్పారావుగారు అనంగీకారం ప్రకటించారు. ఆ అనంగీకార పత్రమే గురజాడ 'డిసెంట్ పత్రం'.

వేదం వెంకటరాయశాస్త్రిగారూ, కొమ్మరాజు లక్ష్మణరావుగారూ మొదలైన కమిటీ సభ్యులు ఆధునిక భాషావాదులతో అంగీకరానికి వచ్చే ప్రయత్నం ఏమీ చెయ్యలేదన్న విమర్శతోనే డిసెంట్ పత్రం మొదలయింది. శిష్టుల వాడుకలో ఉన్న 'వస్తాడు' వంటి రూపాలు స్వీకరించాలని ప్రొ॥ రంగాచార్యగారు ప్రతిపాదించిన సవరణను వారిద్దరూ పట్టించుకోకుండా వాడుకభాషకూ కావ్యభాషకూ సమానంగా ఉన్న రూపాలతోనే పదపట్టికలు తయారు చేశారని గురజాడవారు ఎత్తిచూపించారు. సులభీకరణ పేరుతో ప్రసిద్ధ రచయితలు రాస్తున్న వ్యాకరణ విరుద్ధమైన రూపాల్ని గట్టిగా విమర్శించారు. 'వస్తాడు' మాదిరిగా 'స'కార, 'త'కార సంశ్లిష్ట రూపాలు అనేకం విరివిగా వాడుకలో ఉన్నా పండితులు వాటిని స్వీకరించడం లేదని విమర్శిస్తూ వివిధ జిల్లాలలో ఉన్న ప్రజలు రాసుకొనే ఉత్తరప్రత్యుత్తరాల్లోనూ గెజిట్ అనువాదాల్లోనూ క్రైస్తవ సాహిత్య గ్రంథాల్లోనూ, కథల పుస్తకాల్లోనూ, వివేకవల్లి (శ్రీకాకుళం), దేశమాత (రాజమండ్రి), జ్ఞానోదయ, ఆంధ్రభారతి (మచిలీపట్నం), హిందూజన సంస్కారిణి వంటి పత్రికలలోనూ జనరంజకగ్రంథాల్లోనూ, జానపద సాహిత్యంలోనూ, మెకంజీ కైఫియత్‌లలోనూ ఆ మాదిరి రూపాలు ఎంత విరివిగా వాడుకలో

ఉన్నాయో తెలియడానికి సమృద్ధిగా ఉదాహరణలు ఇచ్చారు. అంతేకాకుండా శక సం॥ 1010 నుంచి వివిధ శాసనాల్లో ప్రయోగిస్తూ వచ్చిన రూపాలు చూపించారు.

అదే విధంగా అనుస్వారాంతంగా వాడుకలో ఉన్న రూపాలను కూడా కమిటీ వారు పరిగణనలోకి తీసుకోకపోవడం తప్పని అప్పారావుగారు స్పష్టం చేశారు. 'Whether or not the final *mu* (ము) which Sanskritic neuter nouns take in the literary dialect correctly represented a speech sound which really existed in the past, the spoken form with an *anuswara* has claims to be considered at least as ancient as the form in *mu* (ము)," సముచ్చయార్థకాల గురించి చర్చిస్తూ వివిధ ద్రావిడ భాషల్లో వాటి స్వరూప పరిణామాలు ఎలా వచ్చాయో వివరించారు. ఆధునిక ప్రాచీన రూపాలు, ప్రామాణిక వ్యావహారిక భాష, ప్రామాణిక భాషలో ఏకరూపత అన్న అంశాల గురించి సుస్పష్టంగా చర్చచేశారు. నవ్యకావ్యభాష అనేది వట్టి మిథ్యావాదంగా నిరూపించడానికి ఆధారాలు చూపించారు. మహా మహా కొమ్ములు తిరిగిన పండితులు సైతం ఎంత అస్తవ్యస్తంగా, వ్యాకరణ విరుద్ధంగా రాస్తారో కళ్ళకి కట్టించారు. అసలైన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న వారు ఆధునిక భాషావాదులేనని నిరూపించారు. పత్రం చివర ఎనిమిది అనుబంధాలు చేర్చారు. మొదటి అనుబంధంలో, ప్రాచీనశాసనాల్లో అనుస్వారాంతంగా నామవాచకాలు (ఉదా॥ రక్తం, సుంకం, సగం, మొ॥) ఆధునిక సముచ్చయార్థకాలు (చేనున్ను, పుణ్యంగాను, తల్లికిన్ని మొ॥) ఉదాహరించారు. రెండో అనుబంధంలో ఆధునిక భాషారూపాలగురించి పాశ్చాత్య భాషావేత్తలు వెల్లడించిన అభిప్రాయాలు అందించారు. కందుకూరి వారు, చిలకమర్తివారు ప్రజలకు వాడుకలో లేని ప్రాచీన రూపాలు ఎలా ప్రయోగించారో చూపించారు. కందుకూరి, వేదం, చిలకమర్తి వంటి రచయితలు, వాడుకలో ఉన్న తత్సమాల్ని కాదని వాడుకలో లేని తద్భవాలు ఎలా ప్రయోగించారో నాలుగో అనుబంధం పట్టికల ద్వారా నిరూపించడం జరిగింది. పదమధ్యంలో అనుస్వారం లేని రూపాలు వాడుకలో ఉన్నప్పటికీ (ఉదా॥ వెలుగు) కొందరు రచయితలు అనుస్వారంతో ఉన్న రూపాలే (ఉదా॥ వెలుంగు, అతండు, తొలంగు) వాడుతున్నారని ఐదో అనుబంధంలో పట్టిక ఇచ్చారు. ఆ తరవాతి అనుబంధంలో వాడుకలో లేని రూపాలనేకం వివిధ రచనల్లోంచి సేకరించి అకారాదిగా ఒక పట్టిక తయారు

చేశారు. ఆ తరవాత, వాడుకలో లేని సాహిత్య రూపాలూ వాడుకలో ఉన్న సాహిత్యేతర రూపాలూ వివిధ రచయితల రచనల్లోంచి ఉదాహరించారు. చివరికి 1912 సెప్టెంబరు ఏషియాటిక్ క్వార్టర్లీ రివ్యూ పత్రికలో 'ఆరిఫ్' అనే ఆయన రాసిన The Arabic Language Question in Egypt అన్న వ్యాసాన్ని తెలుగు పండితుల పరిశీలనార్థం ఇందులో పునర్ముద్రించారు. ప్రాచీన భాషా వాదులకూ ఆధునిక భాషావాదులకూ కలిగే అభిప్రాయ భేదాల తీరుతెన్నులు తెలుసుకోడానికి ఈ అనుబంధం బాగా ఉపయోగపడుతుంది.

మొత్తం మీద, 'మెమొరాండం'లో గిడుగువారూ, 'డిసెంట్ పత్రం'లో గురజాడవారూ చెప్పదలచిన ప్రధాన విషయం ఒక్కటే. ఇద్దరి వాదసరళీ ఒక్కటే. ఇద్దరూ దేశవిదేశ భాషాసాహిత్యాల తీరుతెన్నులు అవగాహన చేసుకొన్నవారే. శాస్త్రసమ్మతంగా, సతార్కికంగా చర్చచేసేవారే. ఒకరు ఉదాహరణలు ఎక్కువ ఇవ్వవచ్చు. మరొకరు తక్కువ ఇవ్వవచ్చు. ఈ ఇద్దరిలోనూ విషయ విస్తృతి చూపించినవారు గురజాడవారు. మధ్యమధ్య కమిటీ సభ్యులతో జరిగిన వాదప్రతివాదాలు కూడా ముచ్చటించడం జరిగింది.

తెలుగు భాషోద్యమ చరిత్ర అధ్యయనం చేసేవాళ్ళకు ఈ రెండూ బాగా ఉపకరిస్తాయి. విషయం ఒకటే అయినా, చర్చల తీరుతెన్నులు సమగ్రంగా గ్రహించడానికి రెండూ అవసరమే. ఇప్పటికి* దాదాపు 70 ఏళ్లకిందట వెలువడ్డ ఈ పుస్తకాలలో తేల్చిన విషయాలు పూర్తిగా బుర్రకెక్కించుకోనివాళ్లు ఇప్పటికీ ఉన్నారంటే ఆశ్చర్యపోనక్కరలేదు. వాళ్ల బుర్రలు మరమ్మతు అయినా కాకపోయినా, తెలుగువాడు వీటిని కళ్లకద్దుకుంటాడు; వారిద్దరినీ వినమ్రంగా తలుచుకుంటాడు.

('మరోసారి గిడుగు రామమూర్తి' వ్యాససంకలనం 1986)

5

# మాండలికాలు

తెలుగుదేశంలో శ్రీకాకుళంనుంచి ఒకరూ చిత్తూరునుంచి ఒకరూ ఆదిలాబాద్‌నుంచి ఒకరూ మొట్టమొదటిసారిగా కలుసుకుంటే, వాళ్ళు మాట్లాడేది తెలుగే అయినా ఒక్కొక్కరు మాట్లాడే తీరులో ఒక్కొక్క విలక్షణత కనిపిస్తుంది. ధ్వనుల ఉచ్చారణలోనూ పదాల ఎంపికలోనూ పదబంధ నిర్మాణంలోనూ వాక్య స్వరంలోనూ ఊనికలోనూ కాకువులోనూ అర్థస్ఫూర్తిలోనూ ఒక్కొక్కరిలో ఒక్కొక్క ప్రత్యేకత కనిపిస్తుంది. అలాగే ఒకే ఊళ్ళో ఉంటున్న సంస్కార వంతుడొకడూ సంస్కారం అబ్బనివాడొకడూ కలుసుకొన్నప్పుడు వింటే వాళ్ళ వాళ్ళ వ్యవహారాల్లోనూ విభిన్నత స్పష్టమవుతుంది. ఒక కుమ్మరి, ఒక వడ్రంగి, ఒక రైతు మాట్లాడుకొనేటప్పుడు వాళ్ళవాళ్ళ వృత్తులకు సంబంధించిన పలుకుబడులు తరచుగా వినిపిస్తూ ఉంటాయి.

ఈ విధంగా భిన్న రూపాల్లో భిన్నస్థాయిల్లో ఉన్న వాడుకలను 'మాండకాలు' అని అంటాం. అయితే వీటన్నిటిలోనూ సమానధర్మం గరిష్ఠంగా ఉంటుంది కనక వాటినన్నిటినీ ఒకే భాషలో అంతర్భాగాలుగా పరిగణిస్తాం ఇక్కడ మాండలికం అన్న పదం విస్తృతార్థంలో వాడటం గమనించాలి. ప్రాంతీయమైన ఒక 'మండలం'లో వాడుకలో ఉన్న భాషే కానక్కరలేదు. ప్రాంతీయతతోబాటు వర్గాన్నిబట్టి, వృత్తినిబట్టి, విద్యాసంస్కారాదులనుబట్టి ఏర్పడ్డ వ్యవహార భేదాలన్నిటినీ మాండలికాలని (dialects) అంటున్నాం.

మాండలికాల స్వరూపస్వభావాల్ని ప్రస్తావించేముందు భాషాగతమైన మౌలికాంశాలు కొన్ని ప్రస్తావించడం అవసరమనుకుంటాను. అసలు, భాష అనేది సమాజంలో ఒకరి అభిప్రాయం మరొకరు తెలుసుకోడానికి వీలుగా వాగ్రూపంలో వెలువరించే సంకేతాల నియత నిర్మాణం. సమాజం దీన్ని సమష్టిగా సృష్టించుకుంది; సమష్టి సాధనంగా వాడుకుంటోంది.

కాలంగడిచినకొద్దీ ఆ సమాజానికి లిపి అలవడ్డప్పుడు వాగ్రూపంలో ఉన్న భాష లిఖితమవుతుంది. అంటే వాగ్రూపంలో ఉన్న భాష మౌలికం, లిఖితభాష దానికి విధేయం అన్నమాట. భాషకు వాగ్రూపమే మౌలికమనడానికి హేతువు ఏమిటంటే, ప్రపంచంలో కొన్నివేల సంవత్సరాలుగా భావప్రకటన వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ ఈనాటికీ గ్రంథస్థం కాని భాషలు ఎన్నో ఉండటమే! నిజానికి ప్రపంచంలో ఇప్పుడు ఎన్ని భాషలు వాడుకలో ఉన్నదీ ఖచ్చితంగా ఎవరూ చెప్పలేకపోయారు. స్థూలంగా రెండుమూడువేల భాషలు ఉండవచ్చని అంచనా. వాటిని గురించి ఇంకా పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి.

మామూలుగా ఏ జీవద్భాషలోనూ నూటికి నూరుపాళ్ల ఏకరూపత ఎక్కడా ఉండదు. దానికి కారణం, మానవులు యంత్రాలు కాకపోవడమే. యాంత్రికంగా రాసే ప్రాచీన కావ్యభాషలోనే ఏకరూపత కొంత కొరవడినప్పుడు జీవద్భాషలో అనేకరూపత లేకుండా ఎలా ఉంటుంది? ఒక తల్లి కడుపున పుట్టిన బిడ్డల్లోనే ఒక్కొక్కరి వ్యవహారంలో ఒక్కొక్క వైయక్తిక పద్ధతి గోచరించవచ్చు. అటువంటి వైయక్తిక పద్ధతుల్లో సామాన్య లక్షణాలు కొన్ని ఒక వర్గంలోనో ప్రాంతంలో గరిష్ఠంగా ఉంటే వాటినన్నిటినీ కలిపి ఒక మాండలికం అంటాం. ఈ మాండలికంలో స్థూలంగా కనిపించేవి రెండు స్థాయిలు. ఒకటి ప్రాంతీయం, రెండోది సామాజికం-horizontal and vertical levels. తెలుగులో కళింగసీమ మాండలికం, కోస్తామాండలికం, రాయలసీమ మాండలికం, తెలంగాణామాండలికం అనేవి స్థూలంగా ప్రాంతీయతనుబట్టి గోచరించేవి. ఉదాహరణకు, కోస్తాప్రాంతీయులు 'వచ్చాడు'అంటే రాయలసీమవాళ్లు 'వచ్చినాడు' అనీ తెలంగాణా వాళ్ళు 'వచ్చిండు' అనీ అంటారు. వీటిలో రూపభేదమున్నదల్లా ఒక్క భూతార్థక ప్రత్యయంలోనే, ఆ రూపాలను 'వచ్చ్-ఆ-డు'; వచ్చ్-ఇనా-డు: వచ్చ్-ఇణ్(న్)-డు' అని విభజిస్తే '-ఆ-/-ఇనా-/-ఇన్-'అనేవి ఆయా ప్రాంతాల్లో వాడుకలో భూతార్థక ప్రత్యయరూపాలని గమనించవచ్చు. వీటిలో 'ఇనా' రూపం ప్రాచీనమని గ్రహిస్తే దీంట్లో నకారం లోపించి కోస్తాప్రాంతంలోనూ ఆకారం లోపించి తెలంగాణా ప్రాంతంలోనూ రూపభేదాలు ఏర్పడ్డాయని చెప్పవచ్చు. అంటే 'వచ్చ్+(ఇ+ఆ→)ఆ+డు=వచ్చాడు', 'వచ్చ్+ఇన్+డు=వచ్చిండు' అని ఏర్పడ్డాయన్న మాట. కావ్యభాషలో 'వచ్చినవాడను, వచ్చినాడను, వచ్చినాను' అనే రూపాలు ఉన్నట్లే ఆధునిక వ్యవహారంలో ఈ మూడు రూపాలూ వాడుకలో

ఉన్నాయన్నమాట. పీటిలో శిష్టేతరమైన అవాంతర భేదాలు కొన్ని వేరే ఉన్నాయి. కోస్తాప్రాంతం మాండలికంతో పోల్చి చూస్తే తెలంగాణా రాయల సీమ మాండలికాల్లో వాక్య నిర్మాణంలో భేదాలేమీ ఉన్నట్టు దాఖలాలు దొరక లేదు. ఉన్న భేదాలన్నీ వాటికి కింది స్థాయిలవేనని చెప్పుకోవలసి ఉంది. సామాన్యంగా, తెలంగాణా మాండలికంలో, అపదాది స్థానంలో వచ్చే దీర్ఘాచ్చులు హ్రస్వాచ్చులు కావడం, గమనించవచ్చు- వస్తా-వస్త, తింటారు-తింటరు, కొను క్కున్నా-కొనుకున్న మొ.వి. ద్విరుక్తాలు అద్విరుక్తాలయి అపదాది స్థానంలో అచ్చు లోపిస్తూ ఉంటుంది. ఉదా।। ఎక్కువ మంది-ఎక్వమంది. ఇలాటి మార్పు లకు ఉర్దూభాషాప్రభావంకూడా కారణం కావచ్చు.

కోస్తాప్రాంతంలో 'నేను, మేము, మనం, నువ్వు, మీరు, వాడు, వాళ్ళు' అనే సర్వనామాల్లో కర్త ఏదయినప్పటికీ 'రావడం లేదు' అనేదాంతో వాక్యంలో అన్వయం కుదురుతుంది. కాని, తెలంగాణా మాండలికంలో మట్టుకు అలా కాదు- 'నేను వస్తలేను, మేము వస్తలేము' మొ.న రూపాలు వాడతారు. 'వచ్చా' అనే పదబంధం ప్రయోగించే సందర్భంలో, రాయలసీమలో 'వచ్చినా' అనీ తెలంగా ణాలో 'వచ్చిన' అనీ అంటూంటారు. రాయలసీమ రూపంలో నకారంతో వచ్చిన అచ్చు దీర్ఘమయితే తెలంగాణా రూపంలో అర్ధదీర్ఘమన్నమాట. అలాగే కోస్తా వాడుకలో 'వచ్చాడా?' అన్నప్పుడు రాయలసీమలో 'వచ్చినాడా?' అనీ తెలంగా ణాలో, 'వచ్చిండా?' అనీ 'వచ్చినాఽడు?' అనీ అంటూంటారు. ఈ చివరి రూపంలో ఒక విశేషముంది. సామాన్యంగా పదాంతంలో చేరే ప్రశ్నార్థక ప్రత్యయం'-అ-'తెలంగాణా వాడుకలో, పురుషార్థక ప్రత్యయానికి ముందు వచ్చి చేరుతుంది. అంతకుముందే 'న' కారం మీది అచ్చు 'ఆ' కారమై ఉన్నందువల్ల ఈ ప్రత్యయం ఒకానొక స్వరంగా పరిణమించి 'వచ్చినాఽడు?' అయింది. అయితే 'వచ్చిండా' అన్నరూపం మామూలు ప్రశ్నార్థకమయితే, రెండోరూపం ఆశ్చర్యాన్నో భయాన్నో హఠాత్సంభవతా ప్రభావాన్నో స్ఫురింపజేసేది కావచ్చు- 'పేటకు బోతున్నాఽవుర గోపయ్యా?' అన్న వాక్యంలో అదే స్వరం వినిపిస్తుంది.

సాధారణంగా తెలంగాణా వాడుకలో 'చెప్పబడితివి, చెప్పరాదు' వంటి రూపాలు విన్నప్పుడు కావ్యభాషలో ఉన్న కర్మణి ప్రయోగం, నిషేధార్థకరూపం వాడుకలో కూడా ఉన్నట్టు అనిపించే ప్రమాదం లేకపోలేదు. కాని, వాటి అర్థాలు

వేరు. 'చెప్పబడితివి' అంటే 'చెప్పబట్టావు' అనీ 'చెప్పరాదు' అంటే 'చెప్పడం చేతకాదు' అనీ గ్రహించాలి. ఇంతేకాకుండా కాలార్థక, సహార్థక, స్థలార్థక ప్రత్యయాల్లో కూడా ఆయా మాండలికాల్లో కొన్నికొన్ని రూపభేదాలు కనిపిస్తూ ఉంటాయి. తెలుగులో ప్రాంతీయ మాండలికాలు స్థూలంగా రాజకీయ విభేదాలకు సరిపోయినా మళ్ళీ ఆయా ప్రాంతాల్లో అవాంతరభేదాలూ అన్యప్రాంతీయ ప్రభావాలూ కొన్ని గోచరిస్తూ ఉంటాయి. కోస్తా ప్రాంతంలో 'అట్లా, అట్టా, అలా, అల్లా' అనే రూపాలూ, 'వస్తోంది, వస్తూంది, వస్తూఉంది, వస్తున్నది' అనే రూపాలూ 'రాయడం, రాయటం' అనేవీ వాడుకలో ఉన్నాయి. వీటిలో కొన్ని తక్కిన ప్రాంతాల్లో కూడా ఉన్నాయి.

ఈ విధంగా ప్రాంతీయ మాండలికాలు ఏర్పడ్డానికి హేతువులు గమనిద్దాం. ఒక భాష మాట్లాడే వాళ్ళలో కొందరు రాజకీయ, ఆర్థిక, సామాజికాది పరిస్థితుల వల్ల మరొక చోటికి వలసపోవడం జరిగిందనుకుందాం. అలా దూరమైనవాళ్ళ మధ్య మళ్ళీ రాకపోకలూ ఇతర సంబంధాలూ అంతగా లేకపోతే, ఒకచోట ఉన్నవాళ్ళ భాషలో వచ్చే మార్పులు మరొకచోట ఉన్నవాళ్ళకు అందకపోవడం సహజం కాబట్టి వాళ్ళవాడుక ఒక రకంగానూ వీళ్లవాడుక మరొక రకంగానూ పరిణమించే అవకాశముంది. అది అలాగే కొనసాగుతూంటే, కొంతకాలానికి, ఆ రెండు వాడుకలూ రెండు మాండలికాలు అయిపోతాయి. అయినా ఒక ప్రాంతం వాళ్ళు మాట్లాడేది మరొక ప్రాంతంవాళ్ళకి అర్థం కాకుండా ఉండదు. ఒకవేళ, ఆ వేర్పాటే కనక మరీ ఎక్కువయితే, వాక్యాదుల్లో అర్థబోధకత పూర్తిగా లోపిస్తే, రెండూ రెండు స్వతంత్రభాషలయిపోతాయి. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం మొ.న పాతిక ముప్పయి సోదర ద్రావిడభాషలకూ మూలభాష ఒక్కటే. వాటి నిర్మాణ నియతి స్థూలంగా ఒక్కటే.

దీనికి భిన్నంగా ఉండే పరిస్థితి గమనిద్దాం. ఒకచోట ఉన్నవాళ్ళు మరొక చోటికి పోయినట్టే, మరొకచోట ఉన్నవాళ్ళు ఇక్కడికి వలసవచ్చారనుకుందాం. అప్పుడు ఒకరి వాడుక ప్రభావం మరొకరి వాడుకమీద ప్రసరించక మానదు. ఒంటెత్తు రామలింగాల వాడుకలో కూడా, వాళ్లకు తెలియకుండానయినా, పరప్రభావాలు చోటుచేసుకుంటాయి. ఒక్కొక్కప్పుడు ఈ రెంటి కలయికవల్లా మరొక మూడో రూపం కూడా ఏర్పడవచ్చు. మేం మాట్లాడేటప్పుడు

తెలంగాణా వాడుక రూపాలు ధారాళంగా దొర్లుతున్నట్టే మా చుట్టుపక్కలవాళ్ళు మాట్లాడేటప్పుడు మా వాడుక రూపాలూ దొర్లుతూ ఉంటాయి. వీటికి దాఖలాలు కావలసినవాళ్ళు హైదరాబాదులో-ముఖ్యంగా చిక్కడపల్లి ప్రాంతంలో-ఉంటున్న తెలుగు వాళ్ళభాష పరిశీలించవచ్చు. భాషాపరిశోధకులకు అదొక మంచి గని. అయితే భాషలో వచ్చే పరిణామాలెప్పుడూ ఆయా భాషా మాండలిక వ్యవహర్తల సంబంధ ఘనిష్ఠత మీద ఆధారపడి ఉంటాయి.

సామాజిక స్థాయిలో వర్గాన్నిబట్టీ కులాన్నిబట్టీ వృత్తినిబట్టీ విద్యాసంస్కారాదుల్నిబట్టీ మాండలికాలు ఏర్పడే అవకాశాలున్నాయని ముందే చెప్పుకొన్నాం. ఒక వర్గంవారికి 'అన్నం' అనే పదం వాడుకలో ఉన్నప్పుడు, వాళ్ళపిల్లల్లో ఒకడు ఎప్పుడయినా 'కూడు' అన్నపదంవాడితే వింతగా చూస్తారు. ఎందువల్ల ? ఆ రెండు రూపాలూ రెండు భిన్నవర్గాల వ్యవహార రూపాలు కావడమే. అలాగే కులాన్నిబట్టి కూడా కొన్ని వాడుకలు ఏర్పడతాయి. తెలుగు దేశంలో పద్మశాలివారు, దేవాంగులు, తొగటవారు, హరిజనులు మొ. వారు బట్టలు నేస్తూంటారు కదా ! వాళ్ళలో కొన్ని వాడుకల్లో వర్గమాండలికతా (class dialect) ముద్ర స్పష్టంగా కనిపిస్తూంటుంది. ఒకే ఊళ్లో ఒకే సాధనానికి ఒక వర్గంవాళ్ళకు ఒకమాట వాడుకలో ఉంటే మరొక వర్గంవాళ్ళకు మరొకటి వాడుకలో ఉంటుంది. ఉదాహరణలు కింద గమనించవచ్చు :

| పద్మశాలీలు | దేవాంగులు | తొగటవారు | కురమలు | హరిజనులు |
|---|---|---|---|---|
| పెడకోల | ఊడుగుకోల | ఊడుగగ్ర | | |
| అని | కచ్చి | | ఆనె | |
| ఊత్తె | దావ | సరాట, సరిబెద్దు, చమిబెద్దు | | సరెద్దు |
| పంటె | | | | పైట |
| పూనుగుర్ర | | | | మట్టుగర్ర |
| మలగర్ర | | | | మడుపుకర్ర |
| | | | | మడుపుకట్టె |
| లాక | లేక | | | |
| పేక | | | పాక | |
| మిడిగూటం | రామలింగంగూటం | | | |
| రాటి, గుమ్మి | | బొంగరం | | దొలక |

విశేషమేమిటంటే, ఏదో ఒక ఊళ్లో ఒకవర్గంవాళ్ళకు ఒకపదం, మరొక వర్గంవాళ్ళకు మరొకపదం వాడుకలో ఉండటమే కాదు, ఒకవర్గంవాళ్ళు ఉన్న ఊళ్ళలో చాలాచోట్ల కొద్దిపాటి రూపభేదాలతో అవే పదాలు వినిపిస్తూండటం. ఉదాహరణల్లో 'పేక', 'లేక' అన్న పదాల్లో ఒక అచ్చులోనే మాండలికత స్పష్టమవుతోంది. తాలవ్యాచ్చు (ఏ = æ) కంఠ్యాచ్చు (అ) గానూ కంఠ్యాచ్చు తాలవ్యాచ్చుగానూ మారుతున్నాయి.

ఇకపోతే, వృత్తినిబట్టి పడికట్లు (పారిభాషికపదాలు) మారుతూండటం కూడా మనకు తెలుసు. కొన్ని పూర్వకావ్యాల్లో పదీపరకా వృత్తిపదాలు చోటు చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారు ప్రచురిస్తున్న మాండలిక వృత్తి పదకోశాల్లో కొన్నివేల పదాలు గ్రంథస్థమయాయి. భారతీయ భాషల్లో మొట్ట మొదటిసారిగా తెలుగులో ఇటువంటి మాండలిక పదకోశాలు శాస్త్రీయ పద్ధతిలో రూపొందడానికి కారకులు ఉస్మానియా విశ్వవిద్యాలయం భాషాశాస్త్రాచార్యులు* భద్రిరాజు కృష్ణమూర్తిగారు (వీరికి ప్రేరకులూ ప్రోత్సాహకులూ అబ్బూరి రామకృష్ణరావుగారు). వీటి నిర్మాణానికి పథకం రూపొందించడం, వ్యవసాయ చేనేత పదకోశ సంపుటాలకు సంకలన, సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించడం, తక్కిన పదకోశాల సంపాదకుల కృషిని సమన్వయం చెయ్యడం వారి పూనిక (ఉత్తరోత్తరా వీరు, ఆం.ప్ర. సాహిత్య అకాడమి వారి మాండలిక వృత్తిపద కోశాల సంపాదకమండలికి అధ్యక్షులయారు). తెలుగులో మొత్తం సాంప్రదాయిక వృత్తుల పదాల్ని సేకరించి వివిధ సంపుటాలుగా ప్రచురించాలని వారి సంకల్పం. వాటిలో మొదటిది వ్యవసాయవృత్తి పదకోశం. ఇది 1962లో విడుదల అయింది. రెండోది చేనేత వృత్తిపదకోశం. ఇది 1971 అక్టోబరులో విడుదలయింది. మూడోది బెస్త పరిశ్రమకూ పడవల నిర్మాణానికీ సంబంధించినది. దీనికి సంపాదకులు ఆచార్య తూమాటి దొణప్పగారు (ఇది 1992 మే 14 న విడుదలయింది). నాలుగో సంపుటం 'వాస్తుపదకోశం' దీనికి సంపాద కులు డా॥ బి. రాధాకృష్ణ. ఇది 1968లో వెలువడింది. ఆ తరవాత వెలువడ్డవి కుమ్మరం, వడ్రంగం పదకోశాలు. వీటికి సంపాదకులు ఆచార్య జి. నారాయణ స్వామిరెడ్డిగారు. 'కమ్మరం' పదకోశానికి సంపాదకులు ఆచార్య జి. నాగయ్య

*ప్రస్తుతం (1992)లో వీరు హైదరాబాదు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు.

గారు. స్వర్ణకారవృత్తి పదకోశ నిర్మాణంకూడా వీరే చేపట్టారు. హస్తకళలకు సంబంధించినది డా॥ బి. రాధాకృష్ణగారు, నీరా–సారా–బెల్లం పరిశ్రమకు సంబంధించినది ఆచార్య చేకూరి రామారావుగారు, 'వేట'కు సంబంధించినది ఆచార్య కేతు విశ్వనాథరెడ్డిగారు తయారుచేస్తున్నారు. 'నాటువైద్యం' పదకోశం తయారీ పనినికూడా ఆచార్య నారాయణస్వామి రెడ్డిగారే కొంతవరకు నిర్వహించారు. ఆయన అకాల మరణం వల్ల ఆ పనిని మరొకరు పూర్తి చేయవలసి ఉంది. పోగా, పోరంకి దక్షిణామూర్తి సంపాదకత్వం వహించిన 'మేదర పరిశ్రమ–ఇతరపనుల' వృత్తిపదకోశం 1992 మేలోనే విడుదల అయింది. 1992 సెప్టెంబరు నాటికి ఉన్న పరిస్థితి ఇదీ).

ఈ వృత్తిపదకోశాల తయారీవల్ల, ఇంతకుపూర్వం వచ్చిన తెలుగు నిఘంటువుల్లో లేని పదాలు వేలకొద్దీ గ్రంథస్థమవుతాయి. ఒకవేళ పూర్వ నిఘంటువుల్లో ఉంటే వాటికి అర్థస్పష్టత, నిర్దిష్టత, వైవిధ్యం నమోదవుతాయి. భిన్న రూపాంతరాలు ఏమేమిటో తెలుస్తుంది. ఆయా పదరూపాల ప్రాంతీయవ్యాప్తి గోచరిస్తుంది. అంతేకాదు, పరిమితమయిన మౌలికపదాలు ఆధారంగా అపరిమితమయిన నూతన పదాల కల్పన కొన్ని శతాబ్దాలుగా తెలుగుదేశంలో ఏ విధంగా జరుగుతోందో, అందులో ఉన్న శిల్పమేమిటో పరిశీలకులకు స్పష్టమవుతుంది. మాండలిక పదపటాల (dialect atlas) ద్వారా ఆయా పదాల ప్రాంతీయ విస్తృతిని బట్టి భాషామండలాల్ని (dialect areas) శాస్త్రీయంగా నిరూపించడం సాధ్యమవుతుంది. దాన్నిబట్టి తెలుగు భాషాపరిణామం ఏవిధంగా సాగుతోందో గమనించగలుగుతాం.

అయితే, భాషలో వాక్యనిర్మాణానికి కింది స్థాయిలో ఉన్న మాండలిక భేదాలు గమనించడానికి చెయ్యవలసిన కృషి వేరు. ఇటీవలి వరకు ఏ భారతీయ భాషలోనూ తత్సంబంధమయిన ప్రయత్నం శాస్త్రపద్ధతిలో జరగలేదు. వృత్తిపదకోశాల విషయంలోలాగే సామాజిక భాషా పరిశోధన విషయంలోకూడా తెలుగు భాష అగ్రగామి కావడం మనకందరికీ గర్వకారణం. దీనికికూడా తగినవిధంగా పథకం రూపొందించి, గ్విన్‌కమిటీచేత సిఫార్సు చేయించి, దాన్ని 'తెలుగు అకాడమి' సక్రమంగా అమలుపరచడానికి ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ వచ్చినవారుకూడా భద్రిరాజు కృష్ణమూర్తిగారే.

తెలుగు అకాడమి చేబట్టిన పరిశోధనల లక్ష్యమేమిటంటే. తెలుగు దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న విద్యావంతుల వ్యవహారంలో ఏయే సామాన్య లక్షణాలు గరిష్ఠంగా ఉన్నదీ గమనించి, రూపభేదాలు చూపిస్తూ, భాషలో ప్రాంతీయ ప్రామాణికాలనూ రాష్ట్రప్రామాణికాన్నీ నిరూపించడం. ఈ పరిశోధన కోసం, భాషాశాస్త్రం (Linguistics)లో ఎం.ఏ. పట్టం పొందినవాళ్లు నియమితులయారు. వాళ్ళు ప్రతి జిల్లాలోనూ ఒక్కొక్క తాలూకా కేంద్రాన్ని సందర్శించి వివిధ స్థాయిల వ్యవహర్తలలో సంభాషించి అవసరమయిన సమాచారం సేకరిస్తారు. వాళ్ళ కథనాల్ని టేపులమీద రికార్డు చేస్తారు. ప్రశ్నావళి పుస్తకాల్లో భాషాసమాచారం నింపుతారు. పర్యటనానంతరం, సేకరించిన సమాచారాన్ని వింగడించి ఆయా వ్యక్తుల వ్యవహారాన్ని తులనాత్మకంగా వ్యాకరిస్తారు. వివిధ జిల్లా ప్రమాణాలను బట్టి రాష్ట్ర ప్రమాణాన్ని నిరూపిస్తారు. ఈ విధంగా ప్రతిఒక్క జిల్లా భాషను గురించి ఒక్కొక్క బులెటిన్, మోనోగ్రాఫ్ ప్రచురిస్తారు. చిట్ట చివరికి తెలుగుభాషకు విస్తృతమయిన వర్ణనాత్మక వ్యాకరణం రూపొందిస్తారు. ఈ సామాజిక భాషాపరిశీలన కార్యక్రమం ఇంకా కొనసాగుతోంది.

సాధారణంగా, అందరికీ పరిచయమయిన ప్రమాణభాషనుబట్టి ఎదుటి వ్యక్తి మాట్లాడేది శిష్టమో శిష్టేతరమో నిర్ణయమవుతూ ఉంటుంది. (1) చదువు కోని వాళ్ళభాషలో మహాప్రాణాలు అల్పప్రాణాలవుతాయి. అంటే 'భారతం' 'బారతం' అవుతుంది. (2) సంయుక్తాలు ద్విరుక్తాలవుతాయి. అంటే 'దక్షిణం' 'దచ్చినం' అవుతుంది. ఇక్కడ కంఠ్యమూర్ధన్యాల సంయుక్తరూపం తాలవ్య ద్విరుక్త రూపంగానూ మూర్ధన్య అనునాసికం దంత్యానునాసికంగానూ మారాయి. (3) చకారం సకారం అవుతుంది. అంటే 'చదువు' 'సదువు'గానూ 'చెయ్యి' 'సెయ్యి'గానూ మారతాయి. (4) పదమధ్యంలో అచ్చు జారిపోతుంది. అంటే 'దుకాణం' 'దుక్ణం', 'దుక్నం' అవుతుంది. ఈ రెండో రూపంలో మూర్ధన్యం దంత్యమయింది. (5) పదాదిని వచ్చే వకారం లోపిస్తూ ఉంటుంది. 'వాడు'ను 'ఆడు' అనీ 'వాన'ను 'ఆన' అనీ అంటూంటారు. శిష్టుల భాషలో అయితే అపదాది స్థానంలో వకారం లోపించడం తరచు గమనిస్తూనే ఉంటాం. 'ఎక్కడికి వెళ్ళాడు?' అనడానికి 'ఎక్కడి కెళ్ళాడు?' అని అంటూంటాంగా! అంతేకాదు, 'గోదావరి' అన్న పదం, ఆ పేరుగల జిల్లాలో చదువుసంస్కారాలున్నవాళ్ళ నోట్లోంచి కూడా అప్పుడప్పుడు, 'గోదారి' అని వినవస్తూ ఉంటుంది. 'అన్నవరం' 'అన్నారం'

(హైదరాబాదులోకూడా 'గడ్డి అన్నారం/గడ్డెన్నారం' అన్న పేట ఉంది) అవుతుంది. ఇక్కడొక చిత్రమయిన విషయం గమనించాలి. అకార, ఎకారాది రూపాల్ని కొన్నిటిని శిష్టేతరాలనుకొని వకారాది రూపాలుగా పలుకుతూ ఉంటారు. అంటే 'అన్నం' 'వణ్ణం' అనీ, 'ఎక్కిళ్ళు' 'వెక్కిళ్ళు' అనీ అంటూంటారు. చిన్నప్పుడు ఆలమూరులో మా క్లాస్‌మేట్ ఒకతను ఉండేవాడు— 'ఏడుకొండలు' అని. 'నీ పేరేమిట్రా ?' అని అడిగితే, 'వేడుకొండలండి !' అనేవాడు.

ఈ రకంగా భాషలో శబ్దగతంగా వచ్చిన మార్పులను గమనించి జీవద్భాష అనేది ప్రతిదీ మార్పులకు లోనవుతూ ఉంటుందని భాషాశాస్త్రవేత్తలు సిద్ధాంతీకరించారు. ఆ వివరిణామాలకు బాహ్యాభ్యంతర హేతువులను నిరూపించారు. ఒక్కొక్క పదంవెనక, ఒక్కొక్క అర్థంవెనక ఎంతో చరిత్ర మరుగువడి ఉంటుంది. దాన్ని వెలికి తీసి భాషాచరిత్రను, భాషాశాస్త్రాన్ని ఆధునిక పద్ధతుల్లో నిర్మించుకోడం భాషాభిమానుల కర్తవ్యం.

ఒకవైపు గ్రాంథిక వ్యావహారిక భాషావాదాలు సంఘర్షణ సాగుతూనే ఉన్నా పూర్తిగా మాండలిక భాషలో రచనలు చేసినవాళ్ళు ఉన్నారు. నండూరి సుబ్బారావుగారి 'ఎంకిపాటలు' చాలావరకు గోదావరిజిల్లా ప్రాంతాల జానపద మాండలికాన్ని పుణికిపుచ్చుకున్నాయి. మా గోఖలే గుంటూరు పామర (జానపద) మాండలికంలో మంచికథలు రాశారు. తెన్నేటి సూరిగారూ జి. సురమౌళిగారూ ఇరివెంటి కృష్ణమూర్తిగారూ శ్రీమతి యశోదారెడ్డిగారూ కోస్తా, తెలంగాణా ప్రాంతీయ జానపద మాండలికాల్లో చిన్నకథలు రాశారు.

తెలుగులో జానపద మాండలికంలో వెలువడిన మొట్టమొదటి నవల 'వెలుగూ వెన్నెలా గోదారీ', తెలంగాణా మాండలికంలో వెలువడిన మొట్టమొదటి నవల 'ముత్యాలపందిరి' (దరిమిలా. రాయలసీమ మాండలికంలో వచ్చిన మొట్టమొదటి నవల 'రంగవల్లి'). ఈ మూడూ పోరంకి దక్షిణామూర్తి రాసినవి.

ఇటీవల కథల్లోనూ కవిత్వంలోనూ మాండలికాలకు ఎక్కువ ఆదరణ లభిస్తూండడం సంతోషం కలిగించే విషయం.

సామాన్యంగా ప్రతి భాషలోనూ మాండలికాలు ఎన్ని ఉన్నా శిష్టజన వ్యవహారంలో ఉన్న భాష ఆ కాలపు ప్రమాణ భాషగా స్థిరపడుతుంది. సుమారు

నలభై ఏభై ఏళ్ళుగా వస్తున్న వచన రచనల్లోనూ పత్రికల్లోనూ రేడియోలోనూ సినిమాల్లోనూ (ఇటీవల 'దూరదర్శన్'లోనూ) వాడుకలో ఉన్న భాష శిష్ట వ్యావహారికమే. శిష్టవ్యావహారికమన్న పేరు అపార్థాలకూ అపోహలకూ గురి అయే అవకాశం ఉంది కనక, దానికి 'ఆధునిక ప్రమాణభాష' అన్న పేరు ఇప్పుడు రూఢి అయింది. పైన చెప్పిన వివిధ ప్రక్రియల్లోనూ ప్రచార ప్రసార సాధనాల్లోనూ అదే వాడుకలో ఉంది. అంటే అవే దానికి ప్రామాణికత కలిగించాయి. ఇటీవలి వరకు పాఠ్యగ్రంథాల్లోనూ పరీక్షల్లోనూ దాన్ని నిషేధిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆ నిషేధమూ తొలగిపోయింది. (1986లో కింది తరగతుల తెలుగువాచకాల్ని కూడా ఆధునిక ప్రమాణ భాషలో రాయించడం మొదలయింది). ప్రమాణభాష ప్రభావం మాండలికాలమీదా మాండలిక భాషల ప్రభావం ప్రమాణ భాషమీదా ఎప్పుడూ ప్రసరిస్తూనే ఉంటాయి. ఈ మాండలికాలే ప్రమాణ భాషకు పుష్టి చేకూరుస్తాయి. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తాయి.

(డా॥ పాటిబండ మాధవశర్మగారి షష్టిపూర్తి
సన్మాన సంచిక 'అక్షరార్చన', 1972)

# 6

# పారిభాషిక పదాలు : కల్పనాశిల్ప రీతులు

## 1. నిర్వచనం

బహుముఖమైన మానవ విజ్ఞానంలో ఒక ప్రత్యేక పరిధికి పరిమితమై నిర్వచనీయార్థానికి సంకేతమైన పదం 'పారిభాషికం'.

స్థూలంగా చెప్పాలంటే విజ్ఞానశాస్త్రాలలోను (సైన్సెస్), మానవీయ శాస్త్రాలలోను (హ్యూమానిటీస్), సారస్వత కళా రంగాలలోను, రాజకీయ వాణిజ్య పరిపాలనా రంగాలలోను, వృత్తివిద్యలలోను, ఇంజనీరింగ్, ఇతర సాంకేతిక విద్యలలోను ప్రత్యేకార్థాలలో వాడుకలో ఉన్న నిర్దిష్టపదాలు పారిభాషికాలు. అవి వ్యస్తపదాలు కావచ్చు, సమస్తపదాలు కావచ్చు, పదబంధాలు కావచ్చు.

సామాన్య వ్యవహారానికి సామాన్య పదజాలం సరిపోతుంది. కాని ప్రత్యేక సందర్భాలకు ప్రత్యేక పదాలు అవసరమవుతాయి. పారిభాషికత నిర్దేశించవలసి వస్తుంది. అలా జరిగినప్పుడు అల్పప్రయత్నంతో అనల్పార్థస్ఫూర్తి కలుగుతుంది. ఆవగింజంత పరిమాణంలో బ్రహ్మాండం ఇముడుతుంది. అందుకే పారిభాషికం రిజర్వ్‌బాంకు నోటులాంటి దనిపిస్తుంది. అచ్చొత్తిన కాయితమే అది. కాని దాని విలువ నిర్ణీతమై ఉంటుంది. దాని రూపం విలక్షణమై ఉంటుంది. కాబట్టే లావాదేవీలు సులువుగా సాగుతున్నాయి.

సామాన్య వ్యవహారంలో కొత్తభావాలు (కాన్‌సెప్ట్స్) ప్రకటించడానికి పదజాలాన్ని ఎలా పెంపుచేసుకొంటామో ఒక ప్రత్యేకరంగానికి కావలసిన పదజాలాన్నికూడా అలాగే పెంపుచేసుకొంటాం. సామాన్యపదజాలం ఉత్పత్తి వినియోగాలు సమాజ సమష్టిమీద ఆధారపడిఉంటే పారిభాషికాల ఉత్పత్తి వినియోగాలు ఒక్కొక్క ప్రత్యేక వర్గంమీద ఆధారపడి ఉంటాయి. ఏ వర్గమైనా సమాజసమష్టిలో భాగమేకాబట్టి వారు రూపొందించే పదజాలం ఆ భాషకు

సహజమైన పద్ధతిలోనే సాగుతూంటుంది. అయినప్పటికీ భాషాసహజమైన పద్ధతి తెలిసినంత మాత్రాన పదం పారిభాషికార్థం తెలియదు. పదవ్యుత్పత్తి గ్రహించినా పదబంధాన్ని విశ్లేషించి చూసినా సరిపోదు. దానికొక నిర్వచనం చెప్పాలి. మూర్తామూర్తాలు (కాంక్రీట్ అండ్ అబ్‌స్ట్రాక్ట్) గురించి ఖచ్చితంగా తెలియాలంటే ఇంద్రియజ్ఞానం ఒక్కటే సరిపోదు. అటువంటప్పుడు నిర్వచనం సాయపడుతుంది. ఆ నిర్వచనం అతివ్యాప్తి, అవ్యాప్తి, అసంభవత అనే దోషాలకు లోనుకాకుండా ఉండాలి.

గ్విన్ కమిటీవారి నివేదికలో (చూ.అనుబంధం 14) పారిభాషిక పదం గురించి ఇలా అన్నారు : "A technical term is the name given to a technical concept whose meaning we already understand." (పుట 20)

## 2. లక్షణాలు

గంటి జోగిసోమయాజిగారు (చూ. అను. 18) పారిభాషిక పదాలకు పేర్కొన్న లక్షణాలు ఇవి :

**(క)** అసామాన్యత : సామాన్య వ్యవహారంలో కొన్ని పదాలకు కొన్ని అర్థాలు రూఢమై ఉంటాయి. ఆ అర్థాలు నిత్యజీవితంలో వారికి కలిగిన అనుభవాన్ని బట్టి ఏర్పడతాయి. కాని పారిభాషికార్థాలు వాటికి (పాక్షికంగా) భిన్నంగా ఏర్పడవచ్చు. ఉదా॥ ధ్వని. సామాన్యవ్యవహారంలో చెవికి సోకే చప్పుడు మాత్రమే ధ్వని. కాని భౌతికశాస్త్ర పరిభాషలో చెవికి సోకని చప్పుడుకూడా ధ్వనే.

**(చ)** నిగూఢత : పారిభాషిక పదానికి అర్థం మరుగున ఉంటుంది. పదం మూలరూపం తెలుసుకొన్నా పదబంధాన్ని విశ్లేషణచేసినా అర్థమయేటంత సుగమం కాదు. ఉదా॥ ఆత్మ, అహంకారం. ఇవి తత్వశాస్త్రంలో వాడుక.

**(ట)** నిర్వచనీయత : అర్థస్ఫూర్తికోసం నిర్వచనం అవసరంకావడం. ఉదా॥

సాంద్రత, సమయోజనీయత, స్థూల సిద్ధ బీజాశయ పత్రం, రసాయ నిక బంధం, వోల్టు, నిగమనం, DNA, పాలపుంత.

(త) నిర్దిష్టార్థ సూచకత : సమానార్థకాలనిపించే భిన్నపదాల అర్థాలలో సూక్ష్మ భేదాలు సూచించవలసివస్తుంది. ఉదా॥ హీట్ : టెంపరేచర్; పైరో మీటర్ : థర్మామీటర్.

(ప) పర్యాయపదాలమధ్య అన్యోన్యపూరకత లోపించడం : థర్మామీటరుకు 'హీట్ మెజ్యర్' పర్యాయపదం అయినప్పటికీ థర్మామీటర్ అని చెప్ప వలసిన చోట్లల్లా పైపదం వాడడానికి వీలులేదు. అంటే ఈ రెంటికీ అన్యోన్యపూరకత (కాంప్లిమెంటేషన్) లేదన్నమాట.

(గ) కృతకకల్పనార్హత : మెండల్ అనే జీవ శాస్త్రవేత్త ప్రవేశపెట్టిన వాదాన్ని 'మెండల్ వాద' మంటున్నాం. అలాగే గాల్వాన్ పేరుమీద 'గాల్వా నైజేషన్' అనీ, మాండలీఫ్ పేరుమీద 'మాండలీవియం' అనీ ఇతర శాస్త్రజ్ఞుల పేర్లనుబట్టి 'ఓమ్' 'వోల్ట్' అనీ కొత్తగా పదాలు కల్పించు కొన్నాం.

(జ) సంక్షేపసాధకత : పూర్తిరూపం వాడక్కర లేకుండా సంక్షేపంచేసి చెప్పవచ్చు. ఉదా॥ మి. మీ.＝మిలీ మీటర్, D. D. T.＝Dichloro diphenyle trichloroethane (ఒక కంపెనీవారు ప్రచారంలోకి తెచ్చిన పేరు). అలాగే రెండు పాళ్ళ హైడ్రొజనూ ఒకపాలు ఆక్సిజనూ అనడానికి బదులుగా $H_2O$ అనవచ్చు.

(డ) నిర్మాణానుకూలత : తీసుకొన్న ఒక రూపంతో భిన్నపదాలు నిర్మించ డానికి వీలు ఉండాలి. ఉదా॥ క్లోరిన్, క్లోరేట్, క్లోరైట్; ద్రావణం, ద్రావణి, ద్రావణీయత, ద్రావితం మొ. వి. వీటిలో భిన్నప్రత్యయాల చేరికవల్ల భిన్నపదాలు రూపొందాయి.

(ద) నామనిర్దేశకత : అధికారపదవులను సూచించే డైరెక్టర్, రీడర్ మొ.న

పేర్లూ వస్తుసామగ్రిని సూచించే బాయిలర్, ట్రాన్స్‌ఫార్మర్, రివాల్వర్ మొ. పేర్లూ క్రియారూపాలనుంచి ఏర్పడ్డ నామాలు. ఇలాటి ఏర్పాటుకు అవకాశం ఉండాలి.

## 3. అపారిభాషికాలు

పారిభాషిక పరిమితి లేకుండా సామాన్య వ్యవహారంలో ఉన్న పదం 'అపారిభాషికం'. అయితే అపారిభాషికాలు కొన్ని పారిభాషికాలలోకి చేరడమూ ఉంది. ఉదా॥ 'ప్రెషర్' అనే ఆంగ్లపదానికి 'ఒత్తిడి' అని అర్థం. కాని భౌతిక శాస్త్ర పరిభాషలో అది 'పీడనం'. దానికి నిర్వచనం ఉంది. అలాగే 'డెన్సిటీ'. సామాన్య జనవ్యవహారంలో ఉన్నది పారిభాషిక మవడం ఏమిటని కొందరికి సందేహం ఉండవచ్చు. కాని ఏ భాషలో అయినా ఒక ప్రత్యేక శాఖలో పారిభాషికం అవసరమయినప్పుడు మొట్టమొదట పరిశీలించేది సామాన్య వ్యవహారంలో ఉన్నపదాన్నే. దాన్ని మన అవసరాలకు అనుగుణంగా మలుచుకోడానికి వీలు లేకపోవడమో అనిష్టార్థస్ఫురణ కలగడమో జరిగితేమట్టుకు దాన్ని విడిచిపెట్టేసి మరొకదానికోసం ప్రయత్నిస్తాం.

'ఎయిర్' అన్నదానికి 'గాలి' అనీ, 'స్పీడ్' అన్నదానికి 'వడి' అనీ అంటున్నాం. వాటినే భౌతికశాస్త్ర పరిభాషలోకి స్వీకరించారు. అయితే జీవశాస్త్రంలో 'అబ్డామినల్ కావిటీ' అన్నదానికి మొదటి అంశానికి 'పొత్తికడుపు-' అనీ రెండోభాగానికి '-బోలు' అని చెప్పవలసివస్తే నిర్మాణావకాశమూ నశించి అనిష్టార్థస్ఫురణా కలుగుతుంది. అందువల్ల 'ఉదరకుహరం' అని చెప్పవలసి వచ్చింది.

మొత్తంమీద, నిత్యజీవితంలో సామాజికుల అలవాటునుబట్టి వాడుకఉండి, ఏ శాఖలోనూ విశేషపరిజ్ఞానం లేకపోయినా స్థూలంగా అర్థమయే పదాలు అపారిభాషికాలని చెప్పుకోవచ్చు.


## 4. అర్ధపారిభాషికాలు

సామాన్య వ్యవహారం మూలంగా సుపరిచితమై, నిర్మాణవిశ్లేషణద్వారా సుబోధకమయే పదాలూ పదబంధాలూ ఉద్దిష్టార్థంలో పారిభాషికాలుగా ఉంటే

వాటిని 'అర్ధపారిభాషికాలు' అంటాం. ఉదా॥ భద్రిరాజు కృష్ణమూర్తిగారు (చూ. అను. 1) మాండలిక వృత్తిపదకోశం రెండోసంపుటం (చేనేతపదాలు)లో ఇచ్చిన 'డబ్బారాట్నం', బూదరాజు రాధాకృష్ణగారు (చూ. అను. 7) మాండలిక వృత్తి పదకోశం నాలుగోసంపుటం (వాస్తుపదజాలం)లో ఇచ్చిన 'మేటిసాంచె'. డబ్బా రాట్నమన్నది డబ్బాలాగఉండే పెట్టెరాట్నం కాదు. గుండ్రటి రేకుడబ్బాలమీదికి నూలు చుట్టటానికి వాడే ఒకరకం రాట్నం. అలాగే మేటిసాంచె అంటే సాంచె (=ఇటిక, పెంకు తయారీలోవాడే మూస)లలో మేటి అనికాదు. "తొలిసారిగా కళ్ళంలో మట్టిపెట్టి సాంచెలోకి సర్దేవాడు"అని అర్థం. ఇంగ్లీషులో 'నెయిల్ పులర్', 'షాక్-అబ్జార్బర్', 'రెసిస్టెన్స్ కోయిల్' మామూలు వాడుక మాటలతో ఏర్పడ్డ సమస్తపదాలు. కాని వీటికి పారిభాషికత లేకపోవడం లేదుకదా! కొన్ని సందర్భాల్లో ఒక పారిభాషికపదమూ ఒక సామాన్యపదమూ కలిపి నూతనరూపం కల్పిస్తారు. ఉదా. ఎరుపుఆల్గీ (జీవశాస్త్రం), ఆయిల్ ఆఫ్ విట్రియల్, రెడ్ లెడ్ (రసాయనశాస్త్రం).

కొన్ని పక్షుల పేర్లూ జంతువుల పేర్లూ కీటకాల పేర్లూ వ్యాధుల పేర్లూ మొ.వి అటు పరిభాషలోనూ ఇటు సామాన్య వ్యవహారంలోనూ వాడుకలో ఉన్నాయి. ఇలాటి పరిస్థితుల్లో అన్ని పదాలూ ఆయా వర్గాలలోకి ఖచ్చితంగా విభజించి చేర్చడం సాధ్యంకాదు. ఏవి పారిభాషికాలు, ఏవి కావు అన్నదాంట్లో భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ వ్యాసానికి సంబంధించినంతవరకూ ఆయా వర్గాలు స్థూలంగా గ్రహించడం మట్టుకే కావలసింది.

పై చర్చ సారాంశం ఏమిటంటే అపారిభాషికాలూ అర్ధపారిభాషికాలూ పారిభాషికాలుగానూ కావచ్చు. పారిభాషికాలుగానూ అర్ధపారిభాషికాలుగానూ ఉన్నవి సామాన్య వ్యవహారంలోకి చొచ్చుకుపోవచ్చు- అదే అర్థంలోనో మరొక అర్థంలోనో; యథారూపంగానో ధ్వని విపరిణామంతోనో. ఒకప్పుడు ఏకపదం సమస్తపదం కావచ్చు. సమస్తపదం ఏకపదమూ కావచ్చు. ఇది నిరవధికంగా సాగే ప్రక్రియ. కాబట్టి పదజాలంలో ఈ మూడు వర్గాలూ ఒక పెట్టెలో అరల మాదిరిగాకాక ఒక సరస్సులో అలలమాదిరిగా ఉంటాయని చెప్పాలి. కింది పటం గమనించండి.




పటం 1

పై పటంలో మూడు వలయాలూ మూడు వర్గాల పదాలకు స్థూలసంకేతాలు. పెద్దవలయం అపారిభాషికాలు. దైనందిన జీవితంలో సామాజికులకు ఎన్నో విషయాలకు సంబంధించిన పదజాలం వాడుకలో ఉంటుంది కాబట్టి దాని పరిమాణం పెద్దది. పారిభాషికాలకు సంకేతం దానికంటే చిన్నవలయం. సామాన్య పదజాలంకంటె పారిభాషిక పదజాలం తక్కువే ఉంటుంది కాబట్టి అది చిన్నది. అర్ధ పారిభాషికాలకు సంకేతం అన్నిటికంటె చిన్నవలయం. ఈ వలయాలు మూడూ ఒకదాంట్లోకి ఒకటి చొచ్చుకు పోతున్నాయి. వాటి చొరబాటును చూపించే భాగాలు విడివిడిగా ప్రదర్శించడం జరిగింది. వీటి పరిమాణాలు యాదృచ్ఛికంగా కనబరిచినవేకాని ఖచ్చితమైన నిష్పత్తి ఏమీ లేదు.

సామాన్య వ్యవహారంలోంచి పారిభాషికాలలోకి చేరిన కొన్నిపదాలు: కాడ, ధ్వని, ఫ్రూట్, పేరాసైట్, ఫెటీగ్ మొ. వి.

పారిభాషికాలలోంచి సామాన్య వ్యవహారంలోకి వచ్చిన కొన్నిపదాలు: అక్యూములేటర్, డైనమో, సీరియల్, పాశ్చరైజ్, కోనిఫెర్ మొ.వి. అలర్జిక్,

అటామిక్ అన్నపదాలకు సామాన్య వ్యవహారంలో అర్థం మారింది. అలర్జిక్ అంటే 'అయిష్టత, అసంసిద్ధత' అనీ అటామిక్ అంటే 'శక్తిమంతమైన, వెదజల్లే' అనీ అర్థాలు చెప్పుకొంటున్నాం.

మొదటి వరసలో వచ్చిన ఉదాహరణల్లో 'ధ్వని' అన్న పదానికి ఉన్న అర్థాల్లో సూక్ష్మభేదాలు ఎలా ఉన్నాయో కిందిపటంలో గమనించవచ్చు.

ధ్వని

↓ సామాన్య వ్యవహారం | ↓ భౌతికశాస్త్రం | ↓ భాషాశాస్త్రం | ↓ అలంకారశాస్త్రం

పటం 2

సామాన్య వ్యవహారంలో ధ్వని అంటే చెవికి వినిపించే చప్పుడు; కాని భౌతికశాస్త్రంలో చెవికి వినిపించనిది కూడా ధ్వనే. భాషాశాస్త్రంలో ఉచ్చారణలో వెలువడింది మట్టుకు ధ్వని. ఇకపోతే అలంకార శాస్త్రంలో కావ్యపరంగానూ వ్యంగ్యార్థపరంగానూ వ్యంజనావృత్తిపరంగానూ (ఆనందవర్ధనుడు) ధ్వనిశబ్దం వ్యవహృత మవుతుంది.

## ౫. పదాలూ అర్థాలూ

భాషలో ప్రతిపదమూ ప్రతి ప్రత్యయమూ ప్రతి ఊనికా అర్థవంతమైనవి. ఉదాహరణకు, 'రామస్-' (రామ–స్) అన్నప్పుడు సుప్ప్రత్యయానికి అర్థం: [ప్రథమావిభక్తి + ఏకవచనం]. అలాగే "వదతి' అన్నప్పుడు (వద్-అ-తి) [వర్తమానకాలం + నిశ్చయవృత్తి + ప్రథమపురుష + ఏకవచనం + కర్త్రర్థకం]. అయితే ఈ ప్రత్యయాలు అర్థవంతమైనా స్వతంత్రప్రయోగ యోగ్యత లేదు కనక వాటిని పదాలుగా పరిగణించం.

పదపదార్థ సంబంధం యాదృచ్ఛికం; సమాజనిష్ఠం. సామాజికుడి బుద్ధిలో నెలకొన్న భావానికి బాహిరరూపమే పదం. కొత్తవాడు ఆ పదం మొదటిసారి

విన్నప్పుడు అతనికి అర్థం తెలిస్తేనేతప్ప భావం ఏర్పడదు. పదాలూ అర్థాలూ గురించి కార్ల్ మార్క్స్ ఇలా అంటాడు :

"The name of a thing is quite external to the nature of that thing. I know nothing about a man simply becacuse I know that he is called James." (Capital, New York 1929 P. 77). బహిః ప్రపంచాన్ని అవగాహన చేసుకోడానికి ప్రతి వస్తువునూ ప్రతి జీవినీ ప్రతి జడపదార్థాన్నీ మానవుడు పరిశీలిస్తాడు. దాని వ్యావహారిక ప్రయోజనాన్ని (ప్రాక్టికల్ నీడ్)బట్టిగాని వ్యాపారాన్నిబట్టిగాని లక్షణాలు నిర్దేశిస్తాడు. వి.ఐ.లెనిన్ గ్రంథ సంపుటి (32)లో ఒక ఉదాహరణ (పుటలు 93-94) గమనార్హం :

A tumbler is assuredly both a glass cylinder and a drinking vessel. But there are more than these two properties, qualities or facets to it; there are an infinite number of them, an infinite number of 'mediacies' and relationships with the rest of the world. A tumbler Is a heavy object which can be used as a missile; it can serve as a paper weight, a receptacle for a captive butter-fly, or a valuable object with on artistic engraving or design 1 and this has nothing at all to do with whether or not it can be used for drinking, is made of glass, is cylindrical or not, and so on and soforth...." (చూ. అను. 5)

వస్తువు ఆకార ద్రవ్య గుణాదులలో సామాజికుడి దృష్టికి ప్రముఖంగా తోచినది ఒకటి ఆ వస్తువుకు పేరు పెట్టడానికి కారకమవుతుంది. సంస్కృతంలో 'వృక' శబ్దముంది. దాని ప్రకృతికి అసలర్థం 'చీల్చడం' అని. చీల్చిచంపే గుణాన్నిబట్టి ఆ జంతువును 'వృకం' (తోడేలు) అన్నారు. దీన్నుంచి వచ్చిన రూపాలే జెర్మన్‌భాషలో Wolf, ఇంగ్లీషులో wolf, రష్యన్‌భాషలో volk అన్నవి.

అయితే సామాజికుడి దృష్టి, ఆలోచనావిధానం అతనికి భాషలో నలిగిన కొన్ని మార్గాలమీద ఆధారపడి ఉంటుంది. ఈ సందర్భంలో భద్రిరాజు కృష్ణమూర్తిగారు (చూ.అను.3) ప్రస్తావించిన అంశాలు గమనించదగ్గవి :

1. "భిన్నభాషా సమాజాలకు వాస్తవిక జగత్తు ఆయా భాషావ్యవస్థల భేదాల్ని బట్టి వేరు వేరుగా కనిపిస్తుంది....మనం తెలుగులో బొగ్గు నల్లగా ఉంటుంది; అతను నల్లగా ఉంటాడు; కృష్ణుడు నల్లటివాడు; నల్లమబ్బులు' మొ.చోట్ల ఇంగ్లీషులో 'బ్లాక్,' బ్రౌన్, బ్లూ, గ్రే, అని నాలుగు రకాలుగా ఉన్న వర్ణ విభాగానికి 'నలుపు' అని ఒకేపేరు పెట్టుకొన్నాం. అంటే అవాంతర భేదాలు లెక్కలోకిరాని ఒకే రంగుగా దీన్ని మనం భావిస్తాం. 'పచ్చటి మనిషి, పచ్చటి ఆకు' అనేచోట్ల ఆంగ్లంలో 'ఎలో, గ్రీన్' అనీ హిందీలో 'పీలా, హరా' అనీ వేరువేరుగా ఉన్న రంగులకు మనం ఒకే శబ్దం ఉపయోగిస్తాం. మన భావనావ్యాపారంలో మొట్టమొదట ఈ రెండు రంగులనూ వేరుచేసే అవసరం లేకపోయి ఉండవచ్చు. ఆకుపచ్చకాయ పక్వమైనప్పుడు పసుప్పచ్చగా మారటం, లేత ఆకు ముదిరి, పండి, రాలిపోయినప్పుడు పరిణామ దశల్లోకలిగే అనుక్రమం వీటి భేదనిరూపణకు హేతువు కావచ్చు. ఈ ధాతువునుంచి వచ్చిన శబ్దాల్లో అర్థసామ్యం గమనించండి: పచ్చ, పచ్చి, పసుపు, పసరు, పసి, పసిమి, పైడి, పైరు మొ.వి. కాలాంతరంలో వ్యవహారంలో ఏర్పడ్డ ఆవశ్యకతనుబట్టి ఈ రంగుల్లో అవాంతర భేదాలకు కూడా పదాలు కల్పించుకున్నాం. ఉదా : ఆకుపచ్చ, పసుప్పచ్చ, చిలకాకుపచ్చ, ముదురాకుపచ్చ. అలాగే ఊదా: మట్టిరంగు, నీలం మొ.వి ...భాషకూ భావానికీ గల సంబంధం ఇలాటి ప్రత్యేక సందర్భాల్లోనే కాదు, వ్యాకరణంలో సంధి, సమాసం, కారకం మొ. వాటిల్లో కూడా కనిపిస్తుంది.

2. తెలుగులో దేశ, కాలభేదాన్ని స్పష్టంగా విడమర్చి చెప్పటం తక్కువ. ఇది మన ఆలోచనావిధానంలో పాతుకుపోయిన కలయిక. ఉదా : 'ఎంతదాకా వెళ్తావు? ఎంతదాకా ఉంటావు?' అన్నప్పుడు దేశంలోనూ కాలంలోనూ ఉన్న దూరపరిమితిని సూచించటానికి'-దాకా' ఒకే ప్రత్యయం ఉపయోగిస్తాం(ఇంగ్లీషులో 'హౌ ఫార్....', 'హౌ లాంగ్....'అని).

3. తెలుగు మాట్లాడే వ్యక్తి తన చుట్టుపక్కల ఉన్న వ్యక్తులతోను, పదార్థాలతోను తనకున్న సంబంధం (దూరమా దగ్గరా అనేది) వ్యక్తీకరించటానికి ఎంతో భాషాసామగ్రిని ఉపయోగిస్తాడు. స్థూలంగా జగత్తును రెండు రకా

లుగా విభజించాడు. అతనికి వ్యక్తులంతా ఒక ఎత్తు, వ్యక్తులుకాని తిర్యగ్గ డాలు ఒక ఎత్తు. అందుకనే 'ఎన్ని పుస్తకాలు?', 'ఎన్ని ఆవులు?' 'ఎన్ని కుక్కలు?' అంటాం. కాని, 'ఎందరు మనుషులు?' అంటాం.

4. ఆర్యభాషల్లో అన్న, తమ్ముడు, అక్క, చెల్లెలు అనే రెండు రకాలైన విభజనకు–వ్యక్తికంటె పెద్ద, చిన్న భేదానికి-మాటలు లేవు. దీన్నిబట్టి కూడా తెనుగు వాడుకలో వ్యక్తికీ వ్యక్తికీమధ్య ఉన్న అంతరాన్ని మాట తీరులోనే అడుగడుగునా నిర్దేశించటం ఎంత ఆవశ్యకమో తెలుస్తుంది.

5. ఇంతేకాకుండా, మనం ఉపయోగించే క్రియల్లో కూడా మన ఆలోచనా విధానం, కాలక్రమాన దాంట్లో వచ్చిన పరిణామం స్పష్టమవుతాయి."

కాలగమనంలో భాష విస్తరిస్తున్నకొద్దీ పదాల అర్థాలు మారుతూ ఉంటాయి. ప్రాథమికమైన సరళస్థాయినించి ఉత్తరోత్తరా సంశ్లిష్టస్థాయికి అర్థం పరిణమిస్తుంది. పదాల అర్థమేకాదు, పరిణామశీల ప్రపంచంలో ప్రతిఫలించే మానవజీవిత ప్రతిబింబ లక్షణమే మారుతుంది. ఇవనగా ఎంత?

మన వాడుకలో ఒకే పదం అనేకమైన అర్థాలతో ఉండడం గమనిస్తాం. తెలుగులో 'ఇల్లు' అనే పదానికి 'గుడిసె, పాక, పెంకుటిల్లు, డాబా, మేడ' మొ. వాటిలో ఏదైనా కావచ్చు. "నేనింటికి వెళ్తాను"అని ఎవరయినా అన్నప్పుడు అతని ఆర్థికస్థితిని బట్టి పై అయిదు అర్థాలలో ఏదయినా గ్రహించవచ్చుకదా ! అలాగే ఇంగ్లీషులో 'ఫేస్' అన్న పదానికి నాలుగర్థాలు ఉన్నాయి: (1) the front part of the head (2) expression of countenance (to make faces) (3) outward appearance (4) the front part of a building. వీటికి 'అనేకార్థకత' (పోలీసెమీ) ఉంది. పై అర్థాలన్నిటిలోనూ సమానగుణం అనేది ఒకటి ఉంది. అయితే కొన్నిపదాలకు రూపసామ్యం ఉండి, సమానగుణం లేని అర్థాలు ఉండవచ్చు. వీటిని 'సమనామాలు' (హోమోనిమ్స్) అంటారు. ఉదా. 'పదును' (కత్తివాదర), పదును (నీటితడి).

రెండుపదాలు భిన్న రూపాల్లో ఉండి ఒకే అర్థంలో వాడుకలో ఉంటే వాటిని 'సమానార్థకాలు' (సినానిమ్స్) అంటారు. వీటికి ప్రధానమైన అర్థం ఒకటే అయి, నిర్దిష్ట సందర్భాల్లో నిర్దిష్టపదాలు ప్రయోగార్హమై ఉంటాయి. వైద్యుడని చెప్పడానికి ఇంగ్లీషులో 'డాక్టర్, సర్జన్, ఫిజీషియన్' అన్నపదాలు వాడతారు.

వాటిలో 'సమానార్థక ప్రధానం' (సినానిమిక్ డామినెంట్) 'డాక్టర్' అన్నది. సమానార్థకాలలో 'నిరపేక్ష (అబ్సల్యూట్)సమానార్థకాలు', 'సాపేక్ష (రిలేటివ్) సమానార్థకాలు', 'శైలీ (స్టైలిస్టిక్) సమానార్థకాలు', 'పదబంధ (ఫ్రేజియలాజికల్) సమానార్థకాలు'అని అవాంతర భేదాలున్నాయి. నిరపేక్ష సమానార్థకాలు చాలా అరుదు. ఉదా : airman, flyer, flying-man; also, too మొ.వి. సాపేక్ష సమానార్థకాలకు అర్థచ్ఛాయలూ ప్రయోగ సందర్భాలూ భిన్నంగా ఉంటాయి. ఉదా. understand, realise, comprehend. శైలీభేదాన్ని బట్టి ప్రయుక్తమయే సమానార్థకాలు : courage, valour, dauntlessness, grit, gust; to monkey, to imitate; to begin, to fire away. పదబంధ నిర్మాణంలో కొన్ని పదాలు కొన్నిటితోనే సమసించడం గమనిస్తాం. ఉదా. ఇంగ్లీషు భాష అనడానికి English language, English tongue అని రెండు విధాలుగానూ అనవచ్చు. అయితే మాతృభాష అని చెప్పడానికి mother-tongue అనే తప్ప mother language అనడానికి వీల్లేదు. ఎందుకు వీల్లేదని అడిగితే, ఆ భాషా వ్యవస్థకు (జీనియస్ ఆఫ్ ద లాంగ్వేజ్) నప్పదు కనక, అని సమాధానం. భాషా విషయంలో 'ఎలాగ?' (how) అన్న ప్రశ్నకే తప్ప 'ఎందుకు?' (why) అన్నదానికి తావు లేదు.

ఇంగ్లీషులో స్థానిక సమానార్థకాలు (లోకల్ సినానిమ్స్) అని కొన్ని ఇంగ్లండులోనూ కొన్ని అమెరికాలోనూ వాడుకలో ఉన్నాయి. కింది ఉదాహరణలు గమనించండి :

| *England* | *America* |
|---|---|
| government | Administration |
| lorry | truck |
| post | mail |
| tube | subway |
| office, ministry | department |

అలాగే తెలుగువాళ్ళు 'నవల' అన్నదాన్ని కర్నాటకులూ మహారాష్ట్రులూ 'కాదంబరి' అనీ, హిందీవాళ్ళు 'ఉపన్యాస్' అనీ అంటారు. తెలుగు వాళ్ళు 'పత్రికా రచయిత, విలేఖరి' అంటే కర్నాటకులు 'సాహిత్యక' అంటారు. తెలుగులో 'కథ'

అనేది గుజరాతీలకు 'వార్తా'. తెలుగు వాళ్ళు 'రాష్ట్రం' అనేదాన్ని ఉత్తరాది వాళ్ళు 'ప్రదేశ్' అంటారు. ఇలాంటివన్నీ స్థానిక సమానార్థకాలు.

పైదాని సారాంశం ఏమిటంటే భాషలో పదరూపాలూ అర్థాలూ ఆ భాషా సమాజానికి సహజమైన పద్ధతిలో ఏర్పడతాయి. సహజమైన పద్ధతిలో పెంపొందుతాయి. అలాగే పరిణామాలకు లోనవుతూ ఉంటాయి. భాషలో పదాలూ అర్థాలూ వచ్చేవి వస్తూండగా పోయేవి కొన్ని పోతూనే ఉంటాయి. ఒక విషయానికి సంబంధించిన భావం పాతబడితే, నిరర్థకమైతే వాడుకలోంచి పోకతప్పదు.'ఫ్లాజిస్టన్, ఫీ సింపుల్' అనే పదాలు ఈనాడు ఇంగ్లీషువాడికి అవసరంలేదు. అలాగే ప్రాచీనాంగ్లంలో ఉన్న 'స్వేగ్' (చప్పుడు), 'వియర్డ్' (జనసమూహం) ఏనాడో నశించాయి. సి.ఎల్. బార్బర్ (చూ. అను. 11) చెప్పిన మాటలు గమనార్హమైనవి:

"It is natural to long for stability in a universe of change, to try to pin things down and fix them. But it can't be done. The whole of nature is in a flux, as so is the whole of the life of man, and we might as well accept the fact. It is not really much good clinging to the bank ; we have to push out into the flux and swim." (పుట 267).

## 6. పారిభాషికాల పుట్టుక

ఒక భాషలో కొత్తగా పారిభాషికపదం రూపొందాలంటే ఆ భాషావ్యవహర్తల బుద్ధిలో కొత్తభావం పొదుకోవాలి. ఆ భావం ఆ భాష మాట్లాడే సమాజంలో పుట్టిందే కావచ్చు లేదా ఆదానంవల్ల వచ్చింది కావచ్చు. ఆ భావం నిర్దిష్టమయినప్పుడు దానికొక సంకేతం ఏర్పడుతుంది. అదే పారిభాషికపదం. సంకేతితార్థసూచకతే దాని ప్రయోజనం. హాలిడే, మెక్ ఇంటోష్, స్ట్రీవన్స్‌లు రాసిన పుస్తకం (చూ. అను 15)లో కింది వాక్యాలు చూడండి:

"Technical terms-come into being for exactly the same reasons as anyother items in the language : because there are things, events, objects, properties and so on- to be named. What distinguishes technical terminology is the named things are specialized categories, and it is because the categories

are found to be needed for observation and action that specialized terms arise.'' (పుట 7).

ఆధునిక ప్రపంచంలో వేలాదిగా కొత్త పారిభాషికాలు రూపొందుతున్నాయంటే దానికి కారణం, వివిధశాఖలలో మానవుడి శాస్త్రీయసాంకేతిక విజ్ఞానం రోజురోజుకూ విస్తరిస్తూ ఉండడమే. ఇంగ్లీషులో ఏర్పడ్డ సుసంపన్నమైన పరిభాష ఈ విజ్ఞానం పెట్టిన భిక్షే. భారతీయులకు ఇంగ్లీషు భాషద్వారా చాలాకాలంగా ఆధునిక విజ్ఞానాభివృద్ధి కలుగుతూ ఉండడం తెలిసిందే. అయితే ఇప్పుడు భావ వినిమయం ప్రాంతీయమైన 'జాతీయభాష'లలోనే జరగడం అవసరమని నిర్ణయించిన కారణంగా ఆయా భాషలను త్వరితగతిని ఆధునికమూ పదసంపన్నమూ చేసుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. భాషను ఆధునికం చేసుకోడమంటే ఆధునికావసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవడమే (చూ. గ్విన్ కమిటీ రిపోర్టు, పుట 48). దానికి భావ-ఆదానం (బారోయింగ్ ద కాన్సెప్ట్) అవసరం. ప్రస్తుత పరిస్థితిలో భారతీయభాషలు 'ఆదానభాష'లూ (బారోయింగ్ లాంగ్వేజెస్). ముఖ్యంగా ఇంగ్లీషుభాష 'ప్రదానభాషా'ను(హోస్ట్ లాంగ్వేజ్). భావాల ఆదానానికి అనుగుణంగా భారతీయభాషల్లో పదసంకేతాలు ఏర్పడాలి. ఇవి ఏర్పడడానికి సహజమైన పద్ధతులు ఏమిటన్నది ప్రధానచర్చ. ఈ సమస్యకు పరిష్కారంగా గ్విన్‌కమిటీవారు సూచించినమార్గాలు మూడు : (క) కొత్తభావాన్ని తెలియజేయడానికి ఆదానభాషలో ఉన్న పదాలతో 'వర్ణనాత్మక పదం' రూపొందించుకోడం. ఉదా॥ హోమోడెంట్స్ అన్నదాన్ని 'ఒకే విధమైన దంతాలున్నవి' (జీవశాస్త్రం) అని చెప్పడం. (చ) ఆదానభాషతో కొత్తపదం సృష్టించుకోడం. ఉదా॥ లేబియం అన్నదాన్ని 'కిందిపెదవి' అని చెప్పడం. (ట) అదీకాకపోతే, ప్రదానభాషలోంచి ఎరువుతెచ్చుకోడం. ఉదా॥ క్లామిడోమోనాస్.

గ్విన్‌కమిటీ నివేదికకు చేర్చిన అనుబంధం (పుట 58)లో భద్రిరాజు కృష్ణమూర్తిగారు వెల్లడించిన అభిప్రాయాలు ఇవి :

1. "It is concepts and categories that matter in the early phases of teaching a new subject and not mere technical terms which would at best be empty tokens unless the whole network of thought which necessitated their emergency is not comprehended in the new language in question.

2. The concepts that technical terms convey can be descriptively explained in any regional languages using where necessary the international terms as occurring in standard English text books.

3. After 'naturalisation' of the new concepts, new technical terms develop in the target language within its own frame of reference and as part of its own classificatory system.

4. Any attempt at translating one technical term of the host language by one term in the borrowing language is bound to fail since it ignores the fact that no two languages classify concepts identically."

కాబట్టి పారిభాషిక పదకల్పన ఏ భాషలో అయినా దానికి సహజమైన పద్ధతిలో జరగాలన్నది సిద్ధాంతం. ఇక తెలుగులో సహజమైన పదనిర్మాణ వ్యవస్థ ఎలా ఉందో గ్రహించడానికి కొన్ని ఉదాహరణలు గమనిద్దాం. తెలుగు దేశంలో అనాదిగా వృత్తి విద్యలవల్ల జీవిస్తున్నవాళ్ళు ఉన్నారు. వాళ్ళంతా తమ తమ వృత్తులకు కావలసిన ప్రత్యేక పదసామగ్రి రూపొందించుకొని వ్యవహరిస్తున్నారు. ఇవీ పారిభాషికాలే. వాటి తీరులు తెలుసుకోడానికి మాండలిక వృత్తిపద కోశం రెండో సంపుటం (చేనేత పదాలు) తయారీకోసం పదసేకరణచేస్తూ కోస్తా రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లో పర్యటించినప్పుడూ పదపట్టికలు తయారు చేసినప్పుడూ నేను గ్రహించిన రూపాలు కొన్ని కింద ఉదాహరిస్తాను.

| పదం ఏర్పడిన తీరు | పదం |
|---|---|
| 1. ఆకారాన్నిబట్టి : | బెండకాయచక్రం, రుద్రాక్షపేటు, ఆకు చెవులగొర్రె, రెక్క, అంటిమొగ్గపేటు |
| 2. మూలపదార్థాన్నిబట్టి : | ఆమదం సబ్బు, తక్కిలేట్‌నూనె |
| 3. ఉపయోగాన్నిబట్టి : | అడకట్టుపంచె, కొలకోల, పడుగేరుకఱ్ఱ, కండెలరాట్నం |
| 4. ఉపయోగించే తీరునుబట్టి : | అడ్డ(కట్టు)పంచె |

5. ప్రక్రియనుబట్టి : ఆటచెక్రం, ఆడు(డు)గోల, అద్దుపిడచ, అల్లికంతాడు, అచ్చుకట్టుదారం

6. చేసేపనిలో మరొకదాంతో ఉన్న పోలికనుబట్టి : ఉడత, రాయబారంతాడు, ఉయ్యాలతాడు

7. వినియోగదారు ఉన్న దేశాన్నిబట్టి: ఆఫ్రికారంగులు (ఆఫ్రికాకు ఎగుమతిచేసే రంగుబట్టలు)

8. తయారైన ప్రదేశాన్నిబట్టి : అడియార్‌కొంగు,మద్రాసుమగ్గం,ఆసియా రుమాలు (వేటపాలెం - జాంధ్రపేటల్లో తయారయిన రుమాళ్ళకు అరేబియాలో ఈ పేరు వాడుకలోకి రావడంవల్ల ఇక్కడి నేతపనివాళ్ళుకూడా ఇదే వ్యవహరిస్తు న్నారు), గద్వాలంచు, పూనాకొంగు

9. పరిమాణాన్నిబట్టి : అర్ధలు, అరపిడి, అగ్గిపెట్టెగడిచీర

10. సంఖ్యనుబట్టి : ముయ్యేర

11. కాలాన్నిబట్టి : ఆవిటికత్తిరింపు, మాగిఉన్ని

12. మొదట పురమాయించిన (పసందుచేసిన)వారి పేరునుబట్టి : హు(ఉ)జూర్‌షర్మాలు (హుజూర్ = నిజాంప్రభువు), గూడాబార్డరు (గూడా (వారు) = ఒక వినియోగదారు ఇంటిపేరు)

13. రంగునుబట్టి : అబ్బాసిచీర, అరటాకుపచ్చ, ఉల్లిమల్లి చీర

14. నమూనానుబట్టి : లింగాలమండపం, ముత్యాలపందిరిచీర

15. స్థితినిబట్టి : ఆలుమగలు (పోగులు) (పైవైపు ఒకటి, కిందివైపు ఒకటిగా వచ్చిన రెండు పోగులు) ఎత్తుపల్లి, అడ్డాకు

16. వ్యవహర్త దృష్టినిబట్టి : అడ్డపట్టె=నిలువుపట్టె (ఒకేస్థితిలో ఉన్న ఒక భాగాన్ని కొందరు అడ్డపట్టె అనీ కొందరు నిలువుపట్టె అనీ అన్నారు).

17. సాంఘిక వ్యవస్థనుబట్టి : అత్తాకోడలందు, పీ(ఈ)రక త్రైలచీర, కూనలమ్మచీర, అంజలి రంగు (ఒక సినిమాతార పేరుతో వాడుకలో ఉంది).

18. ఆచారాన్నిబట్టి : ఉన్ని కంకణంకురమ, పత్తికంకణం కురమ (పెళ్ళిళ్ళలో ఉన్ని కంకణాలు కట్టుకొనే ఆచారంఉన్న కురమలూ, పత్తి కంకణాలు కట్టుకునే ఆచారంఉన్న కురమలూ. ఈ రెండు తెగలకూ కంచం పొత్తేగాని వియ్యంపొత్తులేదు. కురమలు గొంగళ్ళు నేస్తారు).

19. లింగాన్నిబట్టి : ఆడకాయ (దసలిపట్టుపురుగు అల్లిన గూళ్ళలో ఒక రకం).

20. వచనాన్నిబట్టి : ఒరవోగు, జంటచ్చుమగ్గం, ఇజ్జోడుపుల్లలు

21. పనివాళ్ళ తెగనుబట్టి : పెదకోల (= దేశమంతటా కొద్దిపాటి రూపభేదాలతో పద్మశాలివారికి వాడుకలో ఉన్న వస్తునామం). = ఊడు(గు)కోల (ఆ ఊళ్ళోనే ఉన్న దేవాంగులకూ హరిజనులకూ, కొద్దిపాటి రూపభేదాలతో వాడుకలో ఉన్న పేరు).

22. కనిపెట్టిన వ్యక్తినిబట్టి : అంబర్‌చెర్ఖా (ఏకాంబరన్ అనేఆయన తయారుచేసిన రాట్నం).

**దేశ అన్యదేశ్య పదరూపాలూ మిశ్రసమాసాలూ ఇలా ఉన్నాయి :**

(క) కేవల అన్యదేశ్యం - 'కమాను' దూది ఏకే సాధనం

(చ) కేవల దేశ్యం - 'ఈనె' — పన్నెదండెలకు మధ్య బిగించిన పుల్లల వెలితి; అచ్చుకట్టేటప్పుడు ఒక్కొక్క దాంట్లో రెండేసి పోగులు దూరుస్తారు.

(ట) అన్యదేశ్యం + దేశ్యం- 'రాజియాదూది' — ఒకరకం దూది

(త) దేశ్యం + అన్యదేశ్యం-'తీలు రేషం' — నాసిరకంపట్టు; పోగు అక్కడక్కడ గంట్లుగా ఉంటుంది.

**సమస్త పదరూపాలు**

| | | | |
|---|---|---|---|
| అచ్చుసూరె | జేముబారెడుకట్టె | ఆలపురాయి | అంచుమలుపునేత |
| అడ్డపుసాంచా | ఎక్కిరింతపుల్ల | ఆవిటికత్తిరింపు | ఇనపపురికడ్డి |
| ఆటచెక్రం | ఎగుదలకోర్తల | ఆడు(డు)గోల | ఇరువుగోలుచెక్రం |
| ఆపుబద్ధ | అంచపోగులకుంచె | ఒగ్గుడుబల్ల | ఉడతచారికలగొంగడి |
| | | ఎత్తినకోల | ఎర్రబొత్తంచుచీర |
| పడుగేరుకోల | గుండుపరుపుకుంచె | | |
| బానెపోగు | | | |
| సూత్రపుల్ల | మద్దికాయకలశంపేటు | | |
| వియ్యంపొత్తు | | | |

## 7. పారిభాషికాల పెంపు

అవసరాలకు అనుగుణంగా తగినన్ని పారిభాషికాలు భాషలో సిద్ధంగా లేనప్పుడు పెంపుచేసుకోటానికి గ్విన్‌కమిటీవారు ప్రస్తావించిన మూడు పద్ధతులూ ఇంతకు ముందు పేర్కొనడం జరిగింది. ప్రారంభదశలో వర్ణనాత్మక పద బంధాలు ఉపయోగించడమనే సూచన తప్పకుండా అనుసరణీయమైనది. విష యావగాహనకు అంతకంటె సులువైన పద్ధతి మరొకటిలేదు. రానురాను సంక్షేపం చేసి నిర్దిష్టపదం వాడుకోవచ్చు. అయితే తెలుగుదేశంలో ఒక్కొక్కరు ఒక్కొక్క తీరుగా వ్యవ రిస్తే గుర్తింపు కష్టమవుతుందన్న విమర్శ లేకపోలేదు. కాని ఒకే

భావానికి తగిన పదం అధ్యాపక వర్గంలో పదిమంది పదిపదాలు సూచిస్తే వాటిలో మంచి పదం ప్రమాణీకరణంలో నిలుస్తుంది.

అయితే విశ్వవిద్యాలయాల ప్రతినిధుల్లో బహుకొద్దిమందే వర్ణనాత్మక పద వినియోగానికి సుముఖులైనట్లు ఆ కమిటీవారు పేర్కొన్నారు. అలాగే తెలుగులో పదకల్పన చేయడం కూడా కొంతమందికే నచ్చిందట. ఎన్నో శతాబ్దాలుగా పదకల్పన మనదేశంలో సహజరీతిని జరుగుతూనే ఉన్నది. కాని, 'అడ్డుచ్ఛేదం', 'దృశ్యలోతు' లాంటివి చెయ్యమని చెప్పడంలేదు కదా! అయినా ఆంగ్ల పదజాలంలోనే పావిత్ర్యం ఉందని నమ్మేవాళ్ళకు ఎంతచెప్పి ఏం లాభం? మూడోపద్ధతి, అంటే ప్రధానభాషలోంచి పదాలు దిగుమతి చేసుకోడం ఒక్కటే చాలామందికి నచ్చిందట. సామాన్య వ్యవహారంలోకి కూడా ఎంతో పదజాలం పరభాషలనుంచి రావడం మనకు తెలియనిదికాదు. అలా పారిభాషికాలు దిగుమతి చేసుకోవచ్చు. నిజమే! భావాలు దిగుమతి చేసుకోగాలేనిది పదాలు దిగుమతి చేసుకోడానికి మొహమాటపడతామా? కాని దానికి పరిమితి ఉండాలి. విషయగ్రహణం ప్రధానం కాని పారిభాషికాలు కంఠోపాఠం పడితే చాలుతుందా? ప్రఖ్యాతభాషా శాస్త్రవేత్తలు హాలిడే, తదితరులూ (చూ. అను. 15) చెప్పిన ముక్కలు ఇవీ:

".. It will not do assume that mastering a subject means simply learning a set of technical terms, as if these had the status of passwords. We often meet the request, even from specialists in other fields, the very people who ought to know better : 'Can you help me?— It'll only take a couple of minutes— I just need a name for something— I don't know what to call it." This form of words shows clearly that the questioner is deluding himself; what he needs is at theory. The only answer is : 'Just call them a b and c or red and yellow or carrots, looks and cabbages— If names are all you need. these will sufice— it is the categories that count." If the category is invalid or wrongly defined no elegant technical term will save it from futility. The structure of a terminology should reflect the structure of the categories concerned, as in the naming of classes of chemical compounds" (పుట 8).

**ఆదానం :** ఒక భాషాసమాజంలో కొత్తభావంగాని, కొత్తపదంగాని ఎరువు

తెచ్చుకొంటే దాన్ని ఆదానమంటారు. మొదట జరిగేది 'భావ-ఆదానం' ఆ భావాన్ని వ్యక్తంచెయ్యడానికి తగిన పదజాలం తీరుతీరులుగా సమకూర్చుకుంటారు.

1. సామాన్య వ్యవహారంలో ఉన్నపదాలు యథాతథంగా తీసుకొని, నిర్దిష్టార్థం కల్పించి, నిర్వచనం ఇచ్చి పారిభాషికత చేకూరుస్తారు. ఉదా. రసాయనశాస్త్రంలో salt; వృక్షశాస్త్రంలో pollen, fruit; జీవశాస్త్రంలో parasite,అండం;మెటలర్జీలో fatigue; భౌతికశాస్త్రంలో work, force, power, current, resistence. ఈ ప్రక్రియలో 'అర్థవ్యాపనం, అర్థ సంకోచనం, నూతనార్థ కల్పన' జరుగుతుంటాయి.

2. మామూలు పదాలతో కొత్తపదబంధాలు కల్పిస్తారు. ఉదా. జున్నుగడ్డి (అగర్-అగర్), milky-way.

3. పరభాషాపదాలు ఉన్నవి ఉన్నట్లు తీసుకొంటారు. దీన్నే 'పూర్ణపద-ఆదానం' అంటారు. ఉదా. లాటిన్ భాషనుంచి bacillus, corolla, cortex, genus, fours, quantum, saliva, stamen ; గ్రీకు భాషనుంచి cotyledon, iris, larynx, pyrites, thorax అంతర్జాతీయ పదజాలంలోకి స్వీకరించారు.

4. పరభాషా పదాన్ని అర్థభేదంతో వ్యవహరిస్తారు. ఉదా. పాలె. "మరాఠీలో ఇది 'ఫాళ్'. దీని అర్థం 'నాగటిక్రరు' అని. ఈ ప్రాంతంలో 'క్రరు' నిలిచి ఉండటం వల్ల అర్థవిపరిణామం వచ్చి నాగలికి చెందిన మరొక భాగానికి (మేడికి) పేరుగా 'పాలె' వాడుకలోకి వచ్చింది." (చూ: మాం. వృ. కో, సం. 1, పుట. 50). పై ఉదాహరణలో వర్ణవిపరిణామం కూడా గమనించవచ్చు.

5. పరభాషాపదాన్ని మక్కికి మక్కి అనువాదం చేసి వాడుకొంటారు. ఉదా. loan-word (జెర్మన్ భాషలో lehn-wort), కన్నడంలో దూరవాణి (telephone).

6. పరభాషా పదాంశాలతో నూతనపదకల్పన చేస్తారు. లాటిన్, గ్రీకు భాషాంశాలతో విదేశ శాస్త్రవేత్తలు కొత్తపదాలు కల్పించారు. ఉదా. chlorophyll. గ్రీకుభాషలో క్లోరోఫిల్ అన్నపదం లేనేలేదు. కాని chloros లేత

ఆకుపచ్చ), phyllon (ఆకు)అనే పదాలు రెండూ తీసుకొని కలిపి క్లోరోఫిల్ అని రూపొందించారు. అయితే ఈ కొత్తపదానికి అర్థం 'లేతాకుపచ్చ ఆకు' అని కాదు అర్థం. మొక్కల్లో, వాటికి ఆకుపచ్చవన్నె కల్పించే పదార్థానికి పెట్టిన పేరు. అలాగే లాటిన్‌భాషలో ఉదాహరణ గమనిద్దాం. ఇంగ్లీషులో 'విటమిన్' అన్నపదం వాడుతున్నారుకదా : పైకిమట్టుకు అది లాటిన్‌నుంచి ఎరువు తెచ్చుకొన్నపదమే అనిపిస్తుంది. కాని అలాటి పదం లాటిన్‌లో లేదు. అందులో ప్రధానాంశమైన vita (జీవం)మట్టుకు లాటిన్‌లోది. ఇంకొక చిత్రం ఏమిటంటే, అటు గ్రీకులోదో ఇటు లాటిన్‌లోదో దిగుమతి చేసుకోడం కాదు. ఆ భాషలోది ఒక ముక్కా ఈ భాషలోది మరొక ముక్కా తీసుకొని కొత్తరూపం కల్పిస్తారు. ఉదా. haemoglobin (రక్తంలో ఉండే ఒకరం ప్రోటీన్ పదార్థం). 'రక్తం' అన్నదానికి సమార్థకమైన రూపం గ్రీకుభాషనుంచీ 'గోళం' అన్నదానికి సమానార్థకరూపం లాటిన్ భాషలోంచీ తీసుకుని, రెంటినీ కలిపి, చివర రెండు భాషలకూ సమానార్థకమైన '-in' ప్రత్యయం చేర్చి ఈ రూపం సృష్టించారు.

7. పరభాషాపదానికి మరొక దేశ్యపదం జోడించి సమస్తపదం చేస్తారు. దీన్ని 'పాక్షిక పద ఆదానం' అంటారు. ఉదా. సైక్లాయిడ్ పొలుసులు(సైక్లాయిడ్ స్కేల్స్) (చూ. అను. 10).

పరభాషా పదాలు ప్రతిభాషలోకీ కొద్దోగొప్పో వచ్చేవే. ప్రతి చిన్నపదమూ మన భాషలోదే ఉండితీరాలన్న దురభిమానం నిష్ప్రయోజనం. సాధిద్దామనిచూస్తే అయ్యవారిని చెయ్యబోయి కోతిని చేసినట్టు కావచ్చు. ఇంగ్లీషులో electricity అన్నదానికి fire-ghost అనీ horizon కి sky-sill అనీ ఉండాలని వాదించిన వాళ్ళున్నారు. కాని ఆ పదాలు జీవించలేదు. ఒక విషయం వ్యక్తంచెయ్యడానికి మనకు ఉపయోగపడుతూ ఉచ్చారణా రాతా తెలిసినప్పుడు ఆ పదం మన సొంతమే అయిపోతుంది. ఇంగ్లీషులో సామాన్య వ్యవహారంలోకి చొచ్చుకొనిపోయిన పదాలు గమనించండి.

| ప్రదానదేశం | పదం |
|---|---|
| భారతదేశం | పైజామా, జంగిల్ (హిందీ), బంగళా (బెంగాలీ), పంచ్ (సంస్కృతం-పంచ |

| | |
|---|---|
| | -అయిదు దినుసులు కలిసిన ఒక రకం షర్బత్తు), బెటల్ (తమిళం-వెత్తల్-), బాండికూట్ (తెలుగు-పందికొక్కు) |
| చైనా | టీ, టైఫూన్ |
| జపాన్ | కిమోనో |
| మలయా | బాంబూ, ఒరాంగుటాన్ |
| సయాం | పెగోడా |
| పర్షియా | టామరిండ్ (= తమర్ హింద్) |
| టర్కీ | కాఫీ |
| వెస్టిండీస్ | మెయ్‌జ్ |
| మెక్సికో | టొమాటో |
| ఆఫ్రికా | చింపంజీ, గొరిల్లా, అపార్థెయిడ్ |
| ఆస్ట్రేలియా | కంగారూ, బూమ్‌రాంగ్ |
| ఫ్రాన్సు | ఛాంబర్, వెసల్, ఫౌంటెన్, రివర్, షాపర్, గరాజ్, రోజ్ |
| రష్యా | స్పుట్నిక్, లూనిక్ |
| డచ్చి | టాఫ్రెయిల్, స్కూనర్ (నౌకాయాన సంబంధి) |
| ఇటలీ | స్టూడియో, రెప్లికా, సినేరియో, ఫియాస్కో (కళాసంబంధి); పేరాఫిన్, కోబాల్ట్, క్వార్ట్జ (రసాయనశాస్త్ర సంబంధి) |
| జర్మనీ | స్ట్రాఫ్, బ్లిట్జ్ (యుద్ధసంబంధి) |

అలాగని మనభాషలో ఉన్న పదాలన్నీ పక్కకి నెట్టేసి అన్నీ విదేశంనించే దిగుమతి చేసుకోవాలనడంలో సందర్భశుద్ధి ఎంతమాత్రం లేదు. రసాయన శాస్త్రంలో 'సిల్వర్' అన్న పదానికి తెలుగులో 'వెండి' అని అంటే వచ్చే ప్రమాదమేముంది? ఆంగ్ల ప్రామాణిక గ్రంథాల్లో వ్యస్తంగా వచ్చినప్పుడు 'సిల్వర్' అన్నప్పుడు 'ఆర్జెంటం' అని అంటున్నారా? అయితే అన్ని పదాలూ ఎరువే తెచ్చు

కోవాలనడంలో ఉన్న తత్వం విచారణ చెయ్యడం భాషాశాస్త్రేతరమైన అంశం కాబట్టి మనకు అప్రస్తుతం.

ఆదానరూపంలోనో మరొక రూపంలోనో పారిభాషికాల్లోకి కొత్త పదాలు వచ్చి చేరుతున్నట్టే వ్యతిరేకదిశలో పారిభాషికాలు కొన్ని సామాన్య వ్యవహారంలోకి చొచ్చుకొనివస్తాయి. ఉదా. బజెట్, డైనమో, పంచెర్, పెనిసిలిన్, నైలాన్, ట్రాన్సిస్టర్. అంతమాత్రాన వాటి పారిభాషికత నశించకపోయినా కొన్ని పదాలకు అర్థవిపరిణామం వచ్చిన సందర్భాలు ఉన్నాయి. పై ఉదాహరణల్లో 'ట్రాన్సిస్టర్' అనేది రేడియోకి వాడే పారిభాషికం కాదు. ఒక రకం రేడియోలో పెన్సిలుముక్క ఉరువులో ఉండే ఒక భాగానికి ట్రాన్సిస్టరని పేరు. అలాటి ట్రానిస్టర్లు అమర్చింది 'ట్రానిస్టర్ రేడియో'. అయితే మామూలు రేడియో ఒకటి అంతకుముందునుంచే వాడుకలో ఉండడంవల్ల కాబోలు, ఈ రకం రేడియోని ట్రాన్సిస్ట రంటున్నారు.

పద-ఆదానంవల్ల కలిగే లాభనష్టాలు గమనిద్దాం. ప్రాంతీయ (జాతీయ) భాషావ్యవహర్త ఉత్తరోత్తరా ప్రమాణగ్రంథాలు చదివేనాటికి పారిభాషిక పదజాలం యథారూపంగానో కొద్దిపాటి సవరణలతోనో అలవడి ఉంటుంది. అందువల్ల బయటి ప్రపంచంతో సులువుగా సంబంధం పెంచుకోవచ్చు. అయితే పద-ఆదానం విచక్షణారహితంగా కొననాగిస్తే లేనిపోని బరువు నెత్తికెత్తినట్టవుతుంది. అంతేకాదు, స్వభాషపట్ల నిరసన ఏర్పడుతుంది. స్వభాషను వినియోగించుకోవాలనడం కేవలం ప్రాంతీయాభిమానంతో చెబుతున్నట్టు భావించేవారి కొక నమస్కారం. కాని ప్రాంతీయభాష చైతన్యవంతమైన ఒక భాషాసమాజంలో కోట్లాది ప్రజలకు భావవినిమయసాధనం. పరభాషలో చెప్పినప్పటికంటె స్వభాషలో చెప్పినప్పుడే విషయం బాగా ఒంటబడుతుంది. విషయం కొత్తదయినప్పుడు దానికి తగ్గ పదజాలం లేకపోయిందే అన్న కించ అవసరంలేదు. ఏ భాషకయినా ఎప్పుడో ఒకప్పుడు నాంది కావాలి. కాబట్టి చేయవలసిందల్లా స్వభాషాపదాలు వీలయినంతవరకూ వాడటానికే ప్రయత్నించాలి. తన ఇంట లేనప్పుడే పొరుగింటికి పరుగు. తన ఇంట ఉందో లేదో ముందు చూసుకోవాలి. లేకపోతే సాధించాలి. సంస్కృత పదజాలం అనాదిగా తెలుగువాళ్ళ నోట నానుతున్నది. ఒక్క తెలుక్కే కాదు ఎన్నో భాషలకు పుష్టి చేకూరుస్తూంది. భారతీయ సంస్కృతికి

దర్పణంగా నిలిచింది. అందువల్ల, సంస్కృతం సాయంతో మన మూగతనం వదుల్చుకోవాలి. భాషాతత్వాన్నిబట్టి అది నూతనపద నిర్మాణాన్ని సుగమం చేస్తుంది. దానికి సోదరభాషలయిన గ్రీకు, లాటిను అంతర్జాతీయ పదజాలాన్ని ఎంతగానో పెంపొందించాయి. అదే విధంగా సంస్కృతభాషా గ్రంథాలలోనూ సంస్కృతం ఆధారంగా పెరిగిన భారతీయభాషా గ్రంథాలలోనూ పరిభాష కొంత రూపొందింది. తెలుగుభాషా పదజాలం అభివృద్ధి చెందడానికి ఆ గ్రంథాలు ఎంతగానో ఉపయోగపడతాయి. రఘువీరగారు (చూ. అను. 17) సంకలనం చేసిన బృహన్నిఘంటులో సుమారు ఆరువందల ప్రత్యేక శాఖలకు సంబంధించిన పదజాలానికి సంస్కృత-హిందీ అనువాదరూపాలు ఇచ్చారు. ఆయన పరిశీలన చేసిన గ్రంథ విస్తృతి చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది బహుభాషాపాండిత్యం, బహుశాస్త్రపరిచయం దాని రూపకల్పనకు తోడ్పడ్డాయి. ఆ పదాలు యథాతథంగా మనం వాడుకోనక్కరలేదు. కాని అది విస్మరించరాని కృషి అనీ కొన్ని సందర్భాల్లో నయినా తోడ్పడుతుందనీ గ్రహిస్తే చాలు. దాని పద్ధతులు పూర్తిగా మనకు సరిపడకపోవచ్చు. కాని వీలున్నంతవరకు ఉపయోగించుకోడం మంచిది.

## 8. అనువాదం

ప్రదాన భాషలో ఒక పదానికిగాని పదబంధానికి గాని పారిభాషికమైన అర్థం ఏమిటో పూర్తిగా గ్రహించి దాన్ని పూర్తిగానో పాక్షికంగానో అనువదించుకొంటాం. ఈ ప్రక్రియ చాలాకాలంగా సాగుతున్నదే. ఇటీవలికాలంలో 'యంత్రానువాదం' (మెషీన్ ట్రాన్స్‌లేషన్)కూడా బాగా ప్రచురమైంది.

జె. సి. కాట్‌ఫర్డ్ (చూ. అను. 13) అనువాదాన్ని ఇలా నిర్వచించారు : "The replacement of textual material in one language by equivalent textual material in other language''(పుట 20). అనువాదమనేది ఆదానభాషాభిముఖంగా సాగే ప్రక్రియ. ఇది నాలుగుస్థాయిల్లో జరుగుతుంది. (క) పదానికి పదం (చ) పదబంధానికి పదబంధం (ట) వాక్యాంశానికి వాక్యాంశం (త) వాక్యానికి వాక్యం.

ప్రపంచాన్ని తనదైన దృష్టితో చూసే పద్ధతి ప్రతిభాషా సమాజానికి

విలక్షణంగా ఉంటుంది. తెలుగువాళ్ళు 'నిన్న, రేపు' అని చెప్పే పదాలకు హిందీలో ఒకే పదం వాడుకలో ఉంది. 'కల్' (సంస్కృతం 'కల్యే') అలాగే 'మొన్న, ఎల్లుండి': 'పర్సోం' (సంస్కృతం,పరశ్వః). వయోభేదాన్నిబట్టి 'అన్న, తమ్ముడు' అని మనం అంటే వాళ్ళు 'భాఈ' అని ఒకే శబ్దం ప్రయోగిస్తారు. 'మన ఇంగ్లీషులో **dress** అన్నపదం ఆడవాళ్ళ దుస్తులకూ మొగవాళ్ళ దుస్తులకూ కూడా వాడతాం. కాని ఇంగ్లీషువాళ్ళు ఆడవాళ్ళ దుస్తులకే వాడతారు. పద స్థాయిలో ఉన్న భేదమిది. భారతీయభాషల్లో 'పుష్పశయ్యా' అంటే 'పూలపాన్పు' అని అర్థం. కాని ఇంగ్లీషులో '**flower-bed**' అంటే మొక్కలు నాటడానికి చదును చేసిన ప్రదేశం' అని అర్థం. ఇంగ్లీషులో **'I have been writing since morning'** అన్నప్పుడు తెలుగులో 'పొద్దుటినించి రాస్తున్నాను(రాసుకొంటు న్నాను)' అనీ హిందీలో 'మై సుబేసే లిఖ్ రహాహూం' అనీ అంటున్నాం. భావం ఒకటే అయినా నిర్మాణపద్ధతిలో ఆయా వాక్యాలకు భేదం గమనించవచ్చు.

పై చర్చ సారాంశం ఏమిటంటే ఒక భాషలోంచి మరొక భాషలోకి అనువాదం చేసేటప్పుడు ఆయా భాషల సహజనిర్మాణపద్ధతి దృష్టిలో ఉంచుకోవాలి. 'జీనియస్ ఆఫ్ ది లాంగ్వేజ్' దెబ్బతింటే అనువాద ప్రయోజనం దెబ్బతిన్నట్టే.

ఇక పారిభాషిక పదాల అనువాదం సంగతి చూద్దాం. భారత విద్యా మంత్రిత్వ శాఖకు సంబంధించిన కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలిజీవారు ఆయా విషయాలకు సంబంధించిన పదాలు అన్నీ కలిపి మొదట రెండు సంపుటాలుగా ప్రచురించారు. తరవాత ఆయా విషయాలకు సంబంధించిన పదజాలం విడివిడి సంపుటాలుగా ప్రచురించారు. ఈ పదజాలంలో ఆంగ్లపదాలకూ అంతర్జాతీయ పదాలకూ అనువాదాలు కొన్ని ఇచ్చారు. కొన్ని పదాలు హిందీవారి ఉచ్చారణను బట్టి ఉన్నవి ఉన్నట్టు నాగర లిపిలో ఇచ్చారు. అనువాదం చేసిన రూపాలు చాలావరకూ సంస్కృత రూపాలు. కొన్ని కేవలం హిందీవారే వాడే సంస్కృతేతర రూపాలు ఉన్నాయి. కొన్నిపదాలు పూర్తిగానూ కొన్ని పాక్షికంగానూ అనువదించారు. ఈ రూపాలు ప్రవేశపెట్టడానికి పెట్టు కొన్న నియమాలు ఆయా పుస్తకాల్లో వివరించారు. ఈ అనువాదాల్లో హిందీ రాష్ట్రాలవారికి ఇబ్బంది కలిగించే పదాలు ఏమిటో నేను చెప్పలేను గాని హిందీ యేతరులకు ఇబ్బంది కలిగించే రూపాలు కొన్ని ఉన్నాయి. వాటిలో కొన్ని పదాంశాలు పూర్వకాలంనుంచే ఆయా రాష్ట్రాల్లో వాడుకలో ఉండి నిర్దిష్టార్థాల్లో

రూఢంగాఉండడంవల్ల ఈ కొత్తపదాలు కొన్ని అనిష్టార్థస్ఫూర్తి కలిగిస్తున్నాయి. గందరగోళం వస్తూంది. తెలుగుదేశాన్ని దృష్టిలో ఉంచుకొని చూస్తే కింది ఉదాహరణల్లో వచ్చే ఇబ్బంది గమనించవచ్చు :

*1. Administrative terms*

| | |
|---|---|
| Account | లేఖా (తెలుగు- ఖాతా) |
| Agriculture | కృషి (వ్యవసాయం) |
| Character | చరిత్ర (శీలం) |
| Press-Infromation Bureau | పత్రరచనా కార్యాలయ్ |
| Legislative Assembly | విధాన్ సభా (శాసనసభ) |
| Pact | సంఝౌతా (సంధి, ఒడంబడిక) |
| Ability | యోగ్యత (సామర్థ్యం) |
| Abnormal | అపసామాన్య |
| Abolish | ఉన్మూలన్/అంత్‌కర్నా (రద్దుచేయడం) |
| Tribal Welfare Officer | ఆదివాసీ కల్యాణ్ అధికారి (గిరిజన సంక్షేమ అధికారి) |

*2. History*

| | |
|---|---|
| Background | పృష్ఠభూమి (నేపథ్యం) |

*8. Psychology*

| | |
|---|---|
| Abstinance | ఉపరతి (మానుకోడం, విడచిపెట్టడం) |

*4. Linguistics*

| | |
|---|---|
| Malapropism | దుష్ప్రయోగ్ |
| Technique | ప్రవిధి (శిల్పం, పద్ధతి, విధానం) |

*5 Sociology etc.*

| | |
|---|---|
| Accuracy | పరిశుద్ధతా |
| Action | సక్రియా, అందోలన్ (చర్య) |

Distribution — ఆవృత్తి, వంటన్ (పంపిణీ)
Family — పరివార్ (కుటుంబం)
Industrialization — ఉద్యోగీకరణ్, ఔద్యోగీకరణ్ (పారిశ్రామీకరణ)

*6. Medical Sciences*

Malaria — ధర్మరాజికా (చలిజ్వరం, మలేరియా)
Nerve — తంత్రికా (నాడి, నరం)
Period — కాల్ (ఆవృత్తి, కాలం)
Pressure — దాబ్ (పీడనం, ఒత్తిడి)
Preparation — విరచనా (తయారీ)
Pulse Volume — నాడీ ఆయతన్

*7. Sciences*

Expansion Valve — ప్రసార్ వాల్వ్
Over Voltage — అధివోల్టతా

*8. Agriculture*

Breed — నస్ల్
Breaking — కణన్, కనీ పక్నా
Climate — జలవాయు (వాతావరణం)
Drift stand — అపోఢ్ బాలూ
Moment — అఘూర్ణ
Monetary policy — ముద్రానీతి (ద్రవ్యవిధానం)
Perfect Market — పూర్ణ బాజార్
Record — అభిలేఖ

పై ఉదాహరణలనుబట్టి ప్రభుత్వంవారు చేయించిన అనువాదాలు పూర్తిగా నిరసించవలసిన పనిలేదు. బృహత్తరమైన కార్యక్రమం చేపట్టినప్పుడు కొన్ని

లోపాలు రావడం సహజమే. వాటిలో సుతరామూ రాజీపడదగనివీ ఉంటాయి. కాబట్టి ప్రభుత్వంవారి పట్టికల్లో పనికివచ్చేవీ అవసరమైనవీ పదాలు ఆయా భాషలవారు స్వీకరించవచ్చు. అయితే ఈ పదజాలమంతటినీ యథాతథంగా స్వీకరించి తీరాలనిగాని, 70–80 శాతం వాడినట్టు చూపించాలనిగాని నిర్బంధం ఉండగూడదు. 'మావి ఇన్ని పదాలు వాడితే ఇంత డబ్బు ఇస్తాం' అంటూ ఆశ పెట్టడం కూడా తప్పే. మొదటికే ముప్పు వస్తుంది. వారు వాడినవి చాలా వరకూ సంస్కృత రూపాలే అయినా దేశమంతటా ఆ రూపాలు ఆ రీతిగానే ఆ అర్థాల్లోనే వాడుకలో ఉన్నాయని భ్రమపడగూడదు. ఈ పరిస్థితిలో ఆయా రాష్ట్రాలవారికి మరొక సంస్కృత పదంగాని, స్వభాషా పదంగాని వాడుకోడానికి స్వాతంత్ర్యం లేకుండా చెయ్యగూడదు. అలా చేస్తే భాషలో స్ఫూర్తి దెబ్బ తింటుంది. ఏకరూపతాసాధనమే పరమప్రయోజనం కాగూడదు. భాష ప్రజల కోసం. అది వారికి తోడ్పడేటట్టు ఉండాలిగాని గందరగోళం చెయ్యగూడదు. భిన్నత్వంలో ఏకత్వం సాధించాలి. కాని ఏకత్వ సాధనకోసం విలక్షణతలను దిమ్మెస చెయ్యగూడదు.

ఈనాడు దేశంలో ప్రాంతీయ భాషలను అభివృద్ధి చెయ్యడానికి (తెలుగు అకాడమి వంటి) ఒక్కొక్క భాషాసంస్థ చొప్పున ఏర్పడ్డాయి. ఆ సంస్థలకు ఈనాడు గురుతరమైన బాధ్యత ఉంది. సంస్కృతంలోనూ ఇతర భారతీయభాషల్లోనూ ఇంతవరకూ వచ్చిన శాస్త్రగ్రంథాలన్నీ పరిశీలించి పారిభాషికాలు కొన్ని ఏరాలి. పదపట్టికలు తయారు చెయ్యాలి. వాటిలో ఉపయోగపడినన్ని పదాలు వాడుకోవచ్చు. అత్యవసరమైనప్పుడు కొన్ని కల్పించుకోవచ్చు. అంతర్జాతీయ పదాలు స్వీకరించవచ్చు. ఈలోగా వివిధ శాస్త్ర గ్రంథరచయితలు చక్కటి పదాలు కనక సూచిస్తే వాటినీ స్వీకరించవచ్చు. పారిభాషిక పదజాలం కూడా భాషలో అంతర్భాగమే కాబట్టి ఈ ప్రక్రియ ప్రతి భాషకూ ఆ భాషకు సహజమైన పద్ధతిలోనే కొనసాగడం అవసరం.

ఈ సందర్భంలో, కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ వారు చేయవలసినపని కొంత ఉంది. ఏమిటంటే, ఇంతవరకూ తాము సూచించిన పదజాలంలో ఆయా భాషాసమాజాలకు అభ్యంతరకరంగా ఉన్నవీ అనిష్టార్థ స్ఫూర్తి కలిగించేవీ ఏమిటో వివరంగా తెలుసుకోవాలి. ఆ పదాలకు ప్రత్యామ్నాయంగా ఆయా రాష్ట్రాల్లో వాడుకలో ఉన్న పదాలు గ్రహించి వాటినికూడా,

మొదట తాము తీసుకొన్నవాటికి చేర్చుకోవాలి. అలా చేర్చుకొనేటప్పుడు ఆయా భాషల దేశ్యపదాలకుకూడా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలి. హిందీ భాషాపదాలపట్ల వైమనస్యం కలగకుండా, ఇతర భాషలను కించపరచకుండా ఉండాలంటే ఈ పని ప్రథమ కర్తవ్యం. అలాగే తాము రూపొందించిన పదాలలో తగిన సవరణలు చేస్తూ ఇతరుల అభిప్రాయాలు తెలుసుకొంటూ ఉండాలి. ఈ పదజాలం మొదట రూపొందించినవారు హిందీయేతరప్రాంతాలవారిని కూడా దృష్టిలో పెట్టుకొని చెయ్యలేదు కాబట్టి పదజాలాన్ని పునఃపరిశీలించే కృషి వెంటనే చేపట్టి ఆ పనిలో అన్ని ప్రాంతాలవారికీ సమాన ప్రాతినిధ్యం కలిగించాలి. ఇదీ ఆరోగ్యకరమైన పద్ధతి; పదిమంది హర్షించే పద్ధతి. లేనినాడు ఎవరికివారే యమునాతీరే !

## 9. ముగింపు

ఈ వ్యాసంలో పారిభాషికపద నిర్వచనం లగాయతు ఆనుషంగికమైన ఇతర విషయాల వరకూ, ఉన్న పరిమితిని దృష్టిలో పెట్టుకొని, సాధ్యమైనంత వరకూ చర్చించడం జరిగింది. కొన్ని విషయాలు కేవలం ప్రస్తావించడం మట్టుకే జరిగింది. కొన్ని విషయాలు అవసరమైనంతమట్టుకే చెప్పి, తరవాత తుంచివేసి మరొక విషయంలోకి ప్రవేశించడం జరిగింది. ఏమైనా ఇది సంక్షిప్తంగా చెప్ప డానికి చేసిన ప్రయత్నమే.

ఈనాడు దేశంలో ఆయా విద్యావిషయాలు ప్రాంతీయభాషల్లో బోధించ వలసిన అవసరం ఏర్పడినందువల్ల పారిభాషికపదాలగురించి చాలామందికి భయం పట్టుకుంది. నిజమే. ప్రాథమికదశలో ఇలాటి భయాలూ ఆందోళనలూ రావడం సహజమే. ఉన్న సమస్యలను ప్రశాంతంగా పరిశీలించి తగిన పరిష్కారమార్గాలు చూసుకొంటే ఏ సమస్యా మనల్ని భయపెట్టదు. భాషాభిమానం, శాస్త్రాభిమానం, వాటిలో తగినంత చొరవా ఉన్న వ్యక్తులు కృషిచేస్తే తెలుగులో చక్కని పారి భాషికాలు రూపొందించుకోవచ్చు. అలాగే ఆయా రాష్ట్రాల్లో ఉన్న భాషాసంస్థలూ ప్రభుత్వయంత్రాంగమూ సమన్వయ పద్ధతిలో సామరస్య పూర్వకంగా కృషి చేయడం అవసరం. జాతీయభాషల్లో ఒకటి గొప్పదీ ఒకటి తక్కువదీ అన్న దురభిప్రాయాలకు తావు ఉండగూడదు. దేని నైజం దానిది; దేని ప్రత్యేకత

వానివి. వాటిమీద దెబ్బతియ్యకుండా సమన్వయసాధనకు ప్రయత్నిస్తే జాతీయ స్థాయిలో సర్వజనామోదయోగ్యమైన పరిభాష రూపొందించుకోవచ్చు.

(గోలి ఈశ్వరయ్యగారికి వ్యాపారసంస్థ రజతోత్సవ వ్యాససంపుటి 'శారదామంజీరము', 1971)

## అనుబంధం

## పరిశీలించిన రచనలు


1. కృష్ణమూర్తి, భద్రిరాజు, మాండలిక వృత్తిపదకోశం, సంపుటం 1 (వ్యవసాయపదాలు), ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి, హైదరాబాదు 1962
2. .... .... ...., మాండలిక వృత్తిపదకోశం, సంపుటం 2 (చేనేత పదాలు)ఆం.ప్ర. సా. అకాడమి, 1971.
3. .... .... ...., ఆధునిక ప్రమాణభాష : పాఠ్యగ్రంథ రచన (అముద్రిత వ్యాసం) 1965
4. ... ... ... A Note (Appendix II of the Gwynn Committee's Report) 1967
5. ... ... ..., A Note (Appendix III b of the Gwynn Committee's Report 1967
6. .... .... ...., పదం- పదాంశం (వ్యాసం), భారతి

7. రాధాకృష్ణ, బూదరాజు, మాండలిక వృత్తిపదకోశం, సంపుటం 4 (వాస్తుపదజాలం), ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి, హైదరాబాదు 1968

8. .... .... ...., సాంకేతిక పదాల ప్రమాణీకరణం (అముద్రిత వ్యాసం) 1969

9. వేంకటాచార్యులు, ఎన్.సి.ఎస్, అమరవాణి, శాస్త్రరత్నమాల, ఏలూరు 1968

10. శాస్త్రి, ఆర్.ఎల్.ఎన్, ఇంటర్మీడియట్ సామాన్య జీవశాస్త్రము (ప్రథమ భాగము), తెలుగు అకాడమి, హైదరాబాదు 1969

11. Barber, C. L., The Story of Language, The English Language Book Society & Pan Books London 1965

12. Berezin, F.M., Lectures on Linguistics, High School Publishing House, Moscow 1969

13. Catford, J.C., A Linguistic Theory of Translation, Oxford University Press, London 1967

14. Gwynn, J.P L., Report of the (Gwynn) Committee for setting up an institute for the development of the Telugu Language, Hyderabad 1967

15. Halliday, M.A.K., Mc Intosh & Strevens, The Linguistic Sciences and Language Teaching, Longmans 1964

16. Katre, S M., Lexicography, Annamalai University, Annamalainagar 1965

17. Raghuvira, The Consolidated Great English-Indian Dictionary of Techni-

cal Terms, The International Academy of Indian Culture, Nagpur 1950

18. Somayaji, G. J., Technical Terminology in the present context, Commission for Scientific and Technical Terminology, Ministry of Education and Youth Services, Govt. of India 1970

19. C.S.T.T., Glossaries

# 7

# బోధనభాషగా తెలుగు వాడకంలో సాధకబాధకాలు

మనిషి జంతువులలో ఒకరకం. ఈ రకం తక్కిన రకాలను మించిందని చెప్పడానికి ఒక్కటే కారణం– మనిషికి 'ఆలోచన' ఉంది. తక్కినవాటికి 'అలాంటిది' లేదు. ఆ ఆలోచనకు వాహకం భాష. భాషలేకపోతే ఆ మాదిరి ఆలోచనకు అవకాశం లేదు మరి.

అంటే మన ఆలోచన ఎంత ఎత్తుకు పెరిగితే మన భాషకూడా అంత ఎత్తుకు పెరుగుతుంది. అలాగే భాషతోపాటు ఆలోచనా పెరుగుతుంది. ఈ తెలివి కొంత కొరవడ్డంవల్ల ఇంతవరకు మనం గిడసబారిపోయాం. గిరిగీసి కూర్చుని గింజులాడుకున్నాం. అప్పుడప్పుడు దుమ్ముదులుపుకొని లేస్తున్నాం.

అసలొక రహస్యముంది. ఏ గూటిచిలక ఆ పలుకే పలుకుతుందట. ఒక వేళ గూడు మారినా పుట్టిన గూటిపలుకు చచ్చేదాకా పోదట. అది పట్టుబడ్డంత గట్టిగా మరొకటి పట్టుబడదట. అందుకే మనోవిజ్ఞానశాస్త్రవేత్తలు మాతృభాష కంత ప్రాముఖ్యం ఇచ్చింది.

ఈ విషయం ప్రపంచంలో చాలామంది గుర్తించారు. వాళ్ళవాళ్ళ మాతృ భాషలలో నాగరికమనిపించుకొన్న వాటిని విద్యాబోధనకు కూడా సాధనాలుగా వాడుకున్నారు. వాటిలో మౌలిక కృషి చేశారు.

ఈ సంగతి మనకు తెలియక్కాదు. అనాదిగా వచ్చిన మన సంప్రదాయం కూడా అదేనట. అయితే తెల్లదొరల ఏలుబడి వచ్చాక ఇంగ్లిషు పెత్తనం వచ్చింది, నిజాం పాషాల కాలంలో ఉర్దూకి వచ్చినట్టు. దానివల్ల మేలూ కలిగింది, కీడూ కలిగింది. విశాల ప్రపంచంలోకి కొత్త గవాక్షాలు తెరుచుకోడం మనకు కలిగిన

మేలు; వాటిలోంచి వచ్చిన గాలి తాకిడికి మన సింహద్వారం తలుపులే టపటపా కొట్టుకోడం, ఓటలుదియ్యడం దానివల్ల కలిగిన కీడు. అయినా ఎంత బాహాటంగా తెరుచుకున్నా గవాక్షాలు గవాక్షాలే; తలవాకిలి తలవాకిలే:

నిజం చెప్పాలంటే మనదేశంలో, జీవద్భాషల్లో ఇన్ని వేల సంవత్సరాల చరిత్ర లోనూ ఎక్కువగా పెరిగింది సాహిత్యమే కాని శాస్త్రం కాదు. కాని సంస్కృతం సంగతి వేరు. అది ఎవ్వరికీ 'మాతృభాష' కాదు. కాని అందరికీ ఉపకరించినదీ ప్రతిష్ఠ తెచ్చిన భాషా అది. అందుకే అన్ని ప్రాంతాల పండితులూ దాన్ని గౌర వించారు. దేవభాష అని పేరు పెట్టుకున్నారు. ఆ రోజుల్లో పాండిత్యమంటే సంస్కృత పాండిత్యం కిందే లెక్క. అందువల్ల సాహిత్యాభిమానులతోబాటు శాస్త్రాభిమానులుకూడా దాన్ని పెంచి పెద్దచేశారు. మౌలికమయిన రచనలూ చేశారు. పైటికి అన్ని ప్రాంతాలవాళ్ళూ వాళ్ళవాళ్ళ భాషల లిపుల్లో నకళ్ళు రాసు కొని అనువాదాలూ అనుసరణలూ చేసుకొని-వ్యాఖ్యానాలు కూడా రాసుకొని-తృప్తిపడ్డారు.

ఇంగ్లీషువాళ్ళ ధర్మమా అని కొత్త తలుపులు తెరుచుకున్నాయి. ఆధునిక విజ్ఞానరేఖలు బాగా పరుచుకున్నాయి. అయితే ఒక చిక్కుంది. ఆ ఆధునిక విజ్ఞానాన్ని పుక్కిటబట్టడానికి ఇంగ్లీషే మనకు దిక్కయింది. అందువల్ల ఆ విజ్ఞానం, ఆశించినంతమందికి అందుబాటులో లేకుండా పోయింది. లేకపోగా సమాజంలో అప్పటివరకు ఉన్న వర్గాలకు తోడు, మరో కొత్తవర్గం తయార యింది- ఇంగ్లీషు ముక్కలు నేర్చుకున్నవాళ్ళ వర్గం. అది విస్తరించినకొద్దీ అన్నింటిలోనూ వాళ్ళ పెత్తనమే పెరుగుతూ వచ్చింది—వస్తోంది.

ఈ వర్గబలాన్ని అదుపులో ఉంచగల ఏకైక సాధనం దేశీయభాష. దాన్ని గుర్తించినవాళ్ళు ప్రాంతీయభాషల్లోనే విద్యాబోధన జరగాలన్నారు. క్రమ క్రమంగా కొంత సాధిస్తూ వచ్చారు. ఈనాటికది డిగ్రీస్థాయివరకు రావడమే కాదు, పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయికికూడా పోబోతున్నది(కొన్ని శాస్త్ర విష యాల్లో 1982 నాటికి పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో పఠనీయ గ్రంథాలు వెలు వడ్డాయికూడా). "అఁహఁ! అదేం కుదరదు" అంటున్నారు కొందరు. "బొడ్డూడని మా బుజ్జిగాడికి లోయర్ కేజీనుంచే ఇంగ్లీషు పునాది పడకపోతే కొంప మునిగి పోతుంది స్మీ!'' అంటూ కాన్వెంటుబళ్ళ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు, వేలల్లో దక్షిణలు సమర్పించుకుంటున్నారు-మమ్మీలూ డాడీలూ!

ఇదండీ ఈనాటి పరిస్థితి! అంతా గందరగోళంగా ఉంది. దాకి తెన్ను తోచడం లేదు చాలామందికి. అందువల్ల అసలు, తెలుగే బోధనభాషగా ఉంచా లన్నదాంట్లో తత్వం ఏమిటో తెలుసుకోడం అవసరమవుతుంది. దాంట్లో సాధకబాధకాలు గ్రహించవలసి వస్తుంది.

భాష నేర్చుకోడం రెండు రకాలు-భాషకోసం భాష, విషయంకోసం భాష. భాషాస్వరూపస్వభావాల్ని సమగ్రంగా అధ్యయనం చేయడం మొదటి రకం లోది. శాస్త్రి సాంకేతిక విషయాల్నీ సాహిత్య సాంస్కృతిక విషయాలవంటి వాటినీ అధ్యయనం చెయ్యడం రెండో రకంలోది. అలాగే భాషకూడా రెండు రకాలుగా తయారయింది: ప్రాచీన(కావ్య) భాష, ఆధునిక(ప్రమాణ)భాష. సాహిత్యంలో తరతరాల వారసత్వాన్ని అవగాహన చేసుకొని ఆనందించడానికి ప్రాచీన భాష ఉపయోగిస్తుంది. కాని దాన్ని గురించి చెప్పడానికి రాయడానికి ఆధునిక భాషే కావాలి. ఎందువల్లంటే, ఏ కాలంలో జీవించేవాడి ఆలోచనా అలవాట్లూ ఆ కాలంనాటి భాషలోనే సాగుతుంటాయి కనక. అది సహజం. దానికి భిన్నమయింది అసహజం-కృత్రిమం-ఇప్పటికీ మనవాళ్ళు కొందరు రాయడానికి వెరవని 'గ్రాంథికం' లాగ! ఆ మాటకొస్తే. ఈనాటి గ్రాంథికం (గ్రంథాల్లోకి ఎక్కేదీ ఎక్కవలసిందీ) మన వ్యావహారిక భాషే కాని. వాళ్ళ కావ్యభాష కాదు. అరవై డెబ్భై ఏళ్ళనుంచి నిన్నమొన్నటివరకు పండితుల సిగపట్లతో నలిగి నవ్వులపాలవడంవల్ల ఇప్పటికయినా ఆ మాటలకు మోక్షం ప్రసాదించి 'ప్రాచీనం' 'ఆధునికం' అనుకోడం మేలు. ప్రాచీనభాష ప్రయోజనం పరిమితం. ఆధునిక భాష ప్రయోజనం అపరిమితం. అందుకే అంటాం— వివిధ శాస్త్రవిషయాల్ని వివరించడానికే కాదు, పూర్వభాషాసాహిత్యాల్ని గురించి వివరించడానికి కూడా ఆధునిక భాషే వాడాలని! ఆ ఆశయం ఇప్పటికి కొంతవరకు (కాదు-పూర్తిగానే) ఫలించింది.

'విషయంకోసం భాష' అన్నప్పుడు వివరణాత్మక వాక్యాలుగా వాడేది ఎలాగా ఆధునిక భాషే కనక, దానికోసం ప్రత్యేకంగా సాధన చెయ్యవలసిన బాధ ఏమీ ఉండదు- పరాయిభాషలోలాగ. ఎటొచ్చీ, 'పరిభాష' (టెక్నికల్ టెర్మినాలజీ) విషయంలో జాగ్రత్తపడాలి. మొదట్లో కొంచెం సాధనచేసి, కొన్ని పద్ధతులు ఏర్పరుచుకొంటే తరవాత చకచకా సాగిపోతుంది.

ప్రతి భాషలోనూ అన్ని పదాలూ రూపొందినట్లే పారిభాషికపదాలుకూడా రూపొందుతాయి. పారిభాషిక పదమంటే ఏమిటి? నిర్వచించదగిన ఒకానొక నిర్దిష్ట భావనకు సంకేతమయిన మాట. అది వ్యస్తపదం కావచ్చు, సమస్తపదం కావచ్చు. ఏ భాష సమాజంలో నయినా ఒక భావం ఏర్పడినప్పుడు దానికి సంకేతమయిన మాటకూడా ఏర్పడుతుంది(అది ఎలాంటిదయినా సరే-తప్పో ఒప్పో!). ఆ భావం ఎరువు తెచ్చుకున్నదయితే, దానికి సరిగా కాకపోయినా కొంచెం ఇంచుమించుగా ఉండే పదమన్నా వాడతాం; లేకపోతే ఆ భావం ఏ భాషలోంచి తెచ్చుకున్నామో ఆ భాషాపదమయినా వాడతాం; లేదా దాన్ని అనువాదం చేసుకుంటాం. సరైన సంకేతపదం లేనంత మాత్రాన భావం ఎన్నడూ అడ్డదు, ఆగదు. దానికి కావలసిన పదాన్ని అది ఎప్పుడో ఒకప్పుడు వెతుక్కుంటుంది. ఏ భాషలో నయినా పారిభాషిక పదాలు సిద్ధంగా లేనప్పుడు (1) ఉన్న వాటికే కొత్త అర్థాలు చెప్పుకొంటాం(సంకోచ వ్యాకోచాలతో సహా), (2) పరాయి భాషలోంచే ఎరువు తెచ్చుకొంటాం (యథాతథంగానో, కొద్దిపాటి మార్పులతోనో-అదే అర్థంలోనో మరొక అర్థంలోనో-సంపూర్ణంగానో పాక్షికంగానో), (3)పరాయి భాషలోంచి అనువాదం చేసుకొంటాం (పూర్తిగా గాని అసంపూర్తిగా గాని). ఇవేవీ కాకపోతే (4) మనభాషలోనే కొత్తమాటలు కల్పించుకొంటాం. వీటికి ఉదాహరణలు కావలసినన్ని ఉన్నాయి.* ప్రతి భాషలోనూ ఉన్నాయి.

పై చర్చ సారాంశమేమిటీ, కింది స్థాయి మొదలు ఉన్నతస్థాయి వరకు కూడా విద్యాబోధన వాహకంగా తెలుగు భాషను తప్పకుండా వాడాలి. ఇది అన్ని విధాలా సమర్థమయినది. ఇటీవల (1975 ఏప్రిల్) ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలు రాసిన విద్యార్థుల సమాధాన పత్రాలూ క్లాసుల్లో వాళ్ళకు కలిగిన అవగాహనా అందుకు ప్రత్యక్ష నిదర్శనాలు. అంతే కాదు, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కూడా తెలుగే బోధనభాషగా ఉండాలని వాళ్ళు పట్టుబడుతున్నారు. భావాన్ని గ్రహించడానికీ వ్యక్తం చెయ్యడానికీ తెలుగులో సౌలభ్యం ఉండటమే దానికి కారణం.

అయితే, అధ్యాపకవర్గం సామర్థ్యానికి ఇదొక పరీక్షాసమయమయింది.

---

* వివరాలు కావలసినవాళ్ళు 'పారిభాషిక పదాలు : కల్పనాశిల్పరీతులు' అన్న వ్యాసం చూడవచ్చు.

ఎందువల్లంటే, వాళ్ళంతా మొదటినుంచి ఇంగ్లీషులో చదువుకున్నారు. ఇంగ్లీషులో పాఠాలు చెప్పడానికి అలవాటుపడ్డారు. ఇంగ్లీషుమీడియం నుంచి తెలుగుమీడియం లోకి మారడమంటే భయమేసింది- కుర్రాళ్ళముందు అభాసవుతామేమోనని! క్లాసులో ధారాళంగా మాట్లాడ్డం అలవాటులేక కొంతా, కొత్త పారిభాషిక పదాలు చప్పున స్ఫురించక కొంతా! ఆ బెదురు ఇప్పుడు లేదనే చెప్పాలి. తెలుగు బాగా నలుగుతోంది. పారిభాషిక పదాలు మెల్లమెల్లగా స్ఫురిస్తున్నాయి. అంతగా చటుక్కున తట్టకపోతే ఇంగ్లీషు మాటలు ఉండనే ఉన్నాయి. అవసరమయి నప్పుడు వాటిని వాడుకోడం తప్పేంలేదు. తెలుగు అన్నాం కదా అని, అన్నిటికీ తెలుగే ఉండాలనుకోడం చాదస్తమే అవుతుంది. ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణ మూర్తిగారు చెప్పినట్టు, మొదటిదశలో 'యాక్టివ్ బైలింగ్విజం' అధ్యాపకులకు బాగానే తోడ్పడుతుంది. కొన్ని సంవత్సరాలు గడిచేసరికి తెలుక్కే ప్రిఫరెన్స్ ఇస్తారు.

అయితే, ఒకవేపు తెలుగులో విద్యాబోధన జరుగుతూ ఉన్నప్పటికీ, ఆ విధానాన్ని వ్యతిరేకించేవాళ్ళు ఇప్పటికీ ఉన్నారు. అలా వ్యతిరేకించడానికి వాళ్ళు చెప్పే కారణాలు ఇవి: (1) మోడర్న్ నాలెడ్జిని ఎక్స్‌ప్రెస్ చెయ్యడానికి తెలుక్కి తాహతేదండీ?- మనం కృషిచేస్తే తప్పకుండా వస్తుంది. (2) టెర్మినాలజీ, టెక్స్టు బుక్కులూ?- అవీ వస్తాయి, దానికోసం కొందరయినా గట్టిగా నడుంకడితే వ్యక్తులూ సంస్థలూ సిద్ధంగా ఉన్నప్పుడు అదొక సమస్యగా ఉండిపోదు. (3) పై చదువులకీ రిసెర్చికీ ఇబ్బంది కలగదూ?- వాటికి వెళ్ళేవాళ్ళు ఏ కొద్దిమందో ఉంటారు కనక, వాళ్ళకు ఇంగ్లీషు, జర్మన్ వగైరా భాషల్లో స్పెషల్ కోర్సులు నడపొచ్చు. ఇతర దేశాల్లో ఇలాగే చేస్తున్నారట. (4) అవన్నీ సరేనండీ, ఏ ఉత్తరాదికో ఉద్యోగానికి వెడితే తెలుగులో చదివినవాళ్ళ గతి ఏంకాను?- ఏ ప్రాంతానికి వెడితే ఆ ప్రాంతంభాష నేర్చుకోవాలి. ఉత్తరాదిని చాలా రాష్ట్రాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో సైతం వాళ్ళ వాళ్ళ ప్రాంతీయ భాషల్ని ప్రవేశపెట్టేసి చాలా కాలమయింది. ఆ భాష రాకుండా కేవలం ఇంగ్లీషు వచ్చిన వాళ్ళకోసం అక్కడా ఉద్యోగాలు కాసుక్కూర్చోలేదు. పై చదువులకు అవకాశాలూ తక్కువే. పోనీ, దక్షిణాదికి దాటిద్దామంటే తెలుగువాడికి మొదటే చుక్కెదురు. పై పెచ్చు, ఆ అరవ్వాళ్ళూ ఆ మలయాళీలూ మన రాష్ట్రంలోకే చొచ్చుకొస్తూంటే, మన మొహం చూసేవాళ్ళెవరక్కడ? మన ప్రభుత్వంలో పెద్ద పెద్ద ఐ.ఏ.ఎస్. ఆఫీ

సర్లూ గట్రా 'వాళ్ళవాళ్ళే' కనక, మాటసాయమో, చేతసాయమో వాళ్ళకుం టుంది. మనకేదీ? (5) అటువంటప్పుడు ఇంగ్లీషే ఉంచేస్తే పోలా ?

ఇది రాజకీయంలో ముడిపడ్డ విషయం. దానికి బీజం మన రాజ్యాంగ చట్టంలోనే పడింది. స్వతంత్ర భారతదేశంలో అధికార భాషగా ఇంగ్లీషే కొన సాగాలా, హిందీ ఉండాలా అన్న ప్రశ్న వచ్చినప్పుడు, ఓటింగులో- అధ్యక్షుల వారి (డా॥ రాజేంద్రప్రసాద్ గారి) ఒక్క ఓటు మెజారిటీతో నయినా- హిందీనే నెగ్గించారు కదా ! క్రమక్రమంగా ఇంగ్లీషు స్థానాన్ని హిందీకి ఇస్తామన్నారు నెహ్రూగారు. దక్షిణాది రాష్ట్రాలవాళ్ళు దాన్ని వ్యతిరేకించారు. అప్పటికేదో సర్ది చెప్పారు. తరవాత కొంత కాలానికి హిందీ వాళ్ల వ్యూహం మారింది. దేశంలో హిందీ స్థానం సుస్థిరం కావాలంటే ఇంగ్లీషు పునాదులు కదల్చాలన్నది ఆ వ్యూహం. దానికి సాధనం ప్రాంతీయ భాషల్ని అభివృద్ధి చేస్తామనే పథకం. అప్పుడు దక్షిణాది రాష్ట్రాలతోసహా అనేకం తమ తమ ప్రాంతీయ భాషల్లో విద్యా బోధనకు పథకాలు వేశాయి; కమిటీల్ని నియమించాయి. ఎలా చెయ్యాలో చెప్ప మన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో గ్విన్ కమిటీ సిఫార్సు ప్రకారం 1968 లో తెలుగు అకాడమి' అవతరించింది.

'తెలుగు అకాడమి' ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలవరకు గ్రంథాలు రాయడానికి అవసరమయిన పరిభాష సేకరించింది. 'పాఠ్య, పఠనీయ' గ్రంథాలు మొ.వి చాలా రాయించి ప్రచురించింది; ఇంకా ప్రచురిస్తూనే ఉంటుంది.

మన భాష చిరకాలం వర్ధిల్లేది- వర్ధిల్లవలసినది. ఇందుకు చెయ్యవలసిన కృషి ఇంకా ఎంతో ఉంది. ప్రతి శాస్త్రవిషయానికీ మనం ప్రామాణిక మయిన పరిభాషను రూపొందించుకోవాలి. పారిభాషికపద నిఘంటువులు తయారుచేసు కోవాలి. ఇంగ్లీషు భాషలో ఉన్నవాటిని తెలుగులోకి అనువదించుకోవాలి. దేశ విదేశాల ప్రధానభాషలు కొన్నిటితో తెలుగును జోడించి ద్విభాషానిఘంటువులు రూపొందించుకోవాలి. అనుబంధ పఠనీయ గ్రంథాలూ సంప్రదింపు గ్రంథాలూ జనరంజక గ్రంథాలూ రాయించి ప్రచురించాలి. తెలుగువాడు ఏ విషయా న్నయినా తన భాషలో చదువుకోడానికీ చదువుకొన్నది చెప్పడానికీ రాయడానికీ అవసరమయిన సాధనసామగ్రి సంపూర్ణంగా సమకూరేటట్టు చెయ్యాలి. ఈ కృషి జరిగినమేరకు బోధనభాషగా తెలుగు భాషకు సాఫల్యం సిద్ధిస్తుంది.

# 8

# అధికార భాష

మానవ సంస్కృతి మనుగడలో భాష గొప్ప పాత్ర నిర్వహిస్తుంది. దాన్ని మనం అనేక ప్రయోజనాలకు వినియోగిస్తాం. ఆ ప్రయోజనాన్ని బట్టి వాటి రంగాన్ని బట్టి—భాషకు రకరకాల విశేషణాలు చేర్చుకొని రకరకాల పేర్లు పెట్టుకుంటాం. సాహిత్య భాష. విజ్ఞానశాస్త్ర భాష, కంప్యూటర్ భాష, అధికార భాష మొ.వి ఇలా వచ్చిన పేర్లే. భాష ఒక్కటే అయినా ఇలాటివన్నీ అందులో అంతర్భాగాలుగా ఉంటాయి. అయినప్పుడు 'ఇలా వేరువేరు పేర్లు ఎందుకు?' అన్న ప్రశ్న రావచ్చు. వాటికి ప్రయోజనం ఉంది.

భాష ఒక్కటే- కర్తకర్మక్రియల కూర్పుతో వాక్యనిర్మాణంవంటి వ్యాకరణ సంబంధమయిన వ్యవస్థ ఒక్కటే. కాని ప్రయోజనపరంగా ఏ రంగంలో భాషను వినియోగిస్తే ఆ రంగానికి సంబంధించిన విశిష్టతాముద్ర ఆ రంగంలో పనిచేసేవాళ్ళమీద పడుతుంది. ఈ విశిష్టత రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి భావపరమయినది: రెండు, వ్యక్తీకరణపరమయినది.

సామాన్య జనజీవనానికి సంబంధించిన భావాలు సరళమయినవీ, స్థూలమయినవీ. కాబట్టి వాటి వ్యక్తీకరణ సరళంగానూ స్థూలంగానూ ఉంటూంటుంది. ఒకే భావాన్ని రకరకాల పర్యాయపదాలతో, రకరకాల వాక్యవిన్యాసాలతో వ్యక్తం చెయ్యవచ్చు. ఇందులో వెసులుబాటు ఎక్కువా సునిశితత్వం తక్కువా.

కాని ఒక ప్రత్యేక రంగానికి సంబంధించిన 'భాష'లో ఈ విస్తృతి ఉండదు. భావాలు నిర్దిష్టంగా, సునిశితంగా, నిర్వచనీయంగా ఉంటాయి. భావాల వర్గీకరణ నిర్ణీతంగా ఉంటుంది. అందువల్ల వాటి వ్యక్తీకరణకూడా సునిశ్చితంగా ఉంటుంది. ఆ ప్రత్యేక రంగాల్లో కూడా, సాధారణంగా దేని పరిధి దానికి ఉంటుంది(సంబంధిత రంగాల పరిధుల్లో సమానత కొంత ఉండదని కాదు.

అయినప్పటికీ ఒక్కొక్క పరిధిలో ఉన్న వెసులుబాటు మరో పరిధిలో ఉండదు. మాటవరసకు, సాహిత్య విషయాన్ని గురించి చెప్పేటప్పుడు రకరకాల శబ్దాలంకారాలూ అర్థాలంకారాలూ చమత్కారాలూ మొదలయినవి శైలిలో వచ్చే అవకాశముంది. ఇక్కడ భావానికే కాక, భావవ్యక్తీకరణ రీతికికూడా ప్రాముఖ్యం ఉంటుంది. కాని, విజ్ఞానశాస్త్ర విషయం చెప్పే తీరు ఇలా ఉండదు. విషయాన్ని విస్పష్టంగా, సునిశ్చితంగా చెప్పాలి; నిర్దిష్టపరిభాషనే ప్రయోగించాలి. క్లిష్టమయిన సంగతిని కూడా కచ్చితమయిన పద్ధతిలో చెప్పాలి. వాక్యవిన్యాసంలోనూ పద ప్రయోగంలోనూ సంపూర్ణ సార్థకతను సాధించాలి. సాహిత్యభాషకు అందాలు తొడిగే అలంకారాలు శాస్త్రభాషకు సంకెళ్ళవుతాయి; ఊపిరి ఆడకుండా చేస్తాయి.

ఇక పదాల విషయం- ఒక ప్రత్యేకరంగానికి సంబంధించిన విషయం చెప్పేటప్పుడు ప్రత్యేక పదజాలం ప్రయోగించడం సహజం. ఈ ప్రత్యేక పద జాలాన్నే 'పరిభాష' అంటాం. భాషలో పరిభాష అంతర్భాగం. ఏ రంగానికి కావలసిన పరిభాష ఆ రంగంలో ఏర్పడుతుంది. అది ఆ రంగంలోని వర్గీకృత భావనలకు వాహకం.

ప్రభుత్వ కార్యకలాపాల్లో - అధికార నిర్వహణలో - వాడుకలో ఉన్నది 'అధికారభాష'. దీన్ని 'కార్యాలయభాష' అని కూడా అనవచ్చు. పరాధీనపు బతుకులేని దేశంలో-లేదా రాష్ట్రంలో-ప్రజలకు వాడుకలో ఉన్న భాషే అధికార సంబంధమయిన పనులకు కూడా వినియోగమవుతుంది. మనదేశంలో ముస్లిములు పాలించిన ఆయా ప్రాంతాల్లో ఆయా కాలాల్లో పార్సీకాని ఉర్దూకాని అధికార భాషగా వాడుకలో ఉండేది. అలాగే బ్రిటిష్‌వాళ్ళు పాలించిన ప్రాంతాల్లో, కాలాల్లో, ఇంగ్లీషు అధికారభాషగా ఉండేది పరాధీనపు బతుకుల్లో, మనం కోరుకున్నది వాడుకునే స్వేచ్ఛ ఉండదుకదా? కాని, చిత్రమేమిటంటే, దేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యం వచ్చినా కూడా మానసికంగా పరాధీనపు బతుకే బతుకుతున్నాం. అది రకరకాలుగాఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కంటె రాకముందే మనదేశంలో స్వతంత్రాలోచనాపరులు ఎక్కువగా ఉండేవారు. (There were more free-thinking men in Pre-Independent India) అని ఒకాయన చమత్కరించాడు. నిజమే కదా!

తెలుగుభాషలో కొక గుర్తింపుకోసం తెలుగువారి కొక వ్యక్తిత్వంకోసం

కృషి చెయ్యాలన్న పూనిక 1913లో బాపట్లలో జరిగిన మొట్టమొదటి ఆంధ్ర మహాసభలోనే వెల్లడి అయింది. 1946లో మద్రాసులో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చినప్పుడు, విద్యాబోధన మాతృభాషలో జరపాలని నిర్ణయించి ఆంధ్ర దేశంలో తూర్పు గోదావరి జిల్లాలో తెలుగును, తమిళ ప్రాంతంలో తంజావూరు జిల్లాలో తమిళాన్ని బోధన భాషలుగా ప్రవేశపెట్టింది. కాని ఆ ప్రయత్నం సరిగా సాగినట్టు లేదు. 1953 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కాని తెలుగు అధికార భాషగా ప్రభుత్వంలోకి ప్రవేశించలేకపోయింది. అప్పట్లో శాసనసభ్యులుగా ఉన్న శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. "రాజ్యాంగ నిబంధనలకు అసంగతంగా లేనంతవరకు, ప్రభుత్వ వ్యవహారాలను తెలుగులోనే నిర్వహించాలి,'' అని అన్నారు. అయితే శ్రీ అయ్య దేవర కాళేశ్వరరావుగారు, దానికొక చిన్న సవరణ-"సాధ్యమయినంత త్వరలో" అన్నది-చేర్చారు. 1955 సెప్టెంబరు 29న తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమో దించారు కాని వావిలాల వారు ప్రవేశపెట్టిన బిల్లును మాత్రం నిరాకరించారు.

''సాధ్యమయినంత త్వరలో'' అన్న సవరణతో ముప్పు వచ్చింది. చురుగ్గా జరగవలసింది నత్తనడక నడిచింది. ఒక ఉన్నతాధికారినయితే నియ మించారు కాని ప్రయోజనం లేకపోయింది. మరో ఏడాదిలో విశాలాంధ్ర ఏర్పడ్డ హడావిడిలో తెలుగు మరుగున పడిపోయింది. హైదరాబాదు రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణరావుగారి ప్రభుత్వం చూపించిన శ్రద్ధకూడా ఆ తరవాత హరించి పోయింది. రాష్ట్ర పునర్విభజనకు కీలకమయిన భాషాప్రాతిపదికనే పాలకులు విస్మరించారు.

ఆ పరిస్థితిలో వావిలాలవారే మళ్ళీ రొష్టుపడివలసి వచ్చింది. తెలుగును అధికారభాషగా స్వీకరించాలని, అనధికార బిల్లు రూపంలో నయితేనేం, తీర్మాన రూపంలో నయితేనేం, వావిలాలవారు అదే పనిగా ప్రతిపాదిస్తూవచ్చారు. ఒక మాటూ రెండుమాట్లూ కాదు-సుమారు తొమ్మిదిసార్లు ప్రతిపాదించారు. చివరికి 1964లోతెలుగును అధికార భాషగా ఆమోదించడానికి ప్రతిపాదించే బిల్లును అచ్చువేయించడానికి ప్రభుత్వం అంగీకరించింది. దాన్ని ప్రజాభిప్రాయ సేకరణకు పంపారు. తెలుగు పత్రికల్లో ఒక్క 'ఆంధ్రప్రభ' తప్ప తక్కిన పత్రికలు దాని విషయంలో అంతగా శ్రద్ధ చూపించలేదు.

అధికారభాషా బిల్లు సెలెక్ట్ కమిటీకి వెళ్ళింది. అప్పట్లో ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు; విద్యామంత్రి శ్రీ పి.వి. నరసింహారావుగారు. వీరిద్దరూ, అధికారభాషను గురించి అనధికారబిల్లును స్వీకరించే బదులు అధికార బిల్లును ప్రతిపాదించడానికి నిర్ణయించారు. 1966లో అది శాసనం అయింది.

అధికారభాషా శాసనంలో ఉన్న సూచనలు ఎంతవరకు అమలు జరిగాయో తెలుసుకోడానికి శ్రీ పి.వి. నరసింహారావుగారి అధ్యక్షతన ఒక పరిశీలన సంఘాన్ని నియమించడం జరిగింది. ఆ సంఘం నివేదిక 1970లో ప్రభుత్వానికి అందింది ''శాసనంలో నిబంధింపబడిన మేరకు అధికారభాషగా తెలుగు అమలుకు భాషా కమీషను వెంటనే చేయవలెనని సిఫార్సు చేసింది. ఈ శాసనం ప్రకారం, శాసనం అయిన రోజునుంచి అయిదు సంవత్సరాలకు ఒక భాషా కమీషనును నియమించవలెనని నిర్దేశింపబడింది.''

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారి అధ్యక్షతన 'ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఏర్పడింది. ఆ సంఘ సభ్యులు దఫదఫాలుగా వివిధ జిల్లాల్లో పర్యటించి అధికారభాషగా తెలుగు అమలు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలిస్తూ అవసరమయిన సూచనలు చేస్తూ ప్రోత్సహిస్తూ వచ్చారు. అధికార భాషా వ్యాప్తికి గొప్ప ఉద్యమస్ఫూర్తి నిచ్చిన మహావ్యక్తి గోపాలకృష్ణయ్యగారు.

ఆ తరవాత కొంత కాలానికి శ్రీ వందేమాతరం రామచంద్రరావుగారు వారి తరవాత శ్రీమతి అనసూయాదేవిగారూ అధికార భాషా సంఘం అధ్యక్షులయ్యారు. అనంతరం డా॥ సి. నారాయణరెడ్డిగారు అధ్యక్షులయారు. వారి పదవీకాలంలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ పనులు, తెలుగు అకాడమి ఆధ్వర్యంలో 'తర్జుమాదారుల శిక్షణ' (1982) నిర్వహించడం, సుమారు వెయ్యి పదాలతో 'కార్యాలయపదావళి' అనే జేబుసైజుకోశం తయారుచేయించి ప్రచురించడం, టైపిస్టులకు తెలుగులో శిక్షణ ఇప్పించడం వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు తెలుగు టైప్‌రైటర్లు సరఫరా చేయించడం మొ.వి. ఆ తరవాత వరసగా డా॥ కొత్తపల్లి వీరభద్రరావుగారూ డా॥ ఎన్.వి.ఆర్. కృష్ణమాచార్యగారూ అధ్యక్షులుగా నియుక్తులయ్యారు.

1988లో ప్రభుత్వం కోరికమేరకు తెలుగు అకాడమి రాజధానిలోని ఐదు కేంద్రాల్లో ప్రత్యేక తెలుగు బోధనతరగతులను నిర్వహించింది. వివిధ ప్రభుత్వ

శాఖల కార్యాలయాల్లో పనిచేసే ఆంధ్రేతర ఉద్యోగులకు స్వల్పవ్యవధిలో తెలుగు నేర్పడానికి ఏర్పాటయిన తరగతులివి. మామూలు కార్యాలయ పనివేళల్లో ఒక్కొక్క జట్టుకు రెండేసి నెలల చొప్పున 1990 జనవరి నెలాఖరు వరకు ఈ తరగతులు నడిచాయి. దాదాపు వెయ్యిమంది తెలుగు నేర్చుకున్నారు. నిజానికి తెలుగు అకాడమి, ఆంధ్రేతరుల ఉపయోగార్థం 1969నుంచి ఉచితంగా తెలుగు తరగతులు నిర్వహిస్తూనే ఉంది. ఇది నిరంతర కార్యక్రమం.

అనంతరం ఆధికారభాషాసంఘం అధ్యక్షులుగా నియమితులయిన ప్రొ॥ పి. యశోదారెడ్డిగారు తెలుగును మరింత విస్తృతంగా అమలుచేయించడానికి కృషి చేస్తున్నారు.

అధికారభాషా శాసనం రూపొంది ఇప్పటికి సుమారు పాతిక సంవత్సరాలు అయింది. అంతకుముందే అయ్యదేవరకాళేశ్వరరావు అధ్యక్షతన ఏర్పడిన కమిటీ వారు 'పారిభాషిక పదకోశం' (1963) తయారు చేశారు. దాన్ని ప్రాతిపదికగా చేసుకొని మరికొన్ని ఇతర ఆకరాలనుంచి కూడా పదాలు సేకరించుకొని తెలుగు అకాడమి, సుమారు 27600 పదాలతో 'పరిపాలన న్యాయపదకోశం' (1980) వెలువరించింది. ఇది రెండుసార్లు పునర్ముద్రితమయింది. దీనికి పరివర్ధిత పరిష్కృత ప్రతి కూడా తయారవుతోంది. కార్యాలయ ఉద్యోగులు నిత్యపరిపాటిగా జరిపే ఉత్తరప్రత్యుత్తరాలకూ నోట్ ఫైళ్ళూ కరెంట్ ఫైళ్ళూ ముసాయిదాలూ నివేదికలూ రాయడానికి అత్యవసరమయిన సుమారు వెయ్యిపదాలతో (ఇంగ్లీషు-తెలుగు) చిన్న జేబుసైజుకోశం-'కార్యాలయ పదావళి' వెలువరించడం కూడా జరిగింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ మాన్యువల్‌నూ ఇరవై 'జిల్లా మునసబుకోర్టు తీర్పు'లనూ కూడా అకాడమి అనువదింపజేసింది.

రాష్ట్రప్రభుత్వం 'పారిభాషిక పదకోశము' ప్రచురించడమే కాకుండా ప్రభుత్వశాఖలవారీగా కొన్ని పదపట్టికలను తయారుచేసి ప్రచురించింది. కొన్ని నమూనా లేఖలకు తెలుగు అనువాదాలను, 'కార్యాలయ పదావళి'ని ప్రచురించింది.

ఇవి ఉన్నాయి కదా, తెలుగు అధికారభాషగా అన్ని స్థాయిల్లోనూ పటిష్ఠంగానూ ఎందుకు అమలు జరగడం లేదన్నది ప్రశ్న.

గ్రామస్థాయిలోనూ తాలూకా స్థాయిలోనూ తెలుగు అమలు కావడానికి ఆటంకం కలిగే అవకాశం లేదు. ఉన్నదల్లా జిల్లాస్థాయిలోనూ రాష్ట్రస్థాయి

లోనూ మాత్రమే. తెలుగు అమలు జరగాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ, అధికారభాషాసంఘంవారు తనిఖీలు చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు కని పించకపోవటానికి ప్రధాన కారణం; అమలు పరచవలసినవాళ్ళలో చిత్తశుద్ధి లేకపోవడమే. ఇదీ తెలుగువాళ్ళ దౌర్భాగ్యం. ఇరుగు పొరుగుల్లో ఉన్న తమిళ నాడును గాని, మహారాష్ట్రనుగాని చూసి నేర్చుకోకపోవడం ఒకటి, మనరాజకీయ నాయకుల్లో గాని పాలకుల్లో గాని, అధికారుల్లో గాని మన భాషపట్ల శ్రద్ధ లేక పోవడం ఒకటి, భాషాప్రయుక్తరాష్ట్ర ప్రయోజనాన్నీ ప్రజాభీష్టాన్నీ విస్మ రించడం ఒకటి, తెలుగును అమలుపరచకపోతే శిక్షపడుతుందనో నష్టం కలుగు తుందనో భయం లేకపోవడం ఒకటి— ఇలాంటివన్నీ దానికి తోడయినప్పుడు ఇక చెప్పేదేముంది? ఆంధ్రప్రదేశ్ ఏర్పడి మూడున్నర దశాబ్ది అయిన తరవాత కాదు, ప్రస్తుత పరిస్థితిలో మరో ఆరున్నర దశాబ్ది గడిచినా పరిస్థితి మెరుగు పడుతుందన్న ఆశ ఏది?

# 9

# మాండలికంలో ఎందుకు రాశానంటే...

మాండలికంలో ఎందుకు రాశానంటే- సహజత్వం కోసం, పాత్రోచితమైన భాష వాడాలనుకోవడంవల్ల. 1958లో 'వెలుగువెన్నెలా గోదారి'నవల ప్రారంభించి నప్పుడు అందులో ప్రధానపాత్ర 'రావులమ్మ' మనస్సులోకలిగిన భావాల్ని ఆమె స్వగతంలో చెప్పించాల్సిన సందర్భంలో ఆ పాత్రకి సహజమూ ఉచితమూ అయిన 'జానపద మాండలికాన్ని' ప్రయోగించాను. ఆ తరవాత ఆ నవలలోని పాత్రలు దాదాపుఅన్నీ చదువురాని జానపదులవే అయినందువల్ల పాత్రల సంభాష ణలూ స్వగతాలతోబాటు రచయిత కథనం కూడా-రచయిత ఆ పాత్రలతోపే ఉండి వాళ్ళనే గమనిస్తూ వాళ్ళు అనుకున్నవీ చేసేవీ చూసేవీ కూడా-వాళ్ళ భాష లోనే రాస్తే బాగుంటుందనీ అనిపించడంవల్ల మొత్తం నవల అంతా ఆ ప్రాంతీయ మైన జానపదమాండలికంలో రాయడం జరిగింది. అటువంటి ప్రయత్నం అప్పటి వరకూ మరెవరూ చెయ్యలేదు. ఎంకి పాటల్లో జానపద మాండలికం ఉంది. కానీ అందులో కొంత 'కృతకత్వం' కనిపిస్తుంది. మా గోఖలే, తెన్నేటి సూరి వంటి వారి కథల్లో జానపద మాండలికం బాగానే కనిపిస్తుంది. కానీ నవలల్లో అంతకు పూర్వం, రచయిత కథనంతో సహా పూర్తి మాండలికాన్ని ఎవరూ ప్రయోగించలేదు.

ఈ కొత్త ప్రయోగాన్ని తెలంగాణా మాండలికంలో రాసిన 'ముత్యాల పందిరి' (1964)లోనూ రాయలసీమ మాండలికంలో రాసిన 'రంగవల్లి' (1974) లోనూ కూడా కొనసాగించడం జరిగింది. ఈ మూడూ మూడు వేరువేరు మాండలి కాల్లో వచ్చిన మొట్టమొదటి నవలలు.

ఇంతవరకు తెలుగులో వెలువడ్డ నిఘంటువుల్లో ఆరోపాలు (entries) ఉన్న పదాలు దాదాపు అన్ని కావ్యభాషలోంచి తీసుకున్నవే; జనవ్యవహారం

లోంచి తీసుకున్నవి చాలా స్వల్పం. దానికి కారణం, జనవ్యవహారంలో ఉన్న పదాలన్నీ- వివిధ మాండలికాల్లో ఉన్నవన్నీ- గ్రంథస్థం కాకపోవడమే నను కుంటాను. ఇప్పుడు మాండలిక రచనలద్వారా వివిధ ప్రాంతాల్లో వాడుకలో ఉన్న పదాలు గ్రంథస్థమై నిఘంటువుల్లో చేర్చుకోడానికి అవకాశమేర్పడింది. 'రచయిత కథనం'తో సహా మాండలికంలో రాయడంవల్ల, కేవలం సంభాషణ లనే మాండలికాన్ని పరిమితం చేసినప్పుడు లభించే పదాలకన్నా చాలా ఎక్కువ పదాలు లభిస్తాయి. ఈ రకంగా గ్రంథస్థమైన పదాల్ని నిఘంటువుల కెక్కించు కోవచ్చు. వట్టి పదాలే కాకుండా వాటి ప్రయోగాలూ (వాక్యనిర్మాణంలో అవి వచ్చే తీరూ) అర్థచ్ఛాయలూ కాకువులూ వగైరా సరిగా తెలుస్తాయి. దీనివల్ల నిర్దిష్టమైన అర్థాల్లో వాటిని నిఘంటువు కెక్కించుకోవచ్చు.

మరొక లాభం కూడా ఉంది. ఇంతకు పూర్వం నిఘంటువుల్లో కొన్ని మాటలకు ఇచ్చిన తప్పుడు అర్థాలను సవరించుకోవచ్చు.

ఆధునిక ప్రమాణభాష (శిష్టవ్యావహారికం)లో చేసిన రచనలకంటే మాండలిక భాషలో చేసిన రచనలు చదువురాని సామాన్య జనానికి దగ్గరగా వెళతాయనడంలో సందేహం లేదు, అయితే శ్రీ మహీధర రామ్మోహనరావు గారన్నట్లు, "మాండలికంలో రాసినవి మామూలు పాఠకులకు అర్థం కావు. ఆ మాండలికం మాట్లాడేవాళ్ళు ఈ పుస్తకాలు చదవరు'' అన్నది కొంతవరకు నిజమే. ప్రమాణభాషలో రాసినవి చదివేటప్పటికంటే మాండలికంలో రాసినవి చదవటానికి పాఠకుడికి ఎక్కువ ఓపిక, ఆసక్తి అవసరం కానీ ఏ మాండలి కమూ పూర్తిగా అర్థం కాకపోవడం అన్నది ఉండదు. పూర్తిగా అర్థం కాకపోతే అది వేరే భాష అవుతుంది కానీ మాండలికం అనిపించుకోదు. ఏవో కొన్ని ప్రాంతీయమైన పదాలు తెలియనంత మాత్రాన మాండలికం అసలే తెలియదని అనుకోనక్కరలేదు.

మాండలికంవల్ల మరో లాభం ఉంది. అక్షరజ్ఞానం లేనివాళ్ళకు కూడా వారి ప్రాంతానికి సంబంధించిన మాండలికంలో చేసిన రచనల్ని చదివి వినిపిస్తే తప్పకుండా ఆనందిస్తారు. దానికి సంగీతం తోడయితే ఆ ప్రాంతంవాళ్ళే కాకుండా అన్ని ప్రాంతాలవాళ్ళూ కూడా విని ఆనందిస్తారు. ఈ విధంగా సాహిత్యాన్ని చదువురానివాళ్ళకు కూడా అందించే మంచి సాధనం మాండలికం.

ప్రామాణిక భాషలో కన్నా మాండలిక భాషలో రచన చేయటం కష్టమనీ (చాలా శ్రమతో కూడినదనీ చాలా మెలకువతో చెయ్యవలసినదనీ) ఆర్.ఇ. కెల్లర్ అన్నమాట నిజమే. కాని అసాధ్యం మాత్రం కాదు. నేను నవలల్లో ప్రయోగించిన మూడు మాండలికాలూ నా నిత్యజీవిత వ్యవహారంలో ఉన్నవి కావు. నాకు చిన్నప్పటినుంచీ అలవడింది అలవాటులో ఉన్నదీ ప్రామాణికభాషే కానీ మాండలిక (వర్గ/ప్రాంతీయ) భాష మాట్లాడేవాళ్ళతో కలిసిమెలిసి ఉంటూ వాళ్ళలో ఒక్కణ్ణి అనిపించేటంతగా తాదాత్మ్యం చెందడంవల్లా అనుకరణవల్లా మాండలికం నాకు పట్టుబడింది. అందువల్ల మాండలికభాషలో నవలా రచన నాకు అసాధ్యమనిపించలేదు.

మాండలిక భాషలో రాసే రచయిత (పదిమందిలో) మామూలుగా మాట్లాడేది ప్రమాణభాషే కాబట్టి అతను తనకు సహజంగా అలవాటయిన ప్రమాణ భాషలోనే ఆలోచించి మాండలికంలోకి మనస్సులో అనువదించుకొని రాస్తాడని కెల్లర్ చెప్పింది పూర్తిగా నిజంకాదు. మానసికంగానూ సాంస్కృతికంగానూ సామాజికంగానూ తదితరంగానూ రచయిత ఆ మాండలికం తాదాత్మ్యం చెందినప్పుడు సహజంగానే ఆ మాండలికంలో ఆలోచించి రాయగలుగుతాడు. 'వెలుగూ వెన్నెలా గోదారీ' రాసినప్పుడు నాకీ అనుభవం కలిగింది. మాండలికంతో తాదాత్మ్యం తక్కువయినకొద్దీ రచయిత ప్రమాణ భాషలో అనుకొని మాండలికంలో రాయడం ఎక్కువవుతుంది. మాండలికంలో ఉన్న ఉచ్చారణ ధ్వనులూ, ఊనికలూ, స్వరాలూ రచయిత పూర్తిగా లిపిబద్ధం చెయ్యలేకపోవచ్చు. భాషాశాస్త్రజ్ఞులకు మాత్రమే అది సాధ్యమవుతుంది. కాని మెలకువగల రచయిత కొన్ని ధ్వనులకు సొంతంగానైనా కొన్ని సంకేతాల నేర్పరచుకుంటాడు. ఆ సంకేతాలు నూటికి నూరుపాళ్ళు ధ్వనులకు పూర్తిగా ప్రాతినిధ్యం వహించలేకపోయినా ఉచ్చారణ విశేషాన్ని సూచించడానికి చాలా దగ్గరగా వచ్చే అవకాశం ఉంది. నిజానికి నూటికి నూరు పాళ్ళూ ఉచ్చారణ విధేయంగా రాసే లిపి ప్రపంచంలో ఏ భాషకీ లేదు. కాబట్టి మాండలికాన్ని లిపిబద్ధంచేసే ప్రయత్నం ఎన్నడూ వ్యర్థం కాదు.

(1991 ఫిబ్రవరి 21న పరిశోధక విద్యార్థి)
(శ్రీ ప్రభాకర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినది).

# 10

# తెలుగు నవలలో భాష, శైలి, మాండలికత

తెలుగు నవల నూరేళ్ళపంట. ఈ నూరేళ్ళలో తీరుతీర్ల రాజనాలు పండించి రాశిపోసిన దిట్టలు- రసరాట్టులు- ఎందరో ఉన్నారు. ఆ రాశిలో మేలుతీస్కు వింగ డించి చూసుకొని నేటికి బలం, రేపటికి ఫలం చేకూర్చుకోడమన్నదే ఈ సదస్సు ధ్యేయం.

తెలుగు నవలలో భాష, శైలి, మాండలికత అనే అంశాలు ప్రసక్తమై నప్పుడు, ముందుగా ఆయా సంజ్ఞల సార్థకత నిర్దిష్టం చేసుకోడం అవసరం. కారణమేమిటంటే, ఈ పదాలు మామూలుగా అలవోకగా (లూజ్‌గా)వాడుతుంటాం. తెలుగులోనే కాదు, ఇంగ్లీషులో చెప్పేటప్పుడుకూడా ఖచ్చితంగా వాటి భేదం పాటించడం మనకు అలవాటు తక్కువ. ఉదాహరణకు Spoken language, Spoken style- వ్యావహారిక భాష, వ్యావహారిక శైలి- అన్నపదాలు ఒక్కదాన్ని ఉద్దేశించినవే. అలాగే Classical language, Classical style - ప్రాచీనకావ్య భాష, గ్రాంథికభాష- అంటూంటాం. కాని వాస్తవానికి ఈ పదాలకు సమానవ్యాప్తి కాని, సమానార్థకతకాని లేవు. కారణమేమిటంటే, ఒకే భాషలో రకరకాల శైలులూ రకరకాల మాండలికాలూ ఉంటుంటాయి. ఒకే మాండలికంలో అనేక శైలీభేదాలు కనబడతాయి. అలాగే ప్రతి శైలీ ఏదో ఒక మాండలికాన్ని ఆశ్రయించుకొని ఉంటుంది. ప్రతి భాషలోనూ మాండలికాలు ఉండకతప్పదు. మొత్తం మీద, విస్తృతమైన భాషావ్యవస్థలో శైలి, మాండలికత అంతర్భాగాలు. తెలుగులో మాండలికమన్న పదం ప్రాంతీయమైన జీవద్భాషాభేదాన్ని సూచించడానికే మొదట వాడుకలోకి వచ్చింది. కాని క్రమంగా సామాజిక స్థాయిల మూలంగా ఏర్పడ్డ వ్యవహారభేదాల్ని సూచించడానికి కూడా వాడుతున్నాం.

సమాజంలో ఒకరి భావాలు మరొకరికి తెలియటానికి వీలుగా ముఖతః

వెలువరించే ధ్వనిసంకేతాల నియతనిర్మాణమే భాష. అంటే మౌలికంగా, భాష అనేది వాగ్వ్యవహారమే. భాషలేని మానవసమాజం లేనట్టే సామాజికులు లేని భాషకూడా ఉండదు. ప్రతి భాషకూ నియత నిర్మాణం ఉంటుంది - ఎంతటి అనాగరిక భాషకయినా సరే. తల్లిదండ్రులవల్లా పెద్దలవల్లా పరిసరాలవల్లా ఆ భాషానిర్మాణం ప్రతివారికి చిన్నతనంలోనే అలవడుతుంది. ఆ విధంగా వ్యవహర్త బుద్ధిలో సమోదయిన భాషానిర్మాణాన్ని అంతరవ్యాకరణం (internal grammar) అంటారు. దీన్నిబట్టి తేలేదేమిటంటే - లిఖితంకాకపోతే కాకపోవచ్చు కాని, భాష అనేది ఏర్పడిందంటే దానికి వ్యాకరణం స్వతస్సిద్ధంగానే ఉందని అర్థం.

భాషాసమాజానికి లేఖనం అలవడ్డతరవాత వాగ్వ్యవహారం లిఖితమవుతుంది. అంటే లిఖితభాష దానికి విధేయమన్నమాట. కాలాంతరంలో వాగ్వ్యవహారంలో వచ్చే మార్పులూ చేర్పులూ స్వీకరించనినాడు ఆ లిఖితభాష జీవద్భాష అనిపించుకొనే హక్కు పోగొట్టుకుంటుంది. అక్కడితో కరడుగట్టుకునిపోతుంది. దాంట్లో ఇంక పెరుగుదల, తరుగుదల అనేవి ఉండవు.

పోతే, వాగ్వ్యవహారమన్నది ఒక్కొక్కరిలో ఒక్కొక్క తీరుగా ఉంటుంది. అటువంటి వైయక్తిక వాగ్వ్యవహారాల్లో (idiolects) సమాన ధర్మాలు కలిసి ఒక్కొక్క మాండలికం (dialect)కిందకి లెక్కకు వస్తాయి. ఈ మాండలికాలమధ్య సమానధర్మాలు ఒక భాషాపరిధిలోకి వస్తాయి. భాష అనేది వైయక్తిక వాగ్వ్యవహారాల్లోని సమాన ధర్మాల సమాహారమే అయినప్పటికీ, ఆ సమాన ధర్మాలు విస్తృతమైన భాషాపరిధిలోకంటె మాండలికపరిధిలో గరిష్ఠంగా ఉంటాయి. భాషనుగురించి సరిగా తెలియని వాళ్ళు, తాము మాట్లాడేదే సిసలైన భాష అనీ ఫలానావాళ్ళది మాండలికమనీ అంటూ ఉంటారు. కాని అది భ్రమ. ప్రతి ఒక్కరికీ ఒక్కొక్క వైయక్తిక వ్యవహారపద్ధతి ఉంటుంది కనక, అది ఏదోఒక మాండలికానికి చెందకుండా ఉండదు. కొన్ని సందర్భాల్లో వైయక్తిక పద్ధతులు ఒకటికి మించకుండా ఉండవచ్చు. ఉదాహరణకు, ఒక వ్యక్తికి ఒక వర్గమాండలికమో ఒక స్థానిక మాండలికమో ముందు అలవడిందనుకుందాం. ఉత్తరోత్తరా అతనికి ప్రమాణభాష కూడా అలవడినప్పుడు ఎక్కడ, ఏ సందర్భంలో, ఏ మాండలికం వాడాలో అక్కడది వాడతాడు. అప్పుడు అతనికి రెండు వాగ్వ్యవహారాలు ఉన్నాయని చెబుతాం.

మాండలికాల్లో ప్రాంతీయస్థాయిలో కొన్ని, సామాజికస్థాయిలో కొన్ని భేదాలు ఏర్పడుతుంటాయి. ప్రాంతీయ స్థాయినిబట్టి తెలుగులో నాలుగు భాషా మండలాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు ప్రచురించిన మాండలిక వృత్తిపదకోశాలు- వ్యవసాయవృత్తి పదాలు, చేనేతపదాలు, వాస్తు పదాలవల్ల నిరూపణ అయింది.

సామాజికస్థాయిలో అంతగా పరిశోధన జరగనప్పటికీ చదువు సంస్కారాల్నిబట్టి, అధికారాన్నిబట్టి, సంపత్తినిబట్టి, పలుకుబడినిబట్టి, వృత్తులనుబట్టి, వర్గాలనుబట్టి, ఇతర సామాజికహేతువులనుబట్టి మాండలికభేదాలు ఏర్పడుతుంటాయని మనకు తెలుసు. అయితే సమాజంలో విద్యావంతులు, పలుకుబడి, అధికారమూ ఉన్నవారు, సంపన్నులు నిత్యజీవితంలో వ్యవహరించే భాష సామాన్యంగా ఇతరులకు అనుకరణీయమవుతుంది; ప్రామాణికత పొందుతుంది. రాకపోకలవల్లా కలిసిమెలిసి పనిచేయడంవల్లా అది ఆ భాషాసమాజానికంతకూ బాగా పరిచయమవుతుంది. విద్యావ్యాపక సాధనాలు, ప్రచార సాధనాలు, సాహిత్య గ్రంథాలు, పత్రికలు, రేడియో, సినిమా మొదలైనవాటివల్ల దాని ప్రామాణికత రూఢమవుతుంది. ఆ ప్రామాణిక భాషకే తెలుగులో మరోపేరు శిష్టవ్యావహారిక భాష. బెంగాలీలు ఇలాంటిదాన్నే 'చలిత్‌భాష' అంటారు. అది ఈ శతాబ్దంలో కలకత్తా పండితుల వ్యవహారంలోంచి వచ్చిందే. విశ్వకవి టాగూరు దాన్ని స్వీకరించడం వల్ల ఆ భాషకు గౌరవం పెరగడమేకాకుండా ఆ భాషకు అర్హస్థానం ఇయ్యడంవల్ల ఆయన గౌరవమూ పెరిగింది.

ఇకపోతే, 'శైలి' అన్నదాన్ని గురించి ప్రస్తావించవలసి ఉంది. మామిడి వెంకయ్యగారి 'శబ్దార్థ కల్పతరువు'లోగాని, బ్రౌణ్యంలోగాని, శబ్దరత్నాకరంలోగాని, మోనియర్ విలియమ్స్ 1851లో ప్రచురించిన ఇంగ్లీషు-సంస్కృత నిఘంటువులోగాని ఈ పదంలేదు. మోనియర్ విలియమ్స్ 1899లో ప్రచురించిన సంస్కృతం–ఇంగ్లీషు నిఘంటువులో (పుట 1090) ఇచ్చిన అర్థాలు ఏమిటంటే- habit, custom, manner of acting or living, practice, wage; kav; kathas, a special particular interpretation (esp of a concise explanation of a grammatical form). 1959లో సవరించి వేసిన, ఆప్టే సంస్కృతం–ఇంగ్లీషు నిఘంటువు మూడో సంపుటంలో మూడర్థాలున్నాయి :

(1) A short explanation of a grammatical aphorism; (2) A mode of expression or interpretation; (3) Behaviour, manner of acting; conduct, course. కాబట్టి ఈ పదం style అన్నదానికి సమానార్థకంగా అర్వాచీనకాలంలోనే విస్తృతవ్యాప్తిలోకి వచ్చిందేమో అనిపిస్తోంది.

'శైలి' అన్నదాన్ని ఖచ్చితంగా నిర్వచించడం కష్టం. కాని స్థూలంగా ఇలా చెప్పవచ్చు: ఒకే భాషలో దాదాపు ఒకేభావాన్ని అందించగలిగినవి, నిర్మాణంలో మట్టుకు వేరయినవి, రెండు ప్రయోగాలు శైలిలో భిన్నమైనవని చెప్పవచ్చు (Roughly speaking, two utterances in the same language which convey approximately the same information, but which are different in their linguistic structure, can be said to differ in style. *He came too soon- He arrived prematurely-* C. F. Hockett, A Course in Modern Linguistics, 1958, P. 556.

అంటే, ఒకవిషయం చెప్పటానికి లోకంలో వేరు వేరు పదప్రయోగాలు ఐచ్ఛికంగా వాడుకలో ఉన్నప్పుడు, వక్త అప్పటి సందర్భాన్నిబట్టి, అప్పటి శ్రోతనుబట్టి, విషయగౌరవాన్నిబట్టి వైయక్తికమైన అభిరుచిని బట్టి, తన పాండిత్యాన్నిబట్టి, అలవాటునుబట్టి- వీటిలో అన్నీ కాకపోయినా కొన్నిటినిబట్టి-ఆ సందర్భంలో ఒక ప్రయోగంచేస్తాడు. అది అతని శైలిలోకి వస్తుంది. అలాగే భాషలో ఉచ్చారణపద్ధతి మొదలు పదాల ఎన్నిక, పదబంధ నిర్మాణం, వాక్యాంశవివేకం, వాక్యనిర్మాణవిధానం తదితర ఉన్నతస్థాయిలవరకూ అతనిశైలి ద్యోతకమవుతూ ఉంటుంది. విశ్వనాథవారి పరిభాషలో ఆ శైలి అతని 'జీవలక్షణం'. అయితే ఒక వ్యక్తిశైలి రాశిపోసినట్టు ఎక్కడా ఉండదు. అది ఒక శ్రేణిని (stylistic range) ప్రతిబింబిస్తుంది. 'నేను–నారచన' అన్న వ్యాసం (విశ్వనాథసాహితి–విశ్వశ్రీ ప్రత్యేకసంచిక)లో సత్యనారాయణగారన్న మాటలివి: "శైలియనగా కవియొక్క జీవలక్షణము. దాని నెవడును మార్చలేడు. ఆ కవియే మార్చుకొనలేడు. అందుకనియే అందఱు మహాకవులలోను వారివారి ముద్రయుండును. ఆ ముద్ర యెట్టిది? కొన్ని పలుకుబడులు, కొన్నిశబ్దములు, ఒక విధమైన రచన వాని కవిత్వమునకు లక్షణముగా కనిపించును. ఆ అక్షర విన్యాసముచేత, నా శబ్దములచేత, నా పలుకుబడిచేత, వినుపుచేత నది వానిదని గుర్తుపట్టుచున్నాము. నడచుచుండగా నా చేయి

నట్టే విదలించును. కొంచెము వంగియుండును. వా డుత్తరీయ మట్లే వేసికొనును. వాడు తలట్లే దువ్వుకొనును. అది వాని లక్షణము. వానిలో మార్పుండదు. ఎందు చేత మాఱదు ? వాని జీవలక్షణమే యీరీతిగా వివృతమగుచున్నది. సరిగా కవి యొక్క శైలియునిట్టిదే.... జీవసంపుటిలోని లక్షణములు వేళాప్రాప్తములై పరిస్థితులతోడి సన్నికర్షపొంది అట్లు ప్రకటింపబడుట సర్వమానవ లక్షణము. ఇదే సృష్టి సంఘర్షణము. ఆ కవియొక్క రచన యట్లుండుటకు ఇదే కారణము".

పుట్టి పెరిగిన ప్రాంతం, ఉన్న పరిసరాలు, కుటుంబ సంస్కారం, నిజ సంస్కారం మొదలైన అంశాలు శైలిమీద చూపించే ప్రభావం తక్కువది కాదు. పరంపరగా జాతిజీవనానికి ప్రతీకలైన దేశ్యశబ్దాలతో నిండిన రచన ఒకటి, అన్య దేశ్యాలు విశృంఖలంగా వాడిన రచన మరొకటి పక్కపక్కల్ని పెట్టి చూసినప్పుడు ఆయా రచనల శైలీభేదాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. అలాగే ఒక్కొక్క రచన చిన్నచిన్న తేలికమాటలతోనూ, సమాసవాక్యాలతోనూ ఏర్పడితే మరొక రచన మారుమూలమాటలతోనూ, దీర్ఘ సమాసాలతోనూ, సుదీర్ఘ వాక్యాలతోనూ రూపొందుతూ ఉంటుంది ఒక్కొప్పుడు కొన్ని రచనల్లో కొన్నికొన్ని పద రూపాలూ అవ్యయాలూ పదేపదే పునరావృతమవుతూ ఉంటాయి. కొన్నిట సులభ గ్రాహ్యత, స్వభావోక్తి ప్రదానంగా కనిపిస్తే మరికొన్నిట క్లిష్టత, పదాడంబరం అలంకారికత ప్రముఖంగా కనిపిస్తాయి. అయితే మొదటిరకం రచన ఒక్కొక్కప్పుడు శైలిదృష్ట్యా పేలవమూకావచ్చు. మరోరకం రచన అందమూ పొందవచ్చు. ఎరిక్ వెలాండర్ అభిప్రాయంలో, సామాన్య వ్యవహారపద్ధతికి భిన్నమైన ప్రతి ప్రయోగమూ శైలీభేదం కిందికి వస్తుంది. ఇలా భేదించడానికివిషయస్వభావమూ రచనాప్రయోజనమూ పాఠకుడి యోగ్యతా రచయిత మూర్తిమత్వంకూడా కారణాలవుతాయన్నాడు.

స్థూలంగా గుర్తించే శైలీభేదాలు ఏమిటంటే: 1 రచయితనుబట్టి- నన్నయ గారి శైలి, చలంగారి శైలి మొ.వి. 2. కాలాన్నిబట్టి: ఆధునిక శైలి, **Elizabethan style;** 3. ప్రదేశాన్నిబట్టి: శ్రీకాకుళంయాస, కరీంనగరం భాష, **Yankee humour** మొ.వి; 4. ప్రాంతీయమాండలికాన్నిబట్టి; తెలంగాణాభాష, **Mexican style:** 5. వర్గమాండలికాన్నిబట్టి: పద్మశాలివారి వాడుక మొ. వి. 6. ప్రసిద్ధ గ్రంథాన్నిబట్టి: మహాభారతశైలి, కాదంబరి శైలి మొ.వి. 7. రచయితలవర్గాన్ని

బట్టి: కవిత్రయంవారి శైలి, భావుకవుల శైలి, Romatic style, అభ్యుదయ కవులశైలి; 8. రచనాప్రక్రియనుబట్టి: కావ్యభాష, పత్రికలభాష మొ.వి; 9. సందర్భాన్నిబట్టి: సాహిత్యోపన్యాసశైలి, ఎన్నికల ఉపన్యాసాలశైలి, బాలానందం శైలి, పురాణపఠనం మొ.వి; 10. ప్రసిద్ధపాత్రలనుబట్టి: బుడుగు శైలి, గిరీశం శైలి, సీతారామారావు శైలి మొ.వి.

తెలుగు రచనల్లో 'భాష, శైలి, మాండలికత' అనే అంశాల గురించి, తగినంతగా పరిశోధన జరక్కపోవడం ఒక లోటే. కాని స్థూలంగా కొన్ని అంశాలు గమనించవచ్చు. 1872 మొదలు 1972 వరకూ వెలువడ్డ తెలుగు నవలల్ని ప్రధానంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు: 1. ప్రాచీన కావ్యభాషలో రాసినవి 2. అర్వాచీన భాషలో రాసినవి. ఇక్కడ ప్రాచీన భాష అంటే అర్థం నన్నయగారి కాలంనుంచి వస్తున్న కావ్యభాష. కొన్ని పదరూపాల్లోనూ ప్రత్యయాల్లోనూ సంధికార్యాల్లోనూ పదబంధ నిర్మాణంలోనూ ఉత్తరోత్తరా వచ్చిన కొద్దిపాటి మార్పులూ చేర్పులూ ఇక్కడ అప్రసక్తాలని అర్థం. అర్వాచీనభాష అంటే, కనీసం ఈ శతాబ్ది ప్రథమపాదనుంచి గ్రంథస్థమవుతూ వస్తున్న వాగ్వ్యవహార భాష. దీని వెనక ఉన్న సంప్రదాయబలమేమిటంటే: శతాబ్దాల తరబడి తరతరానికీ అందుతున్న జానపదగేయాలు, దాదాపు తొమ్మిదివందల ఏళ్ళనుంచి నుంచి శాసనాలలో లిఖితమవుతున్న వ్యావహారిక రూపాలు (ఉదా. ఇస్తిమి మొ. వి), లక్షణగ్రంథాల వ్యాఖ్యలవంటి కావ్యేతర రచనలు, కావ్యగ్రంథాల్లోనే అక్కడక్కడ చోటుచేసుకొన్న వ్యాకరణ విరుద్ధరూపాలు, రాయవాచకంవంటి వచన రచనలు, దక్షిణాంధ్ర సాహిత్యంలోని అనేక యక్షగానాల్లోని పాత్రోచిత ప్రయోగాలు, మెకంజీకైఫియత్‌ల ప్రయోగాలు, విలియం బ్రౌన్‌వంటి వారి వ్యాకరణాలూ నిఘంటువులూ, కాశీయాత్రచరిత్ర, సి.పి. బ్రౌన్‌వంటి ప్రచురణలు, దస్తావేజులు, జాబులు, తాతాచార్యుల కథలు, సూరిగారికి పూర్వం ప్రచురించిన పాఠ్య పుస్తకాలు, కందుకూరి వీరేశలింగం పంతులుగారి రూపకాల్లో ప్రయుక్తమైన పాత్రోచిత భాష మొ.వి; గిడుగు రామ్మూర్తి పంతులుగారు ఉదాహరించిన ఇతర అంశాలు. వాగ్వ్యవహార భాష అన్నప్పుడు గ్రామాణిక, ప్రాంతీయ, సామాజిక మాండలిక భేదాలు ఇక్కడ అప్రసక్తాలు.

తొలి తెలుగు నవల, నరహరి గోపాలకృష్ణమ్మసెట్టిగారి 'శ్రీరంగరాజు చరిత్ర, పై వర్గీకరణలో మొదటిదాని కిందికి వస్తుంది. అందులో భాష గురించి

డా. కొత్తపల్లి వీరభద్రరావుగారు అన్న మాటలివి. "కథాకల్పనలో చమత్కారము తక్కువ. పద్యప్రబంధములలోపలెనే శైలి వర్ణనాత్మకమైనది. రచనయంతయు గ్రాంథికభాషలో జరిగినది. ఇంతకంటె శైలి విషయములో చెప్పదగినదేదియు లేదు. (తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము 1960) మొదలి నాగభూషణ శర్మగారు, "నవల జటిలమైన, సమాసభూయిష్ఠమైన శైలిలో వ్రాయబడ్డది. అది మొదటి ప్రయత్నంకనుక అది తరువాతి నవలలోని భాషతో ఏమాత్రం పోలిక లేని ప్రబంధాల భాషనే ప్రయుక్తం చేసింది''అన్నారు (తెలుగు నవలా వికాసం, 1971) అయితే శర్మగారనుకున్నంత జటిలం కాదది. ఈ వాక్యాలు గమనించండి: ఒకనాడు మంచి యెండను మార్గాయాసముచే మిక్కిలిడస్సి, నీరు వట్టుచేఁ దపించుచు బాటను బండుకొనియె. అది చేలను గోఁత కోయుచున్న కొందరు మాలలుచూచి యెవరో బడలికచేత నేలఁబడిరని యుతికి వచ్చి నీరిచ్చుటకుఁ దగినవారు కామింజేసి మఱియెవరినయినను దగు కులమువారిని బిలుచుకొని వత్తమని చేతనున్న నీరియ్యకయె మరలిపోయిరి."

రెండో నవల వీరేశలింగంపంతులుగారి 'రాజశేఖరచరిత్ర' కథనమంతా గ్రాంథికంలోనేసాగినా సంభాషణల్లో ఆనాటి శిష్టవ్యావహారికం ప్రయుక్తమయింది. అందులోనూ, బ్రాహ్మవివాహంవంటి రూపకాల్లో వాడిన వ్యావహారికం నేటి వ్యావహారికానికి ఏమంతదూరంగా లేదు. పంతులుగారిలా అన్నారు. "గ్రంథములను సాధారణముగా సలక్షణమైన సులభశైలిని రచయింపవలెననియే నా యభిప్రాయమైనను విషయానుగుణముగా తత్తదుచిత రీతిని గ్రామ్యభాష యందు సహితము గ్రంథములు వ్రాయవచ్చుననికూడ నా యభిప్రాయము. పూర్వవ్యాకరణములన్నియుఁ బద్యకావ్యరచనకొఱకే వచనకావ్యములులేని కాలములోపుట్టినవగుటచేత నందలి లక్షణములనేకములు వచనకావ్యాభివృద్ధికి తగవనియు నిప్పటికాలమునకుఁ దగినట్టుగా వ్యాకరణమును మార్చుకోవలెననియు నే ననుకొని ఈ కాలమునకును వచనరచనాభివృద్ధికి తగినట్టుగా నొక నూతన వ్యాకరణమును వ్రాసి దానికి లక్ష్యముగా నొక వచన కావ్యమును జేయవలెనని పలుమాఱు దలపోసితిని''. పంతులుగారు క్రాంతదర్శి 1919లో ఇంక మూణ్ణెల్లకు చనిపోతారనగా, గిడుగు రామ్మూర్తిగారి వాదాన్ని అంగీకరించి వర్తమానాంధ్రభాషాప్రవర్తక సమాజానికి అధ్యక్షస్థానం స్వీకరించారు. చెళ్ళపిళ్ళవార న్నారు: 'మాతృభాష అంటే ఎవళ్ళకేనా వ్యావహారిక మవుతుందిగాని గ్రాంథికం కాదు''.

'అనుభవాలూ జ్ఞాపకాలూను' అన్న గ్రంథంలో శ్రీ పాదసుబ్రహ్మణ్య శాస్త్రిగారు (రెండోభాగం, పుటలు 144-6) ఇలా అన్నారు. ''సాహిత్య ప్రియులకు కావలసింది రసం. రసం అన్నది వాక్యనిర్మాణంలో పొటమరిస్తుందిగాని శబ్దరూపాల్లోనూ క్రియరూపాల్లోనూ కాదుమరి. వ్యావహారికంలో అయితే రచన నీరసం అవుతుందనుకోవటమూ గ్రాంథికం అయితేచాలు రసమహితం అయి పోతుందనుకోడమూ అవివేకానికి రెండు నిదర్శనాలు. గ్రాంథికమే వ్యాకరణ యుక్తం అయివుంటుందనీ వ్యావహారికం వ్యాకరణదూరం అని అనుకోవడం అవివేకానికి మూడో నిదర్శనం. అసలు వ్యాకరణం అన్నది వొక్క శబ్దరూపాల్లో మాత్రమేనా వుంటుంది? సంధి వ్యాకరణం సంబంధికాదూ- కర్తకర్మక్రియలు వ్యాకరణసంబంధాలు కావూ? ఆకాంక్ష అన్వయమూ వ్యాకరణసంబంధాలు కావూ? కారకాలు వ్యాకరణ సంబంధాలు కావూ? సమాసాలు అవ్యయాలు ధాతువులూ ప్రయోగాలూ వ్యాకరణ సంబంధాలు కావూ? వ్యావహారిక రచనల నిసడించే వారికి నిజంగా అవి అర్థం కాకుండానే వున్నాయా? ప్రయోగమూలం కదా వ్యాకరణం. కర్రచేత కొట్టాడనీ నిన్న వస్తాననీ రెండు మనుష్యులనీ రాముడరణ్య వాసం చేసిందనీ తాటక మహాబలవంతుడనీ యే వ్యాహారిక రచయిత అయినా రాస్తున్నాడా? వ్యాకరణం అంటే ఏమిటో యెరగని, వ్యాకరణం అంటూ వొక టుందని కూడా యెరగని పామరుడయిన అంటున్నాడా పోనీ....ఆ సిగ్గుకు సిగ్గు లేదన్నాడే చేమకూర వెంకన్న, అక్కడ నుగాగమమా చూసుకోవలసింది, రస స్ఫూర్తా?

''జీవద్భాషకు నియామకుడు కవేగాని పండితుడూ వైయాకరణీ కాడు.''

పందొమ్మిదో శతాబ్ది కడపటిభాగంలో వచన రచనలను ప్రోత్సహించ టానికి 'చింతామణి' పత్రికవారు నిర్వహించిన పోటీల్లో భాషను గురించి కూడా రచయితలకు కొన్ని సూచనలు చేసేవారు: ''సంభాషణములు గాక మిగిలిన కథాంశమునందు సహితము సాధ్యమయినంతవరకు కేవల గ్రాంథికపదములను దీర్ఘసమాసములను విడిచి మృదుమధుర పదములతో సులభశైలినే ఉపయోగించ వలెను''. ఈ పోటీలద్వారా పైకెగసిన రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు. వారికి వీరేశలింగంగారి రాజశేఖరచరిత్రే ఆదర్శం. వారి రామచంద్ర విజయంవంటి నవలల్లో గోదావరి ప్రాంతంలో శిష్టకుటుంబాల పలుకుబడికి గ్రాంథికీకరణం స్పష్టంగా గోచరిస్తుంది.

8

తరవాత గ్రాంథికభాషలో నవలలు రాసినవారిలో ప్రముఖులు వెంకట పార్వతీశ్వర కవులు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, విశ్వనాథసత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి, అడవి బాపిరాజు, తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు మొదలైన వారు. శైలిదృష్ట్యా వెంకటపార్వతీశ్వరకవుల ప్రమదావనము విలక్షణమైంది. అలాగే విశ్వనాథవారి వేయిపడగలు, కవిత్రయంవారికి నీరాజనమిస్తూ నోరివారు రచించిన నారాయణభట్టు, మల్లారెడ్డి మొదలైన నవలలు చెప్పుకోదగ్గవి. విశ్వనాథవారి శైలిలో చక్కటి దేశ్యశబ్దాలతో అనల్పభావస్ఫూర్తి కలిగించగల చిన్న చిన్న వాక్యాలు, జటిలపదప్రయోగంతో, సుదీర్ఘమైన సమాసాలతో పంక్తులకు పంక్తులుగా సాగిపోయే పెద్దపెద్ద వాక్యాలూ పక్కపక్కల్నే కనిపిస్తూ ఉంటాయి. తెలుగు నుడికారం ఆయన సొమ్ము. సంస్కృతం ఆయనకు ఊడిగం చేస్తుంది. 'వేయిపడగల'తో బాటు పుట్టినదే బాపిరాజుగారి 'నారాయణరావు'. ''ఉదాత్తమైన సంస్కృత సమాసాలు, వెనువెంటనే అతిలలితమైన తేటతెలుగు పదాలు'' ఆయన రచనకు వన్నె పెట్టాయి. గోన గన్నారెడ్డి హృదయావర్జకమైన రచన.

ఈ శతాబ్దం తొలిపదులు రెండు దాటేసరికే తెలుగు నవల జనపథంలోకి వచ్చింది. వచనరచనలో వ్యావహారికమే నిజమైన సంప్రదాయమని, జీవద్భాషలోనే రచనలు సాగాలని ఎంత కాలంగానో చేస్తున్న గిడుగు మేఘగర్జన ఆనాటికి రచయితల చెవుల్లో తుప్పు వదిలించింది. నాకు తెలిసినంతవరకూ వ్యావహారిక భాషలో వెలువడ్డ తెలుగు నవలల్లో మొట్టమొదట చెప్పుకోవలసింది, ఉన్నవవారి 'మాలపల్లి'; ప్రచురించింది 1922లో. ఆ పుస్తకానికి పరిచయంలో ఆయన అన్న ముక్కలివీ: ''వాడుకభాషలో పుస్తకం వ్రాయడానికి నాకిదే మొదటి ప్రయత్నం. మాదిరికి తగిన గ్రంథములుకూడా లేవు. సంస్కృతభాషా పాండిత్యంగాని, తెలుగు ప్రబంధముల పరిచయంగాని వాడుకభాషలో గ్రంథములు వ్రాయడానికి విశేషం తోడ్పడవు. శుద్ధమయిన తెలుగుభాష రావడానికి సంస్కృతభాషతో సంబంధంలేని పల్లెటూరివారితో పరిచయముండాలి. మొదట సంస్కృత పండితులూ ఇప్పుడాంగ్లభాషాపండితులూ తెలుగు భాషాస్వభావాన్ని మార్చారు. అనేక భావాలను తెలియజేసే అచ్చతెనుగు మాటలున్నా సంస్కృతం నుంచో యింగ్లీషునుంచో మాట లరువుదీసుకోవడం మామూలైంది. అందువల్ల చక్కని తెలుగుమాటలన్నీ మూలబడి భాషలో సాంకర్యమెక్కువయింది. వీలయి

నంతవరకు తెలుగుభాషయొక్క నడక కనుకూలంగా యీ గ్రంథం వ్రాయడానికి ప్రయత్నం చేశాను.''

"విభక్తులూ సంధులూ క్రియరూపములూ మనం మాట్లాడేభాషలోనూ వ్రాసే భాషలోనూ ఒక మోస్తరుగా లేవు. ఒక విధంగా మాట్లాడం మరొక విధంగా వ్రాయడం అలవాటయింది. కృత్రిమ రూపాలను కల్పించుకొని వ్రాయడం, చదవడం, అలవాటుకావడంచేత కృత్రిమరూపాల కలవాటుపడ్డ నోటితో వాడుక భాష చదవబోతే కొందరి కెబ్బెట్టుగా కనపడడం నేనెరుగుదును....మాట్లాడే మోస్తరుగానే చదువడం ప్రారంభిస్తే వాడుకభాషలో రుచి కనబడుతుందిగాని లేక పోతే తెలియదు. ఈ మొదటి ప్రయత్నం జనులకెట్లా రుచిస్తుందో చూసి మరి కొన్ని గ్రంథాలు వ్రాయవలెనని కోరిక....

''భాషయొక్క ప్రస్తుత పరిస్థితిలో వాడుకభాషలో వ్రాయడం కంటె గ్రాంథికభాషలోనే వ్రాయడం సులభంగా కనుపడ్డది. కానిఅలవాటే దీనికి కారణం. జాతీయ తెలుగుభాషతో పూర్ణమైన పరిచయం లేకపోవడం రెండవ కారణం. నా కంటె పల్లెటూరిలో నివసించడం యెక్కువ అలవాటు గలిగి తెలుగుభాషయొక్క నిజస్వభావం బాగా గుర్తెరిగిన తెలుగుభాషాపండితులు వాడుకభాషలో వ్రాయడాని కర్హులు. అయినా దారిజెడితే బాగుంటుందని నా అభిప్రాయం. వాడుకభాషా వాదులలోగూడా అభిప్రాయభేదా లుంటవని నాకు తెలుసు....అన్ని వైపులనుంచి తీవ్రమయిన చర్చలు జరుగకమానవు. అయినా చర్చ జరిగిన తరవాత అవసర ముంటే ప్రయోగములు సవరించుకోవచ్చునని నాకు దోచిన విధంగా అచ్చువేయిం చాను...." వీటినిబట్టి ఉన్నవవారి ప్రయత్నం ఎంత దొడ్డదో గ్రహించవచ్చు. మాలపల్లి రచన ఆదర్శప్రాయమైంది. అలాగే దాని శైలికూడా. గుంటూరుజిల్లా మెట్టప్రాంతాల్లో వాడుకలో ఉన్న భాషను గ్రంథస్థం చెయ్యడంలో ఉన్నవవారి చిత్తశుద్ధికి జోహారులర్పిస్తాం. చక్కని నుడికారంతో ఉదాత్తమైన విషయాలను హృదయావర్జకం చేసిన ఉన్నవవారు ధన్యులు. లక్షణ విరుద్ధము, గ్రామ్యము అంటూ నిందలకు గురిఅయిన వ్యావహారికం తెలుగు వచనరచయితల్లో దాదాపు అందరికీ ఉపాదేయమైంది. "మార్పు ప్రతిదాల్లోనూ ప్రతిజనుడికి కనుపిస్తూనే ఉంటుంది. కాని 'అదిగో మార్పు. మనం మారుతున్నాం, సంగతి ఇదె' అని ఆ మారే జనంతో చెప్పడానికి సాహసించేవాడు తాత్కాలికంగా ఇంతో అంతో రొష్టు పడాలి... భూమిమీద తెలుగు మాట్లాడే వ్యక్తి ఒఖ్ఖడుమాత్రం మిగిలి ఉండేకాలం

వచ్చినా, ఆ ఒక్కడూ తన హృదయపరిస్థితులు యథారీతిగా వెలిబుచ్చడంలో తల్లిదండ్రులవల్లా పెద్దలవల్లా తను నేర్చుకో గలిగిన మాటధోరణిలో (వ్యాప్తి శాశ్వతత్వాలకి లోటు వస్తుందనే భయంచేత మార్చి దాన్ని కేవలం అనృతం చేసేసి, హృదయాన్ని బుర్రతో పొడిచి తన భయాన్ని ఖాయపరచుకోకుండా) తను మాట్లాడే సెయ్యడం, అవసరమయితే అదే లిఖితం చెయ్యడం, తనకి నామర్దా కాదు సరికదా. అసలు అదేగదా సూన్ృతం, అదేగదా యథార్థ జీవితానికి సూచకం, అదేగదా తెలుగు జిహ్వకి జన్మసాఫల్యం, అని చెప్పిన మహాభావుడు రామమూర్తి పంతులుగారు'' అన్నారు భమిడిపాటి కామేశ్వరరావుగారు.

అది మొదలు వ్యావహారిక భాషలో నవలలు విరివిగా రావడం ప్రారంభించాయి. తరతరాలుగా తెలుగు సంస్కృతిలో అంతర్భాగంగా వర్ధిల్లుతున్న జీవద్భాష గాలికి పోకుండా అక్షరబద్ధమవుతూ వచ్చింది. అందుకు తోడ్పడ్డ ఇతర ప్రముఖుల్లో చలం, విశ్వనాథ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, అడివి బాపిరాజు, కొడవగంటి కుటుంబరావు, బుచ్చిబాబు, గోపీచంద్, జి.వి. కృష్ణారావు, వట్టికోట ఆళ్వారు స్వామి, రాచకొండ విశ్వనాథశాస్త్రి, రంగనాయకమ్మ, బీనాదేవి, మధురాంతకం రాజారాం, పోలాప్రగడ సత్యనారాయణమూర్తి, యద్దనపూడి సులోచరాణి, అవసరాల రామకృష్ణరావు, ఆదివిష్ణు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, మంజుశ్రీ, వాకాటి పాండురంగారావు, నవీన్, దాశరథి రంగాచార్య మొదలైన వారు ఉన్నారు. వీరి రచనల్లో కొన్ని వాక్యాలు చదివితే ఫలానా వారిదని పోల్చుకోవచ్చు. చలం, భాష, శైలి పటిష్ఠమైనవి. అంత పటిష్ఠంగా వ్రాసిన మరొక్కడే విశ్వనాథ. తెలుగుభాషలో అతడు తెచ్చిన తియ్యదనం, భావాలలో ఉద్రేకం-ఇవి చలాన్ని కలకాలం నిలిచేటట్లు'' చేస్తాయి అంటారు నాగభూషణశర్మగారు.

చలంగారి భాషకు వేడి, వేగంతోబాటు పదునుకూడా ఎక్కువ. విశ్వనాథ వ్యావహారికానికి 'మాబాబు' మచ్చుతునక. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు గ్రాంథికాన్ని వదిలి ఉండకపోతే తెలుగు నవల ఒక గొప్ప శైలీశిల్పిని పోగొట్టుకొని ఉండేది. 'ఆత్మబలి'లో ఉన్న వేగం, పరభాషావాసనలు ఎంతమాత్రం సోకని చక్కటి తెలుగుదనం శ్రీపాదకు సమున్నతమైన స్థానం ఇచ్చాయి. కుటుంబరావు 'చదువు' 'అనుభవం' నవలలు ఆయన శైలీ విన్యాసానికి అద్దంపడతాయి మధ్యతరగతి బుద్ధిజీవుల హృదయావిష్కారం కుటుంబరావుగారి భాషలో పొందినంత సొగసుగా మరొకదాంట్లో పొందడం అరుదు. సీతారామారావు జీవితచిత్రణలో

గోపీచంద్ శైలి ప్రత్యేకత సంతరించుకుంది. 'పండిత పరమేశ్వరశాస్త్రి 'వీలు నామా'లో అది పరిపుష్టమయింది. రాచకొండవారి సుబ్బయ్య, త్రిపురనేనివారి సీతారామారావులాంటివాడు కాడు. భయస్తుడూ మోహమాటస్తుడూ అయినా రాచ కొండ పలుకుబడితో రాటుదేరతాడు. తనతనం నిలుపుకుంటాడు. తెలుగు నవ లలు రాసే రచయిత్రుల్లో రంగనాయకమ్మగారు, బీనాదేవిగారు భాషని మలుచు కోవడంలో ఆరితేరినవారు. బీనాదేవిగారిలో ఆంగ్లభాషా ప్రభావం మరింతగా కని పిస్తుంది. బుచ్చిబాబుగారు స్వతః కళాకారుడు. అందువల్ల కాల్పనికమైన శైలి ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రాజారాం భాషలో సిద్ధహస్తుడయిన రచయిత. వీరి రచనల్లో చక్కటి పలుకుబళ్ళు, పొందికయిన వాక్యాలు తీర్చిదిద్ది నట్టుంటాయి.

1960 దరిదాపుల్లో తెలుగులో నవలల రచన ఇబ్బడిముబ్బడిగా పెరి గింది. ఆంధ్రపత్రికతోబాటు ఆంధ్రప్రభ వారపత్రికవారు కూడా పోటీలు నిర్వ హించడం ప్రారంభించారు. తొలిపోటీ (1961)లో పూర్తిగా జానపదశైలిలో- అంటే శిష్టేతర మాండలికంలో రాసిన తొలి తెలుగు నవలకు బహుమానం వచ్చింది. ఆ నవల పేరు 'వెలుగూ వెన్నెలా గోదారీ'. గోదావరి పల్లెప్రాంతంలో చదువుకు నోచుకోని కింది తరగతివాళ్ళ జీవితచిత్రణ. నవలలో కథనమంతా వాళ్ళ భాషలోనే సాగింది.

ఈ రకమైన ప్రయోగం ఇతరభాషల్లో ఎవరూ చేసినట్టు నాకు తెలియదు. హిందీలో ఫణీశ్వర్‌నాథ్ 'రేణు' వంటివారి రచనలద్వారా 'ఆంచలిక్ ఉపన్యాస్' అన్న ప్రత్యేక శాఖ ఒకటి ఏర్పడ్డట్టు ఇటీవల విన్నాను. 'రేణు' గారి నవల 'మైలా ఆంచల్' దాంట్లో. మాండలిక భాషాప్రయోగాలూ బాగానే కనవడ్డాయి. అయితే తెలుగులో నవలలకీ దానికీ కొంత తేడా ఉంది. కథాకథనంతో సహా అంతా జానపదుల ప్రాంతీయ మాండలికంలో సాగింది ఈ పద్ధతి. 'మైలా అంచల్'లో అలా సాగిందో లేదో గట్టిగా చెప్పడం కష్టంగాని, చాలావరకూ ప్రామాణికభాషకూడా కనిపిస్తోంది. ఏమైనా ఇటువంటి రచనలకు మరొక ప్రముఖభాషలో విశేషాదరం లభించడం ఆహ్లాదకరమైన విషయం.

మొత్తంమీద ఈనాటి తెలుగునవలలో శైలికి, మాండలికతకు సంబంధించి

సంతవరకూ ఎంతోవైవిధ్యం కనిపించడం సంతోషించదగ్గదే. భాష విషయంలో ఆధునిక ప్రమాణభాషకు- అంటే శిష్టవ్యావహారికానికి- ఇంక ఢోకా- లేదు. ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ తెలుగునవలా రచయితలంతా ఈనాడు భాషవిషయంలో ఒక్క తాటిమీదే నిలబడ్డారనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. శైలీ వైవిధ్యం, మాండలికప్రయోగాలూ తెలుగు భాషను పరిపుష్టం చేశాయనడానికి నవలాసాహిత్యమే నిదర్శనం.

(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి 1972లో నిర్వహించిన
'తెలుగు నవల: నూరు సంవత్సరాలు' అన్న సదస్సులో చదివిన ప్రసంగ పత్రం).

# 11

# పానుగంటివారి భాషాశైలి

''తెలుగు మాటలాడినవాడు విధము చెడినవాడు; విద్యరానివాడు; గౌరవము లేనివాడు; గతిలేనివాడు; తెలివిమాలినవాడు; దిక్కుమాలినవాడు," అనే అభిప్రాయం ఆంగ్లేయాభాషాదురభిమానుల్లో ప్రబలి ఉన్న రోజుల్లో స్వభాషను సముజ్జ్వలం చెయ్యడానికి కంకణం కట్టుకొన్న ప్రతిభాశాలి పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు. ప్రతిభాశాలి అని ప్రత్యేకంగా చెప్పడానికి కారణమేమిటంటే- వ్యుత్పత్తి ఎంత ఉన్నా, అభ్యాసమెంత ఉన్నా వాటిని ఉద్దీప్తం చేసే నేర్పూ తీర్పూ ప్రతిభలోనే గోచరిస్తాయి. ఈ ప్రతిభ ఎంత గాఢమైనదో తెలుసుకోడానికి వారి నాటకాలదాకా పోవక్కరలేదు- 'సాక్షి' ఉపన్యాసాలు చాలు. తెలుగు సాహిత్యంలో వాటి సరసకు చేర్చగలిగిన ఉపన్యాసాలు లేవనడం-ఉన్నమాట చెప్పడం. కొన్ని దశాబ్దాలపాటు పాఠకుల్ని రంజింపజేసిన ఈ ఉపన్యాసాల్లో- లోకవిమర్శ, తార్కికదృష్టి, స్వభాషాభిమానం, జాతీయతాభావం దురాచారఖండన, హాస్యప్రియత మొదలయినవాటిలో ఏది తక్కువో ఏది ఎక్కువో అంచనా వెయ్యడం బహుకష్టం. ఇవన్నీ పానుగంటివారి మూర్తిమత్వంలో అంతర్భాగాలయితే వాటన్నిటికీ అద్దంపట్టేది ఆయన భాషాశైలి. దానిపట్ల ఆయనకొక ప్రత్యేక శ్రద్ధ ఉంది. విషయబోధను దృష్టిలో పెట్టుకున్నా, నుడికారం సొంపు పెంపులను దృష్టిలో పెట్టుకున్నా పద్యానికున్న పరిమితులు గద్యానికి ఉండవుకాబట్టి గద్యంలో రాసిన గ్రంథాలు భాషలో విరివిగా రావాలన్నది ఆయన ఆశయం. అందులో రకలకాల శైలులు చోటుచేసుకోవాలన్నది ఆయన ఆకాంక్ష. దాన్ని ఆయన మాటల్లో వింటేనే రమ్యుగా ఉంటుంది.

''చిత్రములైన శైలీభేదములు మనభాషలో మిగుల నరుదుగా నున్నవని

చెప్పనేల? రైమని పేకచువ్వ పైకెగిరినట్లున్న శైలిభేదమేది? కాకి పైకెగిరి యెగిరి టెక్కలు కదలకుండ జందెపుబెట్టుగ సాపుగ వాలుగ దిగునట్టి లఘుపతన చమత్కృతి కనబఱుచు శైలి పద్ధతియేది? తాళము వాయించునప్పటి తఘకుబెఘకులు, టింగుటింగులు, గలగలలు, జలజలలుగల శైలియేది?........భయంకరమయ్యును మనోహరమై, మహాశక్తిసక్తమయ్యు మార్దవయుక్తమై, ధారాళమయ్యు విశాలమై, స్వభావసమృద్ధమయ్యు సరసాలంకారభూయిష్ఠమై, సముద్రఘోషము గలదయ్యు సంగీతపాయమై, స్పష్టీకృత సకలవిషయతత్త్వమయ్యు నస్పష్టస్వకీయతత్త్వమై, చదువరులకు గనుకట్టై, వాకట్టై, మదిగట్టై తలపులిమినట్లు శ్వాసమైన సలుపకుండ జేసినట్లు, ముష్టివాని చిప్పనుండి మూర్ధాభిషిక్తుని కిరీటమువరకు భూమిక్రింది యరల నుండి సముద్రములోని గుహలవరకు, నెవరెస్టుకొండనుండి యింద్రధనుస్సు రంగులవఱకు, మందాకినీ తరంగరంగద్ధంసాంగనాక్రేంకారములనుండి మహాదేవ సంధ్యాసమయ నాట్యరంగమువఱకు మనోవేగముతో నెగురు శక్తిగల చిత్ర విచిత్ర శైలిభేదములింక నెన్నియో భాషలో బుట్టవలసియున్నవి" అన్నారాయన శైలిలో ఇన్ని అవాంతరభేదాలుంటాయని ఊహించడమే కష్టమనుకుంటే వాటి నింత ధారాళంగా, ఆలంకారికంగా చెప్పడం మరీ కష్టం. చిత్రమేమిటంటే, పానుగంటివారు శైలీభేదాలకు ఈ విధంగా లక్షణం చెప్పడం చూస్తే దానికి లక్ష్యాలు తమ ఉపన్యాసాల్లో కోకొల్లలని ధ్వనించినట్టనిపిస్తుంది.

శైలి అనేది వ్యక్తి జీవలక్షణమంటారు విశ్వనాథ సత్యనారాయణగారు. అంటే, సిద్ధహస్తుడి శైలిలో ఆ ముద్ర స్పష్టంగా గోచరిస్తుందన్నమాట. తెలుగు వచన సాహిత్యంమీద అంతట గాఢమైన ముద్రవేసినవారు పానుగంటివారు.

వచన సాహిత్యమనగానే గ్రాంథికవ్యావహారిక భాషలు రెండూ పోటాపోటీలుగా కనిపిస్తాయి. ఈ తిరకాసు మనభాషను బాధించినంతగా మరే భాషనూ బాధించలేదేమో మరి! దాని మూలంగా వాదోపవాదాలూ ఖండనమండవలూ బయల్దేరి, పండితుల శక్తియుక్తుల్ని పెడదారి పట్టించాయి. నిజానికి, గ్రాంథికమేమిటి, వ్యావహారికమేమిటి-రెండూ ఒకే నాణానికి బొమ్మా బొరుసూను. ఇట్లాటి సమరసభావంఆరోజుల్లో లేకపోయింది మరి.కనక అప్పటిపరిస్థితుల ప్రభావం పానుగంటివారిమీద గట్టిగా పనిచెయ్యడంలో ఆశ్చర్యం లేదు. పరిస్థితులనడంలో నా ఉద్దేశం స్వతహాగా ఆయనకు ఏర్పడ్డ మొగ్గూమోజూ పండితులమధ్య అభిప్రాయ

భేదాలూ అనేకాదు- ఆయనకు పోషకుడైన పిఠాపురం రాజాగారి అభిరుచి కూడా లెక్కకువస్తుంది. రాజాగారు సంఘసంస్కరణకయితే సుముఖులుకాని, భాషాసంస్కరణకు (ప్రాచీన భాషాసంప్రదాయ పునఃప్రతిష్ఠాపనకు) విముఖులు. మొత్తంమీద-కారణాలు ఏవయితేనేం గాని పానుగంటివారు గ్రాంథిక భాషనే చేపట్టారు. కాని దాన్ని సంకుచిత పరిధిలో బంధించడం ఆయనకు ఇష్టంలేదు. వ్యావహారికంలో ఉన్న పలుకుబళ్ళనూ క్రియారూపాల్నీ గ్రాంథికీకరించి ప్రమాణతాముద్రవేసుకొన్నారు. ఆ గ్రాంథిక భాషాభిమానం ఎందాకా వెళ్ళిందంటే- మామూలుగా నాటకాల్లో పాత్రోచితంగా పలికించవలసిన భాషకు సైతం గ్రాంథికాన్నే ఆశ్రయింయించారు. తాము ఒక విషయాన్ని గాఢంగా నమ్మినప్పుడు సర్వాత్మనా దాన్ని ఆచరించి చూపించడమే ఆయన వ్యక్తిత్వం.

సాధారణంగా, ఈయన వాక్యాలు చిన్నచిన్నవి. కాని అప్పుడప్పుడు పంక్తులకు పంక్తులు దీర్ఘంగా సాగుతూంటాయి. కాని, వీటిలో ఒక విశేషముంది. ఒక్కొక్కచోట తూగు కనిపిస్తుంది. ఒక్కొక్కచోట వేగం పుంజుకొంటుంది. మరొకచోట పదగుంఫనం కనిపిస్తుంది. ఇంకొక్కచోట విచిత్ర విన్యాసం కనిపిస్తూంటుంది.

వాక్యాల్లో, చదివే ఊపునుబట్టి ఒక భాగం మరో భాగంతో సమతాస్థితికి వస్తుంది. "కవిత్వమన్న, నగాధహృదయము గల-యాడుది చెప్పవలయును. ఆహ్లాదపు బావియగు-నాడుది చెప్పవలయును. ఔచిత్యపురాశియగు-నాడుది చెప్పవలయును", అన్నప్పుడు మూడు వాక్యాల్లోనూ నిర్దిష్టమైన చోటే వాక్యం విరుగుతూంటుంది. ఈ వాక్యం చూడండి : "చీమకుత్తుకలో సింహము ప్రవేశించినదే ! సముద్ర సప్తకము చాటిపడియలో నిఱికినదే ! పరమాణువులో పర్వతమిమిడినదే! కాసులేనివాని గుడిసెలో కైలాసపర్వత మవతరించినదే!" అంటారు. ఇలా అనేక వాక్యాల మాలికల్లో ఈ తూగు ఉంటూంటుంది: "వైద్యుడు లేకుండా వ్యాధిదాటింపవచ్చును. పురోహితుడు లేకుండ బెండ్లి నీడువవచ్చును. పొసగుడువాడు లేకుండ సంత సాగింపవచ్చును. భోక్తలేకుండ తద్దినము కడతేర్చవచ్చును"అని చెబుతూ, "కాని, వార్షికోత్సవము మాత్ర మగ్రాసనాధిపతి లేకుండా దెప్పదాటించుటకు వీలు లేకుండపోవుటచేత..." అంటూ సాగిస్తారు. ఈ శైలిలో ఇంకో తమాషా ఉంది-అసంభావ్యమైన వాటిని సంభావ్యాలుగా చెప్పి. ఒక స్వల్పవిషయాన్ని గొప్ప

అసంభావ్యంగా చెప్పడం. ఈ వాక్యం గమనించండి : "అన్నము లేనివాని బాధ బాధ కాదు; భార్యలేనివాని బాధ బాధకాదు; కొడుకు లేనివాని బాధ బాధకాదు; పొడుము లేనివాని బాధ ముమ్మాటికిని బాధ," అంటారు.

ఇక వేగాన్ని గురించి చెప్పవలసివస్తే పానుగంటివారినే ముందు చెప్పాలి. పాఠకుడిలో తహతహ పుట్టించి, చకచకా చదివించేటట్టు చేస్తారు. 'స్వభాష'అనే ఉపన్యాసంలో- "ఆంధ్రదేశమున బుట్టిన పక్షులైన ననవరత శ్రవణమున నాంధ్రమున మాటలాడుచుండగా- అయ్యయ్యో ! మనుజుడే ! అంత మనుజుడే ! ఆంధ్ర మాతాపితలకు బుట్టినవాడే- ఆంధ్రదేశీయ వాయు నీరాహార పారణ మొనర్చినవాడే- అధమాధమ మూఱు సంవత్సరముల యీడువఱకైన నాంధ్రమున మాటలాడినవాడే- అట్టివా డాంగ్లేయ భాష నభ్యసించినంత మాత్రమున నిప్పుడాంధ్రమున మాటలాడలేకుండునా ? ఆశ్చర్యము. అవిశ్వసనీయము. అసత్యము." అంటారు.

ఏ చిన్నవిషయం చెప్పవలసి వచ్చినా, కుప్పలు తెప్పలుగా మాటలు దొర్లించడం వీరికొక అలవాటు. ఒకే విషయానికి పది ఉపమానాలు చెబుతారు. వాక్యాల దొంతర్లు పేరుస్తారు :

"నీవేడ్చుచున్న తెలివితక్కువ, నిర్భాగ్యపు, టల్లరి చిల్లరి, యవకతవక, యాసమ్మ యోసమ్మ, యారిగచొప్ప, యలుకుగుడ్డ కవిత్వము నే జెప్పలేక మానివేయలేదు. గడియసేపు ఛందోగ్రంథ మేదైన జూచితినేని నీ పేలపిండి, వట్టిగడ్డి, కల్లబొల్లి, కాకికూత కవిత్వము నా కవిత్వముచుట్టు ముమ్మారు త్రిప్పిత్రిప్పి దిగదుడుచుటకైనను బనికిరాకుండ జేయగలుగుదును." ఈ విధంగా మాటలు గుప్పించడమే కాదు, కొత్తకొత్త సమాసాలు తమాషాగా సృష్టిస్తూ ఉంటారు. న్యాయవాదుల్ని 'కాలాంబర కవచధారు'లంటారు. పనికిమాలిన పలుకుల్ని 'బోదకాలి మాట' లంటారు. కట్ బనియన్‌ని 'ఖండకర కార్పాస కుర్పాసము' అంటారు. అప్పుడప్పుడు ధ్వన్యనుకరణాలు ప్రయోగిస్తారు- "గలగల, ఝుణఝుణ, గణగణ, తళతళ, పెళపెళ" వగైరా. ఒక చిన్నభావాన్ని దీర్ఘసమాసాల్లో చెబుతారు. సంసారమనేదాన్ని, "సంసార సంఘసమావిష్ట సతీపుత్త్ర పౌత్త్ర ప్రపౌత్త్రాది సన్నిపాతము"అనీ, చిత్రమనడానికి, "చిత్రవిచిత్రాతి-విచిత్ర మహాచిత్రము"అనీ అంటారు. శబ్దాలంకారాలు పంతులుగారికి మహామహా ఇష్టంట:

భావవేగాన్వితమయిన చిత్రణ వీరి రచనలో మరొక చమత్కారం: "ఒక గులాబిపువ్వులోని సారళ్యము, సౌందర్యము, సౌరభము నాలోకింపబోయి, యాస్వాదింపబోయి, యనుభవింపబోయి, యా పుష్పసౌభాగ్యముతో గలిసి. యా కేసర మార్దవమున నార్ద్రిమై, యా మకరంద బిందు సందోహమున లీనమై మన సట్టె యట్టె తన్మయత్వమును జెందుచున్నదే. తుట్టతుదకొక్క గడ్డిపోరకలో బర మేశ్వరుని కరుణ, పరమేశ్వరుని లీల, పరమేశ్వరుని జ్ఞానము, పరమేశ్వరుని యానందము, పరమేశ్వరుని మహిమము భావించి, యా మూర్తిని సేవించి సేవించి, యా శక్తిని ధ్యానించి ధ్యానించి తరింపవచ్చునుగదా!" అంటారు.

మొత్తంమీద పానుగంటివారి శైలి ఆలంకారికంగా సాగుతుంది- అవి శబ్దాలంకారాలు కావచ్చు; అర్థాలంకారాలు కావచ్చు. సాక్షి వ్యాసాల్లో అనేక ఘట్టాల్లో ఒకటి రెండు పుటలదాకా సాగే ఆలంకారిక రచన గోచరిస్తుంది. ఔపమ్య మూలకమైన అలంకారాలంటేనే ఆయనకు ఎక్కువ ఇష్టం. ఉపమాలంకార ప్రయోగ బాహుళ్యాన్నిబట్టే ఆయనకు 'ఆంధ్రకాళిదాసు' అన్న బిరుదు వచ్చింది. 'హరిభక్తురాలి వైభవము' అన్న ఉపన్యాసంలో 'భావికాలంకారం' కథనాని కొక వన్నె తెచ్చింది. ఏనాడో జరిగిపోయినవాటిని ఈనాడు కళ్ళకు కట్టినట్టు చెప్పడం భావికాలంకారం. వరదాచార్యుడి భార్య, రామానుజాచార్యులవారికి భిక్ష ఇవ్వడానికి ఏ వైశ్యునికైనా తన ఒళ్ళు అమ్ముకొని అవసరమయిన వస్తువులు కొనుక్కొద్దామని పోతూఉంటుంది. ఆ ఘట్టంలో పంతులుగారి రచన ఎలా సాగిందో చూడండి:

"రామరామా! సాధ్వీతిలక మెంత సాహసమున కొడిగట్టినదో! అయ్యయ్యో! పరివ్రాజక సమారాధన మాచరింప నిశ్చయించుకొనినదా? అయ్యయ్యో! అప్పుడే యింటినుండి బయలుదేరినదే! ఆహా! ఆహాహా! ఇప్పుడైన నామె కాళులకు దారిలో నాల్గురూపాలున్న మూట దగులరాదా? మూటయు వలదు, ముల్లెయు వలదు. ఆమె మృదులారుణ చరణమునకేదైన కఱకుఱాయి దగులుటచే నామె ప్రయాణ మాగిపోరాదా? రంగ రంగ రంగా! నీ వామెకు ప్రసాదించిన మహాదారిద్ర్యము వలననే కదా యా నారీశిరోమణి యిట్టి ఘోరకృత్యము నొనర్ప నిశ్చయించుకొనినది. నీవైన నామె నాపజాలవా? ఇది పాపమే యగునెడల నీ పాపమునకు బాధ్యుడవు నీవగుదువు జాగ్రత్త! రంగ రంగ రంగా! రక్షింపవా? ఱాయియైన నడ్డుపడదే! రంగడైన నడ్డుపడడే! అయ్యయ్యో!" అంటారు పానుగంటివారు.

ఈ విధంగా పరిశీలిస్తే లక్ష్మీనరసింహారావుగారు తాము కాంక్షించిన 'ప్రాణ దురంధరమైన' శైలిని సమగ్రంగా సాధించారన్నది స్పష్టమవుతుంది. 'సాక్షి' ఉపన్యాసాల్ని ఆయన సాటిలేని రీతిగా తీర్చిదిద్దారు; జంఘాలశాస్త్రికి తమతో అభేదం కనబడిచారు.

(16-8-1973; రేడియోలో ప్రసారమయింది)

# 12

# శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రచనలు : భాషావిశేషాలు

## పరిచయం

సుమారు నాలుగు దశాబ్దులకిందట రాజమండ్రి రాజవీధుల్లో ప్రసిద్ధ సాహితీ మూర్తులు దర్శనమిస్తూండేవారు. ఒకరు శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు, మరొకరు భమిడిపాటి కామేశ్వరరావుగారు, ఇంకొకరు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, మరొకరు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు- ఇలా మరికొందరు. ఒక్కొక్కరు ఒక్కొక్క రంగంలో సుప్రసిద్ధులు; ఒక్కొక్కరిది ఒక్కొక్క విశిష్ట వ్యక్తిత్వం.

ఇన్నీసుపేటలో (ఇప్పుడు దాని పేరు 'త్యాగరాజనగరం') చల్లపల్లివారి వీథిలో దక్షిణంవైపు వెళ్తే కుడిపక్క చివర, గోపీచందనంరంగు ఇల్లు కనిపిస్తుంది. ఆ ఇంట్లో పడమటివైపు వాటాలో, వీధి గుమ్మానికెదురుగా నేలమీద చాప వేసుకొని, ముందు 'డస్కుపెట్టె' పెట్టుకొని దీక్షగా రాసుకొంటూ కూర్చునే శ్రమజీవీ-

వీథిగుమ్మం పక్కనున్న సన్నటి చిన్న అరుగుమీద తలవంచుకొని పచార్లు చేస్తూ ఏ కథావస్తువు మీదో మనస్సునిలిపి బయటి ప్రపంచాన్ని మరిచిపోయే ఆలోచనాపరుడూ-

తెలుగువాడి చుట్టూ ఉన్న ప్రపంచంలో కొట్టవచ్చినట్టు కనిపించే అవకతవకల్ని చూసి ఓర్చుకోలేకా, వాటి సంగతే పట్టించుకొనేవాళ్ళ క్రియాశూన్యతకు సరిపెట్టుకోలేకా, ఉన్న పరిస్థితుల్ని ఉన్నవి ఉన్నట్టు కళ్ళకు కట్టించి,మనుషుల్ని కదిపీ కుదిపీ పాలుమాలిక పారదోలీ వాళ్ళ ఆలోచనల్నీ ఆచారాల్నీ గుడ్డినమ్మ

కాల్నీ మరమ్మత్తు చేసి, కొత్తచూపునిచ్చి కొత్తదారికి మళ్ళించి కొత్తబతుకు బతకమని పురికొలపడానికి ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో నిరుకుచేసుకొని, తన ఆలోచనా తన ఊహా తన ఆశయమూ తన తపనా తనరాతా తనచేతా అన్నీ అందుకోసమేనని గంభీరంగా, నిబ్బరంగా రాజవీథిలో నడక సాగించే సాహితీసింహుడూ- చూపులో నిశితత్వమూ మాటలో నిశ్చితత్వమూ వేషంలో ఆధునికత్వమూ భావాల్లో విప్లవత్వమూ రచనలో సహజత్వమూ సమగ్రత్వమూ సౌందర్య తత్త్వమూ కళావేతృత్వమూ మేళవించిన అసమాన ప్రతిభాశాలీ-

పంతంవచ్చినా, పట్టింపువచ్చినా, పదిమంది తనను కాదంటున్నా, ఎంతమంది యద్దేవా చేస్తున్నా జంకని, కొంకని, బిగువు సడలని నిశ్చల ఆత్మగౌరవాభిమానీ- ఒక్కటయి రూపుగట్టిన సాహితీతపస్వీ, అచ్చమయిన- బతుకులాంటి సహజమయిన- తెలుగుభాషావచస్వీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

తెలుగువాళ్ళ మేలుకోసం, తెలుగులోనూ తెలుగువాళ్ళలోనూ తెలుగుతనంకోసం, వాళ్ళలో తెలుగు సాహిత్యాభిరుచి పెంచడంకోసం, కళాకారులకూ సాహితీకారులకూ సముచిత గౌరవాదరాలు ఏర్పడ్డంకోసం ఆయన ప్రచురించి ప్రచారం చేసిన గ్రంథాలూ నడిపించిన పత్రికలూ నిర్వహించిన సాహిత్యసభలూ ఆ రోజుల్లో రాజమండ్రి పురవాసులకు బాగా తెలిసినవే.

'ఆంధ్రభీష్మ' న్యాపతివారి వీధిలో ఎడంపక్క మూడో ఇంటినుంచి డోలూ సన్నాయి మేళంతో బయలుదేరిన ఊరేగింపు ఏమిటనుకున్నారు ? వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సన్మానోత్సవ సంరంభంలో ఒక భాగం. దాన్ని తలపెట్టినవారూ నిర్వహించినవారూ ఎవరు? శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

రాజమహేంద్రవరంలోనే కాక చుట్టుపక్కల ఊళ్ళలోనూ కొన్ని దూర ప్రదేశాల్లోనూ ఉన్న గొప్పగొప్ప సాహితీవేత్తలు ఒకనాటి సాయంత్రం టౌన్ హాలుకు తూర్పువైపు వీధిలో సమావేశమయి సాహితీసమారాధప చేసిందెవరికి ? కడపజిల్లాలోని పొద్దుటూరి నుంచి వచ్చిన 'శివభారత'కర్త గడియారం వేంకటశేషశాస్త్రిగారికి. ఆ మహోత్సవ నిర్వాహకులూ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారే.

జ్ఞాపకం చేసుకొంటే ఇలాంటివి ఇంకా ఎన్నో !

సాహితీవ్రతదీక్షలో, నిర్వాహదక్షతలో ఆయనకు ఆయనే సాటి.

ఆ మహానుభావుడు పుట్టి నూరేళ్ళుఅయింది.
కనక— ఇది శ్రీపాద శత జయంతి సంవత్సరం.(1991)

శాస్త్రిగారు కవిగా సాహితీరంగంలో అడుగుపెట్టారు; విశిష్టవచన రచయితగా నిలిచిపోయారు.

కావ్యభాషాశైలిలో ప్రారంభించారు రచనలు; శిష్టవ్యావహారిక శైలికి చక్కని వరవడి పెట్టారు; "ఇదుగో, ఇదీ 'ఆధునిక ప్రమాణ భాష' అంటే. ఇదీ జవమూ జీవమూ ఉన్న భాష. మనిషిలోని ఎత్తులూ లోతులూ చూపించే భాష ఇదీ. వేగమూ లోతూ ఉన్నభాష ఇదీ. ఇప్పటివాళ్ళూ రేపటివాళ్ళూ కళ్ళకద్దుకొని ఆదరించే భాష ఇదీ!" అంటూ నలుగురూ చెప్పుకొనే విధంగా రచనలు చేశారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథారచనలనుగురించి మిత్రుడు చామర్తి కనకయ్య (కనక్ ప్రవాసి) 'శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్న కథలు : సమగ్ర సమీక్ష' (1986) అన్న పరిశోధన గ్రంథం రాసి పిహెచ్.డి. పట్టం పుచ్చుకున్నాడు. శాస్త్రిగారి కథావస్తువుల్లో వైవిధ్యమూ కథా నిర్వహణలో వైపులమ్యూ ఆయన రచనల తీరుతెన్నులూ ఆయన సాహితీ వ్యక్తిత్వమూ చక్కగా వివరించాడు.

ప్రస్తుత వ్యాసం శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి భాషావిశేషాలకు మాత్రమే పరిమితమయింది. ఈ పరిశీలనకోసం ఎన్నుకొన్నవి మూడు గ్రంథాలు :

1. 'శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్న కథలు', సంపుటి 4. రెండో కూర్పు, 1954 (మొదటి కూర్పు 1940), కలాభివర్ధినీ పరిషత్తు, రాజమహేంద్రవరం.

   ఇందులో ఉన్నవి రెండు కథలు - 'గూడు మారిన కొత్తరికం' (1927 ఆగస్టు 'అభ్యుదయ' పత్రికనుంచి - సవరణలతో; పుటలు 119);
   'అరికాళ్ళకింద మంటలు' (1935 'ప్రబుద్ధాంధ్ర' నుంచి — సవరణలతో పుటలు 38)

2. 'రాజరాజు', నాటకం, మూడో కూర్పు (మొదటి కూర్పు అక్టోబరు 1944; కలాభివర్ధినీ పరిషత్తు, రాజమహేంద్రవరం) ఎమెస్కో పాకెట్ బుక్స్, ఎం. శేషాచలం అండ్ కో, సికింద్రాబాదు, 1971; పుటలు 232)

3. 'అనుభవాలూ జ్ఞాపకాలూను', ఆత్మకథ, సంపుటి 2, (మొదటి కూర్పు జనవరి 1958, కలాభివర్ధనీ పరిషత్తు, రాజమహేంద్రవరం; పుటలు 444).

ప్రస్తావవశంగా పై మూడు పుస్తకాల్లోంచి తీసుకున్న మాటలు ఈ వ్యాసంలో ఉదాహరించినప్పుడు పక్కనే బ్రాకెట్లలో పుస్తకం వరస సంఖ్య, ఆ తరవాత పుట సంఖ్య (1.68) సూచించడం జరిగింది.

## భాష : శైలి మాండలికత

సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వచన రచనలు మొదట్లో కావ్యభాషలోనే ఉండేవి. రెండోదశలో కథనం కావ్యభాషలోనూ, శీర్షికలు వాడుక భాషలోనూ ఉండేవి. కొన్నిట్లో సంభాషణలు కూడా వాడుకభాషలోకి వచ్చాయి. ఆ తరవాతి దశలో రచన యావత్తూ వాడుకభాషలోనే సాగింది. (ఈ శతాబ్ది మూడో దశకం నుంచి.)

శాస్త్రిగారి రచనల్లో-దాదాపు అంతటా-ఉన్నది 'ఆధునిక ప్రమాణభాష' (దాన్నే శిష్ట వ్యావహారికమనీ, వాడుకభాష అనీకూడా అంటూంటారు). రచయిత కథనంలోనూ అనేక పాత్రల సంభాషణల్లోనూ ఇదే కనిపిస్తుంది. శాస్త్రిగారు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా అనపర్తి, రాజమండ్రి, పిఠాపురం వంటి చోట్ల ఉంటూ వచ్చినవారు కాబట్టి ఆ ప్రాంతపు ప్రత్యేకమైన, పలుకుబళ్ళమీద కూడా ఆయనకు మంచి పట్టు ఉంది. ఆయన పాత్రలుకూడా ఆ ప్రాంతాన్ని దాటిపోయినవి కావు కాబట్టి ఆ పాత్రల సంభాషణల్లోకూడా సముచితంగా, సహజంగా, ఆ శైలీ ఆ పలుకుబళ్ళూ వస్తూఉంటాయి. వర్గ, ప్రాంతీయ మాండలికతల్ని కనబరిచే రూపాలు కొన్ని ప్రమాణభాషలోనూ ప్రమాణభాషరూపాలు కొన్ని ఆయా మాండలికాల్లోనూ చేరడం చాలా సహజం. ప్రామాణికభాషా పరిపుష్టికి అవసరం కూడా. ఈ విధంగా ఆధునిక ప్రమాణభాషకు పుష్టి చేకూర్చిన ఆద్యుల్లో సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఒకరు.

ఒకే విషయాన్ని చెప్పేతీరులో దేశకాల సమయ సందర్భాలవంటివాటిని బట్టి వచ్చే తేడాలే శైలీ వైవిధ్యాలు. ఇవి ప్రతి రచయితలోనూ-జీవద్భాషలో

చేసిన ప్రతి రచనలోనూ- కనిపిస్తాయి; మనిషి జీవితంలో సరేసరి. శాస్త్రిగారి రచనల్లో 'అనుభవాలూ జ్ఞాపకాలూను'లో ఉన్న శైలికి 'అరికాళ్ళకింద మంటలు' లాంటి కథల్లో ఉన్న శైలికీ వైవిధ్యం కనిపిస్తూ ఉంటుంది. పామర పాత్రలచేత, ఆ పాత్రకు సహజమైన శైలిలో మాట్లాడించడమూ ఉంది. వేదాధ్యయనానికి కాని, సంగీతసారస్వతాలకు కాని, వర్తకవ్యాపారాలకు కాని సంబంధించిన సందర్భాలు వచ్చినప్పుడు శాస్త్రిగారు ఆయా వర్గాలకు పరిమితమయిన పరిభాషనూ పలుకుబళ్ళనూ కూడా ప్రయోగించారు. వాటిలో కొన్ని ఇప్పుడు అంతగా వాడుకలో లేవు; కొన్ని నిఘంటువులకూ ఎక్కలేదు. ఆధునిక ప్రమాణ భాషకు వర్ణనాత్మక వ్యాకరణం రాయాలన్నా తెలుగుభాష కొక సమగ్రమయిన నిఘంటువు తయారుచెయ్యాలన్నా శాస్త్రిగారి రచనలను తప్పనిసరిగా-విధిగా-పరిశీలించవలసి ఉంటుంది.

శ్రీపాదవారి వచనరచనల్లోని భాషావిశేషాలను స్థూలంగా 8 వర్గాలుగా విభజించడం జరిగింది. ఆధునిక ప్రమాణభాషలో సర్వసామాన్యమయిన ప్రయోగాలను (రూపాలను) పరిశీలనలోకి తీసుకోలేదు. కాని వైవిధ్యమున్నచోట్ల, ఆయన ఎంపిక చేసుకొన్న రూపాలను విస్మరించనూ లేదు. వాటిలో కొన్ని మాండలికతాముద్ర ఉన్నవి కావచ్చు; కొన్ని వైయక్తిక ఇష్టరూపాలు కావచ్చు. కొన్ని, వాడినచోటల్లా పూర్తిగా ఒకే రూపంలో ఉండవచ్చు; కొన్ని రూపాంతరత ప్రదర్శించవచ్చు.

## 1. పదాలు

### (అ) మామూలు పదాలు

రెడ్డికం (1.9) 'రెడ్డిగం' (కూర్చొనే ఒక పద్ధతి)
ఉపమా (1.45) 'ఉప్మా'
కోపె (1.57) 'కప్పు'
జిలోబీ (1.57) 'జిలేబీ'
తొరక (1.81) 'మీగడ తరగ'
పొట్టం (1.109) 'పొట్లం'

కుశ్శంకలు (2.95) 'అనవసరపు అనుమానాలు, వాదస్త్రాలు'
రివ్వ (2.118) 'గాలివిసురు'
దిలాసా (3.80) 'ధైర్యం, నిబ్బరం'
బదులు (3.92) 'జవాబు'
కేవు (3.218) పడవ, రైలు మొ. వాటి ఛార్జి'
దుగ్ధ (3.277) 'కడుపుమంట, అసూయ'
డలాయతు (3.439) 'బిళ్ళబంట్రోతు, బాడీగార్డ్'
సంత (3.56) 'వేదపాఠం, గురువు ఒకసారి చెప్పినదాన్ని శిష్యులు రెండేసి సార్లు పలుకుతారు '
వల్లె (3-56) మళ్ళీమళ్ళీ వేదపాఠం నెమరువేసుకోడం, వల్లింపు, కంఠపాఠం'
పనస (3.350) ఏభై పదాలు గల వేదభాగం, వేద ప్రశ్నాంశం' (పంచాశత్-పణ్ణాసా)
పొగచు (1.32) "తిరగబోతపెట్టు, తాలింపుపెట్టు'
దుబ్బు (2.102) 'రాలు'
వల్లన (3.57) 'వల్లెవెయ్యడం, కంఠస్థంచెయ్యడం'
బోకారించు (3.96) 'పోగొట్టు'
పరకాయించు (3.395) 'పట్టిపట్టి చూచు'
డెకారించు (3.249) 'తిరగబడు'
ముదలకించు (1.84) 'ఎదిరించు'
మెళుకువ (3.110) 'మెలకువ'
సుళువు (3.137) 'సులువు'
అబ్బరం (3.271) 'అబ్బురం'
విలవ (3.137) 'విలువ'

**(ఆ) పాండిత్యం కనబరిచేవి** (పదాలు, సమాసాలు, పదబంధాలు, వాక్యాంశాలు)

బిభీషిక (2.188) 'బెదిరింపు'

గ్రీవాభంగాభిరామంగా (1.55) 'మెడవంచి అందంగా కనిపించే లాగ'

ధౌతచిత్తులయి (1.100) 'మనస్సులో మాలిన్యం తొలిగినవారయి'

అంతఃపురికవిలాసాలు (1.118) 'అంతఃపురంలో చూపించే విలాసాలు'

ముగ్ధమోహనమైన (1.118) 'పరవశం కలిగించే, అందమైన'

సాకూతంగా (చూస్తాడు) (2.33) 'సాభిప్రాయంగా'

హరిః ఓం మొదలు ఇతిశ్రీగా (నేర్పిందిదే) (2.78) 'మొదటినుంచి చివరివరకు'

స్వస్తివాచనం (2.100) "స్వస్తిచెప్పడం, వెళ్ళగొట్టడడం, ముగించడం"

మృత్యుక్రోడం (2.108) మృత్యువు ఒడి'

గత్వాగత్వా (2.116) 'పోగా పోగా, కాగా పోగా, ఒకవేళ"

(భోజనం) ఉదాత్తం కావడం (2.124) 'ఎక్కువ కావడం; జీర్ణ శక్తికి మించింది కావడం'

యత్కించిత్తైనా (2.127) 'ఏ కొంచెమయినా'

వాచోవిధేయంగా (2.142) 'వాక్కుకు లోబడి'

శుకానువాదం చేస్తూ (2.216) 'చిలకలా మారుపలుకుతూ'

ముఖపిధానం (చేయు) (2.217) 'నోరు మూయించడం, ముఖం చాటువెయ్యడం'

కృష్ణాగోదావర్యోర్మధ్యదేశంలో (3.41) 'కృష్ణాగోదావరుల మధ్య ప్రాంతంలో'

జాడ్యజుష్టం అవుతూ (3.55) 'రోగానికి లోనవుతూ'

సకృదావృత్తిగా పారాయణ (3.58) 'ఒకే పర్యాయంగా చేసే పారాయణ'

ఝడితిశ్రవణం (3.64) 'త్వరగా వినడం' (ఝటితి–వేగం)

ఝడితి స్ఫురణం (3.226) 'త్వరగా స్ఫురించడం'

నప్రతిగ్రహిత (3.239) 'ఎవరి దగ్గరా ఏదీ తీసుకోనివాడు, దానం పట్టకపోవడం అనే నియమాన్ని పాటించేవాడు'

పిష్టపేషణం (3.280) 'చెప్పిందే చెప్పడం' (పిసికిన పిండినే పిసకడం)

(విశిష్టత) కర్ణతాడితం అయితేనే (3.315) 'చెవికి సోకితేనే'

మహదాశీర్వచనం (3.349) 'వేదపండితులు మంత్రాలతో చేసే ఆశీర్వచనం' (మహతామ్ ఆశీర్వచనం)

ఆత్మనేపది కాక పరస్మైపది అయిపోయింది నా కది (3.149) 'నా విషయంలో కాక ఇతరుల విషయంలో జరిగింది అది'

తుషాహననం (3.318) 'వృథాప్రయాస, ఊకదంపుడు'

(ఇ) పామర ప్రయోగాలు

లగ్గం (1.128) 'లగ్నం'

యగ్గెం (పట్టినోరు) (1.159) 'యజ్ఞం' (చేసినవారు)

## 2. పదబంధాలు

లేస్తూ (1.68) 'లేద్దూ'

లేచిరావో (1.71) 'లేచిరావే'

తోడబుట్టినది (1.133) 'తోబుట్టువు'

పాబడిపోయాక (1.160) 'పాతబడిపోయిన తరవాత'

లోపుచేసుకోగలవాడు (2.24) 'లొంగదీసుకోగలవాడు'

సెలగో సెలగ (2.64) 'సమృద్ధి' (-గా ఉన్నాయి)

(అలాగే) కాగట్టండి (2.91) 'కానివ్వండి'

చూతాం (2.145) 'చూద్దాం'

కలక్కపోవును (3.68) 'కలక్కపోయి ఉండేది'

నసిపడక (3.17) 'నచ్చక, సరిపోక, నప్పక'

మాటాశ్శేదు (3.74) 'మాట్లాడలేదు'

నిలవతీస్తూ (3.242) 'నిలదీస్తూ'
(నీ యిష్టంవచ్చినట్లు)తగులడు(1.130)'తగలబడు'(నిందార్థంలో)
వంకలు వన్నుతూ (1.5) 'వంకలు పెడుతూ లేదా కల్పిస్తూ'
రానూ పోనూ(3.218) 'రాకపోకలకు'
కూచోడం (2.172) 'కూర్చోడం'

## 3. సమాసాలు

తొలిమాటు (1.3) 'మొదటిసారి'
రెండోపెళ్ళిపెళ్ళాం (1.6) 'మొదటి భార్య పోయిన తరవాత కట్టుకొన్న పెళ్ళాం'
తేనెపానకం (1.7) 'గాను గాడించిన చెరుకురసం'
పొలికాపు (1.8) 'పొలేరు'
వెన్నపూస (1.9) 'వెన్న'
కవాచీబల్ల (1.9) 'నలుగురు కూర్చునే పొడుగాటి కొయ్యబల్ల' ("సొరుగులుపెట్టి చేసిన బెంచి, సాధారణంగా 20 అంగుళాల వెడల్పు, ఆరు అడుగుల పొడుగు ఉంటుంది"- (మాండలిక వృత్తిపదకోశం-వస్త్రరంగం)
ముద్దినిసు పిండివంటలు (1.15) 'అన్ని రకాల పిండివంటలూ'
ముద్దినిసు వరసలు (1-74) 'అన్ని రకాల వరసలూ'
సంగీతం పెట్టి (1.36) 'గ్రామఫోన్ పెట్టి' (హార్మోనియమ్‌కు కూడా వాడతారు)

తెరపిమరుపులు (1.50) తెలివి వచ్చీ రానట్టు ఉండడం'
తాంబూలప్పళ్ళెం (1.88) 'తాంబూల సామగ్రి ఉంచిన పళ్ళెం'
గంగాబొండం (1.94) 'నీరు ఎక్కువగా ఉండే గుండ్రటి కొబ్బరికాయ'

నిలువుకైదు (1.95) 'శిక్ష వేసినట్టుగా నిలబడి ఉండిపోవడం, కూర్చోడానికి వెసులుబాటు లేకుండా ఉండటం'

గొడుగులైటు (1.101) 'డోమ్ ఉన్న దీపం'

ఉలకం మాటలు (1.103) 'తేలిక (చేసి అనే) మాటలు'

ఓంభాయి పాట (1.117) 'ఒహోం-ఒహోం-ఓం-అంటూ పల్లకి బోయీలు పాడే పాట'

ఎదబంధాలు (కల్పించు) (1.122) 'ఎదబాట్లు' (కలిగించు)

రణకంపరం (1.156) 'ఎక్కువ కంపరం'

ఏకబంతి (2.124) 'ఒకే పంక్తి' (-లో భోజనం)

నాలుగ్ఘళ్ళరాత్రి (1.134) 'నాలుగు గడియల రాత్రి'

వ్యాసపీట (2.221) 'వ్యాసపీఠం'

పమిడిగంటం (2.221) 'బంగారపు ఘంటం'

క్షీరాబ్ధి పట్టుతాపితాలు (2.222) 'ఒకరకం అంచుపెట్టి నేసిన పట్టుపంచెలు'

ములకాటి కఱ్ఱ (3.56) 'ముల్లుకోల'

గుమ్మడిమూట (3.59) 'గుమ్మడికాయ ఆకారంలో కట్టిన మూట'

సిగ్గులచేటు (2.181) 'సిగ్గుచేటు'

కలతగొట్టు పాండిత్యం (3.64) 'కలత కలిగించే పాండిత్యం'

పిల్లిమంతరాలు (3.123) 'పిల్లి మొగ్గలు'

సన్నిధానవర్తి (3.171) 'ఒక పెద్దవాణ్ణి ఎప్పుడూ అంటిపెట్టుకొని ఉండేవాడు'

పడవ కేవు (3.218) 'పడవచార్జి'

కవిత్వప్పళ్ళెం (3.349) 'పెళ్ళిలో సదస్యంనాడు వధూవరుల గురించి ఆశీర్వచన పద్యాలు బాగా చెప్పి మెప్పించిన కవి అందుకొనేకానుక పళ్ళెం; అందులో కొంత డబ్బూ పండు తాంబూలాలు ఉంటాయి'.

యమచెర (3.24) 'భరించలేని బాధ, కష్టం'
విజ్జోడు (మనుషులు) (3.330) 'జత కలవని' జోడుకాని ఇద్దరు వేరు వేరు వ్యక్తులు'

## 4. జాతీయాలు

(వేడిమంగలం లాగ) మిటమిటలాడిపోతూ (1.3)'ఎగిరెగిరిపడుతూ'
చుక్క మూఢానపడుతున్నట్లు (కనపడింది) (1.4) 'ప్రతికూలమవుతున్నట్టు'

చేదుమేస్తోందా ఏమిటి? (1.5) 'విషం మింగుతోందా'?
పులుక్కూ పులుకూ (చూశాడు) (1.8) 'రెప్పలల్లారుస్తూ'
గబగబలాడి పోయింది (1.9) 'ఎక్కువగా ఆత్రపడింది'
దానా దీనా (1.12) 'మొత్తంమీద, దానివల్లా దీనివల్లా'
గడ్డిపెట్టు (1.14) 'చివాట్లుపెట్టు, బుద్ధిచెప్పు'
చేసుకుందమ్మా (అది) (1.7) 'పుణ్యం చేసుకొంది'
చెవల వాజమ్మ (1,1 9) 'ఒట్టి చవట'
ఒరగబెట్టు (1.22) 'సాయంచేయు' (నిందార్థంలో)
ముక్తాయించడం (1.22) 'చివరిలో అనడం, ముగించడం, మాట అంటించడం'

గుంపుదంపులు పడగా పడగా (1.26) 'చాలా కష్టపడినమీదట'
మీదిటికి (1.38) 'వచ్చే ఏడాదికి'
పులుగడిగినముత్యంలా(1.59)'మురికితీసేసిన ముత్యంలా, శుభ్రంగా'
తణుకోయి మాచవరంలాగ (1.63) 'చుట్టు తిరుగుడుదారి, వ్యర్థ ప్రయాస'

చలితేలులాగ (1.126) 'కనబడకుండా చల్లగావచ్చి కుట్టే తేలులాగ'
ఇసకపూడి వడ్రంలాగ(3.280)?'చేతకాని (వక్రటంగి) పనివాడిలాగ'
దుంపదంపలు చేసుకొని (రానే వచ్చారు) (1.45) 'చాలా కష్టపడి'

(మూతి) బిడాయించుకొని (1.55) (కావాలని మూతి) 'మూసుకొని'
(కోపంవల్లో, అయిష్టంవల్లో)

తక్కి తారి (1.57) 'జాప్యం చేస్తూ'

పుచ్చినట్టు (నడవాలి) (1.64) 'చచ్చినట్టు'

సంతనాగా (1.72) 'ఆనవాయితీగా, వతనుగా, వాడుకగా'

ఇంతా చేస్తే (1.82) 'ఎక్కువ కాదు' అనే సందర్భంలో

ఆశమ్మ బోశమ్మ కబుర్లు (1.86) 'పనీపాటూ లేని ముసలమ్మలు తీరిగ్గా కూర్చుని చెప్పుకునే ముచ్చట్లు'

కణుగూ పెణుగూ మాట్టాడ్డం (1.86) 'స్పష్టంగా కచ్చితంగా చెప్పడం'

గిలుకుగిలుకుమంటూ (1.101) 'గలగల్లాడుతూ, విలాసంగా'

దిమ్మచెక్కలాగ (1.121) 'కదలకుండా మెదలకుండా, స్థాణువు లాగ, మట్టసంగా'

ముసలాళ్ళు ముక్కాళ్ళు (1.121) 'వయస్సులో ఉన్నవాళ్ళే'

కుంకపీనుగ (1.126) 'కుర్రది' (నిందార్థంలో)

దుడుగూ దుడుగూ (అనెయ్యడం) (1.128) 'తొందరపడి మాట్లాడటం'

పడిచచ్చిపోవు (1.130) 'ఎక్కువగా ఇష్టపడు'

అయిందనిపించు (1.131) 'ఏదో ఒక మోస్తరుగా ముగించు'

ఒంటెత్తు పీనుగు (1.133) 'ఒట్టి స్వార్థపరుడు/-రాలు'

ముచ్చెం మూడుమాట్లు (1.142) 'మూడుసార్లు మాత్రం'

అఘోరించినట్టుంది (1.147) 'ఏడిసినట్టుంది'

రేపులే దెల్లుండి (1.154) 'రేపుకాక ఎల్లుండి'

మిడుతూ మిడుతూ (చూచు) (2.66) 'మిడిగుడ్లు వేసుకొని'

ఇదయిపోవు (2.69) 'మనస్సులో బాధపడు'

నీహారవేశాలు వెతుకు (2.85) 'వ్యర్థప్రయత్నంచేయు' (మంచు కణాలకోసం వెతకడం)

ఈదురోమంటూ (2.88) 'ఉసూరుమంటూ, సత్తువా సహనమూ పోయి ఆయాసపడుతూ'

మిడసరిలగ్గం (2.108) 'మిట్టమధ్యాహ్నం'
అట్టుపుట్టాణీలు (2.110) "పుట్టుపూర్వోత్తరాలు, పునాదులు'
నీటిలో జాడలుతీయు (2.115) 'అవలిస్తే పేగులు లెక్కపెట్టు, అసాధ్యమైన పని చెయ్యగలుగు'

కెక్కుకెక్కుమనిపిస్తూ (2.125) 'ఉక్కిరిబిక్కిరిచేస్తూ'
రాజాంగంగా (3.77) 'దర్జాగా'
నాలుక బుజాన వేసుకొని (3.117) 'ఊరూ వాడా ప్రచారం చేస్తూ'
మాటలు కాదు (3.127) 'సామాన్యం కాదు, సులువు కాదు'
సోరంటాలు (మొదలుపెట్టు) (3.214): 'సాధింపులు, వేధింపులు, ససపీకుడు మాటలు'

పిసుక్కొను (3.237) 'మనస్సులో బాధపడు, గింజుకొను'
అంశువారీ (3.239) 'క్షుద్రదానాలు పట్టే బ్రాహ్మడు'
రంగడి కుచ్చు(లా) (3.243) 'దర్జాగా, కులాసాగా, షోకేలాలాగ'
ఢంకామీద దెబ్బకొట్టి (3.254) 'బహిరంగంగా, నిర్భయంగా'
దొడ్డి సంభావన (3.350) 'అట్టే చదువుకోనివాళ్ళను గుంపుగా పెరట్లో ఉంచి అతిస్వల్పంగా ఇచ్చే దక్షిణ'

పళ్ళెలు చెప్పడం (3.350) 'పెళ్ళిలో సదస్యంనాడు వధూవరుల్ని ఆశీర్వదిస్తూ వేదపండితులు మహదాశీర్వచనం చెప్పడమూ కవులు పద్యాలు చెప్పడమూ. వేదపండితులకు ఒక పళ్ళెం, కవులకు 'కవిత్వప్పళ్ళెం' విడివిడిగా ఉంటాయి. వాళ్ళలో ఆశీర్వచనం బాగా చెప్పి మెప్పించినవాళ్ళకు ఆ పళ్ళెలు అందిస్తారు. పళ్ళెంలో కొంత డబ్బూ పండు తాంబూలాలూ ఉంటాయి.

దేవిడీమన్నా చెప్పించు (3.383) '(దివాణంనుంచి) వెళ్ళగొట్టించు, ప్రవేశం నిషేధించు'
బావురు పిల్లులతో కాట్లాడు (1.155) 'గుర్రుపెట్టడం'

## 5. సామెతలు

బూడిదలో చేసిన హోమం (3.63) 'పనికిమాలిన ప్రయత్నం'
చికిలీ చేసిన చంద్రహాసం (3.87) 'సానబెట్టిన కత్తి'
కరువున పోసిన (బంగారు విగ్రహం) (3.100) 'పోతపోసిన'
కొండా తగరూ ఢీకున్నట్టు (3.132) 'కొండా పొట్టేలూ ఢీకొన్నట్టు'
బంతిలో బాలపక్షం (చేయు) (3.225) 'పక్షపాతం చూపించు'
ముందే వుంది ముసుళ్ళ పండుగ (3.261) 'అనుభవించవలసిన కష్టాలు ముందున్నాయి'

## 6. విసుర్లు

అదేం పోయేకాలమో గాని (1.12)
అన్నట్టడగడం మరిచిపోయాను (1.34)
ఏదో శాస్త్రం చెప్పినట్టుంది (2.136)
నన్నడిగితే (3.113)
మరిగత్తే (2.112) 'మరంటే, మరేమో' (పామర ప్రయోగం)
(నీ కిదే చెప్పడం) ఏమనుకున్నావో (1.154)
హయ్యో, నా తెలివి తెల్లారిపోనూ! (1.109)

## 7. సహజోచ్చారణ నిరూపకాలు

సడే (1.16) 'సరే' (వెటకారంగా అనేది)
వరాసగా (1.72) 'పొడుగాటి వరసగా'
వుశాక్కుని (1.106) 'ఊడలాక్కొని'

హయ్యో (1.109) (అకారాన్ని ఒత్తి పలికేటప్పుడు)
చూ–శావా(1.109)(తనకు నచ్చని మాట ఒకరు అన్నప్పుడుకాని, ఫిర్యాదు చేస్తున్నప్పుడు కాని 'చూ'ను పొడిగించి పలుకుతారు)
ఏమిషే (1.121) 'ఏమిటే' (పాతకాలపు ముసలమ్మల మాటతీరు)
అంచే (1.122) 'అంటే' ,, ,,
గి–్రున (1.133) ('గి' తరవాత రకారప్వొల్లుమీద నాలిక ఒక్క్షణం నిలిపి 'రు'ను ఒత్తి పలుకుతారు; తిరగడంలో వేగాన్ని సూచించే తీరు)

ఇంచ–క్ఖటి పని (1.140) 'చాలా చక్కటి పని'
మాం–ఛి పని (1.140) 'చాలా మంచి పని'
పే–ద్ద (1.140) 'చాలా పెద్ద'
వో–ట్టి (1.40) 'ఎందుకూ పనికిరాని'
గోవిందా–గోః–వింద (2.70) (వ్యర్థప్రయత్నాన్నీ నష్టాన్నీ సూచించే తీరు)

పా–పం (2.70) (ఎక్కువ జాలిని సూచిస్తూ 'పా'ను సాగదీసి పలకడం)

చి–త్రం (2.77)
చి–త్–తం (2.95) } (అవతలివాడు చెప్పినది తనకు నచ్చక పోయినప్పటికీ సరే నంటూనే ఆక్షేపణను కాని వెటకారాన్ని కాని తెలపడానికి అధీనుడు పలికే తీరు)

సౌడబ్యం (2.159) 'సొగసు, అందం' (సౌలభ్యానికి వికృతరూపం; "నువ్వు చెప్పింది, లేదా చేసింది ఏడిసినట్టుంది," అనేది సూచించడానికి "బాగుంది సౌడబ్యం" అంటూంటారు).
చిటాచివర (2.172) 'చిట్టచివర'
గు-మ్-మని (8.72) 'ఎక్కువగా గుబాళిస్తూ'
బహూ్రాశావ్యంగా (3.81) 'చెవికి చాలా చాలా ఇంపుగా'

## 8. వాక్యాలు

1. మీరు మరీనండీ (1.23)
2. ఎంత పుణ్యం చేసుకుంటే అలాంటి పెనిమిటి దొరకనూ? (2.70)
3. ఊరికే పోడానికి వల్లా అమ్మా ? (2.68)
4. మరిచి పోవలసిందే, మరిచీ పోతాము (2.34)
5. పనికీ రాదు, లేనూ లేదు (2.108)
6. అంతా కుంగిన్నీ పోయారు (2.190)
7. వినాపడదు, కనాపడదు (2.226)
8. లచ్చమ్మగారు మన యింటికి వస్తున్నారా దినమ్మా? (1.34)
9. రయితు దగ్గిరే అట్టేపెట్టారు; వడ్డీకి (1.38)
10. ....మొగుడి మెడలో వున్న చేతులు తియ్యలేక తియ్యలేక తీసి, వాడిలో నుంచి లేవలేక లేవలేక లేచి, అడుగు ముందుకి వెయ్యలేక వెయ్యలేక వేసి - అంతలో ఆగిపోయి, గ్రీవాభంగాభిరామంగా వెనక్కి చూస్తూ....(1.55)
11. "మాట్టాడరేమండీ"?
"నోరు కుట్టేశావు కదుటోయ్ నువ్వు?"
"అయితే తమలపాకు చిలకముక్కులతో కుట్లు విప్పేస్తానుండండి" (1.87)
12. నేనేం తియ్యనన్నానా తియ్యనా? (1.122)
13. సాగనిస్తున్నారా యేమిటి? సాగనివ్వమని నే నేడ్చానా యేమిటి? దొడ్లో గేదీ వుంది, యింట్లో నేనూ వున్నాను....(1.127)
14. [కందులు] బాగుచెయ్యకపో, మహమ్మాయి వండించేస్తానో లేదో చూసుకుందువుగాని (1.127)
15. నీకిదే చెప్పడం ఏమనుకున్నావో (1.154)
16. అలాంటి పురుషుణ్ణి చెట్టపట్టని స్త్రీ చచ్చేం, బతికేం (2.70)
17. కించిత్తూ లేదు. ఇక్కడ లేనిదే అదీ (2.94)

18. అవునండోయ్ : అది బాగున్నట్టుంది ...బాగానే వుంది....చాలా బాగుందండీ (2.139)

19. తమకే సభ్యత వుండినట్టు, మహా... (3.68)

20. ఆతపతప్తునకు శరత్పూర్ణిమాకౌముది వేంకటరామశాస్త్రిగారి సన్నిధి, శీతార్తునకు వసంత బాలాతపం వంటిది రామకృష్ణశాస్త్రిగారి సన్నిధి (3.87)

21. ఒక్కమాటలో చెప్పాలంటే, —రెడ్డిగారి విగ్రహం ఆజానుబాహువూ, పరాక్రమం సింహసంహననమూ, రూపం మదనమోహనమూ, చూపు ప్రసన్నగంభీరమూ, వేషం రాజయోగ్యమూ, ప్రవృత్తి మాత్రం సాత్వికమున్నూ.

22. అది మంచనండి చెడ్డనండి, మంచికయినా చెడ్డకయినా నా నిశ్చయమే నిశ్చయం నాకు (3.263)

23. కనక, నేను రాసిన గ్రంథాలవల్ల కొందరికయినా బుద్ధి వికసించాలి, ఏ కొంచెమయినా, నా తెనుగువాళ్ళకి (3.426)

24. పోనీ "యెవర్ని చూసి నువ్విలాంటి దృక్పథం యేర్పరుచుకున్నావో ఆ బంకించంద్రుడు ... 'రాజసింహ' వంటి నవల రచించలేదా?" (3.431)

25. రాజరాజు: క్షోభపెట్టినవారు బిరబిగిసి ఉండడమూ, క్షోభ పెట్టబడ్డ వారు దయతలచడమూ, కటాక్షించడమూనూ, కదూ! (2.129)

(232 పుటలున్న 'రాజరాజు' నాటకంలో 'బడు' ప్రయోగం 129 పుటవరకు మూడుసార్లు వచ్చింది. పై వాక్యం రాజరాజ నరేంద్రుడినోటివెంట పలికించింది. మొత్తం 832 పుటలవరకు ఉన్న- నేను పరిశీలనలోకి తీసుకొన్న- మూడు పుస్తకాల్లో 'బడు' ప్రయోగమున్న సందర్భాలు ఈ మూడేనేమోనని నా అనుమానం. మహాఅయితే, నేను గమనించనివి మరో రెండు మూడు సందర్భాలు ఉంటే ఉండవచ్చు).

పై వింగడింపులో ఇచ్చిన ఉదాహరణలన్నీ ఎంచుకొన్న మూడు పుస్తకా ల్లోంచి అక్కడక్కడ తీసుకొన్నవి. నిదానంగా- అదే పనిగా చూస్తే- అనేకం కనిపిస్తాయి. వైపుల్యమే కాక వైవిధ్యం కూడా చాలా ఉంటుంది. ఇప్పుడిచ్చినవి మచ్చుకు మాత్రమే.

ఒకప్పుడు ప్రచురంగా ఉండి- నిఘంటువుల కెక్కకుండా- ఇప్పుడు చాలా విరళంగా ఉన్న మాటలు కొన్ని శాస్త్రిగారి రచనల్లో కనిపిస్తాయి. ఉదా. **లిగాడు, తాసిక**, 'లిగాడు' అన్న శీర్షికతో శాస్త్రిగారి రచనకూడా ఒకటి ఉంది. దానికి అర్థం తెలియక, మా మిత్రుడు చామర్తి కనకయ్య తెగ గింజుకున్నాడు. ఒకనాడు కాకినాడలో బజారుకు వెళ్ళినప్పుడు ఇద్దరు వర్తకులు మాట్లాడుకొంటూ ఉంటే విన్నాడట. : "ఉల్లిపాయల ధర చాలా లిగాడుగా ఉందిరా!" అన్నాడట ఒకాయన. కనకయ్యకు ప్రాణం లేచివచ్చింది. తరవాత ఒక కన్నడ నిఘంటువు తిరగవేస్తే అందులో "లిగాడు" కనిపించిందట. దీనికి 'నాసిగా తక్కువగా' అన్న అర్థం వస్తుంది. బహుశా కన్నడం ద్వారా మరాఠీలోంచి తెలుగులోకి వచ్చి ఉంటుందని అన్నాడతను. 'తాసిక' అన్నదానికి సందర్భాన్నిబట్టి 'చాడీ' అని అర్థం చెప్పుకోవచ్చు. (తాసికలు చెప్పడం=చాడీలు చెప్పడం.)అలాగే 'సోరంటం' సంగతి కూడా తేల్చుకోవాలి.

శ్రీపాదవారి లేఖనాభ్యాసంలో కొన్ని అంశాలు కనిపిస్తాయి. 1. ఎకార అకారాల మధ్య వచ్చే అచ్చుకు ('వచ్చాడు'లో రెండో అచ్చుధ్వని) తెలుగు వర్ణమాలలో చిహ్నం లేదు కాబట్టి కొన్నిచోట్ల ే గుర్తూ కొన్నిచోట్ల ా గుర్తూ రాయడం మనకు అలవాటు (ఉదా॥ వచ్చేటప్పుడు, వచ్చాడు). శ్రీపాద వారి రచనలో ా గుర్తే సాధారణంగా కనిపిస్తూ ఉంటుంది. ఉదా॥ తెల్లవారాటప్పటికి (1.68), వచ్చాటప్పటికి (1.84), లేచాటప్పటికి (1.132), వాయించాటప్పుడు (3.25).

2. పదాది ఉకారం 'వు'గాను, ఎకారం 'యె'గాను కనిపిస్తుంది. ఉదా॥ వులకం (1.103), యెదురింపు (2.137), ఒకారం 'వ/వొ' అవుతూంటుంది. (వళ్ళు, వొక)

3. రైతు, రైలువంటి మాటలు రయితు, రెయిలుగా రాస్తారు.

శ్రీపాద వారి రచనలకు కేవలం సాహిత్యపరంగానూ సమాజపరంగానూ దేశపరంగానూ మాత్రమే కాకుండా భాషాపరంగాకూడా గొప్ప విలువ ఉంది. "కావడానికి మీరు సిద్ధాంతిగారి అబ్బాయి; కాని నవీనాంధ్ర కథకులలో ఘనాపాఠీ అన్నారు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి గారు, శ్రీపాదవారికి రాసిన ఉత్తరంలో. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కేవలం కథకఘనాపాఠీయే కాదు, 'భాషాఘనాపాఠీ' కూడా అని నొక్కి చెప్పవచ్చు. భాషాశాస్త్ర పరిశోధకులకూ నిఘంటు నిర్మాతలకూ పనికివచ్చే గొప్ప గనులు శాస్త్రి గారి రచనలు. ఆయన '**అనుభవాలూ జ్ఞాపకాలూను**' మూడు సంపుటాలతోనే ఆగిపోవడం-సుమారు నలభై ఐదేళ్ళ జీవితానుభవాలు గ్రంథస్థం కాకుండానే ఆయన గతించడం - తెలుగువాళ్ళ దురదృష్టం.

అయినా తెలుగు సాహిత్యంలో శ్రీపాద ఒక ఉజ్జ్వలదీప్తి.

13

# భారతీయ భాషలన్నిటికీ కలిపి ఏకలిపి అవసరమా?

జేబులోంచి రూపాయినోటు తీసిచూస్తే, దానిమీద ఆ నోటువిలువ పది హేను భాషల్లో కనిపిస్తుంది. ఇంగ్లీషు, హిందీ సరేసరి- మరో పదమూడుభాషల్లో కూడా ఉంటుంది. వాటి వరస ఇంగ్లీషు అక్షరక్రమంలో ఉంటుంది. లిపిమాత్రం దేంది దానికే. కొంచెం జాగ్రత్తగా చూస్తే కొన్ని లిపులకు దగ్గరపోలికలు కనిపిస్తాయి. అలాగే, తేడాలూ కనిపిస్తాయి. తెలుక్కీ కన్నడానికీ ఎంత దగ్గరిపోలి కుందని! 'అ ఆ ఇ ఈ'ల వరకు దాదాపు రెంటికీ ఒకటే. కాని ఉకారంలో తేడా కనిపిస్తుంది. అలాగే హల్లుల్లో కన్నడ 'క'కారం, 'త'కారం, 'య'కారం వగైరా కాస్త తేడాగా కనిపిస్తాయి. తమిళలిపికీ మలయాళ లిపికీ కూడా కొన్ని పోలికలు కనిపిస్తాయి. సంస్కృతం, హిందీ, మరాఠీల సంగతి చెప్పక్కర్లేదు. దేవనాగరి లిపిలోనే రాస్తారు. పైనుండే అడ్డగీతలు మినహాయిస్తే గుజరాతీ లిపి వచ్చేసినట్టుంటుంది. కొన్ని వంపులూ సొంపులూ ఎక్కువన్నమాట కాని, బెంగాలీ లిపి, అస్సామీ లిపులుకూడా నాగరలిపిలాగే ఉంటాయి. ఉర్దూ, కాశ్మీరీ లిపుల తీరే వేరు. ఒరియాకూడా నాగరలిపికన్న భిన్నంగానే కనిపిస్తుంది. మొత్తంమీద, ఆ లిపులన్నీ మనకి రాకపోయినా, ఏ లిపి ఏభాషదో స్థూలంగా గుర్తుపట్టి చెప్పవచ్చు. అంటే లిఖితభాషను గుర్తుపట్టడానికి దాని లిపి ఒక ముద్రలా ఉపకరిస్తుందన్న మాట. అంచేత భారతరాజ్యాంగ చట్టం గుర్తించిన భాషలన్నిటిలోనూ, రూపాయి నోట్లమీద వాటివిలువ అచ్చువేస్తుంటారు.

ప్రపంచంలో మొత్తం ఎన్నిభాషలు వాడుకలో ఉన్నాయో ఇప్పటికీ సరైన లెక్క తేలలేదు. సుమారు రెండు మూడువేల భాషలు ఉండొచ్చని భాషాశాస్త్రవేత్తల అంచనా. వాటిలో భారతదేశంలోనే కొన్ని వందలు ఉన్నాయట. 1910లో

సర్ జార్జ్ గ్రియర్సన్, వెంకయ్య, ప్రొ. స్టెన్‌కెనో గార్లు ప్రచురించిన లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా సంపుటాల్లో, అప్పటికి భారతదేశంలో వాడుకలో ఉన్న భాషలూ మాండలికాలూ కలిపి సుమారు ఆరు వందలుంటాయని అంచనావేశారు. వాటిలో లేఖన సంప్రదాయమేర్పడి అభివృద్ధి చెందిన భాషల్నే రాజ్యాంగచట్టం గుర్తించింది. ఈ లెక్కని, లిపిలేని భాషలు, లిపిఉన్న భాషలకి ఎన్ని రెట్లున్నాయో ఊహించడం కూడా కష్టం. అంతెందుకు? తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం సోదరభాషలనీ ద్రావిడభాషా కుటుంబంలోవనీ చెప్పుకుంటున్నామా! ఈ భాషాకుటుంబంలో ఉన్నవి ఇంతేనా మరి? ఈ నాలుగే? కాదు. జాగ్రత్తగా లెక్కవేస్తే, దాదాపు ఇంకో పాతికముప్పై భాషలున్నట్టు తెలుస్తుంది. పాకిస్తాన్‌లో కూడా మన ద్రావిడభాష ఒకటి ఉంది- దాని పేరు 'బ్రాహుయీ'. ఇవన్నీ నిన్నామొన్నా పుట్టినవి కావు. ప్రతి భాషకూ కొన్నివేల సంవత్సరాల చరిత్ర ఉంటుంది; కనీసం కొన్నివందల ఏళ్ళ చరిత్ర అయినా ఉండి ఉంటుంది. దాన్ని మనం తెలుసుకోడం, తెలుసుకోకపోవడం వేరే విషయాలు. సుమారు రెండువందలకోట్ల ఏళ్ళ కిందట ఈ భూమి పుట్టి, కొన్ని లక్షల ఏళ్ళ కిందట మానవజాతి ఏర్పడినప్పుడు, మనిషితో బాటే భాషకూడా పుట్టిఉంటుందనుకోడంలో తప్పులేదు. కాలక్రమాన, మూలభాషల్లో మాండలికాలు ఏర్పడ్డప్పుడు, ఆ మాండలికాలు పరస్పరం అర్థం కానంతగా వేరయిపోయినప్పుడు, అవే స్వతంత్ర భాషలుగా ఏర్పడతాయి. అలా వచ్చినవే ఇవన్నీ.

మొదట్లో నోటిమాటగా చెలామణి అయిన భాషలు లేఖనసంప్రదాయం అలవడ్డ తరవాత రాతకెక్కుతాయి. అంటే, వాడుకభాష ప్రాచీనం; లేఖనసంప్రదాయం అర్వాచీనం అన్నమాట. మన వేదాలు నోటిమాటమీద జీవించినవే. వాటిని గ్రంథస్థం చేస్తున్నది ఇప్పుడిప్పుడు.

లేఖన చరిత్రద్వారా మనకి లిపి పరిణామం స్పష్టమవుతుంది. అత్యంత ప్రాచీనమైన ఆచారాల్లో మనకి మొదట కనిపించేది చిత్రలిపి. మనిషి మనస్సులో ఉన్న భావం కొన్ని బొమ్మలద్వారా వ్యక్తమవుతుంది. ఆ తరవాత కనిపించేది భావసంకేతలిపి. ఒక వస్తువు పేరుకు కాని, ఆ పేరులోఉన్న అక్షరాలకు కాని సంకేతాలు ఉండడం కాదు- దాని భావానికి ఒక సంకేతం ఏర్పడి ఉంటుంది. ఆ తరవాత కనిపించేది విశ్లేషాత్మక లిపి. దీంట్లో ఒక మాటకొక సంకేతంచొప్పున ఉంటుంది. చైనాభాష లిపిని దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. మరో రకం

లిపులు- ధ్వన్యాత్మక లిపులు. ఇవి మళ్ళీ రెండురకాలు: అక్షరవిధేయలిపి, ధ్వని విధేయలిపి-అని. అంటే, సిలబిక్ స్క్రిప్ట్, ఆల్ఫబెటిక్ స్క్రిప్ట్ అన్నమాట. అక్షరవిధేయలిపిలో ప్రతి సంకేతం ఒక అక్షరాన్ని సూచిస్తుందన్నమాట. ఇక్కడ అక్షరమంటే ఏకాచ్కకం- అంటే 'సిలబిల్'. ఈ రకమైన లిపిలో ఒక పదాన్ని కాని, కొన్ని ధ్వనుల సముదాయాల్ని కాని విభజించినప్పుడు వచ్చే కనిష్ఠప్రమాణం అక్షరమన్న మాట. 'రూపాయి' అన్న మాట రాసిచూసినప్పుడు దాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు: రూ-పా-యి. ఈ మూడింటిలో ప్రతి భాగంలోనూ ఒక్కొక్క అచ్చు ఉంది. కనక ఈ మూడూ మూడు అక్షరాలు. మన దేశంలో సంస్కృతం, తెలుగు, కన్నడం మొదలైన భాషల లిపులు అక్షరవిధేయ లిపులే. వీటిలో ఒత్తులు, తలకట్లు వగైరాలు పైన, కింద, పక్కల చేరుతూ వస్తాయి. ఆ విధంగా ఒక్కొక్క ఏకాచ్కానికి ఒక్కొక్క సంకేతం ఉంటుంది. టైపు చెయ్యాలన్నా, అచ్చువెయ్యాలన్నా వీటితో పని ఎక్కువవడుతుంది. అక్షర విధేయ లిపికన్న ధ్వనివిధేయలిపిలో మంచి సౌకర్యముంది. ఇందులో ఒక్కొక్క ధ్వనికి ఒక్కొక్క లిపి సంకేతం ఉంటుంది. అందులో ఒత్తులూ తలకట్లూ బెడదలేదు. రోమన్ లిపి అల్లాంటిది. తెలుగులిపిలో 'క'అన్న అక్షరం రాయాలంటే, తోకమీదలేచిన పాముమాదిరిగా వంకరగీత ఒకటి గీసి, ఆ పైన తలకట్టుపెట్టాలి. ఆ తలకట్టు 'అ' అన్న అచ్చుకు మారురూపం. 'క్+అ = క; అదే రోమన్‌లిపిలో అయితే 'కె' పక్కన 'ఎ'రాస్తే సరిపోతుంది. తెలుగులో 'క'కి తలకట్టయినా ఉంది; జ, బ, ల, ణలకి అది కూడా లేదు. మొత్తంమీద అచ్చుల్లో అన్నిటికీ, హల్లుల్లో దాదాపు అన్నిటికీ-ప్రధాన సంకేతాలూ ఉపసంకేతాలూ రెండురకాలుగా ఉంటాయి. రాసేవాడూ, టైపుచేసేవాడూ, అచ్చువేసేవాడూ వీటితో సతమతం కాక తప్పదు. అంచేతే, అన్నిటికన్న ధ్వని విధేయలిపే ప్రశస్తమైందని అంటుంటారు. ఇది మూడువేల ఏళ్ళనాటిది.

భారత రాజ్యాంగచట్టంలో గుర్తింపు పొందిన భాషల్లో చాలావాటికి వేరు వేరు లిపులున్నాయి. కొన్ని భాషల లిపులకు కొన్ని పోలికలు కనిపిస్తున్నా, కొన్ని తేడాలు కూడా ఉన్నాయన్న సంగతి విస్మరించలేం. వీటిలో, దాదాపు అన్ని లిపులకూ మూలం 'బ్రాహ్మీలిపి' అంటారు భారతీయభాషలకే కాదు-ఆగ్నేయాసియా భాషల్లో చాలావాటికి అక్షరభిక్ష పెట్టిందికూడా బ్రాహ్మీలిపేనని

చెబుతూంటారు. మూలం ఒకటే అయినా కాలగతిలో పరిణామాలు రాకమానవు. అన్ని వ్యవస్థల్లో వచ్చినట్టే లిపివ్యవస్థలోనూ మార్పులు రావడం సహజం.

పోతే, ప్రపంచంలో ఇన్నివేల భాషలున్నాయి కదా, వాటన్నిటికీ ఒక్కొక్క లిపి ఏర్పాటయిపోతే గందరగోళం పెరిగిపోతుందని కొందరికి భయం. కాని భాషలెన్ని ఉన్నా లిపులు అన్ని లేవు. పైపెచ్చు ఏ లిపీలేని భాషలే హెచ్చు. భారతదేశంలో దేవనాగర లిపిలో రాసే భాషలు మనకి తెలుసు. అలాగే ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, రష్యన్, స్వీడిష్, ఇటాలియన్ మొదలైన భాషలు రోమన్ లిపిలోనే వ్యవహారం సాగిస్తున్నాయి. ఎటొచ్చీ, ఒక్కొక్క భాషకు విలక్షణమైన ధ్వనులున్నప్పుడు వాటిని సూచించడానికి ప్రత్యేక సంకేతాలు ఏర్పరుచుకోవలసి ఉంటుంది. జర్మన్, రష్యన్ మొదలైన భాషల్లో అలాటివి వాడుతూనే ఉన్నారు. అంతేకాదు, రోమన్ లిపిలోకూడా ఒకే సంకేతం ఒక భాషలో ఒక ధ్వనిని, మరో భాషలో మరో ధ్వనినీ సూచించే సందర్భాలు లేకపోలేదు. పైపెచ్చు, అక్షర రూపం తారుమారయిన సందర్భాలుకూడా ఉన్నాయి. రోమన్ లిపిలో 'ఆర్' అన్న సంకేతం రష్యన్ లిపిలో తారుమారుగా ఉంటుంది. (దాన్ని పలికే ధ్వని కూడా వేరే). అంటే మామూలుగా 'ఆర్'రాసి అద్దంలో చూస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుందన్నమాట. ఇటువంటి తేడాలు బహుకొద్ది.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే- భాషలు వేరయినా ఒకే లిపి వాడడంలో బెసబబు లేదు. లేకపోగా, కొన్ని సౌకర్యాలున్నాయి. అదేమిటంటే- ఒక టైపు మిషను అన్ని భాషలకీ ఉపయోగిస్తుంది. అచ్చులో టైపులుకూడా కొత్తగా పోత పోసుకోనక్కరలేదు. ఒకే భాషలో అన్ని భాషల పుస్తకాలూ అచ్చేసుకోవచ్చు. ఇతరభాషలు నేర్చుకునే విద్యార్థులకి ఆయా భాషల లిపులు నేర్చుకోవలసిన బెడద ఉండదు.

ఇల్లాటి సౌకర్యాలున్నందువల్ల భారతీయ భాషలన్నిటికీ కలిపి ఒకే లిపి బాగుంటుందన్న ఆలోచన కొందరికి వచ్చింది. ఆలోచన బాగానే ఉంది. అమలు పరచడంలోనే ఉంది చిక్కు. ఇది సాధ్యమా, కాదా? సాధ్యమయితే, ఎప్పుడు? ఎలా? అన్న ప్రశ్నలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా, ఏ లిపి ప్రవేశపెట్టా లన్నది అన్నిటికన్న పెద్దప్రశ్న.

ప్రభుత్వం తలుచుకుంటే ఏకలిపికేం కొదవ? ఒక శాసనం చెయ్యొచ్చు;

ఒక తాఖీదు జారీచెయ్యొచ్చు. అంతమాత్రాన అది ప్రజల్లోకి చొచ్చుకు వెళ్తుందని చెప్పలేం. అందరి సంగతీ ఎందుకు? తెలుగువాళ్ళ సంగతే తీసుకుందాం. సుమారు ఐదారు కోట్లమందిలో చదువుకున్న వాళ్ళు కొంచెమించుమించుగా మూడోవంతు ఉన్నారనుకున్నా- తరతరాలుగా ఒక లిపికి అలవాటుపడ్డవాళ్ళు వీళ్ళు. ఒక్క సారి లిపి మార్చుకోవాలంటే సాధ్యం కాదు. రాతకోతలు సాఫీగా సాగవు. కనీసం ఒకటి రెండు తరాలవాళ్ళు బాధపడక తప్పదు. ముత్యాలకోవలాంటి తెలుగక్షరాలు వదులుకోడానికి సుతరామూ ఇష్టపడరు. పోనీ నయాన్నో భయాన్నో ఒప్పుకుంటారనుకుందాం. ఆ ఏకలిపి ఎల్లాంటి లిపి? అక్షరవిధేయ లిపా? ధ్వని విధేయలిపా ? ధ్వనివిధేయలిపి అయితే రాతలోనూ అచ్చులోనూ సౌకర్యమున్న మాట వాస్తవం. కాని మన భాషలన్నీ దాదాపు, అక్షరవిధేయ లిపికే అలవాటుపడ్డాయే! పోనీ అక్షర విధేయలిపే తీసుకుంటే, ఏది తీసుకోవాలి? అన్నీ బ్రాహ్మీలిపినించి వచ్చినవే కనక ఏది తీసుకున్నా పరవాలేదని చెప్పొచ్చు. కాని కొన్ని భాషల్లో ప్రచురమైన ధ్వనులకు కూడా సంకేతాలులేవు. తెలుగులో ఉన్న హ్రస్వ 'ఎ'కారానికీ, 'ఒ'కారానికీ దేవనాగరిలో సంకేతాలులేవు. ఖ, ఘ వంటి మహాప్రాణాలకు తమిళలిపిలో సంకేతాలు లేవు. తెలుగులోనే 'తాటాకు'లో ఉన్న 'æ'ధ్వనికి, 'కాఫీ'లో ఉన్న 'ఫ'కి ప్రత్యేక సంకేతాలు లేవు. కాని తెలుగు వర్ణమాలలో వీలయినన్ని ధ్వనులకు సంకేతాలు సిద్ధంగా ఉన్నాయనడంలో విప్రతిపత్తి లేదు.

మరైతే తెలుగు లిపిని భారతీయ భాషలన్నిటికీ ఏకలిపిగా అమలుపరచ వచ్చు కదా! ఇందులో ఎంత సబబున్నా ఇతర భాషలవాళ్ళు, ముఖ్యంగా ఇండో ఆర్యన్ భాషా కుటుంబంవాళ్ళు అంగీకరిస్తారన్న నమ్మకం నాకయితే లేదు. "అందరూ దేవనాగరిలోనే రాస్తే పోలా?'- అంటారు. కాని మనవాళ్ళకి దానివల్ల లాభమూ కనిపించదు, సౌకర్యమూ కనిపించదు. పైపెచ్చు నాగరిలిపికన్న నిర్దుష్టమైందీ, సమగ్రమైందీ తెలుగు లిపేనని దాఖలాలు చూపిస్తారు. తార్కికంగా అది సత్యమే అయినా చిత్తశుద్ధితో అందరూ అంగీకరిస్తారన్న నమ్మకమూ తక్కువే. అంచేత ఏ భారతీయ లిపిని తీసుకున్నా ఇదే సమస్య ఎదురవుతుంది. **'Old habits die hard'** అన్నట్టు, పాత అలవాట్లు ఓ పట్టాన పోవు. మానసికమైన అనుబంధం తెంచుకోడం అంత సులువు కాదు.

అంచేత, 'ఏకలిపి లేకపోతే ఏం కొంప మునుగుతుంది?' అని ప్రశ్నిస్తారు

కొందరు. ఏ కొంపాముునగదు. "ఇన్ని రాష్ట్రప్రభుత్వాలూ ఇన్ని భాషలూ ఉండగాలేంది, ఇన్ని లిపులు ఉంటేమట్టుకు ఏమవుతుంది?" అంటారు. "ప్రపంచమంతటా ఒకే ప్రభుత్వం ఉందా? ప్రపంచమంతటా ద్రవ్యవినిమయానికి ఒకే ప్రమాణం అమలులో ఉందా?" అనికూడా ప్రశ్నిస్తారు. కాదనలేం మరి!

లిపి ఏకమయినంత మాత్రాన భాషలుఒకటి అవుతాయని ఎవరూ అనరు. దగ్గరి పోలికలున్న కన్నడ—తెలుగు భాషలకే ఇంతవరకు సంపూర్ణ ఏకలిపి రూపొందడం సాధ్యం కాలేదే! భారతీయ భాషలన్నిటికీ సులువుగా సాధ్యమవుతుందని ఎలా చెప్పగలం? జాతీయతా ముద్రకోసం అన్ని భాషలవాళ్ళు (ఉర్దూ, కాశ్మీరీ భాషలవాళ్ళుకూడా కలిసివస్తారనుకుంటే మాట!) తమతమ లిపులు వదిలిపెట్టేసి నాగరలిపి ఒక్కటే వాడాలని శాసనం చేసి నిజంగా అమలుపరచగలరనుకున్నా దానివల్ల ప్రయోజనం లేదు. తెలుగులిపిలో లేని సౌలభ్యం నాగరలిపిలోనూ లేదు. పై హ్రస్వ 'ఎ', 'ఒ'కారాలకు అక్షరసంకేతాలే లేవు. ఒక వేళ కొత్తగా పెడతామనుకుందాం; అయినా అది ధ్వనివిధేయలిపి కాదు. నయాన్నో, భయాన్నో ఏకలిపి ప్రవేశపెట్టినా, అది ధ్వని విధేయలిపి (alphabetic script) అయితే ఉపయోగం కాని, అక్షర విధేయలిపి (syllabic script) అయితే లాభంలేదు. ఒక ధ్వని విధేయలిపి, మనలో కొందరికి ఇంగ్లీషు భాషద్వారా అలవాటయింది. అది రోమన్ లిపి. రోమన్‌లిపి వాడ్డం మన జాతీయసంస్కృతికి అవమానకరమనుకుంటే, ఏ భాషకున్న లిపిని దాన్ని వాడుకోనిస్తూ, ధ్వని విధేయంగా రూపొందడానికి కావలసిన సంస్కరణలు చేసుకోడానికి ప్రోత్సహించాలి. మరి గత్యంతరం లేదు.

(1980 ఏప్రిల్ 24న రేడియోలో ప్రసారమయింది)

4914 5134 DPK Acc No. 25760

# ముఖచిత్రం

జాతీయస్థాయిలో
అగ్రశేణి చిత్రకారులూ
సుప్రసిద్ధులూ సమ్మాన్యులూ
శ్రీ కొండపల్లి శేషగిరిరావుగారి
వర్ణచిత్రానికి ఛాయారూపం

# విన్నపం

"దేశభాషద్వారా విద్య బోధిస్తేనే కాని ప్రయోజనం లేదు. శిష్టజన వ్యావహారిక భాష లోకంలో సదా వినబడుతూ ఉంటుంది. అది జీవంతో కలకలలాడుతూ ఉంటుంది. గ్రాంథిక భాష గ్రంథాలలో కనబడేది కాని వినబడేది కాదు....

"నోటిమాటకు చేతివ్రాతకు సామ్యమున్నందువల్ల లాభము ఒక దేశమువారు మరి ఒక దేశ భాషను నేర్చుకొనుట సులభముగా ఉంటుంది.... ఇతరులతో సహవాసము చేయడముచేతను, వారి భాష నోటను తరచుగా మాట్లాడడము చేతను, ఆ భాషే గ్రంథములలోను వార్తాపత్రికల లోను కంటితో చూచి చదవడము చేతను- ఇట్లు చెవికి, నాలుకకు, కంటికి, చేతికి కూడా అలవాటయి వ్యత్యాసము లేకుండా ఏకరూపమయిన భాష మనస్సులో నాటుకొంటున్నది....

"మాండలిక శబ్దాలు అన్ని భాషలలోను ఉంటవి. అన్నీ సాధువులే. భాషాలక్షణం చేసేవారు ఈ రూపాలన్నీ సేకరించి అనుశాసిస్తారు....

"మన ప్రజలకు, సామాన్య జనులకు ఏ భాషద్వారా జ్ఞానం కలుగచేయవలసి ఉంటుందో, ఏ భాషలో గ్రంథ రచన సాగించవలసి ఉంటుందో ఆలోచించండి."

**గిడుగు వేంకట రామమూర్తి**